5. నిర్ణయసాగరప్రతిలోని 16వ అధ్యాయంలోను, చౌఖంభా ప్రతిలోని 17వ అధ్యాయంలోను ఐదు అనుష్టుప్ శ్లోకాలలో 36 నాట్యలక్షణాలు చెప్పబడ్డాయి. గాయక్వాడ్ ప్రతిలోని 16వ అధ్యాయంలో ఇవి నాలుగు ఉపజాతివృత్తాలలో చెప్పబడ్డాయి. అంతే కాకుండా, రెండు పట్టికలలోనూ ఉన్న పేర్లు సమంగా లేవు; రెండింటిలోను సమంగా ఉన్నవి పదిహేడు పేర్లు మాత్రమే. ఇక్కడ అభినవగుప్తుడు - "భరతుడు తానే చెప్పిన లక్షణాల పేర్లకంటె వేరుగా కొన్ని పేర్లు చెపుతున్నాడు. అందుచేతనే లిఖితప్రతులలో నున్న లక్షణాల పేర్లలోను, వాటి క్రమంలోను భేదం కనబడుతూన్నది. అయితే నేను మా గురువుగారైన భట్టతౌతుని సంప్రదాయం అనుసరిస్తున్నాను" అని అన్నాడు - **"తథా చ మతాన్తరేణ భరతమునిరేవ అన్యథాప్యుద్దేశలక్షణేన నామాన్తరైరపి చ వ్యవహారం కరోతి. తత ఏవ పుస్తకేషు భేదో దృశ్యతే. తం చ దర్శయిష్యామః. పఠితోద్దేశక్రమస్తు అస్మదుపాధ్యాయపరమ్పరాగతః"** (అ.భా.రెండవ సంపుటం, పే.298). దీనిని పట్టి అభినవగుప్తాచార్యుల కాలంనాటికి లక్షణాలను గూర్చి చెప్పిన అధ్యాయానికి రెండు విధాలైన పాఠా లున్నట్లు తెలుస్తూన్నది. ధనికుడు **దశరూపకంలోను** (4.78), రాఘవభట్టు **అర్థద్యోతనికలోను** ఉపజాతివృత్తంలో చెప్పిన లక్షణాలను ఉదాహరించగా **సాహిత్య**

దర్పణకారుడు, మరి కొందరూ అనుష్టుప్ శ్లోకాలలో ఇచ్చిన లక్షణాలను ఉదాహరించారు.

6. నిర్ణయసాగర ప్రతిలోని 24వ అధ్యాయం చౌఖంభా ప్రతిలోని 34, 35 అధ్యాయాలలో పంచబడి ఉంది. నిర్ణయసాగరప్రతిలోని 36, 37 అధ్యాయాలు చౌఖంభాప్రతిలోను, **అభినవభారతి**లోనూ కూడ 36వ అధ్యాయంగా కూర్చబడ్డాయి.

7. నిర్ణయసాగరప్రతిలోని 31వ అధ్యాయంలో 334 శ్లోకా లున్నాయి. చౌఖంభాప్రతిలోని అదే అధ్యాయంలో 545 శ్లోకా లున్నాయి. **"ఆకారవృత్తమన్యత్స్యాత్ చతుష్కం త్రికమేవ వా"** (నిర్ణయసాగరప్రతిలో 293వ శ్లోకం. చౌఖంభాప్రతి. 397వ శ్లోకం) అనే శ్లోకం తరవాత ఒక లిఖితపుస్తకంలో 92 శ్లోకాలు చేర్చబడ్డాయి అని క్రొత్త నిర్ణయసాగరప్రతిలో 520వ పేజీలో ఒక సూచన (Note) ఉంది. అభినవగుప్తాచార్యుల వ్యాఖ్యానం ప్రకారం వీటిలోని సగం శ్లోకాలు మాత్రమే విడిచివేయబడ్డాయి అని అభినవభారతీసహిత**నాట్యశాస్త్రా**నికి సంపాదకు డైన రామకృష్ణకవి రెండవ సంపుటం ప్రస్తావనలో పద్నాల్గవ పేజీలో వ్రాశారు. తాను నలభై **నాట్యశాస్త్ర**లిఖితపుస్తకాలను సంపాదించి పరిశీలించినట్లూ వాటిలోని ఏ రెండూ పూర్తి సామ్యంతో లేవు అనీ కూడ కవి మొదటి సంపుట ప్రస్తావన ఏడవ పేజీలో అన్నారు. **నాట్యశాస్త్రానికి** ఔత్తరభారత పాఠమూ, దాక్షిణాత్యపాఠమూ అని రెండు పాఠా లున్నాయనీ, దాక్షిణాత్యపాఠం ప్రాచీన మైన దనీ ఆయన తమ అభిప్రాయం వెలిబుచ్చారు.

ప్రస్తావనలలో కవి వ్రాసినదానిని పట్టి **అభినవభారతి**ని యథాతథంగా సంపాదించడానికి తగిన లిఖితపుస్తకా లేవీ లేవని స్పష్టం అవుతుంది. ముప్పైఆరు అధ్యాయాలన్నింటికీ పూర్తిగా **అభినవభారతి** ఉన్న లిఖితపుస్తకం ఏదీ లభించలేదు. కొన్ని చోట్ల అభినవభారతికే రెండు పాఠా లున్నట్లు, ఇది **నాట్యశాస్త్రా**నికి భిన్నంగా ఉన్నట్లూ కనబడుతుంది. ఏడు - ఎనిమిది అధ్యాయాలకు **అభినవభారతీ**వ్యాఖ్య కవికి లభించలేదు. ఏడవ అధ్యాయం ప్రారంభంలో కొన్ని వాక్యపుంజాలు మాత్రమే లభించాయి. అసంపూర్ణంగా ఉన్న కొన్ని లిఖితపుస్తకాలలో దూరదూరంగా చెదిరి పడి ఉన్న భాగాలను తీసికొని వ్యాఖ్యానాన్ని పూరించవలసి ఉండడంచేత ఈ వ్యాఖ్యానం చాల వరకు అతుకుల బొంతయే అయి సంతృప్తికరంగా ఉండదు. కొన్ని చోట్ల **అభినవభారతి** లభించక పోవడంచేత తన వ్యాఖ్యానం చేర్చినట్లుగా కవి వ్రాశాడు. తాను ఎక్కడ పూరించాడో స్పష్టంగా ఆయన అక్కడ వ్రాసినా కూడ ఇది **అభినవభారతి**యే అని కొందరు భ్రాంతి పడడానికి అవకాశం ఏర్పడింది. గ్రంథం మధ్యలో కాక గ్రంథాంతంలో అనుబంధంగా తన వ్యాఖ్యలు ఇస్తే ఇలాంటి భ్రాంతికి అవకాశం ఉండేది కాదని కొందరు పండితుల అభిప్రాయం.

ఈ విధంగా **నాట్యశాస్త్రమూ**, దాని వ్యాఖ్యయైన **అభినవభారతీ** కూడ మనకీనాడు లభిస్తూన్న రూపంలో అసంపూర్ణంగాను, అసంతృప్తికరంగానూ ఉండడంచేత మూల **నాట్యశాస్త్రం** ఏది, దాని రచయిత ఎవ్వరు అనే రెండు ప్రశ్నలు, సరియైన సమాధానం చెప్పడానికి శక్యం కాని ప్రశ్నలు, ఉదయిస్తున్నాయి.

ప్రస్తుతం మనకు లభిస్తూన్న **నాట్యశాస్త్ర** స్వరూపం ఈ విధంగా ఉంది. -

1. ఈ గ్రంథం అంతా శ్లోకరూపంలో ఉంది. ఆరు ఏడు అధ్యాయాలలో అక్కడక్కడ కొన్ని గద్యభాగా లున్నాయి.

2. "ఆ(అ)నువంశ్యాలు", అనే పేరుతో కనీసం పదిహేను శ్లోకాలు (అనుష్టుప్పులు). 16 ఆర్యలు ఉన్నాయి.

3. **"సూత్రానుబద్ధే ఆర్యే భవతః"** (సూత్రానికి సంబంధించిన రెండు ఆర్యలున్నాయి.) అని ప్రారంభించి చాలా శ్లోకాలు చెప్పబడ్డాయి.

4. **"భవన్తి చాత్ర శ్లోకాః", "అత్రార్యే భవతః" "అత్ర శ్లోకాః"** అని ప్రారంభించి వేరు వేరు స్థానాలలో దాదాపు 100 శ్లోకాలు ఉదాహరించబడ్డాయి.

5. **నాట్యశాస్త్రం**లో ఐదు వేలకు పైగా శ్లోకా లున్నాయి. వీటిలో చాలా వరకు శ్లోకంఛందస్సులో ఉన్నాయి. కొన్ని శ్లోకాలు మాత్రమే ఆర్యా - ఉపజాతివృత్తాలలో ఉన్నాయి.

పైన చెప్పిన అంశాలలో ప్రతీ అంశాన్నీ జాగర్తగా పరిశీలించవలసి ఉంది.

1. గద్యభాగాలు నిరుక్తంలోని వాక్యాల వలె సూత్ర-భాష్యపద్ధతిలో ఉన్నాయి. ఇందుకు ఆరవ అధ్యాయంలోని **"విభావానుభావవ్యభిచారిసంయోగాద్రసనిష్పత్తిః, కో వా దృష్టాన్త ఇతి చేత్ - ఉచ్యతే - యథా నానావ్యఞ్జనౌషధి ... రసత్వమాప్నువన్తి. ఋషయ ఊచుః, రస ఇతి కః పదార్థః? అత్రోచ్యతే ఆస్వాద్యత్వాత్"** అను రససూత్ర వాక్యసందర్భాన్ని ఉదాహరణంగా చూపవచ్చును. ఇక్కడ నున్న మొదటి వాక్యం సూత్రం వలె తరవాతి వాక్యాలు భాష్యంవలె ఉన్నాయి. ఇంకా **"వ్యభిచారిణ ఇదానీం వక్ష్యామః. అత్రాహ, వ్యభిచారిణ ఇతి కస్మాదుచ్యన్తే? వి అభి ఇత్యేతౌ ఉపసర్గౌ. చర గతౌ ధాతుః"** (పే. 34) ఇత్యాదివాక్యాలను ఉదాహరణలుగా చూపవచ్చును. ఈ వాక్యాలను **"అపత్యం కస్మాత్? అపతితం భవతి, నానేన పతతీతి వా"** (నిరు. 3.1) అను నిరుక్తంలోని వాక్యాలతోను, **"కో ధర్మః? కథం లక్షణః? కాన్యస్య సాధనాని? కాని సాధనాభాసాని? కింపరశ్చేతి"** (శాబరభాష్యం. పే. 9) అను శాబరభాష్యవాక్యాలతోను పోల్చి చూడవచ్చును. అభినవగుప్తుడు నాట్యశాస్త్రాన్ని **'భరతసూత్రం'** అనే పేరుతో నిర్దేశించడం గమనార్హం.

ఈ గ్రంథం సూత్రాలు. భాష్యం, సంగ్రహం, కారికలు, నిరుక్తమూ వీటి రూపంలో ఉన్నట్లు మన కిపుడు లభ్యం అవుతున్న గ్రంథంలోనే సూచన లున్నాయి.

"విస్తరేణోపదిష్టానామర్థానాం సూత్రభాష్యయోః,
నిబన్ధో యః సమాసేన సంగ్రహం తం విదుర్బుధాః,
రసా భావా హ్యభినయా ధర్మివృత్తిప్రవృత్తయః,
సిద్ధిః స్వరాస్తథాతోద్యం గానం రఙ్గం చ సంగ్రహః.
అల్పాభిధానేనార్థో యః సమాసేనోచ్యతే బుధైః,
సూత్రతః సా తు విజ్ఞేయా కారికార్థప్రయోగినీ". **(6.9-11)**

"ఏవమేషోఽల్పసూత్రార్థో వ్యాదిష్టో నాట్యసంగ్రహః,
అతః పరం ప్రవక్ష్యామి సూత్రగ్రన్థవికల్పనమ్" (6.31)

సూత్రం అనగా లక్షణం. సూత్రాన్ని పరీక్షించి దాని అర్థాన్ని విశదీకరించేది భాష్యం." (**సూత్రం లక్షణమ్. భాష్యం తద్వ్యక్తీకరణరూపా పరీక్షా.** (మొదటి సంపుటం పే.256) అని అభినవగుప్తుడు సూత్ర - భాష్య శబ్దాల అర్థం వివరించాడు. సూత్రాన్నే కారిక అనవచ్చుననీ, సూత్రం తరవాత వచ్చినది, సూత్రంతో సంబంధించి దాని అర్థాన్ని విశదీకరించేదీ అయిన శ్లోకం కూడ కారికయే అనీ ఈయన వ్యాఖ్యానించారు. - **"సూత్రతః సూత్రణేన, తేన సూత్రమపి కారికా. తత్ సూత్రమ్ అపేక్ష్య యా అను పశ్చాత్ పఠితా శ్లోకరూపా సాపి కారికా"** (మొ.సం.పే 266). ఆరవ అధ్యాయంలోని 39వ శ్లోకంలో ఉన్న **"సూత్రం సూత్రకం, లక్షణం, వక్ష్యామి. తేనైవ చ కారికా సంగృహీతా. గ్రన్థః భాష్యం తత్కృతం చ వికల్పనమ్. ఆక్షేపప్రతిసమాధానాత్మకమ్ ఇతి పరీక్షా నిరుక్త శబ్దవాచ్యా ప్రతిజ్ఞాతా. సూత్రవివరణస్వభావా తు కారికా సూత్రమపి ప్రకాశయన్తీ బహుతరాక్షేపసమాధానవ్యాకులశిష్యజనస్థితిపక్షం నిరూపణేన ఉపకరోతీతి భాష్యస్య పశ్చాదస్యాః పాఠః"** (మొ.సం.పే.273) అని అన్నారు. **"విభావానుభావ ... నిష్పత్తిః"** అను వాక్యానికి అవతారికగా అభినవగుప్తుడు **"ఏవం క్రమహేతుమభిధాయ లక్షణ సూత్రమాహ విభావేతి"** అనీ, **"కో దృష్టాన్తః? అత్రాహ యథా హి..."** ఇత్యాది వాక్యాన్ని వివరిస్తూ **"అత్ర ప్రశ్నే భాష్యేణ ప్రతివచనమాహ యథేత్యాదినా ఆప్లువన్తీత్యన్తేన"** (మొ.సం.పే. 289) అనీ అన్నారు. ఆరవ అధ్యాయంలో **"తత్ర శృఙ్గారో నామ రతిస్థాయిభావప్రభవః ఉజ్జ్వలవేషాత్మకః"** అనే వాక్యానికి అవతారికగా **"అత్ర రతిస్థాయీతి సూత్రభాగం భాష్యేణ స్పష్టయతి స చేత్యాదినా"** అనే అభినవభారతీవాక్యం - పై వాక్యం సూత్ర - భాష్యాత్మకమైన దని సూచిస్తూన్నది.

భవభూతి **ఉత్తరరామచరిత్ర** నాల్గవ అంకంలో భరతుడు "తౌర్యత్రిక సూత్రధారుడు" అని అంటాడు. సూత్రం అనేది గద్యరూపంలోనే ఉండాలనే నియమం లేదు.

ఐతరేయబ్రాహ్మణ - శతపథబ్రాహ్మణాదులైన ప్రాచీన గ్రంథాలలో కూడ శ్లోకాలున్నాయి. ఆపస్తంబ - బోధాయన - వాసిష్ఠాది ధర్మసూత్రాలలోను గృహ్యసూత్రాలలోనూ కూడా శ్లోకాలున్నాయి. మధ్యయుగానికి సంబంధించిన **కావ్యప్రకాశాది** గ్రంథాలలోని కారికలను సూత్రా లని కూడా నిర్దేశించడం ఉన్నది. అందుచేత నాట్యశాస్త్రంలోని మూలభూతమైన ప్రధానభాగంలో పద్యగద్యాలు రెండూ కలిసి ఉండేవని చెప్పవచ్చును.

2. ఇంక - అక్కడక్కడ ఆర్యలను అనుష్టుప్ శ్లోకాలను ఉదాహరించే సందర్భంలో ప్రయోగించిన "ఆనువంశ్య" అనే పదానికి గల అర్థాన్ని పరిశీలించవలసి ఉన్నది. ఈ పేరుతో ఉదాహరించబడిన శ్లోకాలు ముఖ్యంగా ఆరు - ఏడు అధ్యాయాలలో మాత్రమే అధిక సంఖ్యలో ఉన్నా యనే ప్రధాన విషయాన్ని మనం గుర్తు ఉంచుకోవాలి. ఇతర అధ్యాయాలలో ఇవి చాల తక్కువగా కనబడుతున్నాయి. 'ఆనువంశ్యశ్లోకం' అనే పదం తరచుగా **మహాభారతంలో** ప్రయోగించబడింది. కొన్నిచోట్ల 'అనువంశం' అనే పదం కూడా ప్రయోగించబడింది -

**"యత్రానువంశం భగవాన్ జామదగ్న్యస్తథా జగౌ
విశ్వామిత్రస్య తాం దృష్ట్వా విభూతిమతిమానుషీమ్"** (వనపర్వం. 87.16)

వనపర్వంలో (88.5) 'ఆనువంశ్యా' అనే పదం 'గాథా'కు విశేషంగా ప్రయోగించ బడింది. వనపర్వంలోనే **"అత్రానువంశం పఠతః శృణు మే కురు నన్దన"** అనే శ్లోకంలోని 'ఆనువంశ' శబ్దానికి నీలకంఠుడు "పరమ్పరాగతమాఖ్యానశ్లోకమ్" (గురుశిష్యపరంపరయా వస్తూన్న ఒక విషయప్రతిపాదకమైన శ్లోకం) అని అర్థం వ్రాశాడు. **మత్స్యపురాణంలో** కూడా (271.15) ఒక ఆనువంశ్య శ్లోకం ఉంది. **నాట్యశాస్త్రం** ఆరవ అధ్యాయంలో 35-36 శ్లోకాలకు ముందున్న **"ఆనువంశ్యశ్లోకౌ భవతః"** అనే దానిని వివరిస్తూ అభినవగుప్తుడు - **"అత్రేతి భాష్యే అనువంశభవౌ శిష్యాచార్యపరమ్పరాసు వర్తమానౌ శ్లోకాఖ్యౌ వృత్తవిశేషౌ సూత్రార్థసంక్షేపప్రకటీకరణేన కారికాశబ్దవాచ్యౌ భవన్తౌ పఠతి యథేత్యాది"** (మొ.సం.పే.290). ఇక్కడ 'అత్ర' అనే దానికి 'భాష్యే' అని అర్థం చెప్పడం చేత **"విభావా ... నిష్పత్తిః"** అనేదానిని సూత్ర మనీ, అక్కడ గద్యరూపాలైన వాక్యాలను భాష్యం అనీ అభినవగుప్తుడు గ్రహిస్తూన్నట్లు స్పష్టం అవుతున్నది.

దీని నంతనీ పట్టి - ఆనువంశ్యశ్లోకా లనేవి చాలా కాలం క్రితమే రచితములై సంప్రదాయానుసారం తండ్రినుండి కుమారునకు లేదా గురువునుండి శిష్యులకు అందింపబడుతూ వస్తూన్న నాట్యానికి సంబంధించిన శ్లోకాలనీ, వాటినే నాట్యశాస్త్రంలో చేర్చడం జరిగిన దనీ, అంతేనే కాని అవి ప్రస్తుత నాట్యశాస్త్రకర్త రచించినవి కావనీ స్పష్టం అవుతున్నది.

3. కొన్ని ఘట్టాలలో ప్రయోగించిన **"సూత్రానువిద్ధే"** లేదా **"సూత్రానుబద్ధే ఆర్యే భవతః"** అనేదానికి ఈ శ్లోకాలు అంతకు ముందే చెప్పిన సూత్రానికి చాల దగ్గరగా సంబంధించినవి అని లేదా అవి సూత్రంయొక్క అర్థాన్ని సులభమైన భాషలో స్పష్టీకరిస్తాయి అని అర్థం. అవి గ్రంథకారుడు రచించిన శ్లోకాలే అని చెప్పవచ్చును. **"అపి చ సుఖ..."** (మొ.సం.పే. 311-12) అనే దాని దగ్గర - **"ఏవం సూత్రార్థే పరీక్ష్య స్థాపితే తదర్థస్య సుఖగ్రహణార్థం సూత్రార్థవివరణరూపత్వాత్ సూత్రసమీపేఽపి ఉచితపాఠాత్ కారికామధునా పఠతి అపి చేతి. న కేవలం సూత్రం, పరీక్షాపి యావదియం కారికేతి, ఏవం సర్వత్ర మన్తవ్యమ్. తామేవ కారికాం పఠతి - సుఖేతి"** అని అభినవభారతిలో చెప్పబడింది. ఇక్కడ చెప్పినది సూత్రానుబద్ధాలుగా ఉదాహరించబడిన ఆర్యలకు కూడ వర్తిస్తుంది.

"అత్రార్యాః" (మొ.సం.పే. 327-28) అనేచోట అభినవగుప్త డిలా అన్నాడు. "కొందరు ప్రాచీనాచార్యులు రసాలకీ, వాటికి సంబంధించిన కొన్ని విషయాలకీ సంబంధించిన కొన్ని అంశాలను కూర్చిన కొన్ని ఆర్యలను సేకరించి ఉంచారు; భరతుడు వాటినుంచి కొన్ని ఆర్యలను గ్రహించి ఆ యా రసాలను గూర్చి చెప్పేటప్పుడు తగు ప్రదేశాలలో ఆ ఆర్యాశ్లోకాలను చేర్చాడు. - **"తా ఏతా హ్యార్యాః ఏకప్రఘట్టకతయా పూర్వాచార్యైః లక్షణత్వేన పఠితాః. మునినా తు సుఖసంగ్రహాయ యథాస్థానం నివేశితాః"** (మొ.సం.పే. 328). దీనిని పట్టి అభినవగుప్తుని అభిప్రాయం ప్రకారం **నాట్యశాస్త్రంలో** ఉన్న ఆర్యలు భరతవిరచితాలు కావని తెలుస్తూన్నది. **భావప్రకాశనంలో** వాసుకి రచించిన ఒక శ్లోకం ఉదాహరించబడింది. **నాట్యశాస్త్రంలోని** ఆరవ అధ్యాయంలో **"భవన్తి చాత్ర శ్లోకాః"** లేదా **"అత్ర శ్లోకాః"** అని ప్రారంభించి ఉదాహరించిన ఐదు శ్లోకాలలో ఈ శ్లోకం ఉంది.

> **"నానాద్రవ్యౌషధైః పాకైర్వ్యఞ్జనం భావ్యతే యథా,**
> **ఏవం భావా భావయన్తి రసానభినయైః సహ,**
> **ఇతి వాసుకినాప్యుక్తో భావేభ్యో రససంభవః."** (భా.ప్ర.పే. 36, 37)

ఇంక మిగిలిన నాట్యశాస్త్రగ్రంథానికి సంబంధించిన వ్రాతప్రతులలోని శ్లోకాల సంఖ్యలో భేదం వందలలో ఉన్నది. అందుచేత అసలు మూల**నాట్యశాస్త్రంలో** ఏముందో చెప్పడం చాల కష్టం. అయితే దాని స్వరూపం ఈ క్రింది విధంగా ఉండి ఉండవచ్చునని కొందరు పండితుల అభిప్రాయం. ప్రస్తుతం మనకు లభిస్తూన్న ఆరు - ఏడు అధ్యాయాలూ, వివిధాభినయాలను ప్రతిపాదించే ఎనిమిదినుండి పద్నాలుగు వరకు ఉన్న ఆరు అధ్యాయాలూ, పదిహేడవ అధ్యాయం నుంచి ముప్పైయైదవ అధ్యాయం వరకూ ఉన్న

పందొమ్మిది అధ్యాయాలూ - ఇవన్నీ ఒక కాలానికి చెందినవి. ఆరు - ఏడు అధ్యాయాలలోని గద్యభాగాలు, ప్రాచీనాచార్యులనుండి గ్రహింపడినట్లుగా అభినవగుప్తుడు చెప్పే ఆర్యాశ్లోకాలు బహుశా క్రీ.పూ. 200 సంవత్సరం ప్రాంతానికి చెంది ఉంటాయి. వాటిని పైన చెప్పిన అధ్యాయాలను రచించినపుడు వాటిలో చేర్చడం జరిగి ఉంటుంది. ఈ కాలాన్ని చెప్పడానికి కారణాలు ఇవి - **గౌతమధర్మసూత్రంలో** (11.19) నాలుగు ఉపవేదాలు చెప్పబడ్డాయి. **ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, అర్థశాస్త్రం** (కొందరి ప్రకారం స్థాపత్యం) అనేవి నాలుగు వేదాలకు ఉపవేదాలుగా అతిప్రాచీనకాలంనుంచీ చెప్పబడుతున్నాయి. అర్జునుడు విశ్వావసుపుత్రుడైన చిత్రరథుని వద్ద **గాంధర్వవేదం** నేర్చినట్లు వనపర్వంలో (91.14-15) చెప్పబడింది. సామమంత్రాలు, గానము, నృత్యము, వాద్యవాదనము **గాంధర్వవేదానికి** సంబంధించిన విషయాలు. **గాంధర్వవేదాన్ని** మొట్టమొదట ప్రచారంలోనికి తీసికొనివచ్చినవాడు నారదుడని **శాంతిపర్వంలో** (210.21) చెప్పబడింది. **గాంధర్వవేదానికి నాట్యవేదానికి** కొంత భేదం ఉంది. **గాంధర్వవేదం** పరిమితమైన పరిధి గల ఉపవేదం. **నాట్యవేదం** అన్ని వర్గాలవారి కోసమూ ఉద్దిష్టమైన పంచమవేదం. అందుచేత దీని పరిధి అతివిస్తృతమైనది. గానము, నృత్యము అనేవి దీనిలోని ఒక భాగం మాత్రమే. గాంధర్వాన్ని **గాంధర్వవేదం** నుండి భరతుడు గ్రహించినట్లు **నాట్యశాస్త్రంలోనే** చెప్పబడింది. -

> **"గాన్ధర్వమేతత్కథితం మయా హి పూర్వం యదుక్తం త్విహ నారదేన,**
> **కుర్యాద్య ఏవం మనుజః ప్రయోగం సంమానమగ్ర్యం కుశలేషు గచ్ఛేత్"**
> (నా.శా. 32.484)

శృంగారం పుష్పాలచేత, గాంధర్వంచేత, కావ్యపఠనంచేతా ఉత్తేజితం అవుతుంది అని **నాట్యశాస్త్రం** చెపుతున్నది.

> **"ఋతుమాల్యాలఙ్కారైః ప్రియజనగాన్ధర్వసేవాభిః,**
> **ఉపవనగమనవిహారైః శృఙ్గారరసః సముద్భవతి"** (నా.శా. 6.47)

ఈ విధంగా **నాట్యశాస్త్రానికి** గాంధర్వంతో సన్నిహితసంబంధం ఉన్నట్లు స్పష్టం అవుతున్నది. అయితే ఈ రెండూ స్వతంత్రమైన రెండు విద్య లని భరతుని అభిప్రాయం అని కొందరు అంటారు. అందుకు ప్రమాణంగా నాట్యశాస్త్రంలో అక్కడక్కడ ఉన్న **"గాన్ధర్వం చైవ నాట్యం చ యః సమ్యగనుపశ్యతి"** ఇత్యాదివాక్యాలను చూపుతూ ఉంటారు. సామాన్యవిశేషన్యాయంచేత (వృక్షాలు చూతవృక్షాలు అని వేరు వేరుగా చెప్పినట్లు) వీటిని వేరు వేరుగా చెప్పడం జరిగింది కాని ఈ రెండింటిని అత్యంత భిన్నము లైన రెండు విద్యలుగా గ్రహించవలసిన పని లేదు. **నాట్యశాస్త్రం** ప్రారంభంలోనే బ్రహ్మదేవుడు

నాట్యవేదాన్ని సృష్టించా డనీ, దీనికి వేదాలతోనూ ఉపవేదాలతోనూ సంబంధం ఉన్నదనీ, ఇది అత్యంత లలిత మైన వేద మనీ భరతుడు చెప్పి ఉన్నాడు -

"వేదోపవేదైః సంబద్ధో నాట్యవేదో మహాత్మనా,
ఏవం భగవతా సృష్టో బ్రహ్మణా లలితాత్మకః" (నా.శా. 1.18)

అని కాణే మొదలైన పండితుల అభిప్రాయం. అయితే - **నాట్యవేదం గాంధర్వవేదం**నుండి విషయాలు సేకరించినది అని అంగీకరించి నప్పుడు ఈ రెండూ వేరు వేరు విద్యలు అని చెప్పడంలో తప్పులేదు. పైన ఉదాహరించిన శ్లోకంలో చెప్పినట్లు నాట్యవేదానికి వేదోపవేదాలతో సంబంధం ఉన్నా వాటికంటె ఇది భిన్నం అని అంగీకరిస్తున్నాం కదా?

కళింగదేశరాజైన "ఖారవేలుడు" **గాంధర్వవేదబుధుడు** అని, ఖారవేలుడు వ్రాయించిన హథిగుఫాశిలాశాసనంలో చెప్పబడింది. ఈ శాసనం క్రీ.పూ. రెండవ శతాబ్దానికి చెందినదిగా అంగీకరించబడింది. అందుచేత గాంధర్వవేదాన్ని ఒక వేదంగా (ఉపవేదంగా) క్రీస్తుకు కొన్ని శతాబ్దాలకు పూర్వమే అంగీకరించి ఉంటారు. ఈ వేదంలోని కొన్ని అంశాలను అలవాట్లను గ్రహించిన **నాట్యశాస్త్రం** క్రీ.పూ. 200 సంవత్సరాల ప్రాంతానికి చెందినదని చెప్పవచ్చు.

నాట్యశాస్త్ర ప్రవర్తకుడు భరతుడు అని కాళిదాసు - భవభూతి - దామోదరగుప్తులు చెప్పి ఉన్నారు. అందుచేత ప్రస్తుతం లభిస్తూన్న **నాట్యశాస్త్రంలోని** మొదటి అధ్యాయం, బహుశా తరువాతి నాలుగు అధ్యాయాలూ కూడ క్రీ.శ. ఐదవ శతాబ్దికంటె కొన్ని శతాబ్దాలకు పూర్వమే చేర్చబడి ఉండాలి. ఇప్పుడు లభించే అధ్యాయాలలో చాలవరకు క్రీ.శ.మూడవ లేదా నాల్గవ శతాబ్దానికే ఉండి ఉంటాయని అనేక ప్రమాణాల ద్వారా నిర్ధారించడానికి అవకాశం ఉంది.

క్రీ.శ. 1000-1030 ప్రాంతంలో **నాట్యశాస్త్రా**నికి వ్యాఖ్యానం రచించిన అభినవగుప్తుడు నాట్యశాస్త్రాని కున్న అనేక ప్రాచీనవ్యాఖ్యానాలను గూర్చి ప్రస్తావించాడు. తొమ్మిదవ అధ్యాయంలో ఉన్న -

"ఉత్తానో వర్తులస్త్ర్యస్రః స్థితోఽధోముఖ ఏవ చ,
పఞ్చ ప్రచారా హస్తస్య నాట్యనృత్తసమాశ్రయాః" (9.182)

అనే శ్లోకాన్ని భట్టోద్భటుడు -

"ఉత్తానోఽధస్తలస్త్ర్యశ్రోఽగ్రగోఽధోముఖ ఏవ చ,
పఞ్చ ప్రకారా హస్తస్య..."

అని మరొక విధంగా పఠించినట్లు ఆయన వ్రాశారు. అట్లే పద్దెనిమిదవ అధ్యాయంలోని "వృత్తాని సమవకారే కవిభిస్తాని ప్రయోజ్యాని" (18.76) అనే శ్లోకాన్ని ఉద్భటుడు -

"వృత్తాని సమవకారే కవిభిర్నైవ ప్రయోజ్యాని" అని పఠించాడట. పందొమ్మిదవ అధ్యాయంలోని 42వ శ్లోకంలో ఉద్భటుడు 'విమర్శ' కు బదులు 'అవమర్శ' అని పఠించాడని చెపుతూ అభినవగుప్తుడు దాని అర్థం వివరించాడు. అదే అధ్యాయంలోని 69వ శ్లోకంలో సంధ్యంగాల విషయంలో ఉద్భటుడు అంగీకరించిన క్రమాన్ని అభినవగుప్తుడు విమర్శిస్తాడు. ఉద్భటుడు ఎనిమిదవ శతాబ్దం ఉత్తరార్థంలో ఉన్నాడు. దీనిని పట్టి ప్రస్తుతం లభిస్తూన్న గ్రంథంలో తొమ్మిదవ అధ్యాయం, పద్దెనిమిదవ అధ్యాయం కూడ ఎనిమిదవ శతాబ్ధానికి చాల పూర్వమే ఉన్నట్లు చెప్పాలి. లోల్లటుడు ఉద్భటుని మతాన్ని ఖండించినట్లుగా అభినవగుప్తుడు ఆరవ అధ్యాయంలోని పదవ శ్లోకంలో చెప్పాడు. లోల్లటుడు అంగీకరించిన అనేక పాఠభేదాలను కూడా అక్కడక్కడ చూపించాడు. అట్లే **నాట్యశాస్త్రం**లోని 3, 18, 19, 29, అధ్యాయాలలోని కొన్ని శ్లోకాలపై శంకుకుడు చేసిన వ్యాఖ్యను అభినవగుప్తుడు ఉదాహరించాడు. దీనిని పట్టి కనీసం ఎనిమిదవ శతాబ్దం నాటికి **నాట్యశాస్త్రం**లోని ప్రధానమైన అధ్యాయా లన్నీ ప్రచారంలో ఉన్నా యని తెలుస్తూన్నది. **కావ్యాదర్శం**లో (2, 281, 283, 286) దండి రతి - క్రోధ - ఉత్సాహాలు, శృంగార - రౌద్ర - వీరరసాలకు స్థాయిభావా లని చెప్పాడు. అదే విధంగా ఇతరులు చెప్పిన సంధ్యంగ - వృత్త్యంగలక్షణాలు కూడా మా మతంలో అలంకారాల క్రిందికే వస్తాయి అని అంటాడు.

"యచ్చ సంధ్యఙ్గవృత్త్యఙ్గలక్షణాద్యాగమాన్తరే,
వ్యావర్ణితమిదం చేష్టమలంకారతయైవ నః" (కావ్యాదర్శ 2.367)

ఇక్కడ దండి చెప్పిన ఆగమాంతరం **నాట్యశాస్త్రం** అని వ్యాఖ్యాత లందరూ వ్యాఖ్యానించారు. నాట్యశాస్త్రంలో సంధ్యంగాలు 21వ అధ్యాయంలోని 58-69 శ్లోకాలలోను, వృత్తులు వృత్త్యంగాలు 22వ అధ్యాయంలోని 25-64 శ్లోకాలలోను, లక్షణాలు 17వ అధ్యాయంలోని 1-42 శ్లోకాలలోను చెప్పబడ్డాయి. దండి చెప్పిన దానిని పట్టి **నాట్యశాస్త్రం** లోని ప్రధానమైన అధ్యాయాలు ఉద్భటునికంటె ఒకటి రెండు శతాబ్దాలకు పూర్వమే ఉన్నట్లు చెప్పవచ్చును.

కుమారసంభవం ఏడవ సర్గలోని ఈ క్రింది శ్లోకాల భావాన్ని పరిశీలిస్తే మన **నాట్యశాస్త్ర**కాలం ఇంకా వెనుకకు నెట్టవచ్చును.

"తౌ సన్ధిషు వ్యఞ్జితవృత్తిభేదం రసాన్తరేషు ప్రతిబద్ధరాగమ్,
అపశ్యతామప్సరసాం ముహూర్తం ప్రయోగమాద్యం లలితాఙ్గహారమ్."(7-91)
"ప్రమథముఖవికారైర్హాసయామాస గూఢమ్" (7.95)

ఈ శ్లోకాలలో నాట్యశాస్త్రంలోని 6, 21, 22 అధ్యాయాలలో చెప్పిన విషయాల నిర్దేశం ఉంది. నాట్యశాస్త్రంలోని 21వ అధ్యాయం 37వ శ్లోకంలో అయిదు సంధులు, 22వ అధ్యాయంలోని 24-57, 65 శ్లోకాలలో వృత్తులు చెప్పబడ్డాయి. 22వ అధ్యాయం 17వ శ్లోకంలో సులలితైరఙ్గహారైః అనే పదా లున్నాయి. **శృఙ్గారో విష్ణుదైవత్యః హాస్యః ప్రమథదైవతః** (నా.శా. 6.44) అనే శ్లోకంలో హాస్యరసానికి ప్రమథులు దేవత అని చెప్పబడింది. అందుచేత ప్రమథుల చేష్టలు హాస్యజనకా లవడం యుక్తమే. చాలామంది పండితులు అంగీకరించి నట్లు ఐదవశతాబ్దం పూర్వార్థం కాళిదాసుని కాలం అని గ్రహించినా ప్రస్తుతం మనకు లభిస్తూన్న **నాట్యశాస్త్రం** క్రీ.శ. 350-450కి కనీసం ఒకటి రెండు శతాబ్దాలకు పూర్వమే ఉన్న దని చెప్పవచ్చును. కాళిదాసు కాలం క్రీ.పూ. ప్రథమశతాబ్ది అని అంగీకరించిన పక్షంలో **నాట్యశాస్త్ర**కాలం ఇంకా వెనుకకు వెళ్ళవచ్చును.

క్రీ.శ. 100 ప్రాంతంలో ఉన్న అశ్వఘోషుడు రచించిన **శారిపుత్రప్రకరణం** అనే ప్రకరణంలోని కొన్ని భాగాలు మాత్రమే లభించాయి. **నాట్యశాస్త్రంలో** చెప్పిన ప్రకరణనియమాలకు ఈ ప్రకరణంలో అనుసరించిన పద్ధతికీ చాల సామ్యం ఉంది. అశ్వఘోషుడు ఆ కాలంలో చూడడానికి అవకాశం ఉన్న శాస్త్రగ్రంథం నాట్యశాస్త్రమే అయి ఉండాలి. దీనిని పట్టి **నాట్యశాస్త్రం** కాలం క్రీ.శ. 100కి కనీసం ఒకటి రెండు శతాబ్దులకు పూర్వం అయి ఉండాలి.

వేదకాలంలో సంగీతానికీ వాద్యసంగీతానికి అత్యధిక మైన ప్రచారం ఉండేది. "పారాశర్యశిలాలిభ్యాం **భిక్షునటసూత్రయోః**" (పా.సూ. 4.3.110) "**కర్మన్దకృశా శ్వాదినిః**" (పా.సూ. 4.3.111) అను పాణినిసూత్రాలను పట్టి పాణినికి పూర్వం అనగా క్రీ.పూ. ఏడవ శతాబ్దానికి పూర్వం, శిలాలి, కృశాశ్వుడు రచించిన నాట్యసూత్రా లున్నట్లు తెలుస్తూన్నది. అయితే అవి పూర్తిగా విస్మృతము లైపోయాయి. వాటి పేర్లు కూడా నాట్యానికి సంబంధించిన ఏ గ్రంథాలలోను కనబడడంలేదు. ఈ ఇద్దరు సూత్రకారుల పేర్లూ కూడ కాలక్రమంలో భరతశబ్దం వలె నటు డనే అర్థంలో ప్రచారంలోనికి వచ్చాయి. అమరకోశంలో

"శైలాలినస్తు శైలూషా జాయాజీవాః **కృశాశ్వినః**
భరతా ఇత్యపి నటాశ్చారణాస్తు కుశీలవాః"

అని ఈ పేర్లు కనబడుతున్నాయి. శైలాలిన్, కృశాశ్వన్ అనే పదాలు నట వాచకాలుగా ప్రయోగించబడడానికి పాణినిసూత్రాలే మూలం. "భరతాః" అనే పదం "భరతస్య అపత్యాని పుమాంసః" అనే అర్థంలో భరతశబ్దానికి "**అన్వృష్యానన్తర్యే** బిదాదిభ్యోఽఞ్" (పా.సూ. 4.1104) అనే సూత్రంచేత **అఞ్** ప్రత్యయం చేర్చి "**యఞఞోశ్చ**"

(పా.సూ. 2.4.64) అనే సూత్రంచేత దానికి లోపం చేయగా నిష్పన్నం అయిన దని క్షీరస్వామి (అమరకోశవ్యాఖ్యాత) అన్నాడు. "భరతుడు **నాట్యశాస్త్రం** రచించాడు; దాని అధ్యయనం చేసిన భరతశిష్యులు భరతపుత్రు లనడం యుక్తమే. అందుచేత వాళ్ళు "**భరతాః**" అనబడుతున్నారు" అని కూడా క్షీరస్వామి విశదీకరించాడు. "భరత" శబ్దానికి అసలు అర్థం నటుడు. అందుచేత దీనికి నటశాస్త్రం అని కూడ అర్థం ప్రచారంలోనికి వచ్చి ఉంటుంది. కాలాంతరంలో నటశాస్త్రం రచించిన వానినే భరతుడనే పేరుతో పిలవడం జరిగింది" అని కొందరి అభిప్రాయం అంత యుక్తంగా లేదు. 'భరత' అనేది అతిప్రాచీనమైన పేరు. **ఋగ్వేదంలోను**, **శతపథబ్రాహ్మణంలోను**, **ఐతరేయ బ్రాహ్మణంలోను** అనేక స్థలాలలో ప్రయోగించబడింది. ఈ శబ్దం **యాజ్ఞవల్క్యస్మృతిలో** (3.62) నటు డనే అర్థంలో ప్రయోగించబడింది. అందుచేత పాణిని తరవాత కాళిదాసుకు పూర్వం భరతు డనే ఒక రచయిత నాట్యానికి సంబంధించిన ఒక గ్రంథం (అది ఈ **నాట్యశాస్త్రం** కాకపోవచ్చు) రచించి ఉంటాడు, అదే కాలక్రమేణ ఎన్నో చేర్పులతో మార్పులతో ప్రస్తుతనాట్యశాస్త్రంగా తయా రైనది అని కొందరి ఊహ.

ధర్మశాస్త్రాలు, ప్రాచీనస్మృతులు బయలుదేరే కాలంనాటికి సాంప్రదాయికుల దృష్టిలో నట - నర్తక - గాయకాదులను అపవిత్రులనగా నీతిబాహ్యులనుగా పరిగణించడం ప్రారంభం అయింది. విద్యార్థి నృత్యం చూడకూడదు, సభకు గాని సమితికి గాని వెళ్ళకూడదు అని **అపస్తంబధర్మసూత్రం** (1.1.3.11-12) నిషేధించింది. విద్యార్థి నృత్య - గాన - వాద్యసంగీతాదులకు దూరంగా ఉండాలి అని **మనుస్మృతి** (2.178) విధించింది. నృత్య - గీత - వాద్యసంగీతతాలాదులు అభ్యసించే బ్రాహ్మణులు శ్రాద్ధభోజనానికి అనర్హు లని **గౌతమధర్మసూత్రం** (15.18) చెప్పింది. **మనుస్మృతి** ప్రకారం (8.102) బ్రాహ్మణుడు వడ్రంగిపని చేసినా, నటుడుగా ఉన్నా అతడు శూద్రునితో సమానుడు. అలాంటివాడు సాక్ష్యం ఇవ్వడానికి అనర్హుడు (8.65). నటుణ్ణి మతానికి సంబంధించిన కర్మలకు ఆహ్వానించకూడదు (3.155). శూద్రుడు నటించవచ్చు ననీ, స్త్రీవేషం ధరించవచ్చుననీ మూకాభినయప్రదర్శనం చేయవచ్చునీ శాంతిపర్వంలో (295 - 4 - 5) చెప్పబడింది. నటుడు ఏడు రకాలైన అంత్యజుల జాతిలో చేర్చబడ్డాడు (చూ. హిస్టరీ ఆఫ్ ధర్మశాస్త్ర II సంపుటం. పే. 70,84).

ఈ వెలివేతను ఎదుర్కొనడానికి **నాట్యశాస్త్రంలో** ప్రబలమైన ప్రయత్నం చేయబడింది. నాట్యంలో ధార్మిక - ఆధ్యాత్మిక విషయాలను ప్రవేశపెట్టడం ద్వారా దీనికి అత్యున్నత మైన, పూజనీయ మైన స్థానాన్ని కల్పించడంకోసం ప్రయత్నం జరిగింది. నాట్యశాస్త్రంలోని మొదటి ఐదు అధ్యాయాలు ఈ ప్రయోజనాన్నే ఉద్దేశించి చేర్చబడి

ఉంటాయి. మహాపండితుడు, గొప్ప శైవసిద్ధాంతాచార్యుడూ అయిన అభినవగుప్తుడు అత్యుత్తమమైన ఈ నాట్యవిద్య విషయంలో యుక్తియుక్తమూ, పూర్తిగా ఆచరణయోగ్యమూ అయిన తాత్త్వికదృక్పథాన్ని ప్రదర్శించాడు. **"ఏతేన, కామజో దశకో గణః ఇతి వర్జనీయత్వేన నాట్యస్యానుపాదేయతా ఇతి యత్ కేచిదాశశఙ్కిరే తదయుక్తీకృతమ్. యాజ్ఞవల్క్యస్మృతిపురాణాదౌ చ అస్య ప్రశంసాభూయస్త్వశ్రవణాత్. న చాగమాదృతే ధర్మః అనుమానగమ్యః ఇతి న్యాయాత్. ఏతత్తు వృద్ధైవాస్థానభీరూన్ ప్రతి శఙ్కాశమనార్థమ్ అభిధీయతే నామ. తథా హి నటానాం తావదేతత్స్వధర్మామ్నాయరూపత్వాత్ అనుష్ఠేయమేవ. న చాస్మాకం తచ్చేష్టితం విచార్యమ్. సోమక్రయోపదేశినో హి వాక్యస్య న తద్విక్రయిబ్రాహ్మణాన్తరగతకృత్యాకృత్యవిచారణోద్యోగః యుక్తః. న చాప్యస్య ఉపదిశ్యతే గాయేత్ నృత్యేదితి"** (నా.శా.మొ.సం.పే.3,4). పై వాక్యంలోని 'ఏతేన' అనుపదం నాట్యశాస్త్రం మూడవ అధ్యాయంలోని 74-75 శ్లోకాలను నిర్దేశిస్తుంది. ఎవరు **నాట్యవేదం** వింటారో, అధ్యయనం చేస్తారో వాళ్లకు, వేదాధ్యయనం చేసినవాళ్లకు లేదా యజ్ఞాలు చేసినవాళ్ళకు ఎలాంటి ఫలం లభిస్తుందో అలాంటి ఫలమే లభిస్తుంది అని ఆ శ్లోకాలలో చెప్పబడింది. **మనుస్మృతి** - సాధారణంగా మానవు లందరూ ఆనందం కోసం చేసే పనులను పేర్కొని రాజు వాటియందు ఆసక్తుడు కాకూడదు అని బోధించింది.

> **"మృగయాక్షో దివాస్వప్నః పరివాదః స్త్రియో మదః,**
> **తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకో గణః"** (మ.స్మృ. 7.47)

పై విషయాలన్నీ దృష్టిలో ఉంచుకొని పరిశీలించగా క్రీ.శ. మూడు నాలుగు శతాబ్దాలకు పూర్వం ఎవరో నాట్యశాస్త్రం పునర్నిర్మాణం చేసి దానిలో సూత్ర - భాష్యపద్ధతిలో గద్యభాగాలను, ప్రాచీన ఆర్యలను, శ్లోకాలను తాను రచించిన కొన్ని కారికలను చేర్చి ఉంటా డని అనుకొనడానికి అవకాశం ఉంది. తరవాత కాలాంతరాలలో ఈ శాస్త్రంలో నైపుణ్యం గల మరి కొందరు కొన్ని శ్లోకాలు చేర్చి ఉంటారు.

ఏమైనా కూడ కోహల - నందికేశ్వరాదులు రూపకాలపైన రచించిన గ్రంథాలు, ఉద్భటాదుల వ్యాఖ్యానాలు లభించేవరకూ నాట్యశాస్త్రగ్రంథస్వరూపానికీ, దీని రచయితకూ, దీని రచనా, కాలమూ మొదలైన అంశాలకూ సంబంధించిన ప్రశ్నలకు సరియైన సమాధానాలు దొరకడం కష్టమే.

నాట్యశాస్త్రరచయిత ఎవరు అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే చాలా చిక్కులు ఎదురవుతాయి. మొదటి అధ్యాయం ప్రారంభంలో ఉన్న ఐదు శ్లోకాలు భరతుని శిష్యుడు రచించిన వనీ, అట్లే ఈ గ్రంథంలోని ప్రశ్నలు సమాధానాలు కూడా భరతుని శిష్యుడే చేర్చా డనీ, మిగిలిన గ్రంథం మాత్రం భరతుని రచనయే అనీ చెప్పిన పండితులు

అభినవగుప్తునికి పూర్వమే ఉండేవారు. అయితే అభినవగుప్తుడు ఈ అభిప్రాయాన్ని చాల గట్టిగా ఖండించాడు. ఎందువల్ల ననగా - ఈ గ్రంథంలో మరి కొందరి హస్తక్షేపం ఉన్న దని చెప్పడానికి తగిన ప్రమాణం ఏదీ లేదు. ఒక విషయాన్ని గూర్చి చర్చించే టప్పుడు రచయిత తనను ప్రథమపురుషలో నిర్దేశించడం అనేది అన్ని శాస్త్రాలలోనూ ఉన్న సంప్రదాయం. **"ఏకస్య గ్రన్థస్య అనేక వక్తృవచనసందర్భమయత్వే ప్రమాణాభావాత్. స్వపరవ్యవహారేణ పూర్వపక్షోత్తరపక్షాదీనాం శ్రుతిస్మృతివ్యాకరణతర్కాదిశాస్త్రేషు ఏకవి రచితేష్వపి దర్శనాత్"** (అ.భా.మొ.సం.పే.9). **నాట్యవేద**ప్రవర్తకు లైన సదాశివ - బ్రహ్మ - భరతులలో బ్రహ్మచెప్పిన సిద్ధాంతాలే ప్రామాణిక మైనవి అని స్థాపించడం కోసమే **నాట్యశాస్త్రం** రచించబడింది అని చెప్పిన కొందరు 'నాస్తికాగ్రేసరులైన ఉపాధ్యాయుల' అభిప్రాయాన్ని కూడ అభినవగుప్తుడు ఖండించాడు - **"ఏతేన సదాశివబ్రహ్మభరత మతత్రయవివేచనేన బ్రహ్మమతసారతాప్రతిపాదనాయ మతత్రయీసారాసారవివేచనం తద్గ్రన్థఖణ్డప్రక్షేపేణ విహితమిదం శాస్త్రం, న తు మునివిరచితమితి యదాహుః నాస్తికధుర్యోపాధ్యాయాః తత్ ప్రత్యుక్తమ్. సర్వానపహ్నవనీయాబాధితశబ్దలోకప్రసిద్ధి విరోధాచ్చ"** (అ.భా.మొ.సం.పే.8).

ఈ గ్రంథం నందిభరతులు రచించిన దనీ, సంగీతానికి సంబంధించిన దనీ నిర్ణయసాగరప్రతి చివర ఉన్నది. కొన్ని వ్రాతప్రతులను పట్టి నందికేశ్వరునికి **నాట్యశాస్త్రం**తో ఏదో సంబంధం ఉన్నట్లు కనబడుతున్నది. కోహలునికి **నాట్యశాస్త్రం**తో ఎలాంటి సంబంధం ఉన్నదో స్పష్టంగా తెలియదు. **నాట్యవేదా**న్నీ దాని ప్రయోగాన్నీ భరతుడు నూరుగురు కుమారులకు లేదా శిష్యులకు (చౌఖంభాప్రతి ప్రకారం 105 లేదా 106 గురికి) ఉపదేశించి నట్లు చెప్పబడింది. వాళ్లలో శాండిల్యుడు, వాత్స్యుడు, కోహలుడు, దంతిలుడు అనేవాళ్ల పేర్లు ముందున్నాయి. **నాట్యశాస్త్రం**లో చెప్పని విషయాలను మరొక గ్రంథంలో కోహలుడు కాలాంతరంలో చెప్పగలడు అని జోస్యం చెప్పినట్లు చివరి అధ్యాయంలో (36.65) చెప్పబడింది. కోహల - వాత్స్య - శాండిల్య - ధూర్తిలులు నాట్యశాస్త్రాన్ని ప్రయోగించారని కూడ చెప్పబడింది (36-71). నాట్యశాస్త్రాన్ని తిరిగి వ్రాసినవాళ్లమీద కోహలుని ఏదో ఒక గ్రంథం యొక్క ప్రభావం ప్రసరించి ఉంటుంది. అభినవగుప్తుడు కోహలుని అనేక స్థలాలలో పేర్కొన్నాడు. కొన్ని చోట్ల ఆతనిని భరతునికి సమకాలికు డన్నట్లు కూడ వ్రాశాడు. దామోదరగుప్తుడు (క్రీ.శ. ఎనిమిదవ శతాబ్దం ఉత్తరార్ధం) కుట్టనీమతంలో భరతునితో పాటు కోహలుణ్ణి కూడ నాట్యాచార్యుణ్ణిగా పేర్కొన్నాడు. **"విటఖటకే కా నృత్యతి కోహలభరతోదితక్రియయా"** (కు.మ.81). **రాజశేఖరుని బాలరామాయణం**లో కోహలు డనే నాట్యాచార్యు డున్నాడు. అతడు **"పరమేష్ఠినో మానసభువః ప్రథమపుత్రస్య**

నాట్యయోనేః భరతాచార్యస్య కృతిః అభినవం సీతాస్వయంవర ఇతి నాటకం ప్రయోక్తవ్యమ్" (3.12) అని రావణునితో అంటాడు. భరతుడు, శాండిల్యుడు, కోహలుడు, దత్తిలుడు, మతంగుడు నాట్యశాస్త్రానికి సంబంధించిన గ్రంథాలు రచించా రని శింగభూపాలుడు రసార్ణవసుధాకరంలో (1.50-2) అన్నాడు. **కుట్టినీమతంలో** కామశాస్త్రరచయిత లైన వాత్స్యాయన - దంతిలులతో పాటు భరత - విశాఖిల - దత్తిలాచార్యులు పేర్కొనబడ్డారు. ఎపిగ్రాఫియా కర్ణాటకాలో ఉన్న క్రీ.శ.517 నాటి శాసనంలో కొంగణీవర్మ కుమారుడైన మాధవుడు **దత్తకసూత్రవృత్తి** రచించి నట్లు చెప్పబడింది. దంతిలుడు భరతపుత్రులలో ఒకడు. దత్తిలుడు ధ్రువల విషయంలోను, తాళాల విషయంలోను ప్రామాణికు డనీ గంధర్వవేదసారం అనే అతని గ్రంథం లభ్యం అవుతున్న దన్నీ కొంద రంటున్నారు.

అభినవభారతి మొదటి సంపుటం ప్రస్తావనలో రామకృష్ణకవి **యామిలాష్టక** తంత్రంనుండి ఒక శ్లోకం ఉదాహరించాడు. దాని ప్రకారం ఉపవేదమైన గాంధర్వవేదంలో 36000 శ్లోకా లున్నాయి. భరతులు నాట్యవేదంనుంచి రెండు సంగ్రహగ్రంథాలు రచించా రనీ, ఒకదానిలో 12000 శ్లోకాలు, రెండవదానిలో 6000 శ్లోకాలూ ఉన్నా యనీ భావప్రకాశనంలో (10.34-35) చెప్పబడింది. వృద్ధభరతుడు 12000 శ్లోకాలతో ఒక గ్రంథం నిర్మించాడనీ, భరతుడు 6000 శ్లోకాలతో నాట్యశాస్త్రం రచించా డనీ రామకృష్ణకవి అన్నాడు. భరతుడు నాట్యవేదంలో రసాలను ప్రతిపాదించా డనీ భరతవృద్ధుడు గద్యభాగాలను కూర్చా డనీ శారదాతనయుని **భావప్రకాశనంలో** చెప్పబడింది.

"ఏవం హి నాట్యవేదోఽస్మిన్ భరతేనోచ్యతే రసః,
తథా భరతవృద్ధేన కథితం గద్యమీదృశమ్"

"యథా నానాప్రకారైః వ్యఞ్జనౌషధైః **పాకవిశేషైశ్చ"** ఇత్యాదివాక్యాలు ఉదాహరణంగా చూపబడ్డాయి. **నాట్యసర్వస్వదీపికా** అనే ఒక వ్రాతప్రతి ఉన్నది. ఆదిభరతుని గ్రంథానికి వ్యాఖ్యాన మని చెప్పబడే దీనిలో సమవాయం, శిక్ష, భావం, ఉల్లాసం, వైశేషికం అనే ఐదు స్కంధా లున్నాయి. 32 అధ్యాయాలు, 221 ప్రకరణాలు కల ఈ గ్రంథంలో 6000 శ్లోకా లున్నాయి. కొందరు సంస్కృతరూపకవ్యాఖ్యాతలు ఆదిభరతునినుంచీ భరతుని నుంచీ కూడ శ్లోకాలు ఉదాహరిస్తుంటారు. ఉదాహరణకి - **శాకుంతల** వ్యాఖ్యాన మైన **అర్థద్యోతనికలో** రాఘవభట్టు కనీసం పదిహేడు సార్లు ఆదిభరతుని నుంచి శ్లోకాలు ఉదాహరించాడు. వీటిలో చాలా వరకు శ్లోకాలు మనకు లభిస్తున్న **నాట్యశాస్త్రంలో** కనబడుతున్నాయి. కొన్నింటితో సామ్యం ఉన్న శ్లోకాలు **నాట్యశాస్త్రంలో** ఉన్నాయి. అదే విధంగా ఇతడు కనీసం పదకొండు సార్లు భరతునినుంచి శ్లోకాలు ఉదాహరించాడు. భరతునినుంచి శ్లోకాలను ఉదాహరించే టప్పుడు ఇతడు సాధారణంగా అధ్యాయం కూడ

నిర్దేశించాడు. ఆదిభరతునినుంచి మాత్రం అధ్యాయం పేర్కొనకుండానే ఉదాహరించాడు. దీనిని పట్టి రాఘవభట్టు దగ్గర, ఆనాడు భరతుని గ్రంథం ఒకటి ఆదిభరతుని గ్రంథం ఒకటీ ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే చాలా వరకు వాక్యాలు రెండింటిలోను సమానంగానే ఉండి ఉంటాయి. ఒక చోట ఇతడు - **"సూత్ర - మూలభరత - టీకాకారాభినవగుప్తాచార్యసంమతా... ద్వాదశపదా ఉదాహృతా"** అని అంటాడు. దీనిని పట్టి ఇతడు సూత్రమూ మూలభరతమూ వేరు వేరని భావిస్తున్నట్లు తెలుస్తున్నది. సాధారణంగా అర్వాచీనరచయితలు మాత్రమే భరత - ఆదిభరతులను వేరువేరుగా చూపారు. ఉదాహరణకి బహురూపమిశ్రుడు **దశరూపక** వ్యాఖ్యానంలో ఒక "షట్సహస్రీకారుణ్ణి" (అనగా భరతుని నాట్యశాస్త్రం) పేర్కొన్నాడు. - **"సూత్రణం సకలాజ్ఞానాం జ్ఞేయమజ్ఞముఖం బుధైః"** ఇతి **"షట్సహస్రీకారః"**. మరొక చోట "ద్వాదశసహస్రీకారుణ్ణి" పేర్కొన్నాడు.

"సమాప్యమాన ఏకస్మిన్నితరాజ్ఞస్య సూచనమ్,
సమాసతో హి నాట్యజ్ఞైరజ్ఞావతార ఇష్యతే.

ఇతి ద్వాదశసహస్రీకారః".

దీనినంతనీ పట్టి నాట్యశాస్త్రానికి సంబంధించిన రెండు వ్రాతప్రతులు ఉండి ఉండవచ్చు ననీ, వాటిలోని శ్లోకసంఖ్య వేరువేరుగా ఉండడంచేత ఒకదానికి భరతునిగ్రంథ మనీ, మరొకదానికి వృద్ధభరతుని గ్రంథ మనీ ప్రచారం వచ్చి ఉంటుం దనీ ఊహించ వచ్చును.

యాజ్ఞవల్క్యస్మృతిలో భరతశబ్దం నటు డనే అర్థంలో ప్రయోగించబడింది. -

"యథా హి భరతో వర్ణైర్వర్ణయత్యాత్మనస్తనుమ్
నానారూపాణి కుర్వాణస్తథాత్మా కర్మజాస్తనూః" (3.162)

ఈ శబ్దం నాట్యశాస్త్రంలోనే నటవాచకంగా ప్రయోగింపబడింది.

"పృష్ఠే కృత్వాస్య కుతపం నాట్యం యుఙ్క్తే యతోముఖం భరతః,
సా పూర్వా మన్తవ్యా ప్రయోగకాలే తు నాట్యజ్ఞైః" (14.25)

అభినయసంప్రదాయంలో మంచి ప్రావీణ్యం సంపాదించిన ఎవరోఒక విద్వాంసునికి భరతుల (నటుల) విషయంలో ఎక్కువ ఆదరాభిమానాలు ఉండి ఉంటాయి. అతడు నేటి నాట్యశాస్త్రంలోని విషయా లన్నింటిని ఒక చోట క్రోడీకరించి ఈ గ్రంథం భరతుడనే ఒక కాల్పనికవ్యక్తి రచించి నట్లుగా ప్రచారంలోనికి తీసికొనివచ్చి ఉంటాడు. సంస్కృతవాఙ్మయంలో ఇలాంటి పనులు సర్వసాధారణంగా జరుగుతూ ఉంటాయి. ఉదాహరణకి అతివిశాల మైన పురాణవాఙ్మయం అంతా వ్యాసునికి అంటకట్టబడింది.

పద్దెనిమిది మహాపురాణాలు, పద్దెనిమిది ఉపపురాణాలు వ్యాసు డనే ఒక వ్యక్తి రచించాడనేది ఎవ్వరూ కూడ నమ్మడానికి శక్యం కాని విషయం. ఆనువంశ్యశ్లోకా లని చెప్పబడే కొన్ని ఆర్యలను, శ్లోకాలను చూడగా - అతిప్రాచీనకాలంనుంచీ అనేక మైన నాట్యసంబద్ధాలైన శ్లోకాదులు గాలిలో తిరుగుతూండే వనీ, వాటిని సేకరించి నియమబద్ధరీతిలో రచించిన నాట్యశాస్త్రంలో తగిన చోట్ల కూర్చడం జరిగిం దనీ ఊహించడానికి అవకాశం ఉంది. నాట్యశాస్త్రంలో ఒక చోట శబ్దలక్షణాల విషయంలో ప్రాచీనాచార్యుల అభిప్రాయాలను సేకరించి సంక్షిప్తంగా వాటిని ఇక్కడ చేర్చడం జరిగిం దని చెప్పబడింది.

"పూర్వాచార్యైరుక్తం శబ్దానాం లక్షణం తు విస్తరశః,
పునరేవ సంహృతార్థం లక్షణతః సంప్రవక్ష్యామి" (15.12)

భావప్రకాశనంలోని 10వ అధికరణంలో (పే 285-287) నాట్యవేదావిర్భావాన్ని గూర్చిన ఒక కథ ఉన్నది. బ్రహ్మకు **నాట్యవేదం** ఉపదేశించివలసినదిగా శివుడు నందికేశ్వరుణ్ణి ఆజ్ఞాపించాడు. భరతుడు ఐదుగురు శిష్యులతో కలిసి బ్రహ్మదగ్గరికి వెళ్లగా బ్రహ్మ "ఈ నాట్యవేదాన్ని భరించండి" **"తానబ్రవీన్నాట్యవేదం భరతేతి పితా మహః"** అన్నాడు. అందువల్ల మొట్టమొదట నటించిన ఆ నటులకు 'భరతులు' అను పేరు వచ్చింది. జగత్పాలనవల్ల మనుచక్రవర్తికి కలిగిన అలసటను తొలగించడంకోసం వాళ్లు తొలిసారిగా ఆతని ఎదుట ఒక రూపకం ప్రదర్శించారు. భరతులు నాట్యవేదంనుండి కొన్ని అంశాలు గ్రహించి రెండు గ్రంథాలు రచించారు. ఒకదానిలో 12000 శ్లోకాలు, మరొక దానిలో 6000 శ్లోకాలూ ఉన్నాయి. అందుచేత రెండవ దానికి భరతుల పేరు పెట్టబడింది.

"నాట్యవేదాచ్చ భరతః సారముద్ధృత్య సర్వతః,
ఏకం ద్వాదశసాహస్రైః శ్లోకైరేకం తదర్ధతః.
షడ్భిః శ్లోకసహస్రైర్యో నాట్యవేదస్య సంగ్రహః,
భరతైర్నామతస్తేషాం ప్రఖ్యాతా భరతాహ్వయాః"

ఈ కథను పట్టి శారదాతనయుడు ప్రస్తుతం లభిస్తున్న నాట్యశాస్త్రాన్ని పౌరాణికు డైన భరతు డనేవాని రచనగా అంగీకరించ లేదనీ ఇది నాట్యాన్ని అభ్యసించిన భరతుల రచన అని అతడు అంగీకరిస్తున్నా డనీ తెలుస్తూన్నది. స్వాతి - నారదులు గాంధర్వ - వాద్యవిద్యల ప్రవర్తకు లని చెప్పబడింది. (నా.శా. 33.3; 32.484). గుహుడనేవాడు ఛందస్సును ప్రవర్తింపచేసి నట్లు కూడ చెప్పబడింది. (16.112) ధ్రువలను గూర్చి చెప్పిన సందర్భంలో నారదుని పేరు కూడా పేర్కొనబడింది (32.1). తండు అంగహారాల ప్రయోగాన్ని, వివిధకరణాలను, రేచకాలను భరతునికి ఉపదేశించి నట్లు చెప్పబడింది.

(4.17-19). ఇక్కడ ప్రయోగించిన తండు - మునిశబ్దాలు నంది - భరతుల ఉపనామాలని అభినవగుప్తుడు వ్యాఖ్యానించాడు. **"తణ్డుమునిశబ్దౌ నన్దిభరతయోరు పనామనీ"** (అ.భా.మొ.సం.పే 90). నాట్యశాస్త్రంలో రెండు మూడు స్థలాలలో **కామతంత్ర** (24.182; 25.65) **కామసూత్రాలు** (24.142) పేర్కొనబడ్డాయి. రాజు, సేనాపతి, మంత్రులు, ప్రధాన న్యాయాధికారి మొదలైనవాళ్ల కుండవలసిన లక్షణాలను బృహస్పతి చెప్పిన రీతిగా గ్రహించాలి అని చెప్పబడింది. **"బృహస్పతిమతాదేతాన్ గుణాంశ్చాప్యభి లక్షయేత్"** (34.79). అర్థశాస్త్రకర్తగా ప్రసిద్ధుడైన మానవుడైన కౌటిల్యుని పేరు చెపితే నాట్యశాస్త్రానికి బ్రహ్మభరతాదులతో సంబంధం ఉన్నట్లుగా చెప్పినదానికి విరోధం కనబడుతుం దనే ఉద్దేశ్యంతో అర్థశాస్త్రకర్తగా ఇక్కడ బృహస్పతి పేరు నిర్దేశించబడి ఉంటుంది. దేశాల పేర్లను గూర్చి చెప్పిన సందర్భంలో ఒక పురాణం పేర్కొనబడింది.

"అన్యేఽపి దేశాః ప్రాచ్యాం యే పురాణే సంప్రకీర్తితాః,
తేషు ప్రయుజ్యతే త్వేషా ప్రవృత్తిశ్చౌద్రమాగధీ" (14-46)

'అన్యే', 'అన్యైస్తు' ఇత్యాదిపదాలతో ఉపక్రమించి ఇంకా ఇతర రచయితల మతాలు కూడ **నాట్యశాస్త్రంలో** అక్కడక్కడ చెప్పబడ్డాయి.

సంక్షిప్తంగా నాట్యశాస్త్రంలోని విషయాలు అధ్యాయక్రమంలో ఇవి :

1. ఆత్రేయుడు మొదలైన మునులు భరతమునిని - **నాట్యశాస్త్రం** ఎలా ఆవిర్భవించింది? ఎవరికోసం ఆవిర్భవించింది? దీని అంగాలు ఏవి? నిశ్చితము లైన సిద్ధాంతాలను తెలుసుకొనడానికి ఉపకరించే ఉపాయాలు ఏవి? దీనిని నాట్యరంగం మీద ఎట్లు ప్రయోగించాలి? అని ఐదు ప్రశ్నలు అడుగుతారు. అయితే అతడు ఈ ప్రశ్నలకు సమాధానాలు ఒక వరుసలో ఇవ్వలేదు, వీటి సమాధానాలు గ్రంథం అంతటా వ్యాపించి ఉన్నాయి అని అభినవగుప్త డన్నాడు - **"వయం తు బ్రూమః - నాత్ర క్రమః కశ్చిత్. అపి తు యథావసరం మహావాక్యాత్మనా షట్సాహస్రీరూపేణ ప్రధానతయా ప్రశ్నపఞ్చకనిరూపణపరేణ శాస్త్రేణ తత్త్వం నిర్ణీయతే; న తు క్రమః కశ్చిత్"** (అ.భా.1, పే.8). శూద్రులు వేదాలు చదవకూడదు గాన అన్ని వర్ణాలవారికీ ఉపకరించే ఐదవ వేదాన్ని సృష్టించవలసిందిగా బ్రహ్మదేవుడు భరతుణ్ణి ఆదేశించాడు.

"న వేదవ్యవహారోఽయం సంశ్రావ్యః శూద్రజాతిషు,
తస్మాత్సృజాపరం వేదం పఞ్చమం సార్వవర్ణికమ్" (నా.శా.1.12)

భరతుడు **ఋగ్వేదంనుంచి** పాఠ్యాన్నీ, **సామవేదం** నుంచి గానాన్నీ, **యజుర్వేదం** నుంచి అభినయాన్నీ, **అథర్వవేదం** నుంచి రసాలనూ గ్రహించి నాట్యవేదం నిర్మించి నూర్గురు

పుత్రులకు (శిష్యులకు) బోధించాడు.

2 మూడు, ఆరు పద్యాలలో నాట్యమండప నిర్మాణం. 7వ శ్లోకంలో ప్రేక్షాగృహనిర్మాణం చెప్పబడ్డాయి. **నాట్యశాస్త్రం** ప్రకారం (2.8-11) వికృష్టం (పొడవుగా ఉన్నది), చతురస్రం, త్ర్యస్రం (త్రికోణాకృతిలో ఉన్నది) అని నాట్యమండపం మూడు విధాలుగా ఉంటుంది. ఈ మూడు రకాల మండపాలలో ప్రతీ ఒక్కటీ జ్యేష్ఠం, మధ్యమం, అవరం అని మూడేసి రకాలు ఉండవచ్చును. వీటి కొలతలు హస్తాలలో కాని దండాలలో కాని ఉంటాయి. నాలుగు హస్తాలు ఒక దండం. 108 హస్తాలు లేదా దండా లున్నది జ్యేష్ఠం; 64 హస్తాలు లేదా దండా లున్నది మధ్యమం, 32 హస్తాలు లేదా దండా లున్నది అవరం. అరవైనాలుగు హస్తాల పొడవు ముప్పైరెండు హస్తాల వెడల్పు ఉన్న నాట్యమండపం ప్రేక్షకులకు అనుకూలంగా ఉంటుంది. అలా కాకపోతే మాటలు స్పష్టంగా వినబడవు. భావప్రకాశన రచయిత యైన శారదాతనయుడు తాను **నాట్యవేదం** నాట్యశాలాపతి యైన ఒక బ్రాహ్మణునిదగ్గర అభ్యసించి నట్లు చెప్పుకొన్నాడు (1. పే. 2). నాట్యమండపంలో స్తంభాలు నిలపాలి. దీనిలో రెండు భాగా లుండాలి. అది ఒక పర్వతగుహ వలె ఉండాలి. గోడలమీద బొమ్మలు చిత్రించాలి. ప్రేక్షకుల ఆసనాలు ఇటుకలతో గాని కఱ్ఱతో గాని నిర్మించాలి.

3. రూపకప్రయోగానికి ఆ యా దేవతల రక్షణను కోరుతూ మహాదేవుడు, బ్రహ్మ, విష్ణువు, బృహస్పతి, గుహుడు మొదలైన దేవతల పూజలు చెప్పబడ్డాయి.

4. దేవతల సమక్షంలో **అమృతమథనం** అనే రూపకం ప్రయోగించబడింది. భరతుడు దేవతలకోసం **లక్ష్మీస్వయంవరం** అనే రూపకం ప్రయోగించా డనీ, లక్ష్మీపాత్ర ధరించిన ఊర్వశి, పూరూరవుని మీద మనస్సు లగ్నం అయి ఉండడంచేత అభినయం సరిగా చేయకపోవడంతో భరతు డామెను శపించా డనీ **పద్మపురాణం**లో చెప్పబడింది. (5.12.81) మహాదేవుని సమక్షంలో **త్రిపురదాహం** అనే రూపకం ప్రదర్శింపబడింది. తండు భరతునికి వివిధము లైన అంగహారాలు,కరణాలు, రేచకాలు బోధించాడు. (చిదంబరంలోని నటరాజమందిరం తూర్పు గోపురం మీద నాట్యశాస్త్రంలోని ఈ నాల్గవ అధ్యాయం 34 - 55 శ్లోకాలలో వర్ణించిన 108 కరణాలు రాళ్లమీద చెక్కబడి ఉన్నాయి. ప్రతీ కరణం క్రిందా దానికి సంబంధించిన శ్లోకాలు కూడా చెక్కబడి ఉన్నాయి. ఇవి 13వ శతాబ్దికి చెందినవి. వీటి ప్రతికృతులు గాయక్వాడ ప్రతిలో ఇవ్వబడ్డాయి.) రూపకాల ప్రదర్శనలో నృత్యం అర్థప్రకటనానికి, విషయస్పష్టీకరణకి అంతగా ఉపయోగించకపోయినా దీనివల్ల నాట్యరంగంమీద పాడిన పాటలకు ఒక విధమైన శోభ చేకూరుతుంది అని ఈ ఘట్టంలో చెప్పబడింది.

"అత్రోచ్యతే న ఖల్వర్థం నృత్తం కంచిదపేక్షతే,
కిం తు శోభాం జనయతీత్యతో నృత్తమిదం స్మృతమ్.
ప్రాయేణ సర్వలోకస్య నృత్తమిష్టం స్వభావతః,
మఙ్గల్యమితి కృత్వా చ నృత్తమేతత్ప్రకీర్తితమ్.
వివాహప్రసవావాహప్రమోదాభ్యుదయాదిషు
వినోదకారణం చైవ నృత్తమేతత్ ప్రకీర్తితమ్...,
గీతప్రయోగమాశ్రిత్య నృత్యమేతత్ ప్రనృత్యతామ్" (4.260-263, 265)

5. పూర్వరంగం, నాంది, ధ్రువ, ప్రస్తావన వీటికి సంబంధించిన వివరణ.

6. రసాలకు ఆ పేరు ఎలా వచ్చింది? భావా లనగా ఏవి? ఈ విధంగా మునులు అడిగిన ఆరు ప్రశ్నలు, సంగ్రహకారికాదులు, సంగ్రహరూపంగా శాస్త్రసారం అని చెప్పిన - రసాలు, భావాలు, అభినయాలు, ధర్మి, వృత్తి, ప్రవృత్తి, సిద్ధి, స్వరాలు, ఆతోద్యాలు, గానం, రంగం అనే పన్నెండు అంశాలు. కారికా - నిరుక్తశబ్దాల అర్థం. ఎనిమిది లేదా తొమ్మిది రసాలు. (**అభినవభారతి**లో చెప్పినదాని ప్రకారం నాట్యశాస్త్రానికి రెండు పాఠా లున్నాయి. ఒకదానిలో శాంతరసంతో సహా తొమ్మిది రసాలు చెప్పబడ్డాయి. మరొక దానిలో శాంతరసం చెప్పబడలేదు.) ఎనిమిది స్థాయిభావాలు ముప్పైమూడు వ్యభిచారిభావాలు, ఎనిమిది సాత్త్వికభావాలు, ఆంగిక - వాచిక - ఆహార్య - సాత్త్వికాభినయా లనే నాలుగు అభినయాలు, లోకధర్మి, నాట్యధర్మి అను రెండు ధర్ములు, భారతీ - సాత్వతీ - కైశికీ - ఆరభటీవృత్తు లనే నాలుగు వృత్తులు, ఆవంతీ - దాక్షిణాత్యా - పాంచాలీ - ఓఢ్రమాగధీ - మధ్యమా - ప్రవృత్తు లనే ఐదు ప్రవృత్తులు, దైవీ మానుషీ అను రెండు సిద్ధులు, షడ్జఋషభాదిసప్తస్వరాలు, తత - ఆనద్ధ - ఘన - సుషిరా లనే నాలుగు విధాలైన సంగీతోపయుక్తవాద్యాలు, ఐదు విధాలైన గానాలు, నాలుగు రకాలైన నాట్యమండపాలు, విభావానుభావవ్యభిచారిభావాలవల్ల రసనిష్పత్తి క్రమం, రసాలకు పరస్పరసంబంధం, భావాలతో రసాల సంబంధం, రసాల వర్ణాలు (రంగులు), అధిష్ఠానదేవతలు, రసాలయొక్క వాటి స్థాయిభావాలయొక్క విస్తృతప్రతిపాదన.

7. భావ - విభావ - స్థాయిభావాల విస్తృతవర్ణన. నిర్వేదం మొదలైన ముప్పైమూడు వ్యభిచారిభావాలు, స్తంభం మొదలైన ఎనిమిది సాత్త్విక భావాలు.

8. చతుర్విధాభినయాల విస్తృతవర్ణన.

9. నాట్యంలో హస్తాలు, వక్షఃస్థలం, పార్శ్వాలు, నడుము, కాళ్లు, పాదాలు మొదలైన అవయవాల అనేకవిధాలైన చలనాలు, పతాక, త్రిపతాక మొదలైన 24

నృత్తహస్తాలు, పైన చెప్పిన 64 హస్తాల లక్షణప్రయోగాలు; రసభావాద్యనుగుణంగా ఇతరవిధాలైన హస్తాలు కూడ ప్రయోగించవచ్చు. ("**ఏవమేష ప్రయోక్తవ్యః స్త్రీపుంసాభినయే కరః**" (9.27) అనేదాన్ని వ్యాఖ్యానిస్తూ అభినవగుప్తుడు - "**స్త్రీపుంసయోః ఉభయోరపి అభినేత్రోః అభినేయయోర్వా**" అని అన్నాడు. దీనిని పట్టి అభినవగుప్తుని కాలంనాటికి స్త్రీలు కూడ నాట్యప్రయోగంలో పాల్గొనేవా రని తెలుస్తూన్నది).

10. వక్షస్థలం, పార్శ్వాలు, నడుము, ఇతరశరీరావయవాలు - వీటి ఐదు విధాలైన చలనాలు, వాటి లక్షణప్రయోగాలు.

11. చారి - ఖండ - కరణ - మండలాలు, భూమిచారుల లక్షణాలు, 16 ఆకాశచారీలక్షణాలు, వాటి ప్రయోగసమయాలు, నాట్యంలో ధనుర్విద్యాప్రదర్శనవిధానం, నాట్యప్రయోగంలో ఎవరూ ఎక్కువ శీఘ్రత్వాన్ని చూపకూడదు, శ్రమపడకూడదు.

"**ఏక పాదప్రచారో యః సా చారీత్యభిసంజ్ఞితా**
ద్విపాదక్రమణం యత్తు కరణం నామ తద్భవేత్ ...
యదేతత్ప్రస్తుతం నాట్యం తచ్చారీష్వేవ సంజ్ఞితమ్. (11.3,6)"

12. మండలాల సంఖ్య వాటి లక్షణాలు.

13. ధ్రువాంగాలు ప్రారంభం అయిన తరవాత వేణునాదాది వాద్యసంగీతం ప్రవర్తిస్తూండగా పాత్రలు ఆ యా రసాలకు, స్థానాలకు అనుగుణంగా ఏ విధంగా నడుస్తూ ప్రవేశించాలి; పాత్రలు, దేవతలు గాని, రాజులు గాని అయినప్పుడు వాళ్లు రంగస్థలంమీద ఎంత సేపు నడవాలి, మధ్యమపాత్రలు గాని, స్త్రీలు గాని, నీచపాత్రలు గాని అయినప్పుడు ఎంత సేపు నడవాలి, రౌద్ర - బీభత్స - వీరాది రసాలను ప్రకటించేటప్పుడు ఏ విధంగా నడవాలి, ఏ విధంగా శరీరావయవచలనాలు ఉండాలి; గాయాలు చలి మొదలైన వాటిని సూచించడానికి అవయవాల కదలిక ఎలా ఉండాలి, అదే విధంగా సంన్యాసులు, మత్తులు, ఉన్మత్తులు మొదలైన వాళ్ల చలనాదులు ఎలా ఉండాలి.

14. నాట్యమండపం మీద - సంగీతవాద్యాలకు, గృహ - ఉద్యాన - అరణ్య - స్థల జలాదులకు స్థానాల కేటాయింపు. ఒక ముహూర్తకాలంలో (48 నిమిషాలు) గాని, ఒక జాములో కాని, గరిష్టం ఒక రోజులో గాని జరిగే విషయాన్నే ఒక అంకంలో ప్రదర్శించాలి. తరవాత ఒక మాసంలో కాని సంవత్సరంలో కాని జరిగే పనులు దాటవేసి క్రొత్త అంకం ప్రారంభించాలి, దేశ - వేష - భాషలకు, అలవాట్లకు అనుగుణమైన నాలుగు విధాలైన అవంతీ - దాక్షిణాత్యా - పాంచాలీ - ఓఢ్రమాగధీ ప్రవృత్తులు,

ఒక్కొక్క ప్రవృత్తికి సంబంధించిన దేశాలు వృత్తులు; సుకుమారమూ ఆవిద్ధమూ అనే రెండు విధాలైన నాట్యప్రయోగాలు, డిమసమవకార - వ్యాయోగ - ఈహామృగాలు ఆవిద్ధాలు, మిగిలిన రూపకభేదాలు సుకుమారాలు. లోకధర్మి - నాట్యధర్ముల లక్షణోదాహరణాలు

16. "**స్వభావభావోపగతం శుద్ధం త్వవికృతం తథా,**
లోకవార్తాక్రియోపేతమఙ్గలీలావివర్జితమ్.
స్వభావాభినయోపేతం నానాస్త్రీపురుషాశ్రయమ్
యదీదృశం భవేన్నాట్యం లోకధర్మీ తు సా స్మృతా"...
"**యోఽయం స్వభావో లోకస్య సుఖదుఃఖక్రియాత్మకః,**
సోఽఙ్గాభినయసంయుక్తో నాట్యధర్మీ తు సా స్మృతా. (14.70.71,78)

సంగీతరత్నాకరంలో కల్లినాథుడు "**వాక్యాభినయే కేవలవాక్యోచ్చారణం లోకధర్మీ, రాగయుక్తవాక్యోచ్చారణం నాట్యధర్మీ**" (సం.ర.పే. 629) అని వీటిని విశదీకరించాడు.

15. అచ్చులమీద హల్లులమీద ఆధారపడిన వాచికాభినయం. నాట్యానికి వాక్యం (మాటలాడడం) శరీరం. ఆంగికాభినయం, వేషం, రంగస్థలానికి సంబంధించిన ఏర్పాట్లు ఇవన్నీ ఏమి మాటలాడుతారో వాటి భావాన్ని స్పష్టీకరిస్తాయి. అచ్చులు, హల్లులు, నామవాచకాలు, క్రియాపదాలు, ఉపసర్గలు, క్రియావిశేషణాలు, సమాసాలు మొదలైనవాటి వివరణ. రూపకంలో సంభాషణాదికం సంస్కృతంలో కాని, ప్రాకృతంలో కాని రెండింటిలోనూ కాని ఉండాలి; ఒకటినుండి ఇరవైయారు అక్షరాలవరకు ఉన్న వృత్తాలు, వాటి అవాంతరభేదాలు, అవి అసంఖ్యాక మైనవి. భ-మ-జ మొదలైన ఎనిమిది గణాలు గురు - లఘు - యతుల అర్థాలు.

16. రూపకాలలో ఉపయోగించదగిన వృత్తాలు, వాటి లక్షణాలు ఉదాహరణలు. సమ - విషమవృత్తాలు, ఆర్యలు.

17. రంగంమీద ప్రయోగించే కావ్యంలో ఉండవలసిన లక్షణాలు. వాటి స్వరూపం. నాటకంలో ఉపయోగించే ఉపమ, రూపకం, దీపకం, యమకం అనే నాలుగు అలంకారాలు, వాటి అవాంతర భేదాలు; ఉదాహరణలు, పది కావ్యదోషాలు, పది కావ్యగుణాలు, వాటి లక్షణాలు, (భరతుడు "**కావ్యబన్ధాస్తు కర్తవ్యాః షట్త్రింశల్లక్షణాన్వితాః**" అని చెప్పిన లక్షణాలు క్రమక్రమంగా విస్మృతప్రాయా లైపోయా యనీ, ఆశీస్సు, దృష్టాంతం మొదలైన కొన్ని లక్షణాలు అలంకారాలలో అంతర్గతం చేయబడ్డా యనీ అభినవగుప్తుడే అన్నాడు - "**తత్ర గుణాలంకారాదిః వృత్తయశ్చ ఇతి కావ్యేషు ప్రసిద్ధో మార్గః. లక్షణాని తు న ప్రసిద్ధాని**" II పే.294.)

18. రూపకాలలో ప్రాకృతభాషను ఉచ్చరించే విధానం మూడు విధాలుగా ఉంటుంది. (1) సంస్కృతం వలెనే ఉచ్చరించడం (2) విభ్రష్టంగా అనగా సంస్కృతంలోని అచ్చులను హల్లులను మార్చి, ఉచ్చరించడం, (3) దేశరీతిలో ఉచ్చరించడం. ఏ పాత్రలు సంస్కృతంలో మాట్లాడాలి, ఏవి ప్రాకృతంలోను ఇతరములైన ప్రాంతీయభాషలలోను మాటలాడాలి. శౌరసేని ప్రధానప్రాకృతభాష. మాగధి, అవంతిజ, ప్రాచ్య, అర్ధమాగధి, బాహ్లీక, దాక్షిణాత్య అనే ఇతర ప్రాకృతాలు కూడ ఉన్నాయి. వీటిని నటుల ఇష్టాన్ని పట్టి ఉపయోగించాలి. వీటిని ఎవరు ఉపయోగించాలి? శబరులు, ఆభీరులు, చండాలులు, స(శ)కారులు, ద్రవిడులు, ఓఢ్రులు, ఆటవికులు మాటలాడే భాషలకు విభాష లని పేరు.

19. ఉత్తమ - మధ్యమ - నీచ పాత్రలను ఎలా సంబోధించాలి? ఉదాహరణకి బ్రాహ్మణుణ్ణి 'ఆర్య', అనీ, రాజును 'మహారాజ' అని సంబోధించాలి. మొదటి మూడు వర్ణాలవాళ్ల పేర్ల చివర వరసగా 'శర్మ' 'వర్మ' 'దత్త' అని ఉండాలి. వేశ్యల పేర్ల చివర 'దత్తా' 'మిత్రా' 'సేనా' అని ఉండాలి. పాఠ్యగుణాలు, ఏడు సంగీత స్వరాలు, హృదయం, కంఠం, శిరస్సు అనే మూడు ఉచ్చారణస్థానాలు, ఉదాత్తం, అనుదాత్తం స్వరితం, కంపితం అనే నాలుగు స్వరాలు. రెండు విధాలైన కాకుస్వరాలు, ఉచ్చం, దీప్తం, మంద్రం, నీచం, ద్రుతం, విలంబితం అనే అలంకారాలు.

20. పది విధాలైన రూపకాలను గూర్చిన వివరణ -

"నాటకం సప్రకరణమఙ్కో వ్యాయోగ ఏవ చ,
భాణః సమవకారశ్చ వీథీ ప్రహసనం డిమః,
ఈహామృగం చ విజ్ఞేయం దశమం నాట్యలక్షణమ్" (నా.శా.20, 2,3)

దశరూపకాలలో మొదటిదైన నాటకంలో ఉండే విషయాలు దాని ప్రధానలక్షణాలు. రంగంమీద ఏ విషయాలు చూపవచ్చును ఏవి చూపకూడదు?

"క్రోధప్రసాదశోకాః శాపోత్సర్గోఽథ విద్రవోద్వాహౌ,
అద్భుతసంశ్రయదర్శనమఙ్కప్రత్యక్షజాని స్యుః.
"యుద్ధం రాజ్యభ్రంశో మరణం నగరరోధనం చైవ,
అప్రత్యక్షకృతాని ప్రవేశకైః సంవిధేయాని,
అఙ్కప్రవేశకే వా ప్రకరణమాశ్రిత్య నాటకం వాపి.
న వధః కర్తవ్యః స్యాద్యోఽభ్యుదయీ నాయక స్తస్య (నా.శా. 20.20.22)

రంగస్థలం మీద మరణాన్ని ప్రత్యక్షంగా చూపడం విషయంలో అనేకమతాలను ఉదాహరించి అభినవగుప్తుడు "ఎట్టి పరిస్థితిలోనూ రంగస్థలంమీద మరణం చూప కూడదు" (తస్మాద్రఙ్గే మరణమ్ అప్రయోజ్యమేవ) అని అంటాడు. (Vol. II 426.)

ప్రవేశక - విష్కంభకాల విధానం, ప్రకరణాదుల ప్రధానలక్షణాలు. వాటి అంగాల లక్షణాలు.

21. రూపకకథావస్తువు. ఆధికారికం, ప్రాసంగికం అని కథావస్తువు రెండు విధాలు. ఐదు సంధులు, ప్రారంభం యత్నం మొదలైన ఐదు అవస్థలు. బీజ - బిందు - పతాకా - ప్రకరీ - కార్యా లనే ఐదు అర్థప్రకృతులు, వాటి లక్షణాలు. సంధ్యంతరాలు. ఐదు సంధుల 64 అంగాలు (ముఖసంధికి 12, ప్రతిముఖానికి 14, గర్భానికి 12, విమర్శకు 13, నిర్వహణానికి 14) వాటి లక్షణాలు, విష్కంభకం, చూళిక, ప్రవేశకం, అంకావతారం, అంకముఖం అనే ఐదు అర్థోపక్షేపకాలు (ఇవి అంకానికీ అంకానికీ మధ్య జరిగినవీ, రంగస్థలంమీద ప్రదర్శించడానికి శక్యం కానివీ అయిన కథాంశాలను సూచించడానికి ఉపయోగిస్తాయి.) నాటకంలో ప్రయోగించబడనిది లేదా నాటకానికి ఉపయోగించనిదీ అయిన జ్ఞానం కాని, విద్య గాని, కళ గాని, శిల్పం గాని, కర్మ గాని లేదు -

**"న తద్ జ్ఞానం న తచ్ఛిల్పం న సా విద్యా న సా కలా,
న తత్కర్మ న యోగోఽసౌ నాటకే యన్న దృశ్యతే"** (నా.శా. 21.122)

దీనిని అభినవగుప్తుడు ఈ విధంగా వ్యాఖ్యానించాడు. **జ్ఞానమితి ఉపాదేయం ఆత్మజ్ఞానాది... విద్యా దణ్డనీత్యాది... యోగః యోజనం తేషామేవ జ్ఞానాదీనాం కలాన్తానాం స్వభేదైః, అన్యోన్య స్వభేదైః... కర్మేతి యుద్ధనియుద్ధాదిః వ్యాపారః.)**

22. భారతీ, సాత్వతీ, కైశికీ, ఆరభటీ అనే నాలుగు వృత్తులు : మధుకైటభు లనే అసురులతో విష్ణువు యుద్ధం చేస్తున్న సమయంలో అవి ఆవిర్భవించాయి. ఈ నాలుగు వృత్తులూ వరుసగా ఋగ్ - యజుస్ - సామ - అథర్వవేదాలనుండి జనించాయి. వాటి అవాంతర భేదాలు వాటి లక్షణాలు. ఈ నాలుగు వృత్తులలో దేనిని ఏ రసంలో ఉపయోగించాలి.

23. రూపకప్రయోగం అంతా ఆహార్యాభినయంమీద ఆధారపడి ఉంటుంది. ఇది నేపథ్యం మీద అనగా - వేషాలు అలంకారాలు ప్రయోగసాధనాలు లేదా ఉపకరణాలు వీటిమీద ఆధారపడి ఉంటుంది.

**"ఆహార్యాభినయో నామ జ్ఞేయో నేపథ్యజో విధిః,
తత్ర కార్యః ప్రయత్నస్తు నాట్యస్య శుభమిచ్ఛతా".** (నా.శా. 23.2)
"సమస్తాభినయప్రయోగచిత్రస్య భిత్తిస్థానీయమ్ ఆహార్యమ్". (అ.భా.)

పుస్తాలు, అలంకారాలు, అంగరచన, సంజీవం లేదా సజ్జీవం అని నేపథ్యం నాలుగు విధాలు. కొండలు, బండ్లు మొదలైన వాటిని చూపడానికి బట్టలతో గాని తోలుతో గాని తయారుచేసినవి పుస్తాలు. పుష్పమాలలు, తలనుంచి పాదాలవరకు

వివిధావయవాలమీద ధరించే అలంకారాలు, వివిధ దేశాలకు నగరాదులకు అనుగుణంగా ఉండేటట్లు స్త్రీ - పురుషులు ధరించే వస్త్రాలు, తిలకం, కాటుక, దంతాలకీ పెదవులకీ రంగు - ఇవి అలంకారం. రాజులు, ధనవంతులు, కిరాతులు, ఆంధ్రులు, శకులు, యవనులు, శూద్రులు మొదలైన వాళ్ల శరీరచ్ఛాయకు తగునట్లు శరీరానికి పూసికొనే రంగూ, గడ్డాలు, మీసాలూ - ఇవి అంగరచన. చతుష్పాజ్జంతువులను, ద్విపాదులను, పక్షులను సర్పాలను చూపడానికి ఉపకరించే సాధనాలు సంజీవాలు, నాట్యోపకరణాలు, కృత్రిమములైన ఆయుధాలు.

24. సామాన్యాభినయం, సత్త్వాన్ని (మానసికభావాన్ని) పైకి ప్రకటించే పద్ధతులు, యువతుల భావము, హావము, హేల అనే మూడువిధా లైన అలంకారాలు. లీల, విలాసం మొదలైన పది స్వభావజాలంకారాలు. శోభ, కాంతి, దీప్తి, మాధుర్యం ధైర్యం, ప్రాగల్భ్యం, ఔదార్యం అనే ఏడు అయత్నజములైన అలంకారాలు. వీటి లక్షణాలు. పురుషులలో శోభ మొదలైన సత్త్వావిర్భావాలు 'రసభావానుసారం శారీరకాభినయం. రూపకంలోని వాక్యకథనానికి సంబంధించిన ఆలాప - ప్రలాప విలాపాదులైన పన్నెండు విధాలైన అభినయం. ఇవన్నీ వాక్యాభినయాలు. ఇష్టవస్తువులను గాని అనిష్టవస్తువులను గాని వినేటప్పుడు, స్పృశించేటప్పుడు, చూచేటప్పుడు, రుచిచూచే టప్పుడు చేయవలసిన అభినయం. అనేకవిధాల స్త్రీల వర్ణన. అభిలాష, చింతనం, అనుస్మృతి, సుఖకీర్తనం, ఉద్వేగం, విలాపం, ఉన్మాదం, వ్యాధి, జడత, మరణం అనే పది కామావస్థలు; వాటి వర్ణన, వాటి అభినయం. దూతిని పంపడం. వాసకసజ్జ, స్వాధీనపతిక, అభిసారిక, మొదలైన ఎనిమిది విధాలైన నాయికలు. ప్రేక్షకులలో తండ్రులు - కుమారులు, కోడళ్లు - అత్తలు మొదలైన వాళ్లు కలిసి ఉంటారు గాన అలాంటప్పుడు ఇవన్నీ రంగం మీద ఎలా ప్రదర్శించాలి.

"న కార్యం శయనం రఙ్గే నాట్యధర్మం విజానతా,...
చుమ్బనాలిఙ్గనం చైవ తథా గుహ్యం చ యద్భవేత్.
దన్తనఖక్షతం భేద్యం నీవీస్రంసనమేవ చ,
స్తనాధరవిమర్దం చ రఙ్గమధ్యే న కారయేత్.
భోజనం సలిలక్రీడాం తథా లజ్జాకరం తు యత్,
పితృపుత్రస్నుషాశ్వశ్రూదృశ్యం యస్మాత్తు నాటకమ్.
తస్మాదేతాని సర్వాణి వర్జనీయాని యత్నతః. (నా.శా. 24.285 - 289)

ప్రియురాళ్లు ప్రేమతో ఉన్నప్పుడు, అసూయతో ఉన్నపుడూ నాయకులను ఎలా సంబోధించాలి.

25. కళలలో నిపుణుడై స్త్రీలను వేశ్యలను ఆవర్జించడంలో నేర్పు కలవాడు వైశికుడు. అలాంటివానికి సహజంగా ఉండేవి, నేర్చుకొనేవి అయిన ముప్పైమూడు గుణాలు. వాని మిత్రుడు, దూతి. ఒక పురుషుని విషయంలో ప్రేమ కలిగిన లేదా వానిని ద్వేషించే స్త్రీయొక్క చిహ్నాలు, స్త్రీల యౌవనానికి సంబంధించిన నాలుగు అవస్థలు, ప్రేమించే పురుషులలో నాలుగు భేదాలు, స్త్రీలను వశం చేసికొనడానికి సామం, ప్రదానం, భేదం, దండం, ఉపేక్ష అనే అయిదు ఉపాయాలు.

26. చిత్రాభినయం అనగా ఇంతవరకు విశదీకరింపబడని ఆంగికాభినయం (అందుచేత సామాన్యాభినయానికి అనుబంధంగా చెప్పిన అభినయం). ఆకాశాన్ని, రాత్రిని, సాయంకాలాన్ని, చీకటిని వేడిని ఎలా ప్రదర్శించాలి (సూచించాలి). సంతోషాన్ని, కోపాన్ని, బాధను దుఃఖాన్ని ఎలా ప్రదర్శించాలి. ఆకాశవచన - ఆత్మగత - అపవారితక - జనాంతికాల అర్థం. వృద్ధులు బాలులూ వాళ్ల వాళ్ల సంభాషణ ఎలా చెయ్యాలి (ఉచ్చరించాలి). ఒకడు చావబోతున్నాడు అనేదానిని ఎలా చూపించాలి. ఇతరాభినయా లన్నీ లోకంనుండి నేర్చుకోవాలి.

"నోక్తా యే చ మయా తత్ర లోకగ్రాహ్యాస్తు తే బుధైః,
లోకో వేదాస్తథాధ్యాత్మం ప్రమాణం త్రివిధం స్మృతమ్.
తస్మాన్నాట్యప్రయోగే తు ప్రమాణం లోక ఉచ్యతే,
కృతానుకరణం లోకే నాట్యమిత్యభిధీయతే.
లోకస్య చరితం యత్తు నానావస్థాన్తరాత్మకమ్,
తదఙ్గాభినయోపేతం నాట్యమిత్యభిసంజ్ఞితమ్". (నా.శా. 26.111-115)

27. సిద్ధి (చక్కగా జరిగిన నాట్యప్రయోగం). "మానుషీసిద్ధి" "దైవసిద్ధి" అని సిద్ధి రెండు విధాలు. వస్త్రాదులను బహూకరించడంచేత, చిరునవ్వులచేత, విదూషకుడు విచిత్రంగా ప్రవర్తిస్తున్నపుడు బిగ్గరగా నవ్వడంచేత, ఆశ్చర్యకరాలైన దృశ్యాలు, లేదా ప్రేమదృశ్యాలు వచ్చినపుడు 'సాధు సాధు' అని గాని, 'అహో' అని కాని అనడంచేత, కరుణప్రధాన దృశ్యాలలో "కష్టం!" అనడంచేత ప్రేక్షకులు నాట్యప్రయోగంయొక్క సిద్ధిని (సాఫల్యాన్ని) సూచించాలి. ప్రయోగం జరుగుతున్నప్పుడు కలకలధ్వన్యాదులు గాని ఇతర ప్రతిబంధకాలు గాని లేకపోవడం, అపశకునాలేవీ లేకపోవడం, ప్రేక్షాగృహం ప్రేక్షకులతో నిండి ఉండడం ఇవన్నీ 'దైవికసిద్ధి'. అగ్నిప్రమాదం, సుడిగాలి, ఏనుగు, సర్పాలు మొదలైనవి, నటులను ద్వేషించే ప్రేక్షకులు చప్పట్లు కొట్టడం. పేడ, బురద, విసరడం, నటులు తమ సంభాషణం మరిచిపోవడం, కిరీటం గాని అలంకారాలు గాని పడిపోవడం - ఇవన్నీ అపశకునాలు. నాట్యప్రయోగం సాధుత్వాసాధుత్వాలను నిర్ణయించేవాళ్లకి

ఉండవలసిన యోగ్యతలు.

28. తతములు (తీగ లుండే వీణాదులు), అవనద్ధాలు' (చర్మం బిగించిన మద్దెళ్లు మొదలైనవి), ఘనాలు (తాళాలు), సుషిరాలు (రంధ్రా లున్న పిల్లన గ్రోవి మొదలైనవి) అని నాలుగు విధాలైన వాద్యాలు. షడ్జ - ఋషభాది సప్తస్వరాలు. వాటిలో వాది, సంవాది, అనువాది, వివాది అను నాలుగేసి భేదాలు, వాటి లక్షణాలు, గ్రామాలు మూర్ఛనలు, ఇరవై రెండు శ్రుతులు, జాతులు.

29. ఏ రసానికి ఏ స్వరాలను ఏ జాతులను ఉపయోగించాలి. ఆరోహి, అవరోహి, స్థాయి, సంచారి అను నాలుగు వర్ణాలు; వాటిపై ఆధారపడి ఉన్న ముప్పైమూడు అలంకారాలు వాటి లక్షణాలు; గీతులు.

30. మురజులు.

31. తాల - లయలు.

32. ధ్రువాల వర్ణన. ఒక పాత్ర రంగస్థలంమీద ప్రవేశించేటప్పుడు, రంగస్థలాన్ని విడిచి వెళ్లేటప్పుడు, ఒక అంకం ముగిసినప్పుడు, రూపకప్రయోగం జరుగుతున్నప్పుడు మధ్య మధ్య, ఒక పాత్ర క్రింద పడిపోయినప్పుడు తాను చెప్పవలసిన మాటలు మరచి నప్పుడు లేదా మూర్ఛపోయినప్పుడు ధ్రువాగానం చేయబడుతుంది.

"ప్రావేశికీ తు ప్రథమా ద్వితీయాక్షేపికీ స్మృతా,
ప్రాసాదికీ తృతీయా చ చతుర్థీ చాన్తరా ధ్రువా.
నైష్క్రామికీ చ విజ్ఞేయా పఞ్చకీ చ ధ్రువా బుధైః". (నా.శా. 32.23,24)

ఈ ధ్రువలలో కొన్ని సంస్కృతంలో ఉన్నా, సాధారణంగా ఇవి శౌరసేనిలో ఉండాలి. గానం చేసేవారికి, వీణావేణ్వాదులను ప్రయోగించేవాళ్లకి ఉండవలసిన యోగ్యతలు. పాడడం స్త్రీలకు సహజంగా లభిస్తుంది. పురుషులకు వాద్యాలు ప్రయోగించడం సహజంగా అలవడుతుంది.

"ప్రాయేణ తు స్వభావాత్ స్త్రీణాం గానం నృణాం చ వాద్యవిధిః,
స్త్రీణాం స్వభావమధురః కణ్ఠో నృణాం బలత్వం చ" (నా.శా. 32.465)

సంగీతోపాధ్యాయునికి, నేర్చుకొనే శిష్యునికి ఉండవలసిన ఆరు యోగ్యతలు.

33. మృదంగం, పణవం, దర్దురం మొదలైన అవనద్ధవాద్యాల విస్తృతవర్ణన. గాంధర్వాన్ని, వాద్యాలను స్వాతి - నారదులు తొలిసారిగా ప్రవర్తింపచేశారు. అన్ని రకాల వాద్యాలను ప్రయోగించవలసిన సమయాలు. వాద్యాల అధిష్ఠానదేవతలు.

34. పురుషులలోను, స్త్రీలలోను ఉత్తమ - మధ్యమ - అధమ అనే మూడు

ప్రకృతులు, వారి లక్షణాలు. **"ఏవం చ శీలతో నృణాం ప్రకృతిస్త్రివిధా స్త్రియాః"** (నా.శా. 34.8). రూపకనాయకులలో ధీరోద్ధతుడు, ధీరలలితుడు, ధీరోదాత్తుడు, ధీరశాంతుడు అను నాలుగు భేదాలు, ఈ భేదాలలోనికి ఎవరు చేరుతారు. రూపకాలలో వచ్చే మహాదేవి, దేవి, నర్తకి, పరిచారిక మొదలైన వేరు వేరు విధాలైన స్త్రీలు, వాళ్ల వర్ణన. కంచుకీయులు వర్షవరులు మొదలైనవాళ్లు, అంతఃపురపరిచారికలు, నృపుడు - సేనాపతి, పురోహితుడు, మంత్రి, సచివుడు, ప్రాడ్వివాకుడు, కుమారుడు మొదలైనవారి ప్రధానలక్షణాలు.

35. నాటక ప్రయోగం చేయవలసిన నటసముదాయంలో (నాటకసంఘాలలో) ప్రతీ ఒక్కరికీ వారి వారి కర్తవ్యాలను నిర్దేశించడం, ఒక్కొక్కరికీ ఉండవలసిన యోగ్యతలు.. రావణుడు మొదలైన పాత్రల చేతులు తలలు మొదలైనవాటిని, సింహాలు ఏనుగులు మొదలైన వాటిని చూపడానికి ఉపయోగించే మట్టితోను, తోలుతోను, కఱ్ఱతోను చేసిన వివిధ సాధనాలు (నాట్యధర్ములు), స్త్రీ పాత్రలు ధరించే పురుషులను గూర్చి, పురుషపాత్రలు ధరించే స్త్రీలను గూర్చి, సుకుమారరూపకాల (నాటక - ప్రకరణ - భాణ - వీథీ - అంకాల) ప్రయోగం; ఆవిద్ధరూపకాల (డిమం మొదలైనవాటి) ప్రయోగం. సూత్రధార - పారిపార్శ్వికుల కుండవలసిన యోగ్యతలు, విట - శకార - విదూషక - చేట - నాయికా - గణికా - నటాదుల లక్షణాలు. మాల్యకార - వేషకర - రజక - కారుకాదిశిల్పుల లక్షణాలు.

"ఉజ్జ్వలవస్త్రాభరణః క్రుధ్యత్యనిమిత్తతః ప్రసీదతి చ,
అధమో మాగధభాషీ భవతి శకారో బహువికారః". (నా.శా. **35,56)**

36. "పూర్వరంగంలో ఏ దేవతను పూజించాలి? స్వర్గలోకంనుండి నాట్యం భూలోకానికి ఏ విధంగా వచ్చింది? భరతుని వారసులకు నటు లనే పేరు ఎందుకు వచ్చింది" అని ఆత్రేయుడు మొదలైనవారు భరతుణ్ణి ప్రశ్నించారు. భరతడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. నా కుమారులు నాట్యవేదంలో తమ కున్న ప్రావీణ్యాన్ని చూచుకొని దృప్తులై మునీశ్వరులను అనుకరించడం ప్రారంభించారు; కొన్ని అనుచితములైన రూపకాలు నిర్మించారు. మునీశ్వరులు కోపించి భరతులు వాళ్ల సంతానం (లేదా అనుయాయులు) శూద్రులవుతా రని శపించారు. వాళ్లు తమకు తెలిసిన నాట్యశాస్త్రాన్ని ఇతరులకు, మంచి శిష్యులకు బోధించి ఆ విధంగా ప్రాయశ్చిత్తం చేసికొనవలసినదిగా నేను వాళ్లకి సలహా ఇచ్చాను. తరవాత ఇంద్రపదాన్ని అధిరోహించిన నహుషుడు నాట్యశాస్త్రాన్ని భూలోకంలో ప్రచారం చేయవలసిందిగా నన్ను ఆజ్ఞాపించాడు. కోహలుడు నాట్యవేదానికి కావలసిన కొన్ని అంశాలను కూరుస్తా డని కూడ అత డన్నాడు. తరవాత భరతుని కుమారులు

ధూర్తిలుడు దానిని ఈ లోకంలో ప్రచారం చేశారు. **నాట్యశాస్త్రం** చాల మంగళకరమైనది; పవిత్రమైనది. పుష్పగంధాదులతో పూజచేయటంచేతకంటె నాట్యాన్ని ప్రయోగిస్తే దేవతలు చాల సంతోషిస్తారు.

ఇది నాట్యసర్వస్వం వంటి **నాట్యశాస్త్రంలో** ఉన్న విషయాల సంక్షిప్తస్వరూపం. ఒక రూపకప్రయోగాన్ని చూచినప్పుడు కలిగే ఆనందానికి మూలకారణం దీనిలో అతివిస్తృతంగా విశ్లేషించి వివేచింపబడింది. ప్రేక్షాగృహనిర్మాణం, వివిధఛందస్సుల స్వరూపం, అభినయాలు, మాటలాడేటప్పుడు అవలంబించవలసిన వాక్యోచ్చారణ విధానాలు, వివిధరూపకాల స్వరూపం, కథావస్తువిశ్లేషణం, కథావస్తువులలో ఉండే పద్ధతులు చర్చించబడ్డాయి. గీతాలాపనవిధానాలు, ఉపయోగించవలసిన వాద్యాలు, సంగీతస్వరాలు మొదలైనవి ప్రతిపాదింపబడ్డాయి. అన్నింటికి మించి రూపకంయొక్క అత్యున్నతప్రయోజనాలను ఆదర్శాలను విశదీకరిస్తూ అసభ్యచేష్టాభాషాదుల ఉపయోగం నిషేధింపబడింది. నటులు అత్యున్నతమైన అధ్యాత్మికోన్నతిని లక్ష్యంగా పెట్టుకొని తమ కళను శ్రద్ధతో అభ్యసించి దానిలో నిర్దుష్ట మైన ప్రావీణ్యాన్ని సంపాదించా లనీ, ఆ విధంగా సమాజసేవ చేయడం ద్వారా పుణ్యం సంపాదించ కలుగుతా రనీ ఉపదేశింప బడింది. నాట్యశాస్త్రంలోని చివరి అధ్యాయంలో సూచించినట్లు నటుల నీతిబాహ్యప్రవృత్తి చేత నటులూ నాటకాలూ కూడ అపకీర్తికి పాలైనట్లు స్పష్టం అవుతుంది. ఆ అపకీర్తి తొలగించడం కోసం ఈ శాస్త్రంలో నటులూ రూపకాలూ కూడ అత్యున్నతమైన ఆదర్శాలను పాటించి సమాజాభ్యున్నతికీ సమాజసేవకు అంకితం కావాలని ఉపదేశం ఇవ్వబడింది. నాటకాలను గూర్చి రచించిన గ్రంథాలలో ఈ నాట్యశాస్త్రానికి, ప్రపంచ వాఙ్మయం లోనే సాటి లేదని నిఃసంశయంగా చెప్పవచ్చును. ఇది ఒక అసాధారణమైన అద్భుతమైన గ్రంథం. సమగ్రవిషయప్రతిపాదనలోను, సాహిత్యసౌందర్యంలోను, కళాత్మకవైచిత్ర్యంలోను, నాట్యశాస్త్రంతో సరితూగ గలిగిన గ్రంథం ప్రపంచంలోని ఏ భాషలోనూ కనబడదు.

భరతనాట్యశాస్త్రాన్ని గూర్చి ఏ.యల్. బాషం (A.L. Basham, Professor of Asian Civilzation in the Australian National Univerity, Canberra), "ది వండర్ దట్ వజ్ ఇంసియా" *(The Wonder that Was India)* అను గ్రంథంలో ఇలా అన్నాడు. "The Bharata *Natya Sastra* is our earliest Indian authority on these three arts (Drama, Music and Dance) and it shows by this time India had a fully developed system of music out of which later Indian 'classical' music developed" P. 384.

... has changed little with the

centuries, and the best modern Indian dancers, such as Uday Shankar and Ram Gopal, still dance according to the rules of the *Bharata Natya Sastra.* Dancing (Nrtya) was closely connected with acting (Natya) ... Indian dancing is not a thing of legs and arms alone,but of the whole body. Every movement of the little finger or the eye - brow is significant and must be fully controlled. The poses and grestures are classified in detail, even as early as the *Bharatanatya Sastra*. Which mentions thirteen postures of the head, thrity six of the eyes, nine of the neck, thirty seven of the hand and ten of the body. Later texts classfiy many more poses and gestures, everyone of which depicts a specific emotion or object. with so many possible combinations the dancer can tell a whole story easily comprehensible to the observer who knows the convention.

The most striking feature of the Indian dance is undoubtedly, the hand gesture (Mudra). By a beautiful and complicated code, the hand alone is capable of portraying not only a wide range of emotions, but gods, animals men, natural scenery, actions and so on." P. 387

"భారతీయుల నాట్యం (డ్రామా), సంగీతం, నృత్యం అనే ఈ మూడు కళలకు సంబంధించిన, మన కీ నాడు లభిస్తూన్న అతిప్రాచీనమైన ప్రామాణికగ్రంథం భరతుని నాట్యశాస్త్రం. ఈ గ్రంథం బయలుదేరే నాటికే భారతీయ సంగీత సంప్రదాయం సర్వతోముఖ వికాసం చెందిన దని ఈ గ్రంథం వల్ల తెలుస్తూన్నది. ఈ నాడు భారతదేశంలో ప్రచారంలో ఉన్న శాస్త్రీయసంగీతానికి ఈ గ్రంథమే మూలాధారం". (P. 384)

"ఇన్ని శతాబ్దాలు గడిచినా కూడ, భారతీయసంగీతంలో వలెనే భారతీయనృత్యంలో కూడ మార్పు లేవీ రాలేదు. ఉదయశంకర్, రామ్‌గోపాల్ మొదలైన, విశ్వవిఖ్యాతి గాంచిన ఆధునికభారతీయనృత్యవిద్వాంసుల నృత్యప్రయోగాలు కూడ పూర్తిగా భరతనాట్యశాస్త్రంలో చెప్పిన నియమాలను అనుసరించి జరుగుతున్నాయి. నృత్యానికీ, (dance) నాట్యానికీ (acting) చాల దగ్గర సంబంధం ఉంది ...

భారతీయనృత్యం అనగా కేవలం చేతులూ, కాళ్లూ ఆడిస్తూ చేసేది కాదు. ఈ నృత్యంలో మొత్తం శరీరానికి పని ఉంటుంది. చిటికనవేలులో గాని, కనుబొమ్మలో గాని కనబడే ప్రతీ కదలికకూ కూడ ఒక అర్థం, ప్రయోజనం ఉంటుంది. నాట్యశాస్త్రం కాలంనాటికే ఎన్నో స్థానకాల (poses, postures) చేష్టల (gestrues) విధానాలు,

... (postures)

పదమూడు,, మెడకు సంబంధించినవి తొమ్మిది, ముప్పైఆరు విధాల నేత్రాభినయాలు, ముప్పైఏడు హస్తాభినయాలు, పది శరీరాభినయాలు నాట్యశాస్త్రంలో చెప్పబడ్డాయి. తరువాత వచ్చిన గ్రంథాలలో కూడ వేరు వేరు భావాలను, వస్తువులను సూచించడానికి ఉపయోగించే అనేకవిధాల చేష్టలు చెప్పబడ్డాయి. ఇన్ని విధాలైనస్థానకాలను, అభినయ విశేషాలను కలపడం ద్వారా నటుడు, నృత్యసంప్రదాయజ్ఞులకు అర్థం అయే టట్లు మొత్తం ఒక కథ అంతా చెప్పగలడు (అభినయం ద్వారా సూచించగలడు).

భారతీయనృత్యంలో కొట్టవచ్చి నట్లు కనబడే ఒక అసాధారణమైన అంశం హస్త ముద్ర. చాల మనోహరమైన, దురవగాహమైన ఈ సాంకేతిక పద్ధతిలో (code) కేవలం అనేకవిధాలైన భావాలనే కాదు దేవతలను, జంతవులను, మానవులను, ప్రాకృతిక దృశ్యాలను, కొన్ని పనులు మొదలైనవాటినీ కూడ సూచించవచ్చును." (P. 387)

ప్రతిభారతీయుడూ గర్వించ దగిన ఈనాటికీ కూడ ఎందరో కళానిష్ణాతులు భక్తిశ్రద్ధలతో పరిరక్షించుకొంటూ వస్తూన్న ఇంతటి ప్రాచీనభారతీయసాంస్కృతిక సంపదకు నిధానమైనది ఈ భరతనాట్య శాస్త్రం.

నాట్యశాస్త్రం అత్యున్నతాలైన ఆదర్శాలను నటుల ముందు ఉంచినా కూడ కొన్ని శతాబ్దాల అనంతరమే నటులు చాల నీచస్థితికి దిగజారిపోయి నట్లు ఎనిమిదవ శతాబ్దం ఉత్తరార్ధానికి చెందిన దామోదరుని **కుట్టనీమతం** ద్వారా తెలుస్తూన్నది. ఈ గ్రంథంలోని 881-928 శ్లోకాలలో ఒక అసాధారణమైన విషయం చెప్పబడింది. ఒక దేవాలయంలో ఒక రాజు సమక్షాన హర్షవర్ధనుని **రత్నావళి**లోని మొదటి అంకాన్ని ప్రదర్శించారు. స్త్రీ - పురుషపాత్రలు రెండూ వేశ్యలే నిర్వహించారు. మంజరి అనే వేశ్య రత్నావళి పాత్ర నిర్వహించింది. మరొక వేశ్య ఉదయనుని వేషం ధరించింది. **రత్నావళి**లోని ఒక శ్లోకం (1.24) కూడ **కుట్టనీమతం**లో ఉదాహరించబడింది. ఏ మాత్రం సంకోచం లేకుండా వేశ్యలు ధన సంపాదనమే తమ పరమలక్ష్యంగా పెట్టుకొని ప్రవర్తించారు. ఆ రోజులలోని చాలమంది జనులలో, ముఖ్యంగా సంగీతనృత్యాదులకు సంబంధించి నవాళ్లలో ఎంతటి నైతికపతనం ఉండేదో మృదుమధురభాషలో రచించిన ఈ కావ్యంలో స్పష్టంగా వర్ణింపబడింది. ఎనిమిదవ శతాబ్దంలోని ఉత్తరార్ధంలో **నాట్యశాస్త్ర**గ్రంథస్వరూపం ఎలా ఉండేదో **కుట్టనీమతం** అతిస్పష్టంగా విశదీకరిస్తుంది. **కుట్టనీమత** రచయిత అయిన దామోదరగుప్తుణ్ణి కాశ్మీరరాజైన జయాపీడుడు తన మంత్రిపరిషత్తులో ప్రధానుణ్ణిగా చేసినట్లు రాజతరంగిణి చెపుతున్నది -

"స దామోదరగుప్తాఖ్యం కుట్టనీమతకారిణమ్,
కవిం కవిం బలిరివ ధుర్యం ధీసచివం వ్యధాత్". (రాజతరంగిణి 4.496)

జయాపీడుడు క్రీ.శ. 779 నుండి 813 వరకు పాలించాడు. ఈ కాలము

పరిస్థితులను వర్ణించాలంటే వంద కుట్టనీమతాలు కూడ సరిపోవేమో!

నాట్యశాస్త్రం కాలం - నాట్యశాస్త్రం ఆవిర్భవించిన కాలాన్ని గూర్చి వెనుక కొంతవరకు సూచింపబడింది. నాట్యశాస్త్రం కాలాన్ని గూర్చి మాటలాడడానికి ముందు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి. ఆ యా కాలాలలో **నాట్యశాస్త్రం**లో వివిధవిషయాలు చేర్చబడ్డాయి. అందుచేత దీని వ్రాతప్రతులలో ఎన్నో పాఠభేదాదు లున్నాయి. అందుచేత **నాట్యశాస్త్రం** కాలాన్ని నిర్ణయించడం అనగా **నాట్యశాస్త్రం**లో ప్రధానమైన భాగం యొక్క కాలాన్ని నిర్ణయించడంగా తెలుసుకోవాలి. ఇక్కడా అక్కడా జరిగిన అనేక పద్యభాగాల చేర్పులను పరిశీలించడం ఈ సందర్భంలో కుదరదు.

నాట్యశాస్త్రం కాలాన్ని గూర్చి విమర్శకులలో అభిప్రాయ భేదాలున్నాయి. క్రీ.పూ. రెండవ శతాబ్దంలో నాట్యశాస్త్రం రచింపబడిన దని మ.మ. హరప్రసాదశాస్త్రి అభిప్రాయ పడ్డారు. **నాట్యశాస్త్రం**లో ఉపయోగించిన కొన్ని పదాలను ఆధారంగా చేసికొని ప్రొఫెసర్ లెవి **నాట్యశాస్త్రం** ఇండోసిథియన్ క్షత్రపుల కాలంలో రచింపబడి ఉంటుందని అన్నాడు. క్రీ.శ. మూడవ శతాబ్దికి పూర్వమే రససిద్ధాంతం నాట్యప్రయోగం మొదలైన విషయాలను చెప్పే భరతరచిత మైన **నాట్యశాస్త్రం** ఉందని పి.వి.కాణే అభిప్రాయం. ఏ విధంగానూ కూడ ఇది మూడవ శతాబ్దానికి ముందు లేదని కీథ్ అన్నాడు. అయితే మనోమోహన్ ఘోష్ అనేక ఉపపత్తులను చూపుతూ **నాట్యశాస్త్రం** క్రీ.పూ. 100 మొదలు క్రీ.శ. 200 మధ్య రచింపబడి ఉంటుందని ప్రతిపాదించారు. (ఈయనే, కొంతకాలంతరవాత, నా.శా. క్రీ.పూ. 500ల నాటిదని నిర్ణయించారు). ఇది పి.వి.కాణే కూడా అంగీకరించారు. ఈ సందర్భంలో ఆయన, **నాట్యశాస్త్రం** క్రీ.శ. రెండవ శతాబ్దం తరవాతనే రచింపబడి ఉంటుంది అనే డా.డి.సి. సర్కార్ అభిప్రాయాన్ని ఖండించారు. ఏమైనా నాట్యశాస్త్రం పూర్వకాలావధిని (ఫలానా శతాబ్దానికి పూర్వం ఇది లేదు అని) నిర్ణయించడం శక్యం కాదు.

అయితే దీని ఉత్తరకాలావధిని (ఈ కాలం నాటికి ఇది ఉంది అని) నిర్ణయించడానికి తగిన ఉపపత్తులను ఈ విధంగా చూపవచ్చును :-

(అ) వెనుక ఉదాహరించిన కాళిదాసుని **విక్రమోర్వశీయ**శ్లోకాన్ని పట్టి కనీసం క్రీ.శ. 450 సంవత్సరానికి పూర్వం భరతుడు **నాట్యశాస్త్ర** రచయితగా ప్రసిద్ధు డయ్యా డనీ, ఎనిమిది రసాలు ప్రతిపాదించా డనీ, దేవలతల ముందు రూపకప్రయోగం చేశా డనీ తెలుస్తూన్నది. దీనివల్ల మొదటి అధ్యాయంలో చెప్పిన ప్రాచీనకథ, రసాధ్యాయం (ఆరవ అధ్యాయం) ఆనాటికి ఉన్నాయని చెప్పాలి. **రఘువంశం**లో (19.21) 'ఖండితనాయిక' ప్రసక్తి ఉంది. ఇది నాట్యశాస్త్రంలో (31.109-110) చెప్పిన అష్టవిధనాయికలను సూచిస్తున్నది. ఇట్లే రఘువంశంలోని **"అజసత్వవచనాశ్రయం మిథః**

స్త్రీషు నృత్యముపధాయ దర్శనమ్" (రఘు. 19.36) అనే శ్లోకం నాట్యశాస్త్రంలోని "సామాన్యాభినయో నామ జ్ఞేయో వాగఙ్గసత్త్వజః" (21.1) అను శ్లోకానికి అనుకరణం అనే విషయం స్పష్టం అవుతూన్నది.

(అ) నాట్యశాస్త్రం బ్రహ్మచేత చెప్పబడినది అని **కుట్టనీమతం** (75వ శ్లోకం) అంటుంది. ఇది నాట్యశాస్త్రంలోని ప్రథమాధ్యాయానికి నిర్దేశం. **"భరతసుతైరుపదిష్టం క్షితిపతినహుషావరోధనారీణామ్"** (946 శ్లో) అనే శ్లోకంలో నాట్యశాస్త్రంలోని (36.48-61) నహుష - భరతపుత్రాదుల కథ నిర్దేశింపబడుతున్నది. ఇంకా అనేక స్థలాలలో **కుట్టనీమతం**లో ప్రస్తుతం మనకు లభిస్తున్న నాట్యశాస్త్రంలోని వేరు వేరు అధ్యాయాలలోని విషయాల సూచన స్పష్టంగా కనబడుతూన్నది. ఉదాహరణకి 791-91 పద్యాలలోని ఖండితా - కలహాంతరితా నాయికలను గూర్చి **నాట్యశాస్త్రం** 22.216 - 217 మొదలైన శ్లోకాలలో ప్రతిపాదించింది. పాత్రలు రంగస్థలంమీద ప్రవేశించే టప్పుడు చేయవలసిన ప్రావేశికధ్రువాగానం, వాళ్లు నిష్క్రమించే టప్పుడు చేయలసిన నైష్క్రామిక ధ్రువాగానం నాట్యశాస్త్రంలో (32.335-336) చెప్పబడ్డాయి. వాటిని గూర్చిన నిర్దేశం **కుట్టనీమతం**లోని 881, 928 శ్లోకాలలో ఉంది. సూత్రధారుడు ప్రవేశించేటప్పుడు **రత్నావళి** ప్రథమాంకం చివర పాత్ర లందరూ నిష్క్రమించే టప్పుడు ఈ ధ్రువాగానాలు చేయబడినట్లు చెప్పబడింది. కు.మ. 805 శ్లోకంలో సాత్త్వికభావాల ముచ్చట ఉంది. ఇవి **నాట్యశాస్త్రం**లోని ఏడవ అధ్యాయంలో చెప్పబడ్డాయి. **"సదృశేఽప్యనుభావగణే కరుణరసం విప్రలమ్భతో భిన్నమ్"** (కు.మ. 809) అనే వాక్యం **నాట్యశాస్త్రంలో** ఆరవ అధ్యాయంలో ప్రతిపాదించిన విషయాన్నే పేర్కొంది. దీనిని పట్టి **నాట్యశాస్త్రంలోని** ప్రధానమైన అధ్యాయాలన్నీ (మొదటి అధ్యాయం మొదలు ముప్పై ఆరవ అధ్యాయం వరకు) ఎనిమిదవ శతాబ్దంనాటికి ఉన్నా యని స్పష్టం అవుతున్నది.

(ఇ) ఆనందవర్ధనుడు **ధ్వన్యాలోకంలో** - "యది వా వృత్తీనాం భరతప్రసిద్ధానాం కైశిక్యాదీనామ్" అనీ, "యథా **వేణీసంహారే** విలాసాఖ్యస్య ప్రతిముఖసంధ్యఙ్గస్య ప్రకృత రసనిబన్ధనాననుగుణమపి భారతమతానుసరణమాత్రేచ్ఛయా ఘటనమ్" అనీ, "అత ఏవ చ భరతే ప్రబన్ధప్రఖ్యాతవస్తువిషయత్వం ప్రఖ్యాతోదాత్తనాయకత్వం చ నాటక స్యావశ్యకర్తవ్యతయా ఉపన్యస్తమ్" అనీ, "ఏతచ్చ రసాదితాత్పర్యేణ కావ్యనిబన్ధనం భరతాదావపి సుప్రసిద్ధమేవ" అనీ అనేక స్థలాలలో భరతుని మతం ఉదాహరించాడు. ఇక్కడ చెప్పిన విషయాలన్నీ నాట్యశాస్త్రంలో 20, 21, 16 అధ్యాయాలలో ప్రతిపాదింపబడినవి. ఆనందవర్ధనుడు తొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధంలో ఉన్నాడు.

నారాయణుడు నాట్యం విషయంలో భరతుడే అత్యుత్తమప్రమాణం అని అంగీకరించాడు. తదనుసారంగానే నాటకం రచించాడు. అందుచేత ఆనందవర్ధనునికి కొన్ని శతాబ్దాలు పూర్వమే నాట్యశాస్త్రంలో రససిద్ధాంతం, నాయకులు, వృత్తులు, ప్రతిముఖసంధ్యంగమైన విలాసంవంటివాటి వివరణలు ఉన్నాయి.

(ఈ) **నాట్యశాస్త్రం** ఆరవ అధ్యాయంలో ఉన్న రససూత్రం **కావ్యప్రకాశలో** ఉదాహరించబడింది. దానికి భట్టలోల్లట - శంకుక - భట్టనాయక - అభినవగుప్తులు చేసిన వ్యాఖ్యాభేదాల చర్చ కూడ **కావ్యప్రకాశలో** ఉంది. అభినవగుప్తుని వివిధగ్రంథరచనా కాలం క్రీ.శ. 980-1030. భట్టనాయకుడు క్రీ.శ. 900-925 ప్రాంతంలో ఉండేవాడు. **భువనాభ్యుదయం** అనే కావ్యం రచించిన శంకుకుడే ఈ శంకుకుడై ఉంటాడు. ఇతని పేరు **రాజతరంగిణిలో** ఉట్టంకించబడింది.

"కవిబుధమనఃసిన్ధుశశాఙ్కః శఙ్కుకాభిధః,
యముద్దిశ్యాకరోత్కావ్యం భువనాభ్యుదయాభిధమ్" (రా.త.4.705)

దీనిని పట్టి అతడు క్రీ.శ. 840 ప్రాంతానికి చెందినవా డని చెప్పవచ్చును. సోమేశ్వరుడు తాను రచించిన **కావ్యప్రకాశవ్యాఖ్యానంలో** శంకుకుని కొన్ని శ్లోకాలను రససూత్రం దగ్గర ఉదాహరించి వాటి విషయంలో భట్టతౌతుడు చేసిన విమర్శలను కూడ చూపి ఉన్నాడు. లోల్లటుడు ఏ కాలానికి చెందినవాడో స్పష్టంగా తెలియక పోయినా శంకుక - భట్టనాయక - అభినవగుప్తుల మతాలను వాళ్ల కాలక్రమాన్ని బట్టి నిర్దేశించడంచేత ఇతడు వీళ్లందరికంటె ప్రాచీను డని చెప్పవచ్చును. ఇతడు **'రసవివరణం'** రచించాడు. దాని నుంచి -

"యమకానులోమతదితరచక్రాదిభిదా హి రసవిరోధిన్యః,
అభిధానమాత్రమేతద్గడ్డరికాదిప్రవాహో వా"

అనే శ్లోకాన్ని ఉదాహరించాడు. ఈ శ్లోకం రుద్రటుని **కావ్యాలంకారంలో** (3.59) కూడ రచయిత పేరు చెప్పకుండా ఉదాహరించబడింది. అందుచేత లోల్లటుడు శంకుకునికి ముందు క్రీ.శ. 750-800 ప్రాంతంలో ఉండి ఉండాలి. దీని నంతనీ పట్టి ఎనిమిదవ శతాబ్దంనాటికి **నాట్యశాస్త్రంలోని** ఆరవ అధ్యాయాన్ని ఎందరో వ్యాఖ్యాతలు అనేకవిధాలుగా వ్యాఖ్యానించా రని తెలుస్తూన్నది.

(ఉ) క్రీ.శ. 700-740 ప్రాంతానికి చెందిన భవభూతి - భరతుడు తౌర్యత్రిక సూత్రం రచించా డనీ, అతడు వాల్మీకికి సమకాలికు డనీ **ఉత్తరరామచరితం** చతుర్థాంకంలో అన్నాడు.

బాణు డన్నాడు. భరతుని పద్ధతిని అనుసరించిన గానాన్ని గూర్చి **హర్షచరితంలో** ముచ్చటించాడు -

"వంశానుగమవివాది స్ఫుటకరణం భరతమార్గభజనగురు,
శ్రీకణ్ఠవినిర్యాతం గీతమిదం హర్షరాజ్యమివ" (హ.చ.3.4)

నాట్యశాస్త్రంలో వాది, సంవాది, అనువాది, వివాది అను నాలుగు విధాలైన స్వరాలు చెప్పబడ్డాయి. (28.20). పై శ్లోకంలోని వివాదిశబ్దం ఈ చతుర్థభేదాన్ని చెపుతున్నది.

"వివాదినస్తు తే యేషాం వింశతిస్వరమన్తరమ్,
తద్యథా వృషభగాన్ధారౌ ధైవతనిషాదౌ" (నా.శా.28.21)

నాట్యశాస్త్రంలోని తొమ్మిదవ అధ్యాయంలో (198-207శ్లో) కరణాలు చెప్పబడ్డాయి. హర్షవర్ధనుడు మరొక చోట **"వైణవావర్తమణ్డలీరేచకరాసరభసారబ్ధనర్తనార భటీనటాః"** (హర్ష చ.2.4) అని అన్నాడు. **నాట్యశాస్త్రంలో** రేచకము (4.240.246) అరభటి కూడ (20.65) వర్ణించబడ్డాయి.

(ఋ) సామలను శాస్త్రానుసారం నిర్దుష్టంగా గానం చేసేవాడు బ్రహ్మసాక్షాత్కారం పొందుతాడు అని చెప్పిన తరవాత **యాజ్ఞవల్క్యస్మృతిలో** వేదమంత్రాలకు బదులు అపరాంతకం, ఉల్లోప్యకం, మద్రకం, ప్రకరి, ఔవేణకం, సరోబిందు, ఉత్తరం అనే ఏడు విధాలైన గీతాలు గానం చేసేవాడు కూడ అదే ఫలం పొందుతాడు అని చెప్పబడింది. ఋగ్గాథలు మొదలైన వాటిని గానం చేయడంచేత కూడ మనస్సు పరమాత్మపైన స్థిరంగా ఏకాగ్రంగా నిలవడంచేత మోక్షం పొందవచ్చు ననీ, వీణావాదన తత్త్వం తెలిసినవాడూ, శ్రుతి - జాతులయందు నేర్పు గలవాడు, తాలం తెలిసినవాడూ కూడ మోక్షం పొందవచ్చు ననీ చెప్పబడింది.

"అపరాన్తకముల్లోప్యం మద్రకం ప్రకరీం తథా,
ఔవేణకం సరోబిన్దుముత్తరం గీతకాని చ.
ఋగ్గాథా పాణికా దక్షవిహితా బ్రహ్మగీతికా,
గేయమేతత్తదభ్యాసకరణాన్మోక్షసంజ్ఞితమ్.
వీణావాదనతత్త్వజ్ఞః శ్రుతిజాతివిశారదః,
తాలజ్ఞశ్చాప్రయాసేన మోక్షమార్గం నియచ్ఛతి." (యా.స్మృ. 3.113-115)

ఇవన్నీ నాట్యశాస్త్రంలో చెప్పబడినవే -

"బ్రహ్మోక్తం సప్తరూపం హి సమవేతాద్వినిస్సృతమ్,

దైవతారాధనం పుణ్యమనన్తం గీతవాదితమ్...."
ఋగ్గాథాపాణికానాం చ ప్రమాణానాం తథైవ చ,
అనేనైవ విధానేన యుగ్మౌజస్త్వం విభావయేత్" (నా.శా.31.419,421)
"ఋగ్గాథా పాణికా చైవ సప్తరూపం ప్రకీర్ణకమ్" (నా.శా.31.523)
"యా ఋచః పాణిగా గాథా సప్తరూపాఙ్గమేవ చ" (నా.శా. 32.2)

ఈ శ్లోకాలు వ్యాఖ్యానిస్తూ మితాక్షరలోను, అపరార్కవ్యాఖ్యానంలోను భరతుడు ప్రమాణంగా చూపబడ్డాడు. విశ్వరూపుడు నారదుణ్ణి, ఇతరులనూ, **దీపకలిక** విశాఖిలుణ్ణి ఇతరులను ప్రమాణంగా చూపించారు. ఈ ఏడు పేర్లు **నాట్యశాస్త్రంలో** (31.287) కొంచెం భేదంతో కనబడుతున్నాయి. వీటిని వివరిస్తూ **నాట్యశాస్త్రంలో** సుమారు 130 శ్లోకా లున్నాయి. ఇవి బ్రహ్మచేత ప్రచారం చేయబడిన వనీ, దేవతలకు ఆనందకరమైన వనీ కూడ చెప్పబడింది. వైదికాలు కాని ఈ ఏడు విధాల గీతాల స్వరూపాన్ని **అభినవభారతి** కూడ అతివిస్తృతంగా వివరించింది. **నాట్యశాస్త్రం** ప్రకారం ఈ ఏడింటి పేర్లు - మంద్రకం, అపరాంతకం, ప్రకరి, రోవిందకం, (సరోబిందుక బదులు) ఓవేణకం, ఉల్లోప్యకం, ఉత్తరం. యాజ్ఞవల్క్యుడు వీటిని నాట్యశాస్త్రంనుండే గ్రహించాడు గాన నాట్యశాస్త్రాన్ని ఏ విధంగానూ కూడ క్రీ.శ.మొదటి శతాబ్దానికి లేదా రెండవ శతాబ్దానికి తరవాత రచింపబడినట్లు చెప్పడానికి వీలు లేదు.

(ౠ) రతి (ప్రేమ) అనే నాటకానికి ఆలింగనం పూర్వరంగం అని **గాథా సప్తశతిలోని** ఒక గాథలో వర్ణింపబడింది -

"మానదుమ పరుస పవణస్స మామి సవ్వంగణివ్వుదిఅరస్స,
అబఊహణస్స భద్దం రినాడఅ పుబ్బరంగస్స" (సప్తశతి. 4.44)
"మానద్రుమపరుషపవనస్య సర్వాఙ్గనిర్వృతికరస్య
అవగూహనస్య భద్రం రతినాటకపూర్వరంగస్య" (సంస్కృతచ్ఛాయ).

ఇది **నాట్యశాస్త్రంలోని** ఐదవ అధ్యాయంలో ప్రతిపాదించబడిన పూర్వరంగాన్ని దృష్టిలో ఉంచుకొని చెప్పిన వర్ణనం. **గాథాసప్తశతి** సంకలనం క్రీ.శ. 200 కు 400 కు మధ్య చేయబడిం దని పండితుల అభిప్రాయం.

(ఏ) పట్టడకల్ లోని ఒక స్తంభంమీద అచలుడు లేదా అచలదుడు అనే కవి రచించిన కొన్ని శ్లోకాలు చెక్కబడి ఉన్నాయి. అక్కడ ఉపయోగించిన లిపి 8-9 శతాబ్దాలలో ప్రచారంలో ఉన్నది. దక్షిణదేశంలో కూడ ఆనాడు **భరతనాట్యశాస్త్రం** అభ్యసించినవాళ్ళు ఇతరపద్ధతులను అభ్యసించేవారిని ఓడించకలిగేవా రని ఈ క్రింది శ్లోకంలో చెప్పబడింది.

"నట సేవ్యభరతమతయుతపటుతరవచనాశనిప్రపాతేన,

కుటిలోన్నతసటశైలః స్ఫుటితానతమస్తకః పతతి".

(ఐ) భట్టి (క్రీ.శ.590-650), దండి, భామహుడు, ఉద్భటుడు మొదలైన ప్రాచీనాలంకారికు లందరూ సుమారు ముప్పై అలంకారాలను నిరూపించారు. భరతుడు అతి సాధారణా లైన ఉపమ, దీపకం, రూపకం, యమకం అనే నాలుగు అలంకారాలు మాత్రమే ప్రతిపాదించాడు. ఛందస్సును గూర్చి ప్రాకృతభాషలను గూర్చి అతి విస్తృతంగా చర్చించిన భరతుడు ఆ నాటికి చాలా అలంకారాలు ప్రచారంలో ఉండి ఉన్నట్లయితే తప్పకుండా వాటి నన్నింటినీ ప్రతిపాదించి ఉండేవాడు. అందుచేత ఇతడు ఈ ఆలంకారికులకంటె కనీసం కొన్ని శతాబ్దాలు పూర్వం ఉండి ఉంటాడు.

నాట్యశాస్త్రానికున్న 'సూత్రమ్' 'భరతసూత్రమ్' అను పేర్లు దీని అతిప్రాచీనత్వాన్ని సూచిస్తూన్నాయి అని ప్రతిపాదిస్తూ, శ్రీ ఎం. కృష్ణమాచారియార్ ఆంగ్లభాషలో రచించిన తమ 'సంస్కృతవాఙ్మయచరిత్ర'లో ఇలా అన్నారు – "నాట్యశాస్త్రం అతిప్రాచీన మైనది. దీనిలో భరతముని ఐంద్రవ్యాకరణమూ, యాస్కుని నిరుక్తము నిర్దేశించాడు గాని పాణినిని పేర్కొనలేదు. ఈ గ్రంథంలోని భాషలోను, విషయప్రతిపాదనలోను అతిపురాతనతారీతులు (Archaic Tenor) స్పష్టంగా కనబడుతున్నాయి. అందుచేతనే నాట్యశాస్త్రరచయిత పేరు దివ్యపురుషుల కిచ్చే గౌరవభావంతో 'భరతముని' అని ప్రసిద్ధిలోనికి వచ్చింది. (కొందరు ప్రాచీనాలంకారికులు కేవలం 'ముని' అని ఈయనను నిర్దేశించారు).

ఈ గ్రంథాన్ని, దీని వ్యాఖ్యాతలు, ఇతరశాస్త్రకారులూ కూడ 'సూత్రమ్' అని నిర్దేశించారు. చిన్న మాటలలో అతివిస్తృతమైన అర్థాన్ని బోధించే ప్రామాణిక మైన శాస్త్రగ్రంథాన్ని మాత్రమే 'సూత్రమ్' అనడం భారతీయప్రాచీనశాస్త్రసంప్రదాయం. ఉదాహరణకి – 'కలానామాని సూత్రకృదుక్తాని యథా' (భరతసూత్రకారుడు చెప్పిన కలానామా లెట్లనగా) అంటాడు నాన్యదేవుడు. నాట్యశాస్త్రవ్యాఖ్యప్రారంభంలో అభినవ గుప్తాచార్యులు –

"షట్త్రింశకం భరతసూత్రమిదం వివృణ్వన్,
వన్దే శివం శ్రుతితదర్థవివేకిధామ".

("ముప్పై ఆరధ్యాయాల భరతసూత్రాన్ని వ్యాఖ్యానించడానికి ప్రారంభించిన నేను వేద – వేదార్థవిద్యమ్యుడైన పరమశివునికి నమస్కరిస్తున్నాను") అంటారు.

పురాణాలలో లభించే కొన్ని ఐతిహాసికకాలక్రమాలను పట్టి చూడగా భరతుడు అతిప్రాచీను డను విషయం స్పష్టం అవుతుంది. అయితే సాంప్రదాయికవిషయాలను విశ్వసించకపోవడం ఈనాటి విమర్శకులకు ఒక అలవాటుగా ఏర్పడింది. ఏమైనా – పూర్వం సూత్రరూపంలో రచించిన వివిధశాస్త్రగ్రంథాలకు వ్యాఖ్యానాలుగా శ్లోకరూపంలో,

ఆవిర్భవించిన, సూత్రకాలానంతరకాలిక ప్రాచీన గ్రంథాలలో అతిపురాతనమైనది భరత నాట్యశాస్త్రమే; రామాయణ – భారతాల తరువాత మనకు లభిస్తూన్న అతిపురాతన మైన శ్లోకబద్ధ విశాలగ్రంథం ఇదే అని నిస్సంశయంగా చెప్పవచ్చును.

(History of Classical Sanskrit Literature, P. 811)

ఇంతవరకు మనం చూచినదానిని పట్టి నాట్యశాస్త్రం కాలం క్రీ.శ. 300 కు తరువాత అయి ఉండడానికి వీలులే దని స్పష్టం అవుతున్నది. అంటే ఈ నాడు మనకు లభిస్తూన్న నాట్యశాస్త్రం ఇదే ఆకారంలో ఆ కాలంనుంచీ మనకు వస్తూన్నదని అర్థం కాదు. రససిద్ధాంతాన్ని గూర్చి రూపకనియమాలను గూర్చీ చెప్పేది, భరతుని రచనగా ప్రసిద్ధమూ అయిన నాట్యశాస్త్రం క్రీ.శ. 300 లకు పూర్వమే ఉండే దని మాత్రమే దీని అర్థం. అలంకారశాస్త్ర సిద్ధాంతాలను దానికి సంబంధించిన విషయాలనూ ప్రతిపాదించే గ్రంథం ఏదీ క్రీ.శ. 300 ప్రాంతంలో ఉన్నట్లు ప్రస్తుతం కనబడడం లేదు గాన మనకు తెలిసి నంతవరకు నాట్యశాస్త్రమే అలంకార శాస్త్రానికి సంబంధించిన అతి ప్రాచీనగ్రంథం అని అంగీకరించవలసి ఉంటుంది.

దశరూపకవ్యాఖ్యానంలో ధనికుడు – 'ఏతచ్చ –

"ఇదం త్రిపురదాహే తు లక్షణం బ్రహ్మణోదితమ్,
తతస్త్రిపురదాహశ్చ డిమసంజ్ఞః ప్రకీర్తితః" (ద.రూ. 56.60)

"ఇతి భరతమునినా స్వయమేవ త్రిపురదాహేతివృత్తస్య తుల్యత్వం దర్శితమ్" అని నాట్యశాస్త్రంనుండి ఒక శ్లోకం ఉదాహరించాడు. ఇప్పుడు లభించే నాట్యశాస్త్రంలో (4.10) ఈ శ్లోకం ఉత్తరార్ధం మాత్రమే లభ్యం అవుతూన్నది. సరస్వతీకంఠాభరణ వ్యాఖ్యాత మురజబంధానికి ఉపయోగించవలసిన వర్ణాలను గూర్చి –

"పాఠాక్షరాణి మురజే లహకారౌ తథదధాశ్చమౌ రేఫః
నణకఖగవజాశ్చేత్థం షోడశ భరతాదికథితాని" (పే. 268.109కా.)

అని అంటూ భరతుని అభిప్రాయాన్ని ఉదాహరించాడు. కాని నాట్యశాస్త్రంలో ఈ విషయాన్ని గూర్చి ఏమీ కనబడడంలేదు.

నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానాలు : భట్టోద్భటుడు : నాట్యశాస్త్రవ్యాఖ్యానాలలో అతి ప్రసిద్ధ మైనది అభినవగుప్తుని అభినవభారతి. దీనికి నాట్యవేదవివృతి అనే పేరు కూడ ఉంది. ఇది అనేకస్థలాలలో ఖండితంగాను, అస్పష్టంగాను ఉన్నది. అయినా నాట్యశాస్త్ర వ్యాఖ్యాతలను గూర్చి అభినయవిద్యకు సంబంధించిన గ్రంథాలు రచించిన అనేకప్రాచీన రచయితలను గూర్చీ ఎంతో విలువ గల విషయాలు ఈ వ్యాఖ్యానం ద్వారా మనకు తెలుస్తున్నాయి. లోల్లటుడు, ఉద్భటుడు, శంకుకుడు, కీర్తిధరుడు, అభినవగుప్తుడు

నాట్యశాస్త్రానికి వ్యాఖ్యలు రచించారని **సంగీతరత్నాకరంలో** శార్ఙ్గ దేవు డన్నాడు –

వ్యాఖ్యాతారో భారతీయే లోల్లటోద్భటశఙ్కుకాః,
భట్టాభినవగుప్తశ్చ శ్రీమత్కీర్తిధరోఽపరః" (1.19)

అభినవభారతిలోని అనేక స్థలాలలో ఉద్భటుడు అంగీకరించిన కొన్ని పాఠభేదాలను గూర్చి కొన్ని అర్థ విశేషాలను గూర్చి చర్చ ఉంది. అందుచేత ఉద్భటుడు మొత్తం నాట్యశాస్త్రానికి వ్యాఖ్య రచించినట్లు చెప్పవచ్చును. ఉద్భటుడు క్రీ.శ. 800 ప్రాంతానికి చెందినవాడు.

లోల్లటుడు :– వృత్తి, ఆత్మసంవిత్తి మొదలైన విషయాలను గూర్చిన ఉద్భటుని అభిప్రాయాలను శకలీగర్భుడు అంగీకరించాడు. శకలీగర్భుని మతాన్ని లోల్లటుడు నిరాకరించాడు. దీనిని పట్టి లోల్లటుడు క్రీ.శ 800 నుండి 840 కి చెందినవా డని చెప్పవచ్చును. అతడు అనేక స్థలాలలో ఉద్భటుని మతాన్ని కూడ ఖండించాడు. రససూత్రానికి అతడు చేసిన వ్యాఖ్యానం అభినవగుప్తుడు ఉట్టకించాడు. లోల్లటుని కొన్ని అభిప్రాయాలు ఇవి – (1) రసాలు అనేకం. అయినా ప్రసిద్ధమైన సాంప్రదాయికగ్రంథాల ననుసరించి ఎనిమిది లేదా తొమ్మిది రసాలను మాత్రమే రంగస్థలం మీద ప్రదర్శించాలి) – "తేన అనన్త్యేఽపి పార్షదప్రసిద్ధ్యా **ఏతావతాం** ప్రయోజ్యత్వమితి **యద్ భట్టలోల్లటేన** నిరూపితం తదవలేపనాపరామృష్ట్వా **ఇత్యలమ్"** (అ.భా. మొదటి సం.పే. 299) (2) నాట్యశాస్త్రం లోని ఈ క్రింది శ్లోకం భట్టలోల్లటుని ప్రకారం లేదు.

"యః కశ్చిత్కార్యవశాద్గచ్ఛతి **పురుషః** ప్రకృష్టమధ్వానమ్,
తత్రాప్యఙ్కచ్ఛేదః **కర్తవ్యః పూర్వవత్తద్‌జ్ఞైః"** (20.30)
"అత ఏవ ఏతత్ **భట్టలోల్లటాద్యైః అపఠితమేవ"** (అ.భా. II పే. 243)

(3) 'గోపాల'ధ్రువతాలాల విషయంలో లోల్లటుని అభిప్రాయాలను అభినవగుప్తుడు ఉదాహరించాడు (అ.భా.II .134) (4) **నాట్యశాస్త్రం** లోని పదమూడవ అధ్యాయంలోని మొదటిశ్లోకంలో అభినవగుప్తుడు లోల్లటుని మతం నిర్దేశించాడు. (5) **"అఙ్క ఇతి గూఢశబ్దో** భావైశ్చ రసైశ్చ రోహయత్యర్థాన్" (నా.శా. 18.14) అనే శ్లోకంలో **"గూఢ శబ్దః"** అనేది లోల్లటుని పాఠమని చెపుతూ అభినవగుప్తుడు **"రూఢశబ్దః"** అని తనకు సంమతమైన పాఠం ఇచ్చాడు. (6) నాటిక షట్పద అని లోల్లటుని అభిప్రాయ మనీ, అష్టపద అని శంకుకుని అభిప్రాయ మనీ, అభినవగుప్త డంటాడు. **"షట్పదేయం నాటికేతి** సంగ్రహానుసారిణో **భట్టలోల్లటాద్యాః, శ్రీశంకుకస్తు అయుక్తమేతదిత్యభిధాయ అష్టధేతి** వ్యాచష్టే" (అ.భా.III. పే.436). (7) **నాట్యశాస్త్రం** 21వ అధ్యాయం 29వ శ్లోకం దగ్గర లోల్లటుడు – "పతాకానాయకుని జీవితానికి సంబంధించిన భాగాలకు ఆతని

చర్యలకు **"అనుసంధి"** అని పేరు అని అన్నాడు. **"తథా లోల్లటాద్యాస్తు మన్యన్తే పరార్థే సాధయితవ్యే** పతాకానాయకస్య **ఇతివృత్తభాగాః అనుసంధయః"** (అ.భా.III. పే.17) దీనిని పట్టి లోల్లటుడు మొత్తం **నాట్యశాస్త్రానికి** కాకపోయినా 6,13, 18, 21 వంటి చాలవరకు అధ్యాయాలకు వ్యాఖ్య రచించా డని చెప్పవచ్చును.

కావ్యానుశాసనంలో హేమచంద్రుడు లోల్లటుని రెండు శ్లోకాలు ఉదాహరించాడు–

"యస్తు సరిదద్రిసాగరనగతురగపురాదివర్ణనే **యత్నః,**
కవిశక్తిఖ్యాతిఫలో వితతధియాం **నో మతః** ప్రబన్ధేషు.
యమకానులోమతదితరచక్రాదిభిదా హి రసవిరోధిన్యః,
అభిమానమాత్రమేతద్ గడ్డరికాదిప్రవాహో వా" **(కావ్యాను. V పే. 215)**

వీటిలోని మొదటి శ్లోకం అపరాజితి రచించినదిగా **కావ్యమీమాంసలో** చెప్పబడింది. రెండవ శ్లోకం లోల్లటరచితంగా **కావ్యప్రకాశవ్యాఖ్యలో** సోమేశ్వరుడు ఉదాహరించాడు. రుద్రటుని **కావ్యాలంకారవ్యాఖ్యలో** (III. 59) ఈ శ్లోకాన్ని నమిసాధువు రచయిత పేరు చెప్పకుండా ఉదాహరించాడు. క్రీ.శ. 1159–60లో **కావ్యప్రకాశసంకేతం** రచించిన మణిచంద్రుడు – రససిద్ధాంతానికి సంబంధించిన మతాలను లోల్లటుని **రసవివరణం** నుండీ, ఇతరులనుండీ తెలుసుకోవాలని అంటూ లోల్లట – శంకుక – నాయకులను ముగ్గురునీ కూడ ఈ విధంగా ఆక్షేపించాడు –

"న వేత్తి యస్య **గామ్భీర్యం** గిరితుఙ్గోఽపి **లోల్లటః,**
తత్తస్య రసపాథోధేః కథం జానాతు శఙ్కుకః.
భోగరత్యాదిభావానాం భోగం స్వస్యోచితం బ్రువన్,
సర్వథా రససర్వస్వమర్మాస్ప్రాక్షీన్న నాయకః."

లోల్లటుడు రసాన్ని గూర్చిన తన మతాన్ని పూర్వమీమాంసను ఆధారంగా ప్రవర్తింపచేసి నట్లు అభినవగుప్తుని ఈ క్రింది వాక్యాన్ని పట్టి తెలుస్తూన్నది –

"ప్రత్యేకప్రసంగత్వలాభాత్, క్రమస్య అపదార్థత్వాత్ నార్థప్రమాణకత్వాత్ ముఖ్యశ్రౌతపదార్థబాధకత్వమయుక్తం, శ్రుత్యా వాక్యప్రమాణస్య బాధనాత్ ఇతి తు భట్టలోల్లటోక్తం ప్రకృతే సిధ్యతి, విరోధాభావాత్" (అ.భా.2. పే. 196.)

శంకుకుడు : శంకుకుడు రసం విషయంలో లోల్లటుని మతాన్ని ఖండించాడు. ఇతని వ్యాఖ్యానం లోల్లటుని వ్యాఖ్యానం వలెనే మన కిపుడు లభ్యం కాకపోయినా ఇతడు మొత్తం నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానం రచించినట్లు కనబడుతున్నది. (1) మూడవ అధ్యాయం 21–22 శ్లోకాల వ్యాఖ్యానంలో అభినవగుప్తుడు రంగపీఠం విషయంలో శంకుకుని

మతాన్ని – **“అతః చతుర్దశహస్తం రఙ్గపీఠపృష్ఠే ఏవ మణ్డలమిత్యుక్తం భవతి. శఙ్కుకాదిభిః షోడశహస్తావకాశాభావః అసనస్తమ్భాదివశాత్; తస్మాత్ అకృత ఏవ రఙ్గపీఠే ఇత్యాది వృథైవ ఉపన్యస్తమ్”** అని ఉట్టంకించబడింది (2) **“ప్రఖ్యాతవస్తు విషయం ప్రఖ్యాతోదాత్తనాయకమ్”** (1810) అనే శ్లోకానికి శంకుకుడు చేసిన వ్యాఖ్యను నిర్దేశించి అభినవగుప్తుడు దానిని నిరాకరిస్తాడు. (3) **నృపతీనాం యచ్చరితం నానా రసభావచేష్టితం బహుధా”** (1812) అనే శ్లోకంలో 'నృపతీనామ్' అనే పదానికి శంకుకుడు చెప్పిన భావాన్ని అభినవగుప్తుడు నిరాకరించాడు. – **“శ్రీశఙ్కుకస్తు వ్యాచష్టే – విజిగీషుః అరిః మధ్యమోదాసీనౌ మిత్రం మిత్రమిత్రమితి ఏషాం చరితమితి బహువచనేన లభ్యతే ...”** (అ.భా. 18.12). (4) నాటికను గూర్చి శంకుకుని అభిప్రాయం వెనుక చూపబడింది. (5) 21వ అధ్యాయం 40వ శ్లోకంలో ప్రతిముఖసంధిని గూర్చి శంకుకుడు చెప్పిన అభిప్రాయాన్ని అభినవగుప్తుడు – **“ఉద్ఘాటితత్వాత్ బీజస్య స్తోకమాత్రం తు శఙ్కుకాదిభిరుదాహృతం యత్ తదేకదేశలక్షణమితి ద్రష్టవ్యమ్”** (అ.భా. 3 పే.25) అని విమర్శించాడు. (6) 21వ అధ్యాయం 42వ శ్లోకంలో శంకుకుడు విమర్శసంధిని గూర్చి చెప్పిన అభిప్రాయాన్ని అభినవగుప్తుడు ఉదాహరించాడు. (7) గర్భసంధ్యంగాలలో ఒకటైన విద్రవం విషయంలో శంకుకు డంగీకరించిన పాఠాన్ని దాని వివరణాన్ని అభినవగుప్తుడు ఉదాహరించాడు – **“అన్యే తు శఙ్కాభయత్రాసైః కృతః యః స విద్రవ ఇత్యాది, తత్ర చ విశేష్యపదమన్వేష్యమ్ – సముదాయ ఏవ విశేష్యమితి శ్రీశఙ్కుకః, ఉదాహరతి చ కృత్యారావణే షష్ఠేఽఙ్కే గర్భసన్ధౌ”** (అ.భా. 3పే. 52). (8) ఇరవైనాలుగో అధ్యాయంలో సామాన్యాభినయం విషయంలో శంకుకుడు వెలిబుచ్చిన అభిప్రాయాలు విస్తృతంగా ప్రతిపాదించబడ్డాయి. (అ.భా. 3 సంపుటం). (9) ఇరవై నాల్గవ అధ్యాయంలోని మూడవ శ్లోకంలో – **“అవ్యక్తరూపమ్ ఇత్యాదికం ప్రబన్ధం శ్రీశఙ్కుకాదయః ఇత్థం నయన్తి”** (అ.భా. III 150) అని శ్రీశంకుకుని అభిప్రాయం ఉదాహరించబడింది. (10) వందల కొలది అభినయభేదాలు ఏర్పడవచ్చును అని అంటూ అభినవగుప్తుడు ఆ సందర్భంలో శంకుకుని ప్రకారం నలభైవేల భేదా లుండవచ్చు నని అన్నాడు – **“నను యథా శ్రీశఙ్కుకేన ఉక్తం చత్వారింశత్సహస్రాణి ఇత్యాది”** (అ.భా. పే.180). (11) ఐదవ అధ్యాయంలోని 20–21 శ్లోకాల వ్యాఖ్యానంలో అభినవగుప్తుడు 29వ అధ్యాయం నుంచి చాలా శ్లోకాలు ఉదాహరిస్తూ “ఈ శ్లోకాలలో కొన్నింటిలో శ్రీశంకుకుడు అంగీకరించిన పాఠాలు భిన్నంగా ఉన్నా యని ఆ భేదాలను చూపించాడు. (12) **అభినవభారతి** మొదటి అధ్యాయంలోను, రససూత్రవ్యాఖ్యానంలో, 293, 298, 318 పేజీలలో శంకుకుని మతం ఉదాహరించబడింది. దీని నంతనీ పట్టి శంకుకుడు మొత్తం **నాట్యశాస్త్రానికి**

వ్యాఖ్యానం రచించి నట్లు స్పష్టం అవుతున్నది.

అభినవగుప్తుడు తన వ్యాఖ్యానంలో అనేక స్థలాలలో భట్టనాయకుని మతం ప్రస్తావించాడు. అయితే భట్టనాయకుడు నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానం రచించాడా లేక ఏదైనా స్వతంత్రగ్రంథం రచించాడా అనే విషయం నిర్ధారణ చేయవలసి ఉంది. అదే విధంగా **నాట్యశాస్త్రం** నాల్గవ అధ్యాయం చివరి శ్లోకం వ్యాఖ్యానంలో కీర్తిధరుని పేరు చెప్పబడింది కాని ఇతడు **నాట్యశాస్త్రానికి** వ్యాఖ్యానం వ్రాసి నట్లు చెప్పడానికి తగిన ఆధారాలు లేవు.

అదే విధంగా అభినవగుప్తుడు అనేక స్థలాలలో 'టీకాకారుడు' టీకాకృత్. అని నిర్దేశించిన ఒక రచయిత ఎవరో ఉన్నాడు. ఆరవ అధ్యాయంలో రెండు పర్యాయాలు ఇతని మతం ఉదాహరించబడింది. ఇంకా 21,23,29,30,31 అధ్యాయలలోను, ఇతరత్రా కూడా దాదాపు పది పన్నెండు స్థలాలలో ఇతని మతాన్ని ఉదాహరించి నిరాకరించడం జరిగింది. ఈ విధంగా ఈ రచయిత పేరు అన్ని అధ్యాయాలలోనూ కాకపోయినా చాల అధ్యాయాలలో చెప్పబడింది. ఆలాపం, ప్రలాపం, ఉపదేశం, అతిదేశం మొదలైన అంతర్లాపాలను గూర్చి వ్రాస్తూ అభినవగుప్తుడు కొందరు ఉపదేశం, అతిదేశం, ఉపమానం మొదలైన వాటిలోనికి మీమాంసక – తార్కిక పరిభాషలను ప్రవేశపెట్టి సుకుమారమతులను భ్రాంతులను చేసి తప్పుదారి పట్టిస్తున్నారు అని అన్నాడు. **“అత్ర ఉపదేశాతిదేశయోః ఉపమానస్య చ సాహిత్యవిషయే తార్కికమీమాంసకవిషయే విశేషప్రతిపాదనం యత్ టీకాకారైః కృతం తత్సుకుమారమనోమోహనం వృథా భ్రమణికామాత్రం ప్రకృతానుపయోగాదిహోపేక్ష్యమేవ”** (అ.భా. పే. 176). అప్పయ్యదీక్షితులు, తద్వ్యాఖ్యాతలు, పండితరాజ జగన్నాథాదులు అలంకారశాస్త్రంలో ప్రవేశపెట్టిన తర్కశాస్త్రాద్యాడంబరాలు చూస్తే అభినవ గుప్తుడు ఎంత వాపోయి ఉండేవాడో!

అభినవభారతిలోను ఇతర గ్రంథాలలోను ఇంకా ఎంతోమంది కొన్ని నాట్యశాస్త్రీయ విషయాలను చర్చించిన రచయితల పేర్లు కనబడుతున్నాయి. భట్టయంత్రుడు, ప్రియాతిథి, భట్టవృద్ధి, భట్టసుమనస్, భట్టగోపాలుడు, రుద్రకుడు, భట్టశంకరుడు, ఘంటకుడు మొదలైన ఈ రచయితలు నాట్యశాస్త్రాని కంతకీ వ్యాఖ్యలు వ్రాశారా కొన్ని భాగాలకు మాత్రమే వ్రాశారా, లేదా స్వతంత్రగ్రంథాలు రచించి ఆయావిషయాలు చర్చించారా అనే విషయం చెప్పడం కష్టం.

అభినవభారతిలో రాహులకు డనే రచయితను అనేక పర్యాయాలు పేర్కొనడం కనబడుతుంది. **“యథాహ రాహులకః –**

పరోక్షేఽపి హి వక్తవ్యో నార్యా ప్రత్యక్షవత్ప్రియః.

సఖీ చ నాట్యధర్మోఽయం భరతేనోదితం ద్వయమ్" (అ.భా. 1పే.172)

వైశాఖరేచితం ప్రతిపాదిస్తూ రాహులకుడు రచించిన ఒక శ్లోకం ఉదాహరించబడింది. భరతుడు చెప్పిన యువతుల ఇరవై అలంకారాలు కాకుండా ఇతడు - మౌగ్ధ్యం, మదం, భావవికృతం, పరితపనం అనే మరికొన్ని అలంకారాలు కూడా అంగీకరించినట్లు చెప్పబడింది. "**తేన మౌగ్ధ్యమదభావవికృతపరితపనాదీనామపి శాక్యాచార్యరాహులాదిభిః అభిధానం విరుద్ధమ్ ఇత్యలం బహునా**". (అ.భా.3.పే.164)

అభినవగుప్తుడు ఒక మారు పుష్పాన్ని గూర్చి చెప్పే సందర్భంలో మాతృగుప్తుణ్ణి పేర్కొన్నాడు. **నాట్యశాస్త్రం**లో (29.93) చెప్పినట్లు వీణను మ్రోగించే ఒక పద్ధతికి పుష్పం అని పేరు. ఇదొక పారిభాషికపదం. "**యథోక్తం మాతృగుప్తేన**" "**పుష్పం చ జనయత్యేకో భూయోఽనుస్పర్శనాన్వితః**' ఇతి (అ.భా.3.పే.164). మాతృగుప్తుడు నాట్య - సంగీతాలను గూర్చిన గ్రంథాలు రచించి ఉంటాడు. నాటకంలోని కథావస్తువు ప్రాచీన కథతో సంబంధించినదైనా దానిలో కవికల్పితాలైన కథాంశాలు కూడ ఉండవచ్చునని మాతృగుప్తుని అభిప్రాయం అన్నట్లు శారదాతనయుడు **భావప్రకాశనం**లో చెప్పాడు -

"**పూర్వవృత్తాశ్రయమపి కిం చిదుత్పాద్యవస్తు చ,**
విధేయం నాటకమితి మాతృగుప్తేన భాషితమ్" (భా.ప్ర.పే.234)

శాకుంతల వ్యాఖ్యానమైన **అర్థద్యోతనిక**లో రాఘవభట్టు దాదాపు ఇరవై స్థలాలలో మాతృగుప్తుని మతం ఉదాహరించాడు - సూత్రధారుని గుణాలు, ఆర్యావర్తం, రూపకాలలో శౌరసేని అన్నివర్గాల స్త్రీపాత్రలు మాటలాడే భాష అనే విషయం, నాటకలక్షణాలు (51/2 శ్లోకాలు), బీజం (3 శ్లోకాలు), రూపకాలలో ఎవరు సంస్కృతంలో మాటలాడాలి అనే విషయం (ఒక శ్లోకం), 36 నాట్యలక్షణాలలో మొదటిదైన భూషణం యొక్క లక్షణం, పరిచారిక లైన యవనస్త్రీల లక్షణాలు (11/2 శ్లోకాలు) సేనాపతిలక్షణం, హసిత - స్మిత - పతాకాస్థానక - కంచుక - పరిచారికా - కార్యాల లక్షణాలు మామూలుగా ప్రాకృతంలో మాటలాడేవాళ్లు ఎప్పుడు సంస్కృతంలో మాట్లాడతారు అనే విషయం - వీటి అన్నింటి పైన మాతృగుప్తుని మతం ఉదాహరించబడింది. **నాటకలక్షణ రత్నకోశం**లో సాగరనంది మాతృగుప్తుని ఎన్నో శ్లోకాలు ఉదాహరించాడు. మాతృగుప్తుడు సౌకుమార్యంతో నిండిన కవిత్వం చెప్పగల కవి అని **వక్రోక్తిజీవితం**లో చెప్పబడింది. **ఔచిత్యవిచారచర్చ**లో మాతృగుప్తుని శ్లోకం ఒకటి ఉదాహరించబడింది. **రాజతరంగిణి**లో (3.125-33) మాతృగుప్తుణ్ణి గూర్చిన విపులవర్ణనం ఉన్నది. ఈ మహాకవి హర్షవిక్రమాదిత్యుని ఆస్థానంలో ఆస్థానకవిగా ఉండేవాడు. భర్తృమేంఠునికి సమకాలికుడు. ఆతని పోషకుడు, హర్షుని తరువాత ఐదు సంవత్సరాల పాటు కాశ్మీరును పాలించాడు. చివరికి కాశీ వెళ్ళి సంన్యాసం

స్వీకరించాడు. మాతృగుప్తుడు హర్షుని ఆస్థానంలో ఉన్నప్పుడు రూపకాలకు సంబంధించిన ఏదో గ్రంథం శ్లోకాలలో రచించి ఉంటాడని చెప్పవచ్చును గాని ఇతడు **నాట్యశాస్త్రా**నికి వ్యాఖ్యానం వ్రాసినట్లు కనబడదు. **రాజతరంగిణి**లో (III.181.252) ఈతని పద్యాలు రెండు ఉదాహరించబడ్డాయి. క్రీ.శ. 1613లో రచించిన **నాట్యప్రదీపం**లో సుందరమిశ్రుడు **నాట్యశాస్త్రం**నుంచి నాందీలక్షణం (5,25,106) ఉదాహరించి - "**అస్య వ్యాఖ్యానే మాతృగుప్తాచార్యైః షోడశాక్షిపదాపీయమ్ ఉదాహృతా**" అని అన్నాడు. చాల అర్వాచీనుడైన ఇతని వాక్యాన్ని అక్షరశః అంగీకరించ వలసిన పనిలేదు. మాతృగుప్తుడు తన రూపకగ్రంథంలో భరతుని నాందీలక్షణం గ్రహించి వివరించాడు అని మాత్రమే దీని అర్థం అయి ఉంటుంది. **రాజతరంగిణి**లో చెప్పిన మాతృగుప్తుడు వేరు రూపకశాస్త్రం రచించిన మాతృగుప్తుడు వేరు అని కొందరి అభిప్రాయం కాని, మాతృగుప్తుడే కాళిదాసు అనే కొందరి మతం కాని ప్రామాణికాలు కావు.

అభినవగుప్తుని నాట్యశాస్త్రాచార్యుడైన భట్టతౌతుడు కూడ **నాట్యశాస్త్రా**నికి వ్యాఖ్యానం వ్రాసి ఉంటాడా అనే విషయం వివాదాస్పదం. **ప్రత్యభిజ్ఞాశాస్త్రం**లో అభినవ గుప్తుని ప్రాచార్యుడైన ఉత్పలదేవుని అభిప్రాయాలను అభినవగుప్తుడు చాల తరచుగా 29,31,32 అధ్యాయాలలో ఉదాహరించాడు. అతడు ఈ అధ్యాయాలకు వ్యాఖ్య రచించాడా లేక సంగీతశాస్త్రానికి సంబంధించిన స్వతంత్రగ్రంథం ఏదైనా రచించాడా అని నిశ్చితంగా చెప్పడం కష్టం. అభినవగుప్తుడు ఒక చోట ఉత్పలదేవుని మతం అంగీకరించడు - "**ఉత్పలదేవపాదాస్తు అస్మత్పరమగురవః వ్యాచక్షతే ... వయం తు మన్మహే**" (అ.భా.)

ధ్వన్యాలోకవ్యాఖ్యాన మైన **లోచనం**లో అభినవగుప్తుడు -

"**బహూనాం సమవేతానాం రూపం యస్య భవేద్బహు,**
స మన్తవ్యో రసః స్థాయీ శేషాః సంచారిణో మతాః"

అను **నాట్యశాస్త్రం**లోని శ్లోకం ఉదాహరించి, దీనిని చాలమంది చాల విధాలుగా వ్యాఖ్యానించారు అని చెపుతూ భాగురి మతాన్ని ఉటంకిస్తాడు. -

"**తథా చ భాగురిరపి కిం రసానామపి స్థాయిసంచారితా అస్తి ఇత్యాక్షిప్య అభ్యుపగమేనైవ ఉత్తరమవోచత్ బాఢమ్ అస్తీతి**" (లోచనం.పే. 217). భాగురి **నాట్యశాస్త్రవ్యాఖ్యాత** అని చెప్పడానికి మరొక మూలం ఏదీ లభించడంలేదు.

మనకీ నాటివరకు లభించని రూపకప్రయోగ గ్రంథాలను నిర్మించిన కొందరు ప్రాచీన రచయితలను గూర్చి చెప్పవలసి ఉన్నది. సదాశివుడు, శివుడు, బ్రహ్మదేవుడు, భరతుడు, కశ్యపముని, మతంగుడు, యాష్టికుడు, కోహలుడు, విశాఖిలుడు, దంతిలుడు, కంబలుడు, అశ్వతరుడు, నారదుడు, తుంబురుడు, ఆంజనేయుడు, మాతృగుప్తుడు,

రావణుడు నందికేశ్వరుడు, రుద్రటుడు, నాన్యభూపాలుడు, భోజుడు, సోమేశ్వరపరమర్ది, జగదేకమహీపతి ఈ విధంగా ఎందరో గ్రంథనిర్మాతల పేర్లు సంగీతరత్నాకరంలో (1.15-18) కనబడుతున్నాయి. వీరిలో కొందరు దివ్యపురుషులు, కొందరు దేవయోనులు (అర్ధదేవతలు), కొందరు మానవులు, కోహలుణ్ణి గూర్చి వెనుక కొంతవరకు తెలుసుకొని ఉన్నాం. అతడు నాట్యశాస్త్రానికి సంబంధించిన అన్ని విషయాలమీద, ప్రధానంగా సంగీత - నృత్య - అభినయాలమీద గ్రంథం లేక గ్రంథాలు రచించి నట్లు కనబడుతుంది. కోహలుడు రచించిన **సంగీతమేరువు** ఇప్పుడు లభ్యంకాదు; తాలాలకు సంబంధించిన ఒక అధ్యాయం మాత్రమే లభ్యం అవుతున్నది అని తెలుస్తూన్నది. సట్టకం మొదలైన ఉపరూపకాలను గూర్చి మొట్టమొదట చెప్పినవాడు కోహలుడు. అభినవగుప్తుడు అనేకస్థలాలలో కోహలుని మతం ప్రతిపాదించడమే కాకుండా ఆతని శ్లోకాలు కూడ అనేకం ఉదాహరించాడు. నాట్యశాస్త్రంలో కోహలుడు నృత్తాచార్యుడుగా పేర్కొనబడ్డాడు. - "**శూన్యభాస్వరవిద్యుదాద్యభినయవిషయే నృత్తాచార్యప్రవాహసిద్ధః కోహలలిఖితోఽపి హస్తః సంగతో భవతీతి**" (అ.భా.II.పే. 26). ఉపయోగించిన భాషలను పట్టి రూపకాలు అనేకవిధా లని కోహలుని అభిప్రాయ మనీ, సైంధవభాషలో రచించిన సైంధవకాన్ని రూపకంగా అంగీకరించడంచేత భరతునకు కూడ ఈ అభిప్రాయం అంగీకార్యమే అనీ అభినవభారతిలో చెప్పబడింది. - "**తేన దశరూపకస్య యద్భాషాకృతం వైచిత్ర్యం కోహలాదిభిరుక్తం తదిహ మునినా సైన్ధవాఙ్గనిరూపణే స్వీకృతమేవ**" (అ.భా.III.పే.72).

సైన్ధవీమాశ్రితాం భాషాం జ్ఞేయం సైన్ధవకం బుధైః
రూపవాద్యాదిసంయుక్తం సైన్ధవం స్యాద్యథోద్ధతమ్. (నా.శా.31.513).

కోహలుని మతం అంగీకరించిన ప్రాచీనరచయితలు సామాన్యాభినయం ఆరు విధా లని అంగీకరించారు అని చెపుతూ అభినవగుప్తుడు ఒక శ్లోకం కూడ ఉదాహరించాడు -

"**కోహలమతానుసారిభిః వృద్ధైః సామాన్యాభినయస్తు షోఢా భణ్యతే. తథాహి**
కోహలః - "శిష్టం కామం మిశ్రం వక్రం సంభూతమేకయుక్తత్వమ్
సామాన్యాభినయే యత్ షోఢా విదురేతదేవ బుధాః ఇతి" (అ.భా.పే.146)

కోహలశాస్త్రప్రసిద్ధాలైన చిత్రాభినయాలు కూడ అభ్యసించాలి అని చెపుతూ అభినవగుప్తుడు సుమారు ముప్పై విషయప్రతిపాదకశ్లోకాలు ఉదాహరించాడు. (అ.భా.పే.289). కోహలుని మతం **భావప్రకాశనం**లో కూడ అనేక పర్యాయాలు ఉదాహరించబడింది. (చూ.పే.204.210, 236, 245, 251) ప్రాకృతసర్వస్వ కర్త యైన మార్కండేయుడు తాను ఆ గ్రంథాన్ని శాకల్య - భరత - కోహల - వరరుచి -

భామహ - వసంతరాజుల గ్రంథాలను పరిశీలించి రచించినట్లుగా గ్రంథప్రారంభంలో ఉన్న మూడవ శ్లోకంలో చెప్పాడు. దీనివల్ల భరతుని వలెనే కోహలుడు కూడ ప్రాకృత భాషలో ప్రాకృతాలను గూర్చి చెప్పినట్లు తెలుస్తూన్నది.

రసార్ణవసుధాకరంలో సింగభూపాలుడు **భరతుని** కుమారులైన శాండిల్య - కోహల - దత్తిల- మతంగులు నాట్యశాస్త్రగ్రంథాలు రచించా రని అన్నాడు.

అధేవిధంగా **రసరత్నప్రదీపికాకారుడు** తాను అధ్యయనం చేసిన గ్రంథాలను తద్రచయితలనూ గూర్చి చెప్పుతూ కశ్యప - కోహల - మతంగ - దత్తిల - విశాఖిల - నారద - తుమ్బురు - రావణులను పేర్కొన్నాడు. పాటలీపుత్రంలోని గణికలు కోరగా దత్తకుడు కామశాస్త్రంలోని వైశికప్రకరణం రచించి నట్లు **కామసూత్రం**లో చెప్పబడింది. **కుట్టనీమతం** 77, 122 శ్లోకాలలో దత్తకాచార్యుని పేరున్నది. **అభినవభారతి**లో ధ్రువను గూర్చిన ప్రకరణంలో దత్తిలాచార్యుని శ్లోకం ఉదాహరించబడింది. ఆతోద్యాలకు తాళాలకు సంబంధించిన ఘట్టంలో దత్తిలాచార్యుని పేరు చాల సార్లు చెప్పబడింది. **గంధర్వవేదసారం** అనే పేరు గల ఈ గ్రంథం లభ్యమౌతున్న దట.

మాతంగుడు వంశి మొదలైన సుషిరవాద్యాలలో నిపుణు డని దామోదరగుప్త డన్నాడు.

"**సుషిరస్వరప్రయోగే ప్రతిపాదనపణితో మతఙ్గమునిః**" (కుట్టనీమతం. 877)

అందుచేత ఇతడు అభినవగుప్తుని కంటె చాల ప్రాచీనుడు. **నాట్యశాస్త్రం** 30వ అధ్యాయంలో **అభినవభారతి**లో ఈ విధంగా చెప్పబడింది. మతంగుడు మొదలైన మునులు వెదురుకఱ్ఱతో చేసిన పిల్లనగ్రోవితో పూర్వం మహేశ్వరుణ్ణి సంతోషపెట్టారు. దీనికి వంశం అనే పేరు ప్రసిద్ధిలోనికి వచ్చింది. ఖదిరదారువుతో నిర్మించినా కూడ రంధ్రం ఉన్న ఏ గొట్టమైనా సుషిరాతోద్యం అని చెప్పవచ్చు : "**పూర్వం భగవన్మహేశ్వరా రాధనం మతఙ్గమునిప్రభృతిభిః వేణునా కృతమ్. తతో వంశ ఇతి ప్రసిద్ధః. వస్తుతస్తు ఛిద్రాత్మకసుషిరాభివ్యక్తస్వరవిశేషరూపతయైవాస్య ఉపయోగ ఇతి ఖాదిరాదినిర్మితం వ్యసనం భవత్యేవ. తథా చోక్తమ్ -**

"వంశే స్పష్టం యదా పూర్వం వంశసక్తా తు వైణవీ,
వంశాస్తు ఖదిరారోప్యాః శంశవాయత్క..." -- ఇతి".

పిల్లనగ్రోవి లోహంతో కూడ తయారుచేయవచ్చు నని తరవాత చెపుతూ మతంగుని ఒక శ్లోకం కూడ ఉదాహరించబడింది. "**తథా హి మతఙ్గమునినా**" - "**చత్వారో ధాతవో వంశః" ఇత్యాదినా ధాతువినియోగోఽపి ప్రదర్శిత ఏవ**". ముప్పైయవ అధ్యాయం 11వ శ్లోకంలో **అభినవభారతి**లో మతంగుని రెండు శ్లోకాలు ఉదాహరించబడ్డాయి.

సంగీతచూడామణిలో జగదేకమల్లుడు (క్రీ.శ. 1138 - 1150) మతంగ - భోజులు తనకు పూర్వం ఉన్న గొప్ప రచయితలు అని అన్నాడు. **సంగీత రత్నాకరం**లో చాలమంది రచయితల పేర్లు చెప్పబడ్డాయి. తద్వ్యాఖ్యాత యైన కల్లినాథుడు షడ్జాదిస్వరాల సార్థకత్వాన్ని మతంగుడు వివరించా డని చెప్పి (సం.ర. 1.3.24) **"సరిగాదీనాం మతఙ్గాభిమతః ఉద్ధారక్రమః ఉచ్యతే"** (సం.ర. 3.25) అంటాడు. మతంగ - నందికేశ్వరులు పన్నెండు మూర్ఛనలు అంగీకరించా రనీ (సం.ర. 1.4.9) **"సామవేదే గీతప్రధానే ఆవృత్తిషు అర్ధాః నాద్రియన్తే"** అని మతంగు డన్నా డనీ (సం.ర.I.8.13) కూడ కల్లినాథు డన్నాడు. భాషలను విభాషలను దృష్టిలో ఉంచుకొని మతంగుడు ఏడు గీతిక లంగీకరించాడు, భరతుడైతే మాగధి మొదలైన నాలుగు గీతికలనే అంగీకరించాడు అని కూడ కల్లినాథు డన్నాడు (సం.ర. II. 1.7) నాట్యశాస్త్రంలో భరతు డన్నమాట లివి -

"అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి గీతీనామపి లక్షణమ్,
ప్రథమా మాగధీ జ్ఞేయా ద్వితీయా చార్ధమాగధీ
సంభావితా తృతీయా చ చతుర్థీ పృథులా స్మృతా" (నా.శా. 29.76-72)

ఈ నాలుగూ **సంగీతరత్నాకరం**లో కూడ చెప్పబడ్డాయి (సం.ర.I.8.14-16) ఇక్కడ - **"అస్యా మగధోద్భవత్వాత్ మాగధీతి నిరుక్తిః మతఙ్గోక్తా"** అని కల్లినాథు డన్నాడు. మతంగుడు **బృహద్దేశి** అనే ఒక గ్రంథం రచించా డనీ దానిలోని 2500 శ్లోకాలు ఇప్పుడు లభిస్తున్నా యనీ కొందరు అంటున్నారు. ఈ **బృహద్దేశి**ని నాన్యదేవుడు భరతభాష్యంలో అనేక పర్యాయాలు పేర్కొన్నాడు. మనకిపుడు నందికేశ్వరరచిత మైన భరతార్ణవంలో కొంత భాగం మాత్రమే లభిస్తున్నది. నాలుగు వేల శ్లోకాలకు 800 శ్లోకాలు మాత్రమే, పదిహేను అధ్యాయాలలో లభిస్తున్నాయి.

వామనుని **కావ్యాలంకారసూత్రవృత్తి**లో విశాఖిలుడు కళలను గూర్చి గ్రంథం రచించినట్లు చెప్పబడింది (I. 3.7). **కుట్టనీమతం**లో కూడ విశాఖిలుని పేరు కనబడుతున్నది. -

"భరతవిశాఖిలదన్తిలవృక్షాయుర్వేదచిత్రసూత్రేషు,
పత్రచ్ఛేదవిధానే భ్రమకర్మణి **పుస్తసూత్ర**శస్త్రేషు" (123 శ్లో.)

లాస్యగానాన్ని విశాఖిలుడు ప్రచారం చేసినట్లుగా **అభినవభారతి**లో చెప్పబడింది. (అ.భా. I. పే. 199). **అభినవభారతి**లో విశాఖిలుని అభిప్రాయాన్ని ఉదాహరిస్తూ - **"తథా చ విశాఖిలాచార్యాః స్వరపదతాలసమవాయే గాంధర్వమితి"** (నా.శా. 20.10) అని చెప్పబడింది. ఒకచోట అభినవగుప్తుడు భరతునికి విశాఖిలుని గ్రంథంయొక్క పరిచయం ఉన్నట్లు సూచించాడు - **"ఏవకారేణ చతుష్ప్రహరణసత్రిప్రహరణమ్ అఙ్గులీనాం విభాగః**

ద్వే తృతీయా సమరేఖా చిత్రరేఖా ఇత్యాదికం విశాఖిలాచార్యాన్తరప్రోక్తం సర్వథైవ ధ్రువగానజ్ఞానవైకల్యోపయోగాత్ మయా నోక్తమ్ ఇతి సూచయతి" (నా.శా. 29.81-83) **"అత ఏవ శారీరవద్వంశ్యానామారోహణమివారోహణం వా ఇతి విశాఖిలా చార్యః"** (నా.శా. 30.3) అని మరొకచోట కూడ అభినవగుప్తుడు విశాఖిలుణ్ణి పేర్కొన్నాడు.

నాట్యశాస్త్రంమీద హర్షుడు లేదా శ్రీహర్షు డనే పండితుడు రచించిన **'వార్తికం'** ఉన్నట్లు కనబడుతుంది. "వార్తిక కృత్" అనీ "హర్షః" అనీ ఆతనిని చాల తరచుగా నాట్యశాస్త్రంలో పేర్కొనడం జరిగింది. (1) నాట్యమండపంలోని వివిధప్రదేశాలలో నిలుపవలసిన స్తంభాలను గూర్చి వార్తికకారుని అభిప్రాయం **నాట్యశాస్త్రం**లోని ఒకటిన్నర ఆర్యలలో చెప్పబడింది. (II. 97.98) తరవాత కూడ బహుశా వార్తికకారునివే ఇంకా నాలుగు ఆర్య లున్నాయి.

(2) మొదటి అధ్యాయం 84వ శ్లోకంలో **అభినవభారతి**లో వార్తికకారుని అభిప్రాయం చెప్పబడింది. నాల్గవ అధ్యాయం 267 - 68 శ్లోకాల దగ్గర

"వాచ్యానుగతేఽభినయే ప్రతిపాద్యేఽర్థే చ గాత్రవిక్షేపైః,
ఉభయోరపి హి సమానః కో భేదో నృత్తనాట్యగతః"

అని అంటూ చివరికి ప్రయోజనాన్ని పట్టి చూస్తే నృత్తనాట్యాలకి అంతగా భేదం లేదని వార్తికకారు డన్నట్లు చెప్పబడింది.

(నాట్యం అనగా రూపకవస్తుప్రయోగం, రూపకకథాప్రదర్శనం. దీనిలో కథా నిర్వహణం, గానం, నృత్యం - ఈ మూడు కలిసి ఉంటాయి. వివిధరూపకాలలో (నాటక ప్రకరణాదులలో) కథానిర్వహణానికే ప్రాధాన్యం ఉంటుంది. ఇతర రూపకాలలోను ఉపరూపకాలలోను గీత - నృత్యాలు ప్రధానంగా ఉంటాయి. నాట్య - నృత్య - నృత్తాల మధ్య కొంత భేదం ఉన్నట్లు చెప్పడం ఉంది. నాట్యంలో చాలమంది పాత్రలు పాల్గొంటారు. నృత్య - నృత్తాలు ఏకహార్యాలు, ఒక్క పాత్రచేతనే చేయబడతాయి.

"అవస్థానుకృతిర్నాట్యం .... దశధైవ రసాశ్రయమ్,
అన్యద్ భావాశ్రయం నృత్యం నృత్తం తాలలయాశ్రయమ్"

అని **దశరూపకం**లో చెప్పబడింఇ (I. 7-త9)

"పదార్థాభినయో నృత్యం డోమ్బీ శ్రీగదితాదిషు,
అఙ్గవిక్షేపమాత్రం యల్లయతాలసమన్వితమ్
తన్నృత్తమ్...." (పే.298) అనీ,

"నటకర్మైవ నాట్యం స్యాదితి నాట్యవిదాం మతమ్,

కరణైరఙ్గహారైశ్చ నిర్వృత్తం నృత్తముచ్యతే" (పే.45)

అనీ భావప్రకాశనంలో చెప్పబడింది. అనుకరణం అనేది ఈ మూడింటికీ సాధారణమైనది. **"తౌర్యత్రికం నృత్యగీతవాద్యం, నాట్యమిదం త్రయమ్"** అని **అమరకోశం**లో కూడ చెప్పబడింది.)

(4) **"ఏవమవాన్తరవాక్యైరుపదేశో రాగదర్శనీయేషు,**
సింహాదివర్ణకైర్వా క్వచిదప్యర్థాన్తరన్యాసాత్" (అ.భా.I.పే.174)

ఇత్యాది వాక్యాలలో కూడ వార్తికకారుని ఇదే అభిప్రాయం విశదీకరించబడింది.

(5) అయిదవ అధ్యాయంలోని ఏడవ శ్లోకంలో వార్తికకారుడు చెప్పిన 'పూర్వరఙ్గ' శబ్దార్థం, ఒక ఆర్య ఉదాహరింపబడ్డాయి – **"శ్రీహర్షస్తు రఙ్గశబ్దేన తౌర్యత్రికం బ్రువన్ నాట్యాఙ్గప్రయోగస్య తస్యైవ పూర్వరఙ్గతాం మన్యమానః పూర్వశ్చాసౌ రఙ్గశ్చ ఇతి సమాసమ్ అమంస్త. యదాహ –**

"దృష్టా యేవస్థార్థే (వస్త్వర్థే?) నాట్యే రఙ్గాయపాదభాగాః స్యుః
పూర్వం త ఏవ యస్మిన్ శుద్ధాః స్యుః పూర్వరఙ్గోఽ సౌ" (అ.భా.I.పే.211)

(6) అయిదవ అధ్యాయంలోని 8-15 శ్లోకాలలో పూర్వరంగాన్ని గూర్చిన ప్రసంగంలో వార్తికకారుని వాక్యాలు కొన్ని (గద్యరూపంలో) ఉదాహరించబడ్డాయి.

(7) ఐదవ అధ్యాయం 180 వ శ్లోకంలో **"యదాహ శ్రీహర్షః – అత ఏవ హాసో నామ కవిః కస్మింశ్చిన్నాటకే – దివం యాతశ్చిత్రజ్వరేణ కవిరిత ఏవాభివర్తతే; అశక్య మస్య పురతోఽ వస్థాతుమ్"** అని శ్రీహర్షుడు పూర్వరంగంలోని ప్రస్తావనను గూర్చి చెపుతూ అన్నాడని చెప్పబడింది. (అ.భా.I.పే.251)

మనం పైన చూచిన దానిని పట్టి **హర్షవార్తికం** అన్ని అధ్యాయాలకు సంబంధించి ఉంటుందనీ, చాల వరకు ఆర్యలలో రచింపబడి మధ్య మధ్య రూపకవాఙ్మయంనుంచి గ్రహించిన గద్యరూపోదాహరణాదులు కూర్చబడి ఉంటుందనీ ఊహించవచ్చును. **అభినవభారతి** రెండవ సంపుటం ప్రస్తావనలో రామకృష్ణకవి అంగహారాలకు సంబంధించిన వార్తికం లోని కొన్ని భాగాలు లభిస్తున్నా యని అన్నాడు. తోటకంలో విదూషకు డుండడు, నాటకంలో ఉంటాడు; ఇదే ఈ రెండింటికీ భేద మని హర్షుడు చెప్పి నట్లు **భావప్రకాశనం**లో చెప్పబడింది.

సుబంధువు అనే రూపకశాస్త్రకర్త ఉండేవా డనీ, అతడు నాటకాలను పూర్ణం, ప్రశాంతం, భాస్వరం, లలితం, సమగ్రం అని అయిదు విధాలుగా విభజించా డనీ **భావప్రకాశనం** (పే.,238) లో చెప్పబడింది. శారీరాభినయం ఆరు విధా లని

నాట్యశాస్త్రంలో (24.4) చెప్పబడింది. వాటిలో ఒకటి "నాట్యాయితం". ఇది 48వ శ్లోకంలో వివరించబడింది. దీని వ్యాఖ్యానంలో అభినవగుప్తుడు మహాకవి యైన సుబంధువు రచించిన **'వాసవదత్తానాట్యధార'** నాట్యాయితానికి ఉదాహరణం అని అన్నాడు – **"తత్రాస్య బహుతరవ్యాపినః బహుగర్భస్వప్నాయితతుల్యస్య నాట్యాయితస్యోదాహరణం మహాకవిసుబన్ధునిబద్ధో వాసవదత్తానాట్యధారాఖ్యః సమస్త ఏవ ప్రయోగః. తత్ర హి బిన్దుసారః ప్రయోజ్యవస్తుకే ఉదయనచరితే"**. ఈ మహాకవి సుబంధువు భావప్రకాశనం పేర్కొన్న రూపకశాస్త్రవప్రణీత యైన సుబంధువు ఒక్కరేనా వేరు వేరా అనేది తెలియదు.

నాన్యదేవుడు లేదా నాన్యపతి అనే మిథిలదేశరాజు రచించిన **భరతభాష్యం** లేదా **సరస్వతీహృదయాలంకారం** అనే గ్రంథం లిఖితగ్రంథరూపంలో ఉన్నది. దీనికి **భరతవార్తికం** అనే పేరు కూడ పుష్పికలో ఉన్నది. ఇది ఒక బృహద్గ్రంథంగా రచించడానికి ఉద్దేశింపబడినా పై పుస్తకంలో నాల్గు విధాల అభినయాలలో ఒకటైన వాచికాభినయం మాత్రమే ప్రతిపాదింపబడింది. ఇది ప్రధానంగా **నాట్యశాస్త్రం**లో 28 నుండి 33 వరకు ఉన్న అధ్యాయాలపై వ్యాఖ్య. ఈ రాజుకు రాజనారాయణు డని కూడ పేరు ఉన్నట్లు ఇతడు కీర్తిరాజుకు తమ్ముడు అన్నట్లు ఒక చోట చెప్పబడింది. ఇతడు **గ్రంథమహార్ణవం** అనే మరొక గ్రంథం కూడ రచించినట్లు చెప్పుకొన్నాడు. పదిహేడు అధ్యాయాలలో వాచికాభినయాన్ని వివరిస్తాను అని అంటూ ఇతడు ప్రతిపాద్యవిషయాల సూచిక ఇచ్చి ఉన్నాడు. ఇది భరతుని ప్రతీ శ్లోకానికీ వ్యాఖ్యరూపంలో లేదు. భరతుడు వందల కొలది స్థలాలలో ఉదాహరింపబడ్డాడు. ఒక మారు బృహత్కశ్యపుణ్ణి, ఒక మారు వృద్ధకశ్యపుణ్ణీ పేర్కొన్నాడు. బృహద్దేశిని, మతంగుణ్ణి, యాష్టికుని, విశాఖిలుని అనేక పర్యాయాలు ఉదాహరించాడు. ఇతడు ఇంకా నారదీయశిక్షావివరణకృత్, దేవరాజు, మేర్వాచార్యుడు, నందిమతం, స్వరసంహితాచార్యుడు, **యాజ్ఞవల్క్యస్మృతి**, తుంబురుడు, **కాలికాపురాణం**, **భాగవతపురాణం** ఇత్యాదులను కూడ ఉదాహరించాడు. అభినవగుప్తుణ్ణి చాల దగ్గరగా అనుసరించినా ఆతని పేరు మాత్రం ఒకటి రెండు సార్లు మాత్రమే నిర్దేశించారు. పాణిని – నారద – ఆపిశలులను కూడ పేర్కొన్నాడు. కొన్ని చోట్ల భరతునినుంచి తాను విభేదిస్తున్నట్లు చెప్పాడు. – **"గాన్ధారగ్రామశ్చ భరతేన అలౌకికశ్చాత్ర ఉపదర్శితః. అస్మాభిశ్చ ఆగమానుసారేణ దర్శితః"; "భరతాచార్యస్యాస్య శాస్త్రే ... ప్రయోగాగతా అస్మాభిశ్చ కశ్యపమతఙ్గతుమ్బురవిశాఖిలాద్యాచార్యనిఖిలమునివచనాత్"**. ఈ గ్రంథం రచించిన నాన్యదేవుడు క్రీ.శ.1100 ప్రాంతంలో ఉండి ఉంటాడు.

సాగరనంది రచించిన **నాటకలక్షణరత్నకోశం**. చివర –

"శ్రీహర్షవిక్రమనరాధిపమాతృగుప్తగర్గాశ్మకుట్టనఖకుట్టకబాదరాణామ్,

ఏషాం మతేన భరతస్య మతం విగాహ్య ఘుష్టం మయా సమనుగచ్ఛత రత్నకోశమ్'

అనే శ్లోకం ఉంది. దీనిని పట్టి ఈ ఏడుగురు రచయితలు భరతుని నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానాలు వ్రాసి ఉంటారు లేదా తమ గ్రంథాలలో **నాట్యశాస్త్రం**లోని విషయాలను చర్చించి ఉంటారని చెప్పవలసి ఉంటుంది.

భరతుని **నాట్యశాస్త్రా**నికి **భరతసూత్రం** అనే పేరు కూడ ప్రసిద్ధంగా ఉంది. అభినవగుప్తాదులు ఈ పేరుతో **నాట్యశాస్త్రాన్ని** నిర్దేశించారు. వ్యాకరణ – న్యాయ – వేదాంతాదిశాస్త్రాలలో ఉన్న సంప్రదాయాన్ని అనుసరించి ఈ **భరతసూత్రం**మీద వార్తికాలు భాష్యాలు అనే పేర్లతో కూడ వ్యాఖ్యలు బయలుదేరి ఉంటాయి.

ఈ బాలానందినీవ్యాఖ్యను గూర్చి :- కొన్ని అలంకారశాస్త్రగ్రంథాలకు నేను తెలుగులో వ్యాఖ్యానాలు రచించే కాలంలో కొందరు మిత్రులు "అలంకారశాస్త్రానికి మూలగ్రంథంగా పండితు లందరూ అంగీకరించిన అతిప్రాచీన మైన భరతమునిప్రణీత **నాట్యశాస్త్రా**నికి కూడ మీరు తెలుగులో వ్యాఖ్యానం రచిస్తే బాగుంటుంది" అనేవారు. నాకు కూడ ఆ అభిలాష ఉండేది కాని కార్యరూపం దాల్చలేదు. దాదాపు ఇరవైయైదు – ముప్పై సంవత్సరాల క్రితం జరిగిన ఆ విషయం విస్మృతప్రాయం అయిపోయింది.

అయితే – ఆంధ్రదేశంలో రంగస్థలనాటకప్రయోగప్రచారాలకి నిరంతరమూ ప్రయత్నిస్తూ, **'నాటక కళ'** అను మాసపత్రిక కూడ స్థాపించి నడుపుతున్న **'కళామిత్ర'** శ్రీ ఆర్.రవిశర్మ గారు ఈ మధ్య ఏడెనిమిది మాసాల క్రితం మా యింటికి వచ్చి – "నాట్యశాస్త్రానికి సులభమైన తెలుగు అనువాదం ఏదీ లభించడంలేదు. అలాంటి అనువాదం రచించవలసినదిగా మిమ్మల్ని కోరడానికి వచ్చాను" అన్నారు. "వయోభారం చేతా, ఆరోగ్యం కూడ తదనుయాయిగా ఉండడంచేతా ఆ కార్యం నేను నిర్వహించజాలను" అని నేను చెప్పబోయే లోగానే ఆయన ఇంకా ఇలా అన్నారు – "ఆంధ్రదేశంలోని రెండు మూడు ప్రధాననగరాలలో శ్రీత్యాగరాజస్వామి ఉన్నతశిలా విగ్రహాలు స్థాపించాలని, సంకల్పించి, నేను నా మిత్రులు కొందరూ కలిసి, ఈ సంకల్పం సఫలం అయేటట్లు శ్రీశృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులు పొందడానికై శృంగేరి వెళ్లి జగద్గురు శ్రీభారతీతీర్థ స్వాములవారిదర్శనం చేసికొన్నప్పుడు వారితో నాట్యశాస్త్ర వ్యాఖ్యానాన్ని గూర్చి కూడ ప్రస్తావించగా వారు, మీ పేరు చెప్పి 'ఆయన హైదరాబాదులోనే ఉన్నారు కదా. ఆయనని అడగండి; వ్యాఖ్యానం రచిస్తారు. నా మాటగా కూడ చెప్పండి' అన్నారు. అందుచేతనే మీతో నాకంతగా పరిచయం లేకపోయినా వచ్చాను".

ప్రారంభంలో సందేహించినా –

"ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోఽనుధావతి" (ఉత్తరరామచరితం)

"ఋషుల మాటల వెనుకనే అర్థం పరుగిడుతుంది" అను భవభూతిసూక్తి మనస్సులో స్ఫురించి ఉపవేదాలలో ఒకటిగా ప్రసిద్ధమైన ఈ **నాట్యవేదా**నికి తెలుగులో యథాశక్తిగా వ్యాఖ్య రచించి తెలుగువారికి అందించడం అనే ఈ సత్కార్యాన్ని జగద్గురువుల ఆదేశమే పూర్తిచేయిస్తుంది అను విశ్వాసంతో ఈ కార్యక్రమం ప్రారంభించి ఏప్రిల్ 30 తారీకున పూర్తి చేయకలిగాను.

నాట్యశాస్త్రం సకలభారతదేశంలో అధికప్రచారం గల గ్రంథం అవడంచేత, దాదాపు 2500 సంవత్సరాల కాలంలో వేలకొలది లేఖకుల చేతులలో అనేక పాఠ – అక్షరాది దోషాలకు, వ్యాఖ్యాతృ – పాఠకుల చేతులలో ప్రక్షిప్తపాఠాలకూ నిలయంగా ఏర్పడింది. దీనికి తోడు ఎన్నో గ్రంథపాతాలతో దురవగాహ మైపోయినది. ప్రస్తుతం మనకు లభిస్తున్న ఒకే ఒక ప్రాచీనవ్యాఖ్యానం **అభినవభారతి.** అది కూడ అనేకమైన గ్రంథపాతాలతో, అక్షర – పదదోషాలతో చాలచోట్ల అస్పష్టార్థంగానే ఉంది. అందుచేతనే దీని ప్రథమ సంపాదకుడైన రామకృష్ణకవి – "అభినవగుప్తుడే స్వర్గంనుంచి దిగి వచ్చి ఈ లిఖితప్రతులను చూచినా, మూలపాఠాన్ని అంతసులభంగా నిర్ణయింపజాలడు" అన్నారు.

"అభినవగుప్తుని వ్యాఖ్యానరీతియే విచిత్రంగా ఉంటుంది. ఇతర వ్యాఖ్యానాల వలె చెప్పవలసిన అర్థం ప్రత్యక్షంగా (Directly) చెప్పకుండా శైవదర్శన – ఆగమ – తంత్రాదులలో తన కున్న అసాధారణమైన పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ అసలు విషయం నుంచి దూరంగా వెళ్లిపోతూంటాడు. ఘోష్ అన్నట్లు – కొన్ని చోట్ల ఆయన ఏమి చెప్పదలచాడో ఆయనకే తెలియదేమో అన్నట్లు కనబడుతుంది. ఉదాహరణకి – **'ద్విభూమి'** అను పదానికి అర్థం విషయంలో నాలుగు అభిప్రాయాలు చెప్పి తన అభిప్రాయం ఏమో సప్రమాణంగా చెప్పలేదు. అదే విధంగా **'కుతప'** శబ్దానికి ఒక చోట "గాయకుల, సంగీతవాద్యవాదకుల సముదాయం (group)" అనీ, మరొక చోట "నాలుగు విధాలైన వాద్య సాధనాలు" అనీ అర్థం చెప్పాడు .... ఇలాంటి లోపాలు కొన్ని ఉన్నా నాట్యశాస్త్రరత్న భాండాగారం తెరవడానికి **అభినవభారతి** ఒక్కటే మన కున్న తాళం చెవి (key)."

(Dr. R.S. Nagar, Introduction to N.S. Part-I)

అయితే – ఇలాంటివి చాల తక్కువే ఉన్నాయని ప్రొ. ఘోషే అన్నారు. నిజానికి – కొన్ని పదాలు వేరు వేరు అర్థాలలో ప్రయోగించడం నాట్యశాస్త్రంలోనే ఉంది. (పు.శ్రీ.రా.)

నాట్యశాస్త్రంలోని భాష పాణినివ్యాకరణానికి లొంగిన భాష కాదు. బహుశా ఈ గ్రంథం రచించేనాటికి పాణినివ్యాకరణం పూర్తిగా పండితజనామోదం పొంది ఉండక పోవచ్చు. పూర్వం పాణినీయులకీ, కాతంత్రవైయాకరుణులకీ తరచు తీవ్రమైన కాకోలూకీయం జరుగుతూండే దని **పద్మప్రాభృతక** భాణం వంటి కొన్ని ప్రాచీనగ్రంథాల

ద్వారా తెలుస్తూన్నది. నాట్యశాస్త్రకారునికి పాణినీయంతో పరిచయమే లేకపోవచ్చు కూడ. అందుచేతనే విశేష్య - విశేషణాలను భిన్నలింగ - వచనాదులలో ప్రయోగించడం, క్రియాపదాలలో కాలనియమాలను సరిగా పాటించకపోవడం, సమస్తపదాలలో పౌర్వాపర్యవ్యత్యాసం, సంధినియమాలు మరొక విధంగా ఉండడం మొదలైన అనేకమైన అపాణినీయరీతులు దీనిలో కనబడతాయి.

నాట్యశాస్త్రంలోని పద్నాల్గవ అధ్యాయంలో సంస్కృతవ్యాకరణానికి సంబంధించిన కొన్ని విషయాల చర్చ ఉంది. అదంతా ఏవో **ప్రాతిశాఖ్యలను**, ప్రాచీనవ్యాకరణాలను అనుసరించి చేసి నట్లు కనబడుతుంది. సంస్కృతధాతువులు ఐదువంద లనీ, అవి ఇరవైఎనిమిది గణాలుగా (ఇది ఘోష్‌గారి అభిప్రాయం. 'ఐదు గణాలుగా' అని మా అభిప్రాయం. పు.శ్రీ.రా). విభక్తములై ఉన్నాయనీ ఈ ఘట్టంలో చెప్పబడింది. అయితే ఇది ఏ వ్యాకరణం ప్రకారం చెప్పబడిందో తెలియదు. పాణినివ్యాకరణం ప్రకారమైతే మొత్తం ధాతువులు దాదాపు రెండు వేలు; అవి పది గణాలుగా విభక్తములయి ఉన్నాయి. ఈ విషయా లన్నీ దృష్టిలో ఉంచుకొని వ్యాఖ్యాతలు నాట్యశాస్త్రశ్లోకాదులకు అర్థం చెప్పవలసి ఉంటుంది.

డా. మానవల్లి రామకృష్ణకవి గారి తరువాత అంత సుదీర్ఘమైన పరిశ్రమచేసి నాట్యశాస్త్రానికి సంబంధించిన ఎన్నో పాఠాలను పరిశీలించి సవరించి, ఆంగ్లభాషలో అనువాదం కూడ సంతరించినవారు ప్రొ. మనోమోహన్‌ఘోష్. ఏడెనిమిది సంవత్సరాలు శాంతినికేతనంలో 'విశ్వకవి' రవీంద్రనాథటాగూరు గారి సంనిధిలో ఉన్న ఈయన ఆయన ప్రేరణచేత 1924లో నాట్యశాస్త్రాధ్యయనం ధ్రువాధ్యాయంలో ఉన్న ప్రాకృతశ్లోకాలలోని ప్రాకృతాల స్వరూపస్వభావాల పరిశీలనతో ప్రారంభించి, తాను పరిశోధించిన **నాట్యశాస్త్రం** మూలం రెండు సంపుటాలలోను, ఎన్నో విమర్శాత్మకవిషయాలతో కూర్చిన ఆంగ్లభాషానువాదం రెండు సంపుటాలలోను, విస్తృతమైన ఇంట్రడక్షన్స్‌తో 1962 నాటికి పూర్తిగా ప్రకటించారు. ఈలోగా అనేకమైన పరిశోధనాత్మకమైన పత్రాలు, **అభినయదర్పణాదులకు** ఆంగ్లానువాదాలు కూడ ప్రకటించారు.

"భాసుని రూపకాలలోను, నాట్యశాస్త్రంలోను ఉన్న ప్రాకృతభాష ఒక స్వతంత్రభాష కాదు; ఆ కాలంలో సంస్కృతమే జనసామాన్యభాషగా ఉండడంచేత ఆ యా ప్రాంతాలలో నివసించే ఉచ్చారణభేదాదులను పట్టి మార్పులు చెందిన సంస్కృతభాషనే 'ప్రాకృతం' అనేవారు. అందుచేత భాసుని రూపకాలలోని ప్రాకృతాన్ని పట్టి అవి క్రీ.పూ. 350 ప్రాంతానికి చెందినవి" అను డా. పుసాల్కర్ గారి అభిప్రాయంతో ఏకీభవిస్తూ - "భాసునికి తెలిసిన ఈ **నాట్యశాస్త్రం** క్రీ.పూ. 500 లకు చెందిన దని నిస్సంశయంగా చెప్పవచ్చును" అని ప్రొ.ఘోష్ ప్రతిపాదించారు -

"We are in complete agreement with him (Dr. Pusalkr) when

he concludes :

"From the flowing tone of Bhasa's Sanskrit and the conversational style of his dialogues which are short, easy, graceful and colloquial we are inclined to think that Sanskrit was a spoken language in Bhasa's time and so we place him after Panini, before the later's grammer got a strong foothold, and probably before Katyatyana (350 B.C.)"

- quoted from Dr. Pusalkar's work on Bhasa by Prof. M. Ghosh

"But the Prakrt of the plays of Bhasa, as they have reached us, needs some comments ... The Prakrt of the dramas was always in the state of flux. In the beginning, the Prakrt of the dramas was not considered a seperate langauge, but a mode of speaking, and such a condifion prevailed probably in the time of Panini, and even continued for some time after him. Most probably the original orthography of Bhasa's Prakrt was not different from that of Sanskrit and the available Prakrt passages of Bhasa speak of the date of the MSS, tradition they followed, rather that of the dramatist, hence there is no bar to place him between 400 and 350 B.C, just before Kautilya (350 B.C.) who made a quotation from a play of his. Under these circumstances the most probable date for the NS. becomes about 500 B.C. because he was known to Bhasa".

(Introduction to Volume I of Translation PP IXIV, IXV)

పాణిని క్రీ.పూ. నాల్గవ శతాబ్దికి చెందినవా డని పాశ్చాత్యపండితులు అంటారు. ఆయన క్రీ.పూ. ఏడవ శతాబ్దానికి చెందినవా డని భారతీయవిమర్శకుల నిర్ణయం. పాణినికాలమూ, **నాట్యశాస్త్ర** కాలమూ కొంచెం ఇటు అటూ జరిగితే పాణిని పేర్కొన్న రెండు నటసూత్రాలలో ఒకటి మన **నాట్యశాస్త్రమే** కావచ్చునేమో! ప్రాచీనశాస్త్రరచయితల అసలు పేర్లు ఏవో తెలియక పోవడానికి ఎన్నో ఉదాహరణ లున్నాయి. ఉదాహరణకి - 'పాణిని' అనేదే పణినపుత్రు డను అర్థంలో ఉపయోగించిన పదం. ఈయన అసలు పేరు మరొక టేదో అయి ఉండవచ్చు. అందుచేతనే **నాట్యశాస్త్రంలో** అపాణినీయ ప్రయోగా లుండడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. **నాట్యశాస్త్రం** ఎంత ప్రాచీనమైనదో చెప్పడానికి ఇక్కడ ఈ విషయం అంతా చెప్పడం జరిగింది.

'బాలానందినీ' రచనకు ఈ క్రింది **నాట్యశాస్త్రం** పుస్తకాల సాహాయ్యం తీసికొనబడింది.

1. **అభినవభారతి**తో పరిమళపబ్లికేషన్స్, ఢిల్లీవారు నాలుగు సంపుటాలలో

ప్రచురించినది. ఇది పూర్తిగా గాయక్వాడ్ ఎడిషన్ అనుసరించి డా. రవిశంకర్ నాగర్ సంపాదించినది. ద్వితీయసంస్కరణం - 1988.

2. ప్రొ. మనోమోహన్‌ఘోష్ సంపాదించినది. ఆంగ్లానువాదంతో నాలుగు సంపుటాలలో ఛౌఖంభా సాన్‌స్క్రిట్ సీరీస్, వారణాసివారు ప్రచురించినది.

3. డా. బాబూలాల్ శుక్ల శాస్త్రి గారి హిందీ అనువాదాదులతో, నాలుగు సంపుటాలలో చౌఖంభా పబ్లికేషన్స్, వారణాసివారు ప్రచురించినది. పునర్ముద్రణం 2009. (ఇది ఘోష్‌గారి ఎడిషన్‌ను అనుసరించినది).

4. డా. సుధా రస్తోగీ రచించిన హిందీఅనువాదం. 1-10 అధ్యాయాలు మాత్రం. కృష్ణదాస్ అకాడమీ, వారణసి, 1989. (గాయక్వాడ్ ఎడిషన్ ను అనుసరించినది).

మా వ్యాఖ్యానంలో అధ్యాయాలసంఖ్య, వాటి పేర్లు మొదలైన విషయాలలో **అభినవభారతీ** సహిత **నాట్యశాస్త్రం** అనుసరించబడింది. అభినవగుప్తాచార్యుడు ఈ శాస్త్రంలో 36 అధ్యాయా లున్నా యని చాల చోట్ల చెప్పి ఉన్నా చివరిదైన 36 వ అధ్యాయం రెండుగా విభజించి 37 వ అధ్యాయానికి కూడ వ్యాఖ్య వ్రాసి సమాప్తి చేసి నట్లు ముద్రితపుస్తకం ద్వారా తెలుస్తున్నది. బహుశా ఈ మార్పు ఏ లేఖకులో చేసి ఉంటారు. మా వ్యాఖ్య ప.ప. ముద్రిత పుస్తకాన్నే అనుసరించింది. అదే విధంగా మొదటి ఇరవై అధ్యాయాల వ్యాఖ్య. ముప్పై యైదవ అధ్యాయం వ్యాఖ్య, మధ్యమధ్య ఇతర ప్రతుల సాహాయ్యం తీసికొన్నా ప్రధానంగా అ.భా.సహిత పుస్తకాన్నే అనుసరించి నడిచింది. మిగిలిన అధ్యాయాల వ్యాఖ్యకు ఘోష్ గారి పుస్తకము. అత్యల్పమైన భేదంతో దానినే అనుసరించిన డా. శుక్లగారి హిందీ అనువాదసహితపుస్తకము బాగా సహకరించాయి. నాట్యశాస్త్రస్వరూపం తెలిసికొనడానికి ఈ గ్రంథం కొంతవరకైనా జిజ్ఞాసువులైన తెలుగువారికి ఉపకరించగలదని ఆశిస్తున్నాను.

డా. (శ్రీమతి) పెండ్యాల **సీతాభవాని** ఈ పుస్తకం ప్రాగ్రూపాలు (ప్రూఫులు) దిద్దడంలో చాల సహకరించింది. పుస్తకాకారాదినిర్ణయం, ముద్రణపర్యవేక్షణ, ఛాయా చిత్రగ్రహణము మొదలైన బాధ్యత లన్నీ తమపైవేసికొని, గణిత - భౌతికశాస్త్ర విద్వద్వతంసులు **శ్రీ ఉప్పులూరి కామేశ్వరరావు** గారు తమ అమూల్యమైన కాలాన్ని ఈ పనులకై వెచ్చించారు.

ప్రసిద్ధ నాట్యాచార్యులు **శ్రీ దండిభొట్ల వైకుంఠ నారాయణమూర్తి** గారి వద్ద నాట్యవిద్య నేర్చిన **చి॥ కుమారి ఝాన్సీ**, చి॥ కుమారి **ఫణికుమారీ**, చి ॥ **లక్ష్మీనారాయణ** తమ గురువుల సమక్షంలో ప్రదర్శించిన 'కరణ' **'హస్తముద్ర'**ల చిత్రాలు ఈ పుస్తకానికి అపూర్వమైన శోభను చేకూర్చి పాఠకుల హృదయాలలో **నాట్యశాస్త్రం** విషయంలో కుతూహలాన్ని ఇనుమడింపచేసేవిగా ఉన్నాయి. అర్థాపేక్ష లేకుండా కేవలం కళారాధన

దృష్టితో ఆచార్య - శిష్యులు చేసిన ఈ శోభాసంవర్ధనం చాల ఆనందదాయకమైనది. అనేక ధార్మిక - సాంస్కృతిక సంస్థలతో సంనిహిత సంబంధం కలిగి తత్సంవర్ధకులుగా కూడ ఉన్న వదాయన్యశేఖరులు **శ్రీ ముసునూరి చంద్రశేఖరరావుగారు** ఈ నాట్యచార్యు లతో మా పరిచయానికి కారణ భూతులు.

నాట్యశాస్త్రంలోనే కాక నాట్యనృత్యనృత్తాదుల ప్రయోగంలో కూడ నిష్ణాతులుగా విఖ్యాతి గాంచిన **శ్రీ మునుకుంట్ల సదాశివ** గారితో మాకు పరిచయం కలగడం నటరాజ చోదనాకృతం. మా అభ్యర్థనను మన్నించి వీరు తమ అమూల్యమైన సమయం వెచ్చించి చేసిన పర్యవేక్షణ ఈ చిరంజీవులు చేసిన కరణముద్రావిన్యాసాలకు ప్రామాణికత్వాన్ని సమకూర్చింది.

శ్రీ 'సమంత గ్రాఫిక్స్' సోదరులు శ్రీకృష్ణ, **పవన్‌కుమారులు**, యథాపూర్వంగా డి.టి.పి. కార్యం, అతిశీఘ్రంగా, శ్రద్ధాపూర్వకంగా నిర్వహించారు. **'సంహిత గ్రాఫిక్స్'** అధిపతి శ్రీ నరేంద్ర గారు ఈ పుస్తకాన్ని సహృదయు లందరూ మెచ్చుకొనే రీతిలో లాభదృష్టి లేకుండా, అతిమనోహర మైన ఆకారంతో తీర్చిదిద్ది, తయారుచేశారు. వీరందరికీ - **"విప్రస్తుష్టః శ్లోకమేకం దదాతి"** (విప్రుడు సంతోషిస్తే మాత్రం ఏమిస్తాడు! ఒక శ్లోకం ఇస్తాడు) అన్నట్లు, అభినందన పూర్వకశుభాకాంక్షలు తెలుపుతున్నాను.

మహామాహేశ్వరులు, శ్రీమదభినవగుప్తాచార్యుల రెండు శ్లోకాలతో ఈ ప్రస్తావన ముగిస్తున్నాను.

ఊర్ధ్వోర్ధ్వమారుహ్య యదర్థతత్త్వం ధీః పశ్యతి శ్రాన్తిమవేదయన్తీ,
ఫలం తదాద్యైః పరికల్పితానాం వివేకసోపానపరమ్పరాణామ్.

అభినవభారతి, షష్ఠాధ్యాయం. రససూత్రవ్యాఖ్య సందర్భంలో.

(ఒక విద్వాంసుని) బుద్ధి, అలసట అనేది ఎరుగకుండా, పై పైకి ఎక్కి ఒక విషయానికి సంబంధించిన తత్త్వాన్ని చూడకలుగుతూన్న దంటే, పూర్వులు ఏర్పరచిన వివేచనాలు (series of anlytical discussions) అనే సోపానపరంపరల (మెట్ల పంక్తుల) వల్ల లభించిన ఫలమే అది.

"సజ్జనాన్ కవిరసౌ న యాచతే; హ్లాదనాయ శశభృత్ కిమర్థితః,
నాపి నిన్దతి ఖలాన్, ముహుర్ముహుః ధిక్కృతోఽపి న హి శీతలోఽనలః."

ఈ కవి సజ్జనులను ప్రార్థించడు; ఎవరైనా సంతోషపెట్ట మని చంద్రుణ్ణి ప్రార్థిస్తున్నారా! దుష్టులను నిందించడు; ఎంత నిందిస్తే మాత్రం నిప్పు చల్లబడుతుందా!

హైదరాబాదు — పుల్లెల శ్రీరామచంద్రుడు

6-7-2014

శ్రీః

నాట్య – నృత్య – నృత్తాల వైశిష్ట్యము

దేవానామిదమామనన్తి మునయః కాన్తం క్రతుం చాక్షుషం
రుద్రేణేదముమాకృతవ్యతికరే స్వాఙ్గే విభక్తం ద్విధా,
త్రైగుణ్యోద్భవమత్ర లోకోచరితం నానారసం దృశ్యతే
నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధకమ్.

నాట్యం అనేది కళ్లతో చూచి ఆనందించే మనోహరమైన దేవయజ్ఞం, దేవతారాధన, అని మునులు అంటారు. రుద్రుడు, ఈ నాట్యాన్ని, తాండవం, (ఉద్ధతనృత్యం) లాస్యం (లలితనృత్యం) అని రెండు విధాలుగా విభజించి, (వామభాగంలో) ఉమతో కలిసిఉన్న తన శరీంలో ధరించాడు. సత్త్వ – రజస్ – తమోగుణాల ప్రభావంచేత జరిగే, వివిధరసాలకు నిలయమైన సకలలోకాల చరిత్ర, జీవనవిధానం, దీనిలో చూడవచ్చు. ఈ విధంగా, నాట్యం, అది అవడానికి ఒక్కటే అయినా, వేరు వేరు అభిరుచులు గల మనుష్యులకు అనేకవిధాల వినోదం కలిగిస్తుంది.

– మాళవికాగ్నిమిత్రము

క్షితౌ రత్నచ్ఛాయాఫలనముదకే వీచిలలితం
శిఖిన్యర్చిఃప్రేఙ్ఖా, సహజగతివైచిత్ర్యమనిలే,
తడిత్క్రీడా వ్యోమ్నీత్యకృతసుభగః పఞ్చసు పరః,
ప్రవిష్టో భూతేషు ప్రభవతి హి నృత్తస్య మహిమా.

– జాయసేనాపతివిరచితనృత్తరత్నావళి

భూమిలో రత్నకాంతుల తళతళలు, నీటిలో తరంగాల లలితచలనము; అగ్నిలో జ్వాలల ఊగులాటలు. వాయువులో సహజమైన వింత వింత నడకలు, ఆకాశంలో మెరుపుదీగల ఆటలు – ఈ విధంగా సహజసుందరమైన నృత్తకళామహిమ పంచ భూతాలలో ప్రవేశించింది.

[1]జాయసేనాపతి రచించిన నృత్తరత్నావళి 1-4

– [1]ఈయన కాకతీయచక్రవర్తి గణపతిదేవుని బావమరిది, గజసేనాపతి

శ్రీః

ఓం స్వస్తి శ్రీగణేశాయ నమః

నాట్యశాస్త్రము

నత్వా శ్రీతాతపాదాదీన్ సర్వశాస్త్రార్థసద్గురూన్,
భరతస్య మునేర్నాట్యశాస్త్రమాస్త్రాంవివృణ్మహే.

ప్రథమాధ్యాయము

నాట్యోత్పత్తి

యస్తన్మయాన్ హృదయసంవదనక్రమేణ
ద్రాక్సిత్రశక్తిగణభూమివిభాగభాగీ,
హర్షోల్లసత్వరవికారజుషః కరోతి
వన్దేతమాం తమహమిన్దుకలావతంసమ్. 1

షడ్వింశ (షట్త్రింశ) కాత్మక జగద్గగనావభాస
సందిన్మరీచిచయచుమ్బితబిమ్బశోభమ్,
షట్త్రింశకం భరతసూత్రమిదం వివృణ్వన్
వన్దే శివం శ్రుతితదర్థవివేకి ధామ. 2

విశ్వబీజప్రరోహార్థం మూలాధారతయా స్థితమ్,
ధర్తుం శక్తిమయం వన్దే ధరణీరూపమీశ్వరమ్. 3

మూ. ప్రణమ్య శిరసా దేవౌ పితామహమహేశ్వరౌ,
నాట్యశాస్త్రం ప్రవక్ష్యామి బ్రహ్మణా యదుదాహృతమ్. 1

శ్రీమదభినవగుప్తాచార్యాః

తాత్పర్యం : బ్రహ్మదేవునకు మహేశ్వరునకు శిరస్సు వంచి నమస్కరించి బ్రహ్మదేవుడు బోధించిన నాట్యశాస్త్రాన్ని నా మాటలలో చెపుతాను.

మూ. సమాప్తజప్యం వ్రతినం స్వసుతైః పరివారితమ్,
అనధ్యాయే కదాచిత్తం భరతం నాట్యకోవిదమ్. 2

మునయః పర్యుపాస్యైవమాత్రేయప్రముఖాః పురా,
పప్రచ్ఛుస్తే మహాత్మానో నియతేన్ద్రియబుద్ధయః. 3

తా. పూర్వం ఒక అనధ్యాయదివసాన (శిష్యులకు క్రొత్త పాఠాలు చెప్పకూడని రోజున) నాట్యశాస్త్రప్రవీణుడు, నియమవంతుడు అయిన భరతముని జపం పూర్తి చేసికొని

(40) సుకేరలుడు (41) ఋజుకుడు (42) మండకుడు (43) శంబరుడు (44) వంజులుడు (45) మాగధుడు (46) సరలుడు (47) కర్త (48) ఉగ్రుడు (49) తుషారుడు (50) పార్షదుడు (51) గౌతముడు (52) బాదరాయణుడు (53) విశాలుడు(54) శబలుడు (55) సునాభుడు (56) మేషుడు (57) కాలియుడు (58) భ్రమరుడు (59) పీఠముఖ ముని (60) నఖకుట్టుడు (61) అశ్మకుట్టుడు (62) షట్పదుడు (63) ఉత్తముడు (64) పాదుకుడు (65) ఉపానహుడు (66) శ్రుతి (67) చాషస్వరుడు (68) అగ్నికుండుడు (69) ఆజ్యకుండుడు (70) వితండ్యుడు (71) తాండ్యుడు (72) కర్తరాక్షుడు (73) హిరణ్యాక్షుడు (74) కుశలుడు (75) దుస్సహుడు (76) లాజుడు (77) భయానకుడు (78) బీభత్సుడు (79) విచక్షణుడు (80) పుండ్రాక్షుడు (81) పుండ్రాననుడు (82) అసితుడు (83) సితుడు (84) విద్యుజ్జిహ్వుడు (85) మహాజిహ్వుడు (86) శాలంకాయనుడు (87) శ్యామాయనుడు (88) మాఠరుడు (89) లోహితాంగుడు (90) సంవర్తకుడు (91) పంచశిఖుడు (92) త్రిశిఖుడు (93) శిఖుడు (94) శంఖవర్ణముఖుడు (95) షండుడు (96) శంకుకర్ణుడు (97) శక్రనేమి (98) గభస్తి (99) అంశుమాలి (100) శఠుడు (101) విద్యుతుడు (102) శతజంఘుడు (103) రౌద్రుడు (104) వీరుడు – అను నూర్గురు పుత్రులను, బ్రహ్మదేవుని ఆజ్ఞను అనుసరించి నేను వాని వాని అర్హతలను బట్టి, అనగా ఎవడు ఏ భూమికను చక్కగా నిర్వహించగలడో వానికి ఆ భూమికను ఇచ్చి, నాట్యశాస్త్రప్రయోగంలో నియమించాను. ఎవడు ఏ కర్మయందు నిపుణుడో అతనిని ఆ కర్మయందు నియమించాను.

వి. ఇక్కడ భరతపుత్రుల సంఖ్య నూరు కాక నూటనాలుగు వచ్చినది. స్థూలంగా నూరుగురు అన్నాడు అని సమాధానం చెప్పుకోవాలి. లేదా 'మునిమ్', 'తాపసమ్', 'షణ్డమ్' 'శుచిమ్' అను పదాలను ప్రక్కనున్నవాటి విశేషణాలుగా గ్రహించి సంఖ్య సరిపెట్టుకోవాలి.

ఏమైనా వీరందరూ భరతముని పుత్రులు కాకపోవచ్చును. కాలాంతరానికి సంబంధించిన కోహలుడు, దత్తిలుడు, తండు వంటి కొందరు రచించిన, నాట్యశాస్త్రంలోని కొన్ని విషయాలకు సంబంధించిన కొన్ని గ్రంథాల పేర్లు, కొన్ని వాక్యాలు ప్రాచీన గ్రంథాలలో కనబడుతున్నాయి. అందుచేత అలాంటివాళ్ల పేర్లు కూడ ఎవరో ఇక్కడ భరతపుత్రుల పేర్లలో చేర్చి ఉంటారు అని కొందరి అలంకారశాస్త్రేతిహాసనిర్మాతల అభిప్రాయం.

మూ. భారతీం సాత్త్వతీం చైవ వృత్తిమారభటీం తథా,
సమాశ్రితః ప్రయోగస్తు ప్రయుక్తో వై మయా ద్విజాః. 41

తా. మునులారా! నేను నాట్యంలో భారతి, సాత్త్వతి, ఆరభటి అను వృత్తులను

ఆశ్రయించి ప్రయోగం చేశాను. (వీటి స్వరూపం ముమ్ముందు తెలియగలదు).

మూ. పరిగృహ్య ప్రణమ్యాథ బ్రహ్మా విజ్ఞాపితో మయా,
అథాహ మాం సురగురుః కైశికీమపి యోజయ. 42

యచ్చ తస్యాః క్షమం ద్రవ్యం తద్బ్రూహి ద్విజసత్తమ.

తా. నేను మూడు వృత్తులను నాట్యంలో గ్రహించి నేను చేసిన పని బ్రహ్మదేవునకు నివేదించాను. అప్పు డాయన "భరతా! కైశికీవృత్తిని కూడ చేర్చి దానికి తగిన సుందరమైన వస్తువు ఏది ఉంటుందో అది కూడ చెప్పు" అని ఆదేశించాడు.

మూ. ఏవం తేనాస్మ్యభిహితః; ప్రత్యుక్తశ్చ మయా ప్రభుః. 43

"దీయతాం భగవన్! ద్రవ్యం కైశిక్యాః సంప్రయోజకమ్."

తా. బ్రహ్మదేవుడు ఇట్లు ఆజ్ఞాపించగా నేను ఆయనతో "పూజ్యుడా! కైశికీవృత్తిని ప్రయోగించడానికి ఉపకరించే ద్రవ్యాన్ని (material) నీవే నాకు ఇవ్వాలి.

మూ. నృత్తాఙ్గహారసంపన్నా రసభావక్రియాత్మికా. 44

దృష్టా మయా భగవతో నీలకణ్ఠస్య నృత్యతః,
కైశికీ శ్లక్ష్ణనైపథ్యా శృఙ్గారరససంభవా. 45

తా. కైశికీవత్తి నృత్తంతోను, అంగహారాల తోను కూడి ఉంటుంది. రసభావనను కలిగించడమే దీని స్వరూపం. శృంగారరసాన్ని ఆవిష్కరించే టప్పుడు వేషధారణాదికం చాల సుకుమారంగా ఉంటుంది. అలాంటి కైశికీవృత్తి వినియోగాన్ని నేను భగవంతుడైన నీలకంఠుడు నృత్యం చేస్తూన్నప్పుడు చూచి ఉన్నాను" అని నేను విజ్ఞాపన చేశాను.

మూ. అశక్యా పురుషైః సా తు ప్రయోక్తుం స్త్రీజనాదృతే,
తతోఽసృజన్మహాతేజా మనసాప్సరసో విభుః. 46

నాట్యాలంకారచతురాః ప్రాదాన్మహ్యం ప్రయోగతః,

తా. స్త్రీలు తప్ప పురుషులు కైశికీవృత్తిని ప్రయోగింపజాలరు. అందుచేత మహాతేజఃశాలి యైన బ్రహ్మదేవుడు మనస్సుచేత అప్సరఃస్త్రీలను సృజించి నాట్యాలంకారమునందు చాతుర్యం గల వాళ్లను, నాట్యప్రయోగం కోసమై నా కిచ్చాడు.

అప్సరసల పేర్లు

మూ. మఞ్జుకేశీం సుకేశీం చ మిశ్రకేశీం సులోచనామ్. 47
సౌదామినీం, దేవదత్తాం దేవసేనాం మనోరమామ్,
సుదతీం సున్దరీం చైవ విదగ్ధాం విపులాం తథా. 48

అసీనుడై ఉన్నాడు. ఆయన పుత్రులు అయన చుట్టూ కూర్చొని ఉన్నారు. అప్పుడు, ఇంద్రియాలను బుద్ధిని అదుపులో ఉంచుకొన్న మహాత్ములైన ఆత్రేయాది మునులు ఆ భరతమునిని ఈ విధంగా ప్రశ్నించారు -

మూ. యోఽయం భగవతా సమ్యక్ గ్రథితో వేదసంమితః,
నాట్యవేదః కథం బ్రహ్మన్నుత్పన్నః కస్య వా కృతే. 4

తా. ఓ! బ్రాహ్మణోత్తమా! పూజ్యుడ వైన నీవు చక్కగా కూర్చిన ఈ నాట్యవేదం వేదంతో సమాన మైనది. ఇది ఎలా ఆవిర్భవించినది? ఎవనికోసం ఆవిర్భవించింది?

మూ. కత్యఙ్గః కింప్రమాణశ్చ ప్రయోగశ్చాస్య కీదృశః,
సర్వమేతద్యథాతత్త్వం భగవన్! వక్తుమర్హసి. 5

తా. పూజ్యుడా! ఈ నాట్యవేదానికి ఎన్ని అంగా లున్నాయి? దీని ప్రమాణం ఎంత? దీనిని ఏ విధంగా ప్రయోగించాలి? ఈ విషయా లన్నీ ఉన్నవి ఉన్నట్లు నీవు మాకు చెప్పా లని కోరుతున్నాం.

నాట్యోత్పత్తికథనమ్ - నాట్యావిర్భావాన్ని గూర్చిన **వివరణ**

మూ. తేషాం తద్వచనం శ్రుత్వా మునీనాం **భరతో** మునిః,
ప్రత్యువాచ తతో వాక్యం నాట్యవేదకథాం ప్రతి. 6

తా. భరతముని, ఆ మునుల మాటలు విని నాట్యవేదోత్పత్తిని గూర్చిన కథ ఈ విధంగా చెప్పడం ప్రారంభించాడు.

మూ. భవద్భిః శుచిభిర్భూత్వా తథావహితమానసైః,
శ్రూయతాం నాట్యవేదస్య సంభవో బ్రహ్మనిర్మితః. 7

తా. బ్రహ్మదేవుడు నాట్యవేదం ఏ విధంగా సృజించాడో చెపుతాను; మీరందరూ పవిత్రులై, సావధాన మైన మనస్సులతో వినండి.

మూ. పూర్వం కృతయుగే విప్రాః వృత్తే స్వాయమ్భువేఽన్తరే,
త్రేతాయుగేఽథ సంప్రాప్తే మనోర్వైవస్వతస్య చ. 8
గ్రామ్యధర్మప్రవృత్తే తు కామలోభవశం గతే,
ఈర్ష్యాక్రోధాభిసంమూఢే లోకే సుఖితదుఃఖితే. 9
దేవదానవగన్ధర్వయక్షరక్షోమహోరగైః,
జమ్బూద్వీపే సమాక్రాన్తే లోకపాలప్రతిష్ఠితే. 10
మహేన్ద్రప్రముఖైర్దేవైరుక్తః కిల పితామహః,
"క్రీడనీయకమిచ్ఛామో దృశ్యం శ్రవ్యం చ యద్ భవేత్. 11

తా. ఓ! బ్రాహ్మణులారా! పూర్వం స్వాయంభువమన్వంతరంలో, కృతయుగం గడచి త్రేతాయుగం ప్రారంభ మైనప్పుడు అట్లే వైవస్వతమన్వంతరంలో కృతయుగం గడచి త్రేతాయుగం ప్రారంభ మైనప్పుడు భూలోకంలోని ప్రజ లందరూ కామ - లోభాలకు వశులై, ఈర్ష్య, క్రోధము మొదలైనవాటితో ఏమి చేయ్యాలో తెలియని స్థితిలో సుఖ - దుఃఖాలు అనభవిస్తూ, గ్రామ్యధర్మాలను, (ధర్మవిముఖు లైన పామరజనుల జీవనవిధానాలను) అనుసరిస్తూండేవారు. అప్పుడు లోకపాలులు స్థాపించిన జంబూ ద్వీపాన్ని దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు మహోరగులు (మహానాగులు) ఆక్రమించుకొన్నారు. ఇది చూచి మహేంద్రుడు మొదలైన దేవతలు బ్రహ్మదేవుని వద్దకు వెళ్లి - "పూజ్యుడా! కళ్లతో చూచి, చెవులతో విని అందరూ ఆనందించడానికి ఉపయోగించే ఏదైన ఒక సాధనాన్ని కోరుతున్నాము".

మూ. "న వేదవ్యవహారోఽయం సంశ్రావ్యః శూద్రజాతిషు,
తస్మాత్సృజాపరం వేదం పఞ్చమం సార్వవర్ణికమ్." 12

తా. "శూద్రజాతులవాళ్లు, శూద్రసమానప్రవృత్తికలవాళ్లూ కూడ రాజసస్వభావం కలవాళ్లవడంచేత వాళ్లకు వేదవ్యవహారం, (వేదోక్తధర్మాదికం) వినిపించి ప్రయోజనం లేదు. అందుచేత అన్ని వర్ణాలవాళ్లకు ఉపయోగించే మరొక వేదాన్ని, ఐదవ వేదాన్ని నువ్వు నిర్మించి మమ్ములను అనుగ్రహించాలి".

వివరణ : ఎనిమిదవ (8) శ్లోకానికి ఉన్నదున్నట్లు అర్థం చెప్పుకొంటే భావం కుదరదు. అందుచేత **నాట్యశాస్త్రా**నికి ప్రామాణికమైన **అభినవభారతి** అను వ్యాఖ్యానం వ్రాసిన అభినవగుప్తులు వ్రాసిన విధంగా అనువాదం చేయబడింది.

భారతీయ జ్యోతిఃశాస్త్ర ప్రకారం కృత - త్రేతా - ద్వాపర - కలియుగా లని నాలుగు యుగాలు. వీటికాలం (ఒక్కొక్కదానిలో) కొన్ని లక్షల సంవత్సరాలు. నాలుగు యుగాల కాలానికి ఒక **మన్వంతరం** అని పేరు. అలాంటి పద్నాలుగు మన్వంతరాలు ఒక **కల్పం,** ఒక కల్పం బ్రహ్మదేవునికి ఒక దినం. ఒక కల్పంలో మొదటిది స్వాయంభువ మన్వంతరం. ప్రస్తుతం జరుగుతూన్న వైవస్వతమన్వంతరం పద్నాలుగు మన్వంతరాలలో ఏడవది. పైన చూచి నట్లు ప్రతీ మన్వంతరంలోను నాలుగు యుగా లుంటాయి కదా! మొదటి మన్వంతర మైన స్వాయంభువమన్వంతరంలో త్రేతాయుగంలో బ్రహ్మదేవుడు నాట్యశాస్త్రం ఆవిర్భవింపచేశాడు. అదే విధంగా అన్ని మన్వంతరాలకు సంబంధించిన త్రేతాయుగాలలోను నాట్యశాస్త్రావిర్భావం జరుగుతూంటుంది. కృతయుగంలో ప్రజలు సహజంగానే స్వధర్మాలు పాటిస్తూ సుఖంగా ఉంటారు. అది గడచిన వెంటనే వాళ్ల మానసికప్రవృత్తులు మారి దుఃఖాలు కూడ అనుభవిస్తూంటారు. అట్టి వారి ఆనందం కోసం నాట్యశాస్త్రావిర్భావం. ఇది అభినవగుపాచార్యుల [illegible]

మూ. ఏవమస్త్వితి తానుక్త్వా దేవరాజం విసృజ్య చ,
సస్మార చతురో వేదాన్ యోగమాస్థాయ తత్త్వవిత్. 13

తా. లోక – వేదాదిశాస్త్రాల తత్త్వం బాగా తెలిసిన బ్రహ్మదేవుడు "సరే! అలాగే ఆవిర్భవింప చేస్తాను" అని వాళ్లతో పలికి, దేవేంద్రుణ్ణి పంపివేసి, ధ్యానముద్రలో కూర్చొని నాలుగు వేదాలను స్మరించాడు.

మూ. ("నేమే వేదాః యతః శ్రావ్యాః స్త్రీశూద్రాద్యాసు జాతిషు,
వేదమన్యత్తతః స్రక్ష్యే సర్వశ్రావ్యం తు యద్భవేత్.")

(ఇది 12వ శ్లోకం పూర్వార్ధంలోని భావాన్నే అనువదిస్తూ చెప్పిన ప్రక్షిప్తశ్లోకం. మూలంలో లేకపోయినా తరువాతి ఎవరో చేర్చినదానిని ప్రక్షిప్తం అంటారు. ఇలాంటి ప్రక్షిపశ్లోకాలు ముస్ముందు అడుగడుగునా తగులుతాయి. వాటిని చాల వరకు కుండలిలో (బ్రాకెట్సులో) చూపడం జరిగింది.

మూ. ధర్మ్యమర్థ్యం యశస్యం చ సోపదేశ్యం ససంగ్రహమ్,
భవిష్యతశ్చ లోకస్య సర్వకర్మానుదర్శకమ్. 14
సర్వశాస్త్రార్థసంపన్నం సర్వశిల్పప్రవర్తకమ్,
నాట్యాఖ్యం పఞ్చమం వేదం సేతిహాసం కరోమ్యహమ్. 15

తా. "నేను 'నాట్యవేదం' అనే పంచమవేదాన్ని నిర్మిస్తూ దాని ఇతిహాసం కూడ చెపుతాను. ఆ యా చారిత్రవిషయాలు కూడ ఈ నాట్యశాస్త్రం ద్వారా, నాట్యం ద్వారా తెలుస్తాయి. ఈ నాట్యవేదం ధర్మసంమతంగా, అందరూ ఆదరపూర్వకంగా కోరదగినది గాను, జనులకు యశస్సు సంపాదించేదిగాను ఉంటుంది. దీనిలో జనులకు ఉపదేశించ వలసిన విషయా లుంటాయి, అన్ని విషయాలు సంగ్రహింపబడతాయి. ఇది రాబోయే తరాల వాళ్లకు అన్ని విధాల కర్మలను (కర్తవ్యాలను) చూపేదిగా ఉంటుంది. దీనిలో సమస్తశాస్త్రాలలోని విషయాలు, చెప్పబడతాయి. అన్ని విధాలైన శిల్పాలకు దీనిలో అవకాశం ఉంటుంది.

మూ. ఏవం సంకల్ప్య భగవాన్ సర్వవేదాననుస్మరన్,
నాట్యవేదం తతశ్చక్రే చతుర్వేదాఙ్గసంభవమ్. 16

తా. భగవంతు డైన బ్రహ్మదేవుడు ఈ విధంగా సంకల్పించి, సమస్తవేదాలను స్మరిస్తూ, నాలుగువేదాలనుండి గ్రహించబడిన అంగాలతో ఏర్పరచిన నాట్యవేదాన్ని నిర్మించాడు.

మూ. జగ్రాహ పాఠ్యమృగ్వేదాత్ సామభ్యో గీతమేవ చ,
యజుర్వేదాదభినయాన్ రసానాథర్వణాదపి. 17

తా. ఋగ్వేదంనుండి పాఠ్యాన్నీ, సామలనుండి (సామవేదంనుండి) గీతాన్నీ, యజుర్వేదం నుండి అభినయాలను, అథర్వవేదంనుండి రసాలను గ్రహించాడు.

వి. స్పష్టమైన ఉచ్చారణ చేస్తూ చెప్పదలచిన విషయాన్ని స్పష్టంగా ఇతరులకు అర్థ మయే టట్లు, తగిన కంఠస్వరం, దానిలోని మార్పులు, అలంకారాదులు చేర్చి కూర్చిన వాగ్విధానానికి పాఠ్యం అని పేరు.

మూ. వేదోపవేదైః సంబద్ధో నాట్యవేదో మహాత్మనా,
ఏవం భగవతా సృష్టో బ్రహ్మణా సర్వవేదినా. 18

తా. సర్వజ్ఞుడు, మహాత్ముడు, పూజ్యుడు అయిన బ్రహ్మదేవుడు ఈ విధంగా వేదాలతోను, ఉపవేదాలతోను సంబంధం ఉన్న నాట్యవేదాన్ని సృష్టించాడు.

మూ. ఉత్పాద్య నాట్యవేదం తు బ్రహ్మోవాచ సురేశ్వరమ్,
ఇతిహాసో మయా సృష్టః స సురేషు నియుజ్యతామ్. 19

తా. బ్రహ్మదేవుడు ఈ విధంగా నాట్యవేదం సృష్టించి ఇంద్రునితో – "ఇతిహాసం, అనగా దేవదానవమానవాదుల వివిధచరిత్రలను చూపే దశరూపకం (పది రూపకాలు) నేను సృజించాను. దీన్ని గ్రహించవలసినదిగా దేవతలను ఆజ్ఞాపించుము" అన్నాడు.

మూ. కుశలా యే విదగ్ధాశ్చ ప్రగల్భాశ్చ జితశ్రమాః,
తేష్వయం నాట్యసంజ్ఞో హి వేదః సంక్రామ్యతాం త్వయా. 20

తా. "నీవు ఈ నాట్యవేదాన్ని కుశలులు, విదగ్ధులు, ప్రగల్భులు, జితశ్రములు అయినవాళ్లకు బోధించాలి."

వి. గురువునుండి విషయం గ్రహించడానికీ, గ్రహించినదానిని మరవకుండడానికీ సమర్థులు **కుశలులు**. ఎక్కడ ఏది చేర్చాలి, ఏది తొలగించాలి అను ఊహ – అపోహలలో సమర్థులు **విదగ్ధులు**. సభాకంపం లేనివాళ్లు **ప్రగల్భులు**. యోగ్యులై తగు ఆకారాదు లుండి, తొందరగా అలసిపోని వాళ్లు జితశ్రములు – అలసటను జయించినవారు.

మూ. తచ్ఛ్రుత్వా వచనం శక్రో బ్రహ్మణా యదుదాహృతమ్,
ప్రాఞ్జలిః ప్రణతో భూత్వా ప్రత్యువాచ పితామహమ్. 21

తా. ఇంద్రుడు బ్రహ్మదేవుని మాటలు విని, అంజలి ఘటించి వినయపూర్వకంగా ఇలా అన్నాడు.

మూ. "గ్రహణే ధారణే జ్ఞానే ప్రయోగే చాస్య సత్తమ,
అశక్తా భగవన్! దేవా అయోగ్యా నాట్యకర్మణి." 22

తా. "మహానుభావా! పూజ్యుడా! దేవతలు ఈ నాట్యవేదాన్ని గ్రహించడానికి గాని, ధరించడానికి గాని, ప్రయోగించడానికి (అభినయించడానికి) గాని అసమర్థులు. వీళ్లు ఈ పని చేయడానికి అనర్హులు.

మూ. య ఇమే వేదగుహ్యజ్ఞా ఋషయః సంశితవ్రతాః,
ఏతేఽస్య గ్రహణే శక్తాః ప్రయోగే ధారణే తథా." 23

తా. వేదాలలోని రహస్యా లన్నీ తెలిసిన, ఉత్తమనియమాలను పాలించే ఈ ఋషులు ఈ నాట్యశాస్త్రాన్ని గ్రహించడానికీ, ధరించడానికీ గ్రహించినదానిని మనస్సులో ధారణ చేయడానికీ ప్రయోగించడానికీ సమర్థులు."

భరతముని నూర్గురు పుత్రుల పేర్లు

మూ. శ్రుత్వా తు శక్రవచనం మామాహామ్బుజసంభవః,
త్వం పుత్రశతసంయుక్తః ప్రయోక్తాస్య భవానఘ. 24

తా. ఇంద్రుని మాటలు విని బ్రహ్మదేవుడు నాతో – "ఓ దోషరహితుడవైన భరతా! నువ్వు నీ నూరుగురు పుత్రులతో కలిసి ఈ నాట్యశాస్త్రాన్ని ప్రయోగించు" అన్నాడు.

మూ. ఆజ్ఞాపితో విదిత్వాహం నాట్యవేదం పితామహాత్,
పుత్రానధ్యాపయామాస ప్రయోగం చాపి తత్త్వతః. 25

తా. బ్రహ్మదేవు డీ విధంగా ఆజ్ఞాపించగా నేను ఆయననుండి నాట్యవేదం తెలిసికొని దానినీ దానిని ప్రయోగించే విధానాన్నీ నా పుత్రులకు, ఏవిధమైన దోషములూ లేనివిధంగా బోధించాను.

మూ. శాణ్డిల్యం చైవ వాత్స్యం చ కోహలం దత్తిలం తథా,
జటిలామ్బష్టకౌ చైవ తణ్డుమగ్నిశిఖం తథా. 26
సైన్ధవం సపులోమానం శాద్వలిం విపులం తథా,
కపిఞ్జలిం బాదరిం చ యమధూమ్రాయణౌ తథా. 27
జమ్బుధ్వజం కాకజఙ్ఘం స్వర్ణకం తాపసం తథా,
కైదారిం శాలికర్ణం చ దీర్ఘగాత్రం చ శాలికమ్. 28
కౌత్సం తాణ్డాయనిం చైవ పిఙ్గలం చిత్రకం తథా,
బన్ధులం మల్లకం చైవ ముష్టికం సైన్ధవాయనమ్. 29
తైతిలం భార్గవం చైవ శుచిం బహులమేవ చ,
అబుధం బుధసేనం చ పాణ్డుకర్ణం సుకేరలమ్. 30

ఋజుకం మణ్డకం చైవ శమ్బరం వఞ్జులం తథా,
మాగధం సదలం చైవ కర్తారం చోగ్రమేవ చ. 31
తుషారం పార్షదం చైవ గౌతమం బాదరాయణమ్,
విశాలం శబలం చైవ సునాభం మేషమేవ చ. 32
కాలియం భ్రమరం చైవ తథా పీఠముఖం మునిమ్,
నఖకుట్టాశ్మ కుట్టౌ చ షట్పదం సోత్తమం తథా. 33
పాదుకోపానహౌ చైవ శ్రుతిం చాషస్వరం తథా,
అగ్నికుణ్డాజ్యకుణ్డౌ చ వితణ్డం తాణ్డ్యమేవ చ. 34
కర్తరాక్షం హిరణ్యాక్షం కుశలం దుస్సహం తథా,
లాజం భయానకం చైవ బీభత్సం సవిచక్షణమ్. 35
పుణ్డ్రాక్షం పుణ్డ్రనాసం చాప్యసితం సితమేవ చ,
విద్యుజ్జిహ్వం మహాజిహ్వం శాలఙ్కాయనమేవ చ. 36
శ్యామాయనం మాఠరం చ లోహితాఙ్గం తథైవ చ,
సంవర్తకం పంచశిఖం త్రిశిఖం శిఖమేవ చ. 37
శఙ్ఖవర్ణముఖం షణ్డం శఙ్కుకర్ణమథాపి చ,
శక్రనేమిం గభస్తిం చాప్యంశుమాలిం శఠం తథా. 38
విద్యుతం శాతజఙ్ఘం చ రౌద్రం వీరమథాపి చ,
పితామహాజ్ఞయాస్మాభిః లోకస్య చ గుణేప్సయా. 39
ప్రయోజితం పుత్రశతం యథాభూమివిభాగశః,
యో యస్మిన్ కర్మణి యథా యోగ్యస్తస్మిన్ స యోజితః. 40

తా. (భరతముని నాట్యవేదాన్ని ఉపదేశించిన ఆయన కుమారుల పేర్లు –)

(1) శాండిల్యుడు (2) వాత్స్యుడు (3) కోహలుడు (4) దత్తిలుడు (5) జటిలుడు (6) అంబష్టకుడు (7) తండు (8) అగ్నిశిఖుడు (9) సైంధవుడు (10) పులోముడు (11) శాద్వలి (12) విపులుడు (13) కపింజలి (14) బాదరి (15) యముడు (16) ధూమ్రాయణుడు (17) జంబుధ్వజుడు 918) కాకజంఘుడు (19) స్వర్ణకుడు (20) తాపసుడు (21) కైదారి (22) శాలికర్ణుడు (23) దీర్ఘగాత్రుడు (24) శాలికర్ణుడు (25) కౌత్సుడు (26) తాండాయని (27) పింగలుడు (28) చిత్రకుడు (29) బంధులుడు (30) భల్లకుడు (31) ముష్టికుడు (32) సైంధవాయనుడు (33) తైతిలుడు (34) భార్గవుడు (35) శుచి (36) బహులుడు (37) అబుధుడు (38) బుధసేనుడు (39) పాండుకర్ణుడు

సుమాలాం సంతతిం చైవ సునన్దాం సుముఖీం తథా,
మాగధీమర్జునీం చైవ సరలాం కేరలాం ధృతిమ్. 49

నన్దాం సపుష్కలాం చైవ కలమాం చైవ మే దదౌ,

తా. మంజుకేశి, సుకేశి, మిశ్రకేశి, సులోచన, సౌదామిని, దేవదత్త, దేవసేన, మనోరమ, సుదతి, సుందరి, విదగ్ధయైన విపుల, సుమాల, సుమతి, సునంద, సుముఖి, మాగధి, అర్జుని, సరల, కేరల, ధృతి, నంద, పుష్కల, కలమ అను అప్సరసలను నాకు అప్పగించాడు.

మూ. స్వాతిర్భాణ్డనియుక్తస్తు సహ శిష్యైః స్వయంభువా. 50
నారదాద్యాశ్చ గన్ధర్వా గానయోగే నియోజితాః.

తా. బ్రహ్మదేవుడు, స్వాతినీ, ఆతని శిష్యులను భాండానికి (మృదంగాది వాద్య సముదాయానికి) సంబంధించిన విషయా లన్నీ చూచుకొనడానికీ, నారదుడు మొదలైన గంధర్వులను గానానికి సంబంధించిన వీణావేణ్వాదుల విషయాలు పర్యవేక్షించడానికీ నియమించాడు.

వి. ఇక్కడ చెప్పినదానిని బట్టి సంగీతశాస్త్రప్రవీణు డైన నారదుడు దేవర్షి యైన నారదుడు కాదు; గంధర్వుడైన మరొక నారదు డని తెలుస్తూన్నది.

బ్రహ్మదేవుని ఆజ్ఞచేత ప్రథమనాట్యప్రయోగప్రారంభం

మూ. ఏవం నాట్యమిదం సమ్యగ్బుద్ధ్వా సర్వైః సుతైః సహ. 51
స్వాతినారదసంయుక్తో వేదవేదాఙ్గకారణమ్,
ఉపస్థితోఽహం బ్రహ్మాణం ప్రయోగార్థం కృతాఞ్జలిః. 52

తా. నేను, నా పుత్రులూ కూడ ఈ విధంగా వేద - వేదాంగాలనుండి జనించిన నాట్యాన్ని గూర్చి బాగా తెలిసికొన్నాం. పిమ్మట నేను స్వాతితోను, నారదునితోను కలిసి బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లి, అంజలి ఘటించి, దీని ప్రయోగాన్ని గూర్చి ఆయనను అభ్యర్థించాను.

మూ. "నాట్యస్య గ్రహణం ప్రాప్తం బ్రూహి కిం కరవాణ్యహమ్"
ఏతత్తు వచనం శ్రుత్వా ప్రత్యువాచ పితామహః. 53

తా. "దేవా! ఇపుడు నాట్యాన్ని ప్రయోగించవలసి ఉన్నది. నే నేమి చేయవలెనో ఆదేశించుము" అని కోరాను. నా మాట విని బ్రహ్మదేవు డిట్లన్నాడు.

మూ. "మహానయం ప్రయోగస్య సమయః ప్రత్యుపస్థితః,
అయం ధ్వజమహః శ్రీమాన్ మహేన్ద్రస్య ప్రవర్తతే. 54
అత్రేదానీమయం వేదో నాట్యసంజ్ఞః ప్రయుజ్యతామ్."

తా. "నాట్యప్రయోగానికి (ప్రదర్శనానికి) తగిన మంచి అవకాశం ఇప్పుడు వచ్చినది - మహేంద్రధ్వజమహోత్సవం జరుగుతూన్నది. ఈ ఉత్సవంలో ఈ నాట్యవేదప్రదర్శన చెయ్యండి."

మూ. తతస్తస్మిన్ ధ్వజమహే నిహతాసురదానవే. 55
ప్రహృష్టామరసంకీర్ణే మహేన్ద్రవిజయోత్సవే,
పూర్వం కృతా మయా నాన్దీ హ్యాశీర్వచనసంయుతా. 56

తా. ధ్వజోత్సవం ప్రారంభ మైనది. అసురులు దానవులు నశించగా దేవత లందరూ ఆనందిస్తూన్న ఆ మహేంద్రవిజయోత్సవంలో నేను ముందుగా ఆశీర్వచనంతో కూడిన నాంది చేశాను.

మూ. అష్టాఙ్గపదసంయుక్తా విచిత్రా వేదనిర్మితా,
తదన్తేఽనుకృతిర్బద్ధా యథా దైత్యాః సురైర్జితాః. 57

తా. ప్రారంభంలో నేను చేసిన నాంది నాట్యవేదంలో చెప్పిన ప్రకారం అంగములైన ఎనిమిది పదములతో విచిత్రంగా ఉన్నది. ఆ నాంది చేసిన తరువాత సురులు దైత్యులను జయించినట్లు అనుకృతి (అభినయం) చేయబడింది.

మూ. సంఫేటవిద్రవకృతా చ్ఛేద్యభేద్యాహవాత్మికా,
తతో బ్రహ్మాదయో దేవాః ప్రయోగపరితోషితాః. 58

తా. ఆ అనుకృతి (అభినయం) సంఫేటంతోనూ, విద్రవంతోను చేయబడినదై ఛేద్య భేద్యాహవాల స్వరూపంతో ఉన్నది. అప్పుడు ఆ ప్రయోగానికి సంతోషించిన బ్రహ్మాది దేవతలు -

వి. రోషంతో పలికిన వాక్యాలతో కూర్చినది **సంఫేటం.** శంకా - భయ - త్రాసాలతో కూర్చినది విద్రవం. శస్త్రయుద్ధం ఛేద్యం. మల్లయుద్ధం భేద్యం. ఆహవం = యుద్ధం.

సంతసించిన బ్రహ్మాదిదేవతలు ఉపకరణాలను ఇచ్చుట

మూ. ప్రదదుర్మత్సుతేభ్యస్తు సర్వోపకరణాని వై,
ప్రీతస్తు భగవాన్ శక్రో దత్తవాన్ స్వం ధ్వజం శుభమ్. 59

తా. (దేవతలు) నా పుత్రులకు అన్ని (నాట్య) సాధనాలను బహూకరించారు. సంతోషించిన ఇంద్రుడు ముందుగా తన (ఇంద్ర) ధ్వజం బహూకరించాడు.

మూ. బ్రహ్మా కుటిలకం చైవ భృఙ్గారం వరుణః శుభమ్,
సూర్యశ్ఛత్రం శివః సిద్ధిం వాయుర్వ్యజనమేవ చ. 60

తా. బ్రహ్మదేవుడు (విదూషకుడు చేతిలో ధరించే) వంకరగా ఉండే దండం ఇచ్చాడు. వరుణుడు మంగళప్రదమైన పాత్ర ఇచ్చాడు. సూర్యుడు ఛత్రం (ఇక్కడ దీనికి వితానం, అనగా డేరా పైకప్పువంటి ఆచ్ఛాదనపటం అని అర్థం). శివుడు సిద్ధిని (తలపెట్టిన కార్యం నిర్విఘ్నంగా సిద్ధించడాన్నీ), వాయువు వింజామరను బహూకరించారు.

మూ. విష్ణుః సింహాసనం చైవ కుబేరో మకుటం తథా,
శ్రావ్యత్వం ప్రేక్షణీయస్య దదౌ దేవీ సరస్వతీ. 61

తా. విష్ణువు సింహాసనము, కుబేరుడు కిరీటము, సరస్వతీదేవి దృశ్యమైన రూపకాలలోని గీతాదులు శ్రావ్యంగా ఉండడాన్ని ఇచ్చారు.

మూ. శేషా యే దేవగన్ధర్వా యక్షరాక్షసపన్నగాః,
తస్మిన్ సదస్యభిప్రేతాన్నానాజాతిగుణాశ్రయాన్. 62

అంశాంశైర్భాషితం భావాన్ రసాన్ రూపం బలం తథా,
దత్తవన్తః ప్రహృష్టాస్తే మత్సుతేభ్యో దివౌకసః. 63

తా. ఆ సదస్సులో ఉన్న మిగిలిన దేవతలు, గంధర్వులు. యక్షులు, రాక్షసులు, పన్నగులు వాళ్లకు ఇష్టమైన అనేకవిధాలైన జాతులకు, గుణాలకు సంబంధించిన ఆయా అంశలకు (భూమికలకు) అనుగుణమైన సంభాషణలను, భావాలను, రసాలను, రూపమును, బలమును ఇచ్చారు. ఈ విధంగా సంతసించిన ఆ దేవతలు (దేవాదులు) నా పుత్రులకు అనేక వస్త్రాదులను ఇచ్చారు.

విరూపాక్షుడు మొదలైన దైత్యులు నాట్యప్రయోగంలో విఘ్నం కలిగించుట

మూ. ఏవం ప్రయోగే ప్రారబ్ధే దైత్యదానవనాశనే,
అభవన్ క్షుభితాః సర్వే దైత్యా యే తత్ర సంగతాః. 64

తా. దైత్యదానవుల నాశనాన్ని చూపే నాట్యప్రయోగం ఈ విధంగా ప్రారంభం కాగానే అక్కడ చేరిన దైత్యు లందరు క్షోభ చెందారు. ఆ ప్రదర్శనం తమ జాతివాళ్లను కించపరచేదిగా ఉన్న దని వాళ్లు ఆగ్రహించారు.

మూ. విరూపాక్షపురోగాంశ్చ విఘ్నాన్ ప్రోత్సాహ్య తేఽబ్రువన్,
న క్షమిష్యామహే నాట్యం హేతదాగమ్యతామితి. 65

తా. వాళ్లు విరూపాక్షుడు మొదలైన విఘ్నాలను ప్రోత్సహించి, – “మేం ఈ నాట్యం సహించజాలం. వెళ్లిపోదాం. వచ్చి వేయండి” (అంటూ బైటకు వెళ్లిపోయారు).

మూ. తతస్తైరసురైః సార్ధం విఘ్నా మాయాముపాశ్రితాః,
వాచశ్చేష్టాం స్మృతిం చైవ స్తమ్భయన్తి స్మ నృత్యతామ్. 66

తా. విఘ్నాలు (విఘ్నకారకులైన భూతాలు) అసురులతో కలిసి, మాయాబలంతో ఆ నాట్యప్రయోగంలో నృత్యం చేస్తున్నవాళ్ల వాక్కులను, చేష్టలను, స్మృతినీ స్తంభింప చేశారు.

మూ. తథా విధ్వంసనం దృష్ట్వా సూత్రధారస్య దేవరాట్,
కస్మాత్ప్రయోగవైషమ్యమిత్యుక్త్వా ధ్యానమావిశత్. 67

తా. సూత్రధారుణ్ణి ఆ విధంగా బాధించడం చూచిన దేవేంద్రుడు నాట్యప్రయోగంలో ఈ విధంగా వైషమ్యం ఎందుకు కలిగిందా అని ధ్యానించాడు. ఆలోచించాడు.

జర్జరం ఆవిర్భవించుట

మూ. అథాపశ్యత్సదో విఘ్నైః సమన్తాత్పరివారితమ్,
సహేతరైః సూత్రధారం నష్టసంజ్ఞం జడీకృతమ్. 68

తా. ఈ విధంగా ధ్యానం ద్వారా ఇంద్రుడు, పరివారసమేతు డైన సూత్రధారుణ్ణి విఘ్నాలు చుట్టుముట్టి సంజ్ఞ లేకుండా, జడుడుగా చేసినట్లు తెలుసుకొన్నాడు.

మూ. ఉత్థాయ త్వరితం శక్రః గృహీత్వా ధ్వజముత్తమమ్,
సర్వరత్నోజ్జ్వలం తం తు కిఞ్చిదుద్వృత్తలోచనః. 69

రఙ్గపీఠగతాన్విఘ్నానసురాంశ్చైవ దేవరాట్,
జర్జరీకృతదేహాంస్తానకరోజ్జర్జరేణ సః. 70

తా. దేవేంద్రుడు వెంటనే లేచి, కోపంతో నేత్రాలు కొంచెం త్రిప్పుచు, సమస్త రత్నాలతో ప్రకాశిస్తూన్న ఉత్తమమైన ఆ (ఇంద్ర) ధ్వజాన్ని ఎత్తి (చేత ధరించి) ఆ జర్జరంతో రంగపీఠం మీద ఉన్న విఘ్నాల దేహాలను, అసురుల దేహాలను జర్జరమై పోయేటట్లు చేశాడు.

వి. జర్జరం (దుర్బలం) అయేటట్లు చేయడంచేత ఆ దండానికి ‘జర్జరం’ అని పేరు.

మూ. నిహతేషు చ సర్వేషు విఘ్నేషు సహ దానవైః,
సంప్రహృష్య తతో వాక్యమాహుః సర్వే దివౌకసః. 71

తా. విఘ్నాలూ, దానవులూ నశించిపోవడంతో దేవత లందరూ సంతోషించి ఇంద్రునితో ఇలా అన్నారు -

మూ. అహో ప్రహరణం దివ్యమిదమాసాదితం త్వయా,
జర్జరీకృతసర్వాఙ్గా యేనైతే దానవాః కృతాః. 72

తా. ఆహా! నీ కెంత దివ్యమైన దండం లభించినది! ఇది సకలదానవుల అవయవాలన్నీ చితగకొట్టినది.

మూ. యస్మాదనేన తే విఘ్నాః సాసురా జర్జరీకృతాః,
తస్మాజ్జర్జర ఏవేతి నామతోఽయం భవిష్యతి. 73

తా. ఈ దండం విఘ్నాలను అసురులనూ కూడ జర్జరులను చేసింది. అందుచేత దీనికి 'జర్జరము' అను పేరు ప్రసిద్ధికి వస్తుంది.

మూ. శేషా యే చైవ హింసార్థముపయాస్యన్తి హింసకాః,
దృష్ట్వైవ జర్జరం తేఽపి గమిష్యన్త్యేవమేవ తు. 74

తా. ఇంకా మిగిలిన హింసకులు ఎవరైనా విఘ్నాలు కల్పించడానికి వచ్చినా, వాళ్లు కూడ ఈ జర్జరాన్ని చూడగానే జర్జరదేహులై పారిపోతారు.

మూ. ఏవమేవాస్త్వితి తతః శక్రః ప్రోవాచ తాన్ సురాన్,
రక్షాభూతశ్చ సర్వేషాం భవిష్యత్యేష జర్జరః. 75

తా. "మీరన్నట్లే జరుగుతుంది; ఈ జర్జరం నాట్యప్రయోక్త లందరికీ రక్షగా ఉంటుంది" అని దేవేంద్రుడు దేవతలకు మాట ఇచ్చాడు.

మూ. ప్రయోగే ప్రస్తుతే హ్యేవం స్ఫీతే శక్రమహే పునః,
త్రాసం సంజనయన్తి స్మ విఘ్నాః శేషాస్తు నృత్యతామ్. 76

తా. ఇంద్రోత్సవం మళ్లీ మహోత్సాహంతో ప్రారంభం కాగానే మిగిలిన విఘ్నాలు నర్తకులను భయపెట్టడం ప్రారంభించారు(యి).

మూ. దృష్ట్వా తేషాం వ్యవసితం దైత్యానాం విప్రకారజమ్,
ఉపస్థితోఽహం బ్రహ్మాణం సుతైః సర్వైః సమన్వితః. 77

తా. ఆ దైత్యులు పగ తీర్చుకొనడంకోసం చేస్తూన్న ఆ ప్రయత్నాన్ని చూచి, నేను నా పుత్రులతో కలిసి బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లాను.

మూ. "నిశ్చితా భగవన్! విఘ్నా నాట్యస్యాస్య వినాశనే,
అస్య రక్షావిధిం సమ్యగాజ్ఞాపయ సురేశ్వర!" 78

తా. "దేవాధిపతి వైన ఓ! పూజ్యుడా! విఘ్నాలు ఈ నాట్యప్రయోగం జరగకుండా చెయ్యాలన్న నిశ్చయంతో ఉన్నారు (యి); ఈ ప్రయోగాన్ని బాగా, రక్షించే విధానం ఏమో నువ్వు ఆజ్ఞాపించు."

విశ్వకర్మ నాట్యశాల నిర్మించుట

మూ. తతశ్చ విశ్వకర్మాణం బ్రహ్మోవాచ ప్రయత్నతః,
"కురు లక్షణసంపన్నం నాట్యవేశ్మ మహామతే." 79

తా. అప్పుడు బ్రహ్మదేవుడు విశ్వకర్మను పిలిచి - "ఓ! మహామతీ! అన్ని మంచి లక్షణాలతో కూడిన ఒక నాట్యగృహం నీవు ప్రయత్నపూర్వకంగా నిర్మించాలి" అని ఆదేశించాడు.

మూ. తతోఽచిరేణ కాలేన విశ్వకర్మా మహచ్ఛుభమ్,
సర్వలక్షణసంపన్నం కృత్వా నాట్యగృహం తు సః. 80
ప్రోక్తవాన్ ద్రుహిణం గత్వా సభాయాం తు కృతాఞ్జలిః,
సజ్జం నాట్యగృహం దేవ తదవేక్షితుమర్హసి. 81

తా. బ్రహ్మదేవుని ఆదేశమును విని విశ్వకర్మ సర్వలక్షణసంపన్నమూ, శుభకరమూ అయిన ఒక నాట్యగృహం అచిరకాలంలో నిర్మించి సభలో ఉన్న బ్రహ్మదేవునివద్దకు వెళ్లి నమస్కరించి "ప్రభూ! నాట్యగృహం నిర్మించాను. నీవు వచ్చి దర్శించుము" అని విన్నవించాడు.

మూ. తతః సహమహేన్ద్రేణ సురైః సర్వైశ్చ సేతరైః,
ఆగతస్త్వరితో ద్రష్టుం దృహిణో నాట్యమణ్డపమ్. 82

తా. బ్రహ్మదేవుడు వెంటనే మహేంద్రునితోను, సకల దేవతలతోను విద్యాధర గంధర్వాదులతోను కలిసి ఆ నాట్యమండపం చూడడానికి వచ్చాడు.

బ్రహ్మదేవుడు నాట్యమండపరక్షణకై దేవతలను నియోగించుట

మూ. దృష్ట్వా నాట్యగృహం బ్రహ్మా ప్రాహ సర్వాన్సురాంస్తతః,
అంశభాగైర్భవద్భిస్తు రక్ష్యోఽయం నాట్యమణ్డపః. 83

తా. బ్రహ్మదేవుడు నాట్యగృహం చూచిన తరువాత దేవతలను ఇలా ఆజ్ఞాపించాడు - "మీరందరూ ఎవరికి ఏ అంశం నిర్దేశిస్తున్నానో ఆ అంశల ప్రకారం ఈ నాట్య మండపాన్ని రక్షిస్తుండాలి."

మూ. రక్షణే మణ్డపస్యాథ వినియుక్తస్తు చన్ద్రమాః,
లోకపాలాస్తథా దిక్షు విదిక్ష్వపి చ మారుతాః. 84

తా. పూర్తి మండపాన్ని రక్షించడానికి (సౌమ్యస్వభావం గల) చంద్రుణ్ణీ, నాలుగు దిక్కుల రక్షణకు నలుగురు లోకపాలులను, విదిక్కులను రక్షించడానికి వాయువులను నియోగించాడు.

మూ. నేపథ్యభూమౌ మిత్రస్తు నిక్షిప్తో వరుణోఽమ్బరే.
వేదికారక్షణే వహ్నిః భాణ్డే సర్వదివౌకసః. 85

తా. వేషధారణగృహం రక్షణకు మిత్రుణ్ణీ (సూర్యునీ), ఆకాశ (ఊర్ధ్వభాగ) రక్షణకు వరుణుణ్ణీ, వేదికను (రంగస్థలాన్ని) రక్షించడానికి అగ్నినీ, వాద్యసముదాయరక్షణకు మేఘాలను (మేఘాధిష్ఠానదేవతలను) నియమించాడు.

మూ. వర్ణాశ్చత్వార ఏవాథ స్తమ్భేషు వినియోజితాః,
ఆదిత్యాశ్చైవ రుద్రాశ్చ స్థితాః స్తంభాన్తరేష్వథ. 86

తా. స్తంభాల రక్షణకు నలుగురు వర్ణాధిష్ఠానదేవతలను, నాలుగు స్తంభాల మధ్య భాగాలలో ఆదిత్యులను, రుద్రులను నియమించాడు.

మూ. ధారణీష్వథ భూతాని శాలాస్వప్సరసస్తథా,
సర్వవేశ్మసు యక్షిణ్యో మహీపృష్ఠే మహోదధిః. 87

తా. ధారణులయందు భూతాలను, శాలలయందు అప్సరసలను, సమస్తగృహాలలో యక్షిణులను, నేల వెనుక (అడుగున) మహాసముద్రాన్ని రక్షణకై నియమించాడు.

మూ. ద్వారశాలానియుక్తౌ తు కృతాన్తః కాల ఏవ చ,
స్థాపితౌ ద్వారపత్రేషు నాగముఖ్యౌ మహాబలౌ. 88

తా. ద్వార-శాలల రక్షణకై యముణ్ణి, కాలదేవతను, తలుపుల రక్షణకై మహాబలశాలు లైన అనంతుడు గులికుడు అను ప్రధాననాగులను నియమించాడు.

మూ. దేహల్యాం యమదణ్డస్తు శూలం తస్యోపరిస్థితమ్,
ద్వారపాలౌ స్థితౌ చోభౌ నియతిర్మృత్యురేవ చ. 89

తా. గుమ్మంమీద యమదండమూ, దాని పైభాగంలో శూలమూ వాటి రక్షణకై ఉన్నాయి. నియతి (దైవం) మృత్యువు అను ఇద్దరు దేవతలు ద్వారపాలకులుగా ఉన్నారు.

మూ. పార్శ్వే చ రఙ్గపీఠస్య మహేన్ద్రః స్థితవాన్ స్వయమ్,
స్థాపితా మత్తవారణ్యాం విద్యుద్దైత్యనిషూదనీ. 90

తా. రంగపీఠం ప్రక్కన స్వయంగా మహేంద్రుడే రక్షకుడుగా ఉన్నాడు. మత్తవారణి రక్షణకై దైత్యవినాశక మైన వజ్రరూపమైన మెరుపు నిలపబడింది.

మూ. స్తమ్భేషు మత్తవారణ్యాః స్థాపితాః పరిపాలనే,
భూతయక్షపిశాచాశ్చ గుహ్యకాశ్చ మహాబలాః. 91

తా. మత్తవారణి స్తంభాలమీద వాటి రక్షణకై భూత - యక్ష - పిశాచాలను, మహాబలవంతు లైన గుహ్యకులను (యక్షులలో ఒక తెగ) నియమించాడు.

మూ. జర్జరే తు వినిక్షిప్తం వజ్రం దైత్యనిబర్హణమ్,
తత్పర్వసు వినిక్షిప్తాః సురేన్ద్రా హ్యమితౌజసః. 92

తా. గొప్ప తేజస్సు గల సురేంద్రులను దైత్యసంహారకమైన జర్జరంలోను, దాని పర్వల (కణుపుల) లోను రక్షణకై ఉంచాడు.

మూ. శిరఃపర్వస్థితో బ్రహ్మా ద్వితీయే శఙ్కరస్తథా,
తృతీయే చ స్థితో విష్ణుశ్చతుర్థే స్కన్ద ఏవ చ. 93

తా. జర్జరం చివరి పర్వమీద బ్రహ్మ, రెండవదానిమీద శంకరుడు, మూడవదాని మీద విష్ణువు, నాల్గవదాని మీద కుమారస్వామి ఉన్నారు.

మూ. పఞ్చమే చ మహానాగాః శేషవాసుకితక్షకాః,
ఏవం విఘ్నవినాశాయ స్థాపితా జర్జరే సురాః. 94

తా. శేష - వాసుకి - తక్షకు లను మహానాగులు ఐదవ పర్వంమీద ఉన్నారు. ఈ విధంగా విఘ్నవినాశంకొరకై ఆ యా దేవతలు జర్జరంమీద (జర్జరంలో) నిలుపబడ్డారు.

మూ. రఙ్గపీఠస్య మధ్యే తు స్వయం బ్రహ్మా ప్రతిష్ఠితః,
ఇష్ట్యర్థం రఙ్గమధ్యే తు క్రియతే పుష్పమోక్షణమ్. 95

తా. బ్రహ్మదేవుడే స్వయంగా రంగపీఠం మధ్య నిలిచి ఉంటాడు. రంగమధ్యలో (బ్రహ్మదేవుని) పూజించడానికై పుష్పాలు చల్లుతారు.

మూ. పాతాలవాసినో యే చ యక్షగుహ్యకపన్నగాః,
అధస్తాద్రఙ్గపీఠస్య రక్షణే తే నియోజితాః. 96

తా. రంగపీఠం క్రిందిభాగాన్ని రక్షించడానికై పాతాళవాసులైన యక్షులు, గుహ్యకులు, పన్నగులు నియమింపబడ్డారు.

మూ. నాయకం రక్షతీన్ద్రస్తు నాయికాం చ సరస్వతీ,
విదూషకమథోఙ్కారః శేషాస్తు ప్రకృతీర్హరః. 97

తా. నాయకుణ్ణి ఇంద్రుడు, నాయికను సరస్వతి, విదూషకుణ్ణి ఓంకారము, మిగిలిన ప్రకృతులను (actors) అందరినీ హరుడు రక్షిస్తుంటారు.

మూ. యాన్యేతాని నియుక్తాని దైవతానీహ రక్షణే,
ఏతాన్యేవాధిదైవాని భవిష్యన్తీత్యువాచ సః. **98**

తా. ఆ యా స్థానాదుల రక్షణకై ఏ దేవతలు నియమింపబడ్డారో వాళ్లే వాటికి అధిష్ఠానదేవత లవుతా రని బ్రహ్మదేవుడు చెప్పాడు.

మూ. ఏతస్మిన్నన్తరే దేవైః సర్వైరుక్తః పితామహః,
సామ్నా తావదిమే విఘ్నాః స్థాప్యన్తాం వచసా త్వయా. **99**
పూర్వం సామ ప్రయోక్తవ్యం ద్వితీయం దానమేవ చ,
తయోరుపరి భేదస్తు తతో దణ్డః ప్రయుజ్యతే. **100**

తా. ఇంతలో దేవతలందరూ బ్రహ్మదేవునితో ఇలా అన్నారు – "పూజ్యుడా! ముందుగా నువ్వు ఈ విఘ్నకర్తలతో మాట్లాడి వాళ్లను విఘ్నాలు కలిగించకుండా ఆపుచెయ్యి. ఎందువల్ల ననగా – ముందు సామోపాయం ప్రయోగించాలి. రెండవది దానోపాయం. ఈ రెండూ విఫలమైతే భేదోపాయం. అదీ విఫలమైతే దండం ప్రయోగించాలి."

బ్రహ్మదేవుడు దైత్యుల విషయంలో సామం ప్రయోగించుట

మూ. దేవానాం వచనం శ్రుత్వా బ్రహ్మా విఘ్నానువాచ హ,
కస్మాద్భవన్తో నాట్యస్య వినాశాయ సముత్థితాః. **101**

తా. దేవతల మాటలు విని బ్రహ్మదేవుడు – "మీరందరూ నాట్యాన్ని చెడగొట్టడానికి ఎందుకు పూనుకొన్నారు?" అని విఘ్నకారకు లైన ఆ దైత్యులను ప్రశ్నించాడు.

మూ. బ్రహ్మణో వచనం శ్రుత్వా విరూపాక్షోఽబ్రవీద్వచః,
దైత్యైర్విఘ్నగణైః సార్ధం సామపూర్వమిదం తతః. **102**

తా. విఘ్నగణా లైన దైత్యులు ప్రక్కనే ఉన్న విరూపాక్షుడు బ్రహ్మదేవునితో సామపూర్వకంగా (సవినయంగా) ఇలా అన్నాడు.

మూ. "యోఽయం భగవతా సృష్టో నాట్యవేదః సురేచ్ఛయా,
ప్రత్యాదేశోఽయమస్మాకం సురార్థం భవతా కృతః. **103**

తా. "సురులు కోరగా నువ్వు ఈ నాట్యశాస్త్రం సృజించావు. ఇది మాకు తిరస్కారం. అవమానకరం! నువ్వు దీనిని సురులకోసం నిర్మించావు.

మూ. తన్నైతదేవం కర్తవ్యం త్వయా లోకపితామహ,
యథా దేవాస్తథా దైత్యాః త్వత్తః సర్వే వినిర్గతాః." **104**

తా. "సకలలోకపితామహు డైన నువ్వు ఇలా చేసి ఉండకూడదు. నీనుండి దేవతలు ఏ విధంగా ఆవిర్భవించారో దైత్యు లందరూ కూడ అలాగే ఆవిర్భవించారు."

మూ. విఘ్నానాం వచనం శ్రుత్వా బ్రహ్మా వచనమబ్రవీత్,
అలం వో మన్యునా దైత్యాః విషాదం త్యజతానఘాః. **105**

తా. విఘ్నాల మాటలు విని బ్రహ్మదేవు డిలా అన్నాడు – "దైత్యులారా! మీకు ఏమాత్రమూ కోపం తగదు. ఓ! దోషరహితులారా! మీరు విషాదం చెందకండి."

మూ. భవతాం దేవతానాం చ శుభాశుభవికల్పకః,
కర్మభావాన్వయాపేక్షీ నాట్యవేదో మయా కృతః. **106**

తా. నేను రచించిన ఈ నాట్యవేదం మీకూ దేవతలకూ కూడ శుభాశుభాలను వికల్పించేది. కర్మలమీద, మనోభావాలమీదా, వంశ – దేశాదులభేదాల మీదా ఆధార పడినది.

వి. దేవతలు గొప్పవాళ్ళనీ దానవాదులు చెడ్డవాళ్లనీ చిత్రించడం నాట్యంయొక్క ఉద్దేశ్యం కాదు. దానస్నానాదులు ధర్మం; హింస, చౌర్యం మొదలైనది అధర్మం. ధర్మం ఆచరించినవాడు, అతడు సురుడైనా అసురుడైనా సుఖం పొందుతాడు. అధర్మం చేసినవాడు కష్టాల పాలవుతాడు అని బోధించడమే నాట్యం ఉద్దేశించిన పని. "ప్రతీ ఒక్కడు తాను చేసిన కర్మను, తన భావాన్నీ, తాను పుట్టిన జాతిదేశాదులను పట్టి ప్రవర్తిస్తాడు, ఫలం అనుభవిస్తాడు" అని మాత్రమే నాట్యం బోధిస్తుంది.

నాట్యస్వరూపం ఏమో తెలుపుట

మూ. నైకాన్తతోఽత్ర భవతాం దేవానాం చానుభావనమ్,
త్రైలోక్యస్యాస్య సర్వస్య నాట్యం భావానుకీర్తనమ్. **107**

తా. ఈ నాట్యంలో కేవలం మీకు సంబంధించిన విషయాలు తెలపడం కాని, సురులకు సంబంధించిన విషయాలు తెలపడం కాని ఉద్దిష్టం కాదు. నాట్యం మూడు లోకాలలో నివసించే స్వరూపస్వభావాలను చిత్రీకరిస్తుంది. ప్రత్యక్షంగా జరుగుతున్నట్లు చూపి ప్రేక్షకుల హృదయాలలో ఆ అనుభవాలను రేకెత్తిస్తుంది.

మూ. క్వచిద్ధర్మః క్వచిత్క్రీడా, క్వచిదర్థః, క్వచిచ్ఛమః,
క్వచిద్ధాస్యం, క్వచిద్యుద్ధం, క్వచిత్కామః, క్వచిద్వధః. **108**

తా. నాట్యంలోని కొన్ని ఘట్టాలలో ధర్మం ప్రదర్శింపబడుతుంది; ఒక చోట ఆటలు, ఒకచోట అర్థం (ధనదాన్యాదిసంపద), ఒక చోట హాస్యం, మరొక చోట యుద్ధం, వేరొక చోట కామం, ఒకచోట వధ చిత్రింపబడతాయి.

మూ. ధర్మో ధర్మప్రవృత్తానాం కామః కామోపసేవినామ్,
నిగ్రహో దుర్వినీతానాం వినీతానాం దమక్రియా. 109

తా. ధర్మప్రవృత్తిగలవాళ్ల ధర్మాచరణ, కామాలు అనుభవించేవాళ్ల కామోపభోగమూ, దుర్మార్గుల నిగ్రహమూ, వినీతుల (ఇంద్రియనిగ్రహవంతుల) శమపూర్వక మైన ప్రవర్తన - ఇవన్నీ నాట్యంలో ప్రయోగింపబడతాయి (ప్రదర్శింపబడతాయి).

మూ. క్లీబానాం ధార్ష్ట్యజననముత్సాహః శూరమానినామ్,
అబుధానాం విబోధశ్చ వైదుష్యం విదుషామపి. 110

తా. నపుంసకులలో ధార్ష్ట్యాన్ని (హాస్యాన్ని) పుట్టించడమూ, శూరులైన ఆత్మాభిమానవంతుల ఉత్సాహము, తెలివితక్కువవాళ్లు తెలిసికొనేటట్లు చేయడము, విద్వాంసుల వైదుష్యమూ - ఇవన్నీ నాట్యంలో ప్రయోగింపబడతాయి.

మూ. ఈశ్వరాణాం విలాసశ్చ స్థైర్యం దుఃఖార్దితస్య చ,
అర్థోపజీవినామర్థో ధృతిరుద్విగ్నచేతసామ్. 111

తా. ప్రభువుల విలాసలు, దుఃఖపీడితుల మానసికస్థైర్యము, అర్థసంపాదనకోసం జీవించేవాళ్ల అర్థమూ, (అర్థసంపాదనావిధానము) దిగులు చెందిన మనస్సులు కలవాళ్ల ధృతి (ధైర్యము) ప్రయోగింపబడతాయి.

మూ. నానాభావోపసంపన్నం నానావస్థాన్తరాత్మకమ్,
లోకవృత్తానుకరణం నాట్యమేతన్మయా కృతమ్. 112

తా. నేను రచించిన ఈ నాట్యంలో లోకప్రవృత్తి, ఎన్నో విధా లైన మానవాదుల ప్రవర్తన అనుకరించబడుతుంది; ప్రదర్శింపబడుతుంది. దీనిలో అనేకవిధాలైన భావాలు, అనేకవిధాలైన అవస్థలు పుష్కలంగా ప్రదర్శింపబడతాయి.

మూ. ఉత్తమాధమమధ్యానాం నరాణాం కర్మసంశ్రయమ్,
హితోపదేశజననం ధృతిక్రీడాసుఖాదికృత్. 113

తా. సమాజంలో కొందరు ఉత్తము లుంటారు. కొందరు మధ్యము లుంటారు; కొందరు అధములు ఉంటారు. అలాంటివాళ్లు చేసే పనులను, వాళ్ల ప్రవర్తనాదులను ఆశ్రయించుకొని ఉంటుంది నాట్యం. హితం ఉపదేశిస్తుంది. ధైర్యం కలగజేస్తుంది. కొందరికి క్రీడగా, వినోదం కలిగించే ఆటగా, ఉంటుంది. సుఖం మొదలైన వాటిని కలిగిస్తుంది.

మూ. (ఏతద్రసేషు భావేషు సర్వకర్మక్రియాస్వథ,
సర్వోపదేశజననం నాట్యం లోకే భవిష్యతి).

తా. (లోకంలో ఈ నాట్యం రసాల విషయంలోను, భావాల విషయంలోను, అన్ని విధాలైన కర్మల (పనుల) ఆచరణ విషయంలోను అందరికీ ఉపదేశం చేస్తుంది).

మూ. దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాం తపస్వినామ్,
విశ్రాన్తిజననం కాలే నాట్యమేతద్భవిష్యతి. 114

తా. వ్యాధ్యాదులవల్ల కలిగిన దుఃఖంతో బాధపడుతున్నవారికీ, దూరగమనం మొదలైన శ్రమతో బాధపడుతున్నవారికీ, ఇష్టజనమరణాదులవల్ల కలిగిన శోకంతో బాధపడుతున్నవారికీ, ఉపవాస - కృచ్ఛ్రచాంద్రాయణాదివ్రతాలతో అలసిపోయిన మునులకు తగు సమయాలలో నాట్యం విశ్రాంతిని కలిగిస్తుంది.

మూ. ధర్మ్యం యశస్యమాయుష్యం హితం బుద్ధివివర్ధనమ్,
లోకోపదేశజననం నాట్యమేతద్భవిష్యతి. 115

తా. నాట్యం ధార్మిక ప్రవృత్తిని కలిగిస్తుంది. యశస్సును ఇస్తుంది. ఆయుర్దాయం పెంచుతుంది. హితోపదేశం చేస్తుంది. బుద్ధిని పెంచుతుంది. లోకం పోకడను తెలుపుతుంది.

మూ. న తద్ జ్ఞానం న తచ్ఛిల్పం న సా విద్యా న సా కలా,
నాసౌ యోగో న తత్కర్మ నాట్యేఽస్మిన్ యన్న దృశ్యతే. 116

తా. నాట్యంలో ప్రదర్శింపబడని జ్ఞానం లేదు; శిల్పం లేదు; విద్య లేదు; కళ లేదు; యోగం లేదు. కర్మ లేదు.

వి. జ్ఞానం = ఆత్మజ్ఞానాదికం. శిల్పం = మాలా - చిత్ర - పుత్తలికా (బొమ్మ)ది రచన. విద్య = దండనీతి మొ; కళ = సంగీత - వాద్యాదికం. యోగం = వీటిలో కొన్నింటిని మేళవించడం. కర్మ = యుద్ధ - మల్లయుద్ధాదికం.

మూ. తన్నాత్ర మన్యుః కర్తవ్యో భవద్భిరమరాన్ ప్రతి,
సప్తద్వీపానుకరణం నాట్యమేతద్భవిష్యతి. 117
(యేనానుకరణం నాట్యమేతత్తద్యన్మయా కృతమ్).

తా. అందుచేత మీకు దేవతలమీద కోపం కలగకూడదు. ఏడు ద్వీపాలలోని విషయాల అనుకరణం ఈ నాట్యంలో ఉంటుంది. (ఎందువల్ల ననగా నేను రచించిన ఈ నాట్యం అనుకరణప్రధాన మైనది).

మూ. దేవానామసురాణాం చ రాజ్ఞామథ కుటుమ్బినామ్,
బ్రహ్మర్షీణాం చ విజ్ఞేయం నాట్యవృత్తాన్తదర్శకమ్. 118

తా. దేవతలు, అసురులు, రాజులు, కుటుంబాలు, బ్రహ్మర్షులు - వీళ్ల అందరి వృత్తాంతాలను చరిత్రలను ఈ నాట్యం ప్రదర్శిస్తుంది.

మూ. యోఽయం స్వభావో లోకస్య సుఖదుఃఖసమన్వితః,
సోఽఙ్గాద్యభినయోపేతః నాట్యమిత్యభిధీయతే. 119

తా. నాట్యం అంటే ఏమనగా - సుఖదుఃఖాదులతో నిండిన లోకుల స్వభావాన్నే (జీవనవిధానాదులనే) అంగాభినయాదులతో ప్రదర్శిస్తే అది 'నాట్యం' అంటారు.

మూ. (వేదవిద్యేతిహాసానామాఖ్యానపరికల్పనమ్,
వినోదకరణం లోకే నాట్యమేతద్భవిష్యతి.
శ్రుతిస్మృతిసదాచారపరిశేషార్థకల్పనమ్,
వినోదజననం లోకే నాట్యమేతద్భవిష్యతి.)

తా. (ఈ నాట్యంలో వేదములు, ఇతరవిద్యలు, ఇతిహాసములు - వీటినుండి అఖ్యానాల కల్పన చేయబడుతుంది. ఈ విధంగా ఇది వినోదసాధనంగా లోకంలో ఉంటుంది.

శ్రుతులలోను, స్మతులలోను ఉన్న విషయాలను, సదాచారంతో సంబంధించిన విషయాలను, ఇంకా మిగిలిన ఇతరవిషయాలను కూర్చడంచేత నాట్యం వినోదకరం అవుతుంది).

రంగదేవతాపూజ చెయ్యా లని బ్రహ్మదేవుడు చెప్పుట

మూ. ఏతస్మిన్నన్తరే దేవాన్ సర్వానాహ పితామహః,
క్రియతామద్య విధివద్యజనం నాట్యమణ్డపే. 120

తా. ఈ మధ్యలో పితామహుడు దేవతలతో - "ఇప్పుడు నాట్యమండపంలో యథాశాస్త్రంగా పూజలు నిర్వహించాలి" అన్నాడు.

మూ. బలిప్రదానైర్హోమైశ్చ మన్త్రౌషధిసమన్వితైః,
భోజ్యైర్భక్ష్యైశ్చ పానైశ్చ బలిః సముపకల్ప్యతామ్. 121

తా. మంత్రాలతోను ఓషధులతోను కూడిన బలిప్రదానములచేత, హోమాలచేత, భోజ్యములచేత, భక్ష్యములచేత, పానీయములచేత పూజలు ఏర్పరచాలి.

వి. బలి = అనేకవిధా లైన రంగులు పూసిన తండులాదులు. హోమం = తిలాదులు అగ్నిలో ఉంచడం. భోజ్యం = నమిలి తినే గట్టి పదార్థం. భక్ష్యం = పాయసం, పొంగలి మొ. పానం = పాలు, చెరకురసం, ద్రాక్షారసం మొ. "**బల్యన్తే ఆప్యాయ్యన్తే దేవతాః**

అనేన ఇతి బలిః" అని వ్యుత్పత్తి. "దేనిచేత దేవతలకు సంతృప్తి కలిగింపబడుతుందో అది బలి" అని బలిశబ్దానికి సాధారణమైన (general) అర్థం.

మూ. మర్త్యలోకగతాః సర్వే శుభాం పూజామవాప్స్యథ.
(మర్త్యలోకేష్వయం వేదః శుభాం పూజామవాప్స్యతి)
అపూజయిత్వా రఙ్గం తు నైవ ప్రేక్షాం ప్రవర్తయేత్. 122

తా. మీరందరూ మర్త్యలోకానికి వెళ్లి శుభమైన పూజను పొందగలరు. ("ఈ నాట్య వేదం మర్త్యలోకాలలో అనగా భూలోకనివాసులలో, శుభమైన పూజను (ఆదరమును) పొందగలదు") రంగపూజచేయకుండా నాట్యప్రదర్శనం చేయకూడదు.

మూ. అపూజయిత్వా రఙ్గం తు యః ప్రేక్షాం కల్పయిష్యతి,
నిష్ఫలం తస్య తద్ జ్ఞానం తిర్యగ్యోనిం చ యాస్యతి. 123

తా. రంగపూజ చేయకుండా నాట్యప్రదర్శనం చేయించేవాని నాట్యజ్ఞానం అంతా నిష్ఫలం అయిపోతుంది; వాడు పశుపక్ష్యాదిజన్మ ఎత్తుతాడు.

మూ. యజ్ఞేన సంమితం హ్యేతద్రఙ్గదైవతపూజనమ్,
తస్మాత్సర్వప్రయత్నేన కర్తవ్యం నాట్యయోక్తృభిః. 124

తా. రంగదేవతాపూజ యజ్ఞంతో సమాన మైనది. అందుచేత నాట్యప్రయోగం చేసే వాళ్లు అన్ని విధాలా ప్రయత్నించి ఈ రంగపూజ జరిపించాలి.

మూ. నర్తకోఽర్థపతిర్వాపి యః పూజాం న కరిష్యతి,
న కారయత్యన్యైర్వా ప్రాప్నోత్యపచయం తు సః. 125

తా. నర్తకుడు గాని, అర్థపతిగాని, అనగా డబ్బు పెట్టుబడి పెట్టి నాట్యం జరిపించే ధనికుడు గాని, తాను స్వయంగా ఈ పూజలు చేయకపోయినా, ఇతరులచేత చేయించక పోయినా అతడు నష్టపోతాడు.

మూ. యథావిధి యథాదృష్టం యస్తు పూజాం కరిష్యతి,
స లప్స్యతే శుభానర్థాన్ స్వర్గలోకం స యాస్యతి. 126

తా. యథాశాస్త్రంగా ఇతరులు చేస్తూన్నప్పుడు తాను చూచిన విధంగా పూజలు జరిపించేవాడు శుభమైన ప్రయోజనాలను (లాభాలను) పొందుతాడు. స్వర్గలోకానికి వెడతాడు కూడ.

మూ. ఏవముక్త్వా తు భగవాన్ ద్రుహిణః సహ దైవతైః,
రఙ్గపూజాం కురుష్వేతి మామేవం సమచోదయత్. 127

ఇతి భరతీయే నాట్యశాస్త్రే శాస్త్రోత్పత్తిర్నామ ప్రథమోఽధ్యాయః.

తా. ముందుగా దేవతలతో ఇలా చెప్పి దేవతాసహితుడైన బ్రహ్మదేవుడు "రంగపూజ చెయ్యి" అని నన్ను ఆదేశించాడు.

వి. దేనిచేత ప్రేక్షకుల మనస్సులు రంజింపచేయబడతాయో అది రంగం. అనగా నాట్యం. నాట్యప్రయోగానికి ఆధారమైన మండపం కూడ రంగం అని చెప్పబడుతుంది.

పుల్లెల శ్రీరామచంద్రుడు రచించిన బాలానందిని అను భరతనాట్యశాస్త్రాంధ్ర వ్యాఖ్యానంలో నాట్యోత్పత్తి అను ప్రథమాధ్యాయం సమాప్తం.

"త్రిణేత్రపాదాబ్జసదాస్తవో (సమాశ్రయో)ల్లస
త్రసారభాక్స్ఫుటమిహ నాట్యశాసనే,
ప్రవర్తితేయం హృదయే మహాధియాం
ప్రకాశతామభినవగుప్తభారతీ."

– శ్రీమదభినవగుప్తాచార్యాః.

శ్రీః శ్రీః శ్రీః

స
జ
మూ. భ
"భ
తా.
సంబంధ
మూ.
రాబోయే
కోరుచు
మూ.
దానికి
కోరుతు
మూ.
విధానా
మూ.

శ్రీః

ఓం స్వస్తి శ్రీగణేశాయ నమః

అథ షష్ఠోఽధ్యాయః

రసాధ్యాయము

మూ. పూర్వరఙ్గవిధిం శ్రుత్వా పునరాహుర్మహత్తమాః,
భరతం మునయః సర్వే ప్రశ్నాన్ పఞ్చాభిధత్స్వ నః. 1

తా. మహాత్ములైన ఆ మును లందరు పూర్వరంగవిధానం విని భరతమునితో ఇలా అన్నారు – "మహాత్మా! మా ఐదు ప్రశ్నలకు ఉత్తరములు చెప్పుము.

మూ. యే రసా ఇతి పఠ్యన్తే నాట్యే నాట్యవిచక్షణైః,
రసత్వం కేన వై తేషామేతదాఖ్యాతుమర్హసి. 2

తా. (1) నాట్యమునందు మంచి నేర్పుగలవారు. "నాట్యంలో (రూపకాలలో) 'రసాలు' అని అంటూంటారు కదా? వాటికి రసత్వం ఎలా వచ్చిందో, అనగా వాటిని రసాలు అని ఎందుకు అంటారో, మాకు చెప్పుము.

మూ. భావాశ్చైవ కథం ప్రోక్తాః కిం వా తే భావయన్త్యపి,
సంగ్రహం కారికాం చైవ నిరుక్తం చైవ తత్త్వతః. 3

తా. (2) కొన్నింటిని భావా లని ఎందు కంటారు? అవి దేనిని భావింపచేస్తాయి. (3) రసభావాల సంగ్రహమును, (4) కారికను, (5) నిరుక్తమును మాకు విశదీకరింపుము.

మూ. తేషాం తు వచనం శ్రుత్వా మునీనాం భరతో మునిః,
ప్రత్యువాచ పునర్వాక్యం రసభావవికల్పనమ్. 4

తా. భరతముని ఆ మునుల మాటలు విని రసభావాల స్వరూపాన్ని లక్షణాదులను బోధిస్తూ వాళ్లతో ఇలా అన్నాడు.

మూ. అహం వః కథయిష్యామి నిఖిలేన తపోధనాః,
సంగ్రహం కారికాం చైవ నిరుక్తం చ యథాక్రమమ్. 5

తా. తపోధనులారా! రస – భావాదులకు సంబంధించిన సంగ్రహమూ, కారిక, నిరుక్తమూ కూడ క్రమానుసారంగా మీకు చెపుతాను.

మూ. న శక్యమస్య నాట్యస్య గన్తుమన్తం కథంచన,
కస్మాద్ బహుత్వాద్ జ్ఞానానాం శిల్పానాం చాప్యనన్తతః. 6

తా. ఈ నాట్యాన్ని గూర్చి పూర్తిగా తెలిసికొనడానికి ఏ విధంగా నూ కూడ శక్యం కాదు. ఎందువల్ల ననగా – జ్ఞానములు, అనగా వ్యాకరణాదివివిధశాస్త్రాలలో ఉన్న తెలిసికొనదగిన విషయాలు ఎన్నో ఉన్నాయి. చిత్రలేఖనము, పుత్తలికా (బొమ్మలు మొ.) నిర్మాణము మొదలైన శిల్పాలు అనంత మైనవి.

మూ. ఏకస్యాపి న వై శక్యస్త్వన్తో జ్ఞానార్ణవస్య హి,
గన్తుం కిం పునరన్యేషాం జ్ఞానానామర్థతత్త్వతః. 7

తా. ఒక్క జ్ఞాన (విద్యా) సముద్రం కొనలు చూడడమే శక్యం కాని పని; ఇతర జ్ఞానాల (సకలవిద్యల) తత్త్వాన్ని తెలుసుకొంటూ వాటి అంతాలను చూడగలవాడు ఎవ్వడూ ఉండ డని వేరుగా చెప్పాలా!

మూ. కిన్త్వల్పసూత్రగ్రన్థార్థమనుమానప్రసాదకమ్,
నాట్యస్యాస్య ప్రవక్ష్యామి రసభావాదిసంగ్రహమ్. 8

తా. అయినా కూడ అల్పమైన (చిన్నవైన) సూత్రరూపములలో ఉన్న గ్రంథానికి సంబంధించిన విషయాలు తెలిపేదీ, అనగా చిన్న సూత్రాల రూపంలో ఉన్న గ్రంథంలోని విషయా లన్నీ ప్రతిపాదించేదీ, అనుమానప్రమాణం ద్వారా విషయాలను బోధించేదీ, అనగా విషయజ్ఞానానికి ఉపయోగించే అనుమానాలను (inferences) సూచించేదీ అయిన, ఈ నాట్యానికి (రూపకనిర్మాణ ప్రయోగాదులకు) సంబంధించిన రస – భావాదుల సంగ్రహమును మీకు చెపుతాను.

మూ. విస్తరేణోపదిష్టానామర్థానాం సూత్రభాష్యయోః,
నిబన్ధో యః సమాసేన సంగ్రహం తం విదుర్బుధాః. 9

తా. సూత్రాలలోను వాటి భాష్యంలోను (విస్తృతవ్యాఖ్యానంలోను) సవిస్తరంగా చెప్పబడిన విషయాలను సమాసంచేత, అనగా సంక్షిప్తరూపంలో, నిబంధించడం (ఒకచోట కూర్చడం) సంగ్రహం అని పండితు లంటారు. ఇది సంగ్రహానికి లక్షణం.

మూ. రసా భావా హ్యభినయాః ధర్మీ వృత్తిప్రవృత్తయః,
సిద్ధిః స్వరాస్తథాతోద్యం గానం రఙ్గశ్చ సంగ్రహః. 10

తా. రసాలు, భావాలు, అభినయాలు, ధర్మి, వృత్తులు, ప్రవృత్తులు, సిద్ధి, స్వరాలు, ఆతోద్యం, గానం, రంగం – ఇవే నాట్యసంగ్రహం. నాట్యశాస్త్రంలో ఉన్న విషయా లేవో సంగ్రహంగా చెప్పా లంటే ఇవే అని అర్థం.

మూ. అల్పాభిధానేనార్థో యః సమాసేనోచ్యతే బుధైః,
సూత్రతః సాఽను పఠితా కారికార్థప్రదర్శినీ. 11

తా. చాల తక్కువ సంఖ్యలో ఉన్న శబ్దాలతో విస్తృత మైన అర్థాన్ని సమాసంచేత, అనగా సంక్షిప్త రూపంలో. క్రోడీకరించి సూత్రం బోధించగా ఆ సూత్రాన్ని అనుసరించి దానిలో ఇమడ్చిన అర్థాన్ని బోధించేది **కారిక.**

వి. ఈ శ్లోకానికి వ్యాఖ్య వ్రాస్తూ అభినవగుప్తుడు. "అర్థానికీ అనగా చెప్పబడే విషయానికీ, లక్షణరూప మైన సూత్రానికీ, ఆ సూత్రం అర్థాన్ని వివరించే శ్లోకానికీ కూడ కారిక అని పేరు" అన్నాడు. కాని ఆ అర్థం ఈ శ్లోకంలో రావడంలేదు.

మూ. **నానానామాశ్రయోత్పన్నం నిఘణ్టునిగమాన్వితమ్,**
ధాత్వర్థహేతుసంయుక్తం నానాసిద్ధాన్తసాధితమ్. **12**
స్థాపితోఽర్థో భవేద్యత్ర సమాసేనార్థసూచకః,
ధాత్వర్థవచనేనేహ నిరుక్తం తత్ప్రచక్షతే. **13**

తా. ఒక పదం ఏ ధాతువునుండి నిష్పన్న మైనదో దాని అర్థాన్ని చెపుతూ, సంక్షిప్తరూపంలో ఉన్న అర్థాన్ని సూచించే అర్థాన్ని ఏది స్థాపిస్తుందో అది **నిరుక్తం.** ఈ నిరుక్తం అనేకవిధా లైన నామల (సుబంతపదాల) ఆశ్రయంవల్ల ఏర్పడుతుంది. నిఘంటువులకు, వ్యాకరణాదిశాస్త్రాలకు అనుగుణంగా ఉంటుంది. ధాతువుయొక్క అర్థాన్ని హేతువుగా చూపి చెప్పబడుతుంది. అనేకవిధా లైన సిద్ధాంతాల సాహాయ్యంతో నిర్ణయింపబడుతుంది.

వి. ఈ ఘట్టంలోని శ్లోకాలను పట్టి, సంగ్రహం అనగా ఒక శాస్త్రంలోని విషయాలను సూచించే విషయసూచికవంటి దనీ, సూత్రాలలో సంక్షిప్తంగా చెప్పిన విషయాన్ని వివరించేది శ్లోకరూపంలో ఉంటే కారిక అనీ, ఒక పదానికి ఆ అర్థం ఎలా వచ్చిందో దాని మూలధాతువును, నిఘంట్వాదులలో ఉన్న ఆ పదం అర్థాన్నీ, ఇతరశాస్త్ర సిద్ధాంతాలను పరిశీలించి నిర్ణయించేది **నిరుక్తం** అనీ చెప్పినట్లు అర్థం అవుతున్నది. ఇది ఒక పద్ధతి.

అయితే వ్యాకరణశాస్త్రాదులలో సూత్రం, వార్తికం, భాష్యం, సంగ్రహం అను మరొక వ్యాఖ్యానవిధానం ఉంది. చాల తక్కువ పదాలలో అతివిస్తృత మైన విషయాన్ని సూచించేది సూత్రం.

"అల్పాక్షరమసందిగ్ధం సారవద్విశ్వతోముఖమ్,
అస్తోభమనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః."

సూత్రకారుడు చెప్పినవాటిలో ఏవైనా లోపా లుంటే సవరిస్తూ. చెప్పనివాటిని చేరుస్తూ, చెప్పినవాటికి అవసరం అయితే వివరణం ఇస్తూ వ్రాసినదానికి వార్తికం అని పేరు. ఇది శ్లోకరూపంలో ఉండవచ్చు, చిన్న వాక్యాల రూపంలో ఉండవచ్చు.

"ఉక్తానుక్తదురుక్తానాం చిన్తా యత్ర ప్రవర్తతే,

తం గ్రన్థం వార్తికం ప్రాహుర్వార్తికజ్ఞా మనీషిణః."

సూత్రాలవంటి చిన్న చిన్న వాక్యాలలో సూత్రార్థాన్ని వివరిస్తూ, తనలోని పదాల అర్థాలు కూడా వివరించేది **భాష్యం.**

సూత్రార్థో వర్ణ్యతే యత్ర పదైః సూత్రానుకారిభిః,
స్వపదాని చ వర్ణ్యన్తే భాష్యం భాష్యవిదో విదుః.

ఈ లక్షణాలు పాణినిసూత్ర - కాత్యాయనకృత వార్తిక - పతంజలికృత మహాభాష్యాలకు చక్కగా వర్తిస్తాయి. బ్రహ్మసూత్ర - శాంకరభాష్య - సురేశ్వరాచార్యకృత వార్తికాలకు కూడ వర్తిస్తాయిగాని వార్తికాలు భాష్యాలపై వ్రాయబడినవి.

వ్యాకరణశాస్త్రంలో సంగ్రహం అనేది కూడ ఒకటుండేది. సూత్ర - భాష్యాలలో విస్తృతంగా చెప్పిన విషయాలను సంక్షిప్తంగా చెప్పేది **సంగ్రహం.**

"విస్తరేణోపదిష్టానామర్థానాం సూత్రభాష్యయోః,
నిబన్ధో యః సమాసేన సంగ్రహం తం విదుర్బుధాః."

అని దీని లక్షణ. వ్యాడి అనే పండితుడు రచించిన **'సంగ్రహం'** అనేది ఉండేది; అది లభ్యం కాదు.

వైదికవాఙ్మయానికి సంబంధించిన 'నిఘంటు' 'నిరుక్తాలు' ప్రసిద్ధములే. ఇక్కడ చెప్పిన 'నిరుక్తం' నిరుక్తంవంటిదే కాని అది కాదు.

'రసాః భావాః' ఇత్యాదిశ్లోకంలో చెప్పిన సంగ్రహస్వరూపం, కోహలుడు చెప్పిన పదకొండు అంగాల సంగ్రహానికి సరిపడినా, నాట్యశాస్త్రంలోని అంగాలు - మూడు విధాల అభినయం, గీతము, ఆతోద్యము అని ఐదే గాన దీనికి సంబంధించినది కాదు అని అభినవగుప్తుని అభిప్రాయం.

మూ. **సంగ్రహో యో మయా ప్రోక్తః సమాసేన ద్విజోత్తమాః,**
విస్తరం తస్య వక్ష్యామి సనిరుక్తం సకారికమ్. **14**

తా. ద్విజోత్తములారా! నేను మీకు సంక్షిప్తరూపంలో చెప్పిన సంగ్రహానికి సంబంధించిన విస్తరాన్ని, నిరుక్తమును, కారికలను ఇప్పుడు చెపుతాను.

మూ. **శృఙ్గారహాస్యకరుణా రౌద్రవీరభయానకాః,**
బీభత్సాద్భుతసంజ్ఞా చేత్యష్టౌ నాట్యే రసాః. స్మృతాః. **15**

తా. నాట్యంలో శృంగారము, హాస్యము, కరుణ, రౌద్రము, వీరము, భయానకము, భీభత్సము, అద్భుతము అని ఎనిమిది రసాలు చెప్పబడ్డాయి.

మూ. ఏతే హ్యష్టౌ రసాః ప్రోక్తా ద్రుహిణేన మహాత్మనా,
పునశ్చ భావాన్ వక్ష్యామి స్థాయిసఞ్చారిసత్త్వజాన్. 16

తా. మహాత్ముడైన బ్రహ్మదేవుడు ఈ ఎనిమిది రసాలు చెప్పాడు. ఇంకా మీకు స్థాయిభావాలను, సంచారిభావాలను, సాత్త్వికభావాలను చెపుతాను.

స్థాయిభావాలు

మూ. రతిర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా,
జుగుప్సా విస్మయశ్చేతి స్థాయిభావాః ప్రకీర్తితాః. 17

తా. (పైన చెప్పిన ఎనిమిది రసాలకు) రతి, హాసం, శోకం, క్రోధం, ఉత్సాహం, భయం, జుగుప్స (ఏవగింపు) విస్మయం (ఆశ్చర్యం) అనేవి వరుసగా ఎనిమిది స్థాయి భావాలు.

మూ. నిర్వేదగ్లానిశఙ్కాఖ్యాస్తథాసూయా మదః శ్రమః,
ఆలస్యం చైవ దైన్యం చ చిన్తా మోహః స్మృతిర్ధృతిః. 18
వ్రీడా చపలతా హర్ష ఆవేగో జడతా తథా,
గర్వో విషాద ఔత్సుక్యం నిద్రాపస్మార ఏవ చ. 19
సుప్తం విబోధోఽమర్షశ్చాప్యవహిత్థమథోగ్రతా,
మతిర్వ్యాధిస్తథోన్మాదస్తథా మరణమేవ చ. 20
త్రాసశ్చైవ వితర్కశ్చ విజ్ఞేయా వ్యభిచారిణః,
త్రయస్త్రింశదమీ భావాః సమాఖ్యాతాస్తు నామతః. 21

తా. నిర్వేదం, గ్లాని, శంక, అసూయ, మదం, శ్రమ, ఆలస్యం (సోమరితనం), దైన్యం, చింత, మోహం, స్మృతి, ధృతి (ధైర్యం), వ్రీడ (సిగ్గు), చపలత్వం, హర్షం, ఆవేగం (మనస్సులో కంగారు), జడత్వం (కదలిక లేకపోవడం), గర్వం, విషాదం, ఔత్సుక్యం, నిద్ర, అపస్మారం (మూర్ఛ), సుప్తం (నిద్ర), విబోధం (మేల్కొనడం) అమర్షం, అవహిత్థం (మనస్సులోని భావాలు దాచుకొనడం), ఉన్మాదం, మరణం, త్రాసం (భయం) వితర్కం (ఊహ) ఇవి వ్యభిచారిభావాలు. ఈ ముప్పైమూడు (33) భావాల పేర్లు చెప్పాను.

వి. వ్యభిచారిభావాలు అన్నా సంచారిభావాలన్నా ఒకటే. ఇవి పర్యాయపదాలు.

మూ. స్తంభః స్వేదోఽథ రోమాఞ్చః స్వరభఙ్గోఽథ వేపథుః,
వైవర్ణ్యమశ్రు ప్రలయ ఇత్యష్టౌ సాత్త్వికాః స్మృతాః. 22

తా. స్తంభం (కొయ్యబారిపోవడం), స్వేదం (చెమటపట్టడం), రోమాంచం, స్వర భంగం (కంఠస్వరం మారిపోవడం), వేపథు (కంపం), వైవర్ణ్యం (ముఖం రంగు

మారిపోవడం), ప్రలయం (సొమ్మసిలడం) ఇవి ఎనిమిది **సాత్త్వికభావాలు** (మనోవికారం వల్ల పుట్టే భావాలు).

మూ. ఆఙ్గికో వాచికశ్చైవ హ్యాహార్యః సాత్త్వికస్తథా,
చత్వారోఽభినయా హ్యేతే విజ్ఞేయా నాట్యసంశ్రయాః. 23

తా. ఆంగికము, వాచికము, ఆహార్యము, సాత్త్వికము అని నాట్యానికి సంబంధించిన అభినయాలు నాలుగు విధాలు.

మూ. లోకధర్మీ నాట్యధర్మీ ధర్మీతి ద్వివిధః స్మృతః,
భారతీ సాత్త్వతీచైవ కైశిక్యారభటీ తథా. 24
చతస్రో వృత్తయో హ్యేతా యాసు నాట్యం ప్రతిష్ఠితమ్.

తా. లోకధర్మి, నాట్యధర్మి అని ధర్మి రెండు విధాలు. భారతి, సాత్త్వతి, కైశికి, ఆరభటి అని వృత్తులు నాలుగు విధాలు. నాట్యం ఈ నాలుగు వృత్తులమీదనే ఆధారపడి ఉన్నది.

మూ. ఆవన్తీ దాక్షిణాత్యా చ తథా చైవౌఢ్రమాగధీ. 25
పాఞ్చాలమధ్యమా చేతి విజ్ఞేయాస్తు ప్రవృత్తయః.

తా. ఆవన్తి, దాక్షిణాత్య (ఆంధ్ర – కర్నాట – ద్రవిడ – కేరల – మహారాష్ట్ర – గుజరాతదేశాలు దాక్షిణాత్యదేశాలు), ఓఢ్రీమాగధి (అర్ధమాగధి), పాంచాలి, మధ్యమ అనేవి ప్రవృత్తులు.

మూ. దైవికీ మానుషీ చైవ సిద్ధిః స్యాత్ ద్వివిధైవ తు. 26

తా. దైవికి, మానుషి అని సిద్ధి రెండు విధాలైనది.

మూ. శారీరాశ్చైవ వైణాశ్చ సప్త షడ్జాదయః స్వరాః,
(నిషాదర్షభగాన్ధారమధ్యపఞ్చమధైవతాః)

తా. శారీరములు, వైణములు అను రెండు భేదములతో షడ్జం మొదలైన స్వరాలు ఏడు. (వాటి పేర్లు నిషాదము, ఋషభము, గాంధారము, మధ్యమము, పంచమము ధైవతము, షడ్జము).

మూ. తతం చైవావనద్ధం చ ఘనం సుషిరమేవ చ. 27
చతుర్విధం చ విజ్ఞేయమాతోద్యం లక్షణాన్వితమ్.

తా. తతము, అవనద్ధము, ఘనము, సుషిరము అని ఆతోద్యం వేరు వేరు లక్షణాలతో నాలుగు విధాలు.

మూ. తతం తన్త్రీగతం జ్ఞేయమవనద్ధం తు పౌష్కరమ్. 28
ఘనస్తు తాలో విజ్ఞేయః సుషిరో వంశ ఏవ చ.

తా. తీగ లున్న వీణాదివాద్యం **తతం.** రెండు ప్రక్కలా లేదా ఒక ప్రక్క చర్మచేత బిగించిన మృదంగాది వాద్యం **అవనద్ధం.** ఇత్తడి తాళాలు మొదలైనవి **ఘనం.** వెదురు వంటివాటితో చేసిన పిల్లనగ్రోవి మొదలైన రంధ్రా లున్న వాద్యం **సుషిరం.**

మూ. ప్రవేశాక్షేపనిష్క్రామప్రాసాదికమథాన్తరమ్. 29
గానం పఞ్చవిధం జ్ఞేయం ధ్రువాయోగసమన్వితమ్.

తా. ధ్రువతో సంబంధించిన గానం ప్రవేశకం, ఆక్షేపం నిష్క్రామం, ప్రాసాదికం, అన్తరం అని ఐదు విధాలు.

వి. రంగప్రవేశం చేస్తూన్న పాత్రల ప్రకృతిని, మనోభావాదులను సూచించే గానం **ప్రవేశికం.** ప్రకృతమైన రసంకంటె భిన్నమైన రసాన్ని దూరంగా ఉంచే గానం **ఆక్షేపం.** పాత్రలు రంగంనుండి నిష్క్రమిస్తూన్నప్పుడు చేసే గానం **నిష్క్రామం.** ప్రవేశించిన పాత్ర యొక్క చిత్తవృత్తిని సామాజికులకు తెలిపే గానం **ప్రాసాదికం.** ప్రవేశ - నిష్క్రమణాల మధ్య చేసే గానం ఆంతరం.

మూ. చతురశ్రో వికృష్టశ్చ రఙ్గస్త్ర్యశ్రశ్చ కీర్తితః. 30

చతురశ్రం, వికృష్టం, త్ర్యశ్రం అని రంగం మూడు విధాలు.

మూ. ఏవమేషోఽల్పసూత్రార్థో నిర్దిష్టో నాట్యసంగ్రహః,
అతఃపరం ప్రవక్ష్యామి సూత్రగ్రన్థవికల్పనమ్. 31

తా. ఈ విధంగా సూత్రాల అల్పార్థమైన నాట్యసంగ్రహం చెప్పాను. ఇటుపైన సూత్రాల వ్యాఖ్యారూప మైన పరీక్షను చెప్పెదను.

మూ. తత్ర రసానేవ తావదభివ్యాఖ్యాస్యామః. న హి రసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే.

తా. ముందుగా రసాలను గూర్చియే విస్తృత మైన వ్యాఖ్య (వివరణం) చేస్తాం. ఎందువల్ల ననగా రసం లేకుండా నాట్యాంగమైన ఏ విషయమూ ప్రవర్తించదు. నడవదు.

రసలక్షణసూత్రం

మూ. తత్ర విభావానుభావవ్యభిచారిసంయోగాద్రసనిష్పత్తిః.

తా. విభావాల, అనుభావాల, వ్యభిచారిభావాల సంయోగంవల్ల రసం నిష్పన్నం అవుతుంది.

వి. ఇది రససిద్ధాంతానికి ఆయువుపట్టు వంటి సూత్రం. దీనిలోని **'సంయోగాత్'** 'నిష్పత్తిః' అను పదాలకు అనేకవిధాల అర్థాలు చెపుతూ అనేకవాదనలు బయలుదేరాయి.

అభినవగుప్తుడు, ఆయనకంటె ముందున్న నాట్యశాస్త్రవ్యాఖ్యాతలు ఈ సూత్రాన్ని, ఎలా వ్యాఖ్యానించాలో, వారి వ్యాఖ్యాభేదాలను పట్టి రసస్వరూపనిరూపణం ఎలా వేరు వేరుగా జరిగిందో **'రససిద్ధాంతం'** అను శీర్షికతో అస్మద్విరచిత **అలంకారశాస్త్రచరిత్రలో** ప్రతిపాదింపబడింది. ఆ భాగం (386 - 407 పేజీలు) యథాతథంగా ఈ షష్ఠాధ్యాయం చివర ఇవ్వబడింది. అందుచేత ఇక్కడ ఈ సూత్రానికి విస్తృతవ్యాఖ్యానం ఏమీ చేయలేదు.

మూ. కో దృష్టాన్తః? అత్రాహ - యథా హి నానావ్యఞ్జనౌషధిద్రవ్యసంయోగాద్రసనిష్పత్తిః తథా నానాభావోపగమాద్రసనిష్పత్తిః. యథా హి గుడాదిభిర్ద్రవ్యైః వ్యఞ్జనైః ఓషధిభిశ్చ షాడబాదయో రసాః నిర్వర్త్యన్తే తథా నానాభావోపగతా అపి స్థాయినః భావాః రసత్వమాప్నువన్తీతి.

తా. విభావాదులు కలవడంవల్ల రసనిష్పత్తి జరుగుతుంది అని చెప్పడానికి దృష్టాంతం ఏమిటి? దీనికి సమాధానం చెపుతున్నారు - అనేక విధాలైన వ్యంజనాలతోను, ఓషధులతోను ఒకద్రవ్యం కలవడంవల్ల (క్రొత్త) రసం (రుచి) ఎలా నిష్పన్నం అవుతుందో అట్లే అనేకవిధా లైన భావాలు వచ్చి స్థాయితో చేరడంవల్ల రసనిష్పత్తి జరుగుతుంది. సూత్రప్రాయంగా ఉన్న ఈ వాక్యాన్నే వ్యాఖ్యానిస్తున్నాడు -

యథాహీతి :- బెల్లం మొదలైన ద్రవ్యాలు వ్యంజనములతోను, నంజులతోను, ఓషధులతోను (ఎలకులు లవంగాలు కుంకుమపువ్వు మొదలైన ఓషధులతోను) కలవడం వల్ల (కలిపి) షాడవం మొదలైన రసాలు తయారు చేయబడతాయో అదే విధంగా అనేక విధాలైన విభావాదిభావాలతో కూడిన స్థాయిభావాలు రసత్వాన్ని పొందుతాయి; రసం అవుతాయి.

వి. మధుర (తియ్యని) తిక్త (చేదైన) ఆమ్ల (పుల్లని) లవణ (ఉప్పని) కటు (కారం) కషాయ (వగరు) రుచులు గల పదార్థాలను కలపగా ఈ ఆరు రుచులకంటె భిన్నమైన రుచి ఏర్పడుతుంది. అదే **షాడబం** అనగా అని **అభినవభారతి.** ప్రధానమైన ఒక గుడం వంటి పదార్థంతో వేరు వేరు రుచులు గల కొన్ని వస్తువులు కొంచెం కొంచెం కలపగా క్రొత్తగా రుచి పుట్టి నట్లు ప్రధానమైన స్థాయిభావంతో ఇతరభావాలు కలుపగా క్రొత్తగా రసం నిష్పన్నమౌతుంది అని అర్థం.

మూ. అత్రాహ - రస ఇతి కః పదార్థః? ఉచ్యతే; ఆస్వాద్యత్వాత్.

తా. 'రసః' అంటున్నావు కదా? ఆ పదానికి అర్థం ఏమిటి? అని అడుగుతున్నాడు. దీనికి సమాధానం చెప్పబడుతూన్నది - ఆస్వాదింపబడుతుంది కాబట్టి ఇది రసం అని చెప్పబడుతున్నది. **"రస్యతే ఇతి రసః"** అని నిరుక్తి చూపినట్లయింది.

మూ. కథమాస్వాద్యతే రసః? **యథాహి నానావ్యఞ్జనసంస్కృతమన్నం భుఞ్జానాః రసానా స్వాదయన్తి సుమనసః పురుషాః, హర్షాదీంశ్చాధిగచ్ఛన్తి తథా నానాభావాభినయవ్యఞ్జి** తాన్ వాగఙ్గసత్త్వోపేతాన్ స్థాయిభావాన్ ఆస్వాదయన్తి సుమనసః ప్రేక్షకాః; హర్షాదీంశ్చా ధిగచ్ఛన్తి. తస్మాన్నాట్యరసా ఇత్యభివ్యాఖ్యాతాః.

తా. (ప్రశ్న) రసం ఎలా ఆస్వాదింప బడుతుంది? (సమాధానం) మంచి మనస్సులతో ఉన్న, అనగా శోకక్రోధాదులు ఏవీ మనస్సులలో లేని, పురుషులు అనేకవిధా లైన వ్యంజనాలతో సంస్కరింపబడిన అన్నం తింటూ రసాలను ఎలా ఆస్వాదిస్తారో, (ఆ రసాలలో ఉన్న భేదాలను, తమ ఇష్టత్వానిష్టత్వాదులను బట్టి) హర్షాదులు పొందుతారో (తమ కిష్టం కాని రసం తగిలితే కొంచెం క్లేశం కూడ పొందవచ్చును గాన హర్షాదీన్ అని 'ఆది' శబ్దం ప్రయోగించాడు) అదే విధంగా సహృదయు లైన ప్రేక్షకులు అనేక విధాలైన భావాల అభినయంచేత వ్యంజింపచేయబడిన వాచిక - ఆంగిక - సాత్త్వికాభినయములతో కూడిన స్థాయిభావాలను ఆస్వాదిస్తారు, హర్షాదులు కూడ పొందుతారు. అందుచేత వీటిని నాట్యరసాలు - నాట్యం ద్వారా నిష్పన్నములైన రసాలు - అని అంటారు.

మూ. అత్రానువంశ్యౌ శ్లోకౌ **భవతః.**

యథా బహుద్రవ్యయుతైర్వ్యఞ్జనైర్బహుభిర్యుతమ్,
ఆస్వాదయన్తి భుఞ్జానా భక్తం భక్తవిదో జనాః. **32**
భావాభినయసంబద్ధాన్ స్థాయిభావాంస్తథా బుధాః,
ఆస్వాదయన్తి మనసా తస్మాన్నాట్యరసాః స్మృతాః. **33**

తా. ఈ విషయంలో రెండు **అనువంశ్యశ్లోకాలు** ప్రసిద్ధిలో ఉన్నాయి - అనేక ద్రవ్యాలతో చేర్చిన, అనేక వ్యంజనాలతో కలిసిన అన్నమును తింటూ భోజనప్రియులు దానిని ఏ విధంగా ఆస్వాదిస్తారో అదే విధంగా, బుధులు, భావాల అభినయాలతో కూడిన స్థాయిభావాలను మనస్సుతో ఆస్వాదిస్తారు. అందువల్లనే, అనగా దీనికి భావాభినయం ప్రధానకారణం అవడంవల్ల, వీటిని నాట్యరసా లంటారు.

వి. 'వంశో ద్విధా - విద్యయా **జన్మనా** చ' అను అభియుక్తోక్తి ననుసరించి గురు శిష్యపరంపర విద్యావంశం. ఆ విద్యావంశానికి సంబంధించినవి గాన గురుశిష్య పరంపరయా వస్తూన్నవి గాన, ఇలాంటి అజ్ఞాతకర్తృకా లైన ప్రాచీన శ్లోకాలకు **అనువ్యంశ్య** శ్లోకాలు అని పేరు.

మూ. అత్రాహ - **కిం రసేభ్యో భావానామభినిర్వృత్తిః, ఉతాహో భావేభ్యో రసానామితి? కేషాంచిన్మతం పరస్పరసంబన్ధాదేషామభినిర్వృత్తిరితి. తన్న; కస్మాత్? దృశ్యతే హి భావేభ్యో రసానామభినిర్వృత్తిః న తు రసేభ్యో భావానామభినిర్వృత్తిరితి.**

తా. ఇక్కడ ఇలా ప్రశ్నిస్తున్నాడు - రసాలనుండి భావాలు ఏర్పడతాయా; లేక భావాల నుండి రసాలు ఏర్పడతాయా? రసభావాలకు పరస్పరం సంబంధంచేత, కలవడంచేత, ఇవి ఏర్పడతాయి, (అనగా రసాలతో సంబంధించి భావాలు, భావాలతో సంబంధించి రసాలు పుడతాయి) అని కొంద రంటారు. అది యుక్తం కాదు. ఎందువల్ల? భావాలనుండి రసాల ఉత్పత్తి కనబడుతూన్నది కాని రసాలనుండి భావాల ఉత్పత్తి కనబడడంలేదు కదా?

మూ. భవన్తి చాత్ర శ్లోకాః -
నానాభినయసంబన్ధాన్భావయన్తి రసానిమాన్,
యస్మాత్తస్మాదమీ భావా విజ్ఞేయా నాట్యయోక్తృభిః. **34**

తా. ఈ విషయంలో కొన్ని అనువంశ్యశ్లోకా లున్నాయి -

అనేకవిధా లైన అభినయాలతో సంబంధం గల రసాలను భావింపజేస్తాయి కాబట్టి వీటిని 'భావాలు' అని నాట్యప్రయోక్తలు తెలుసుకోవాలి.

వి. అనగా **"భావయన్తి రసానితి భావాః"** - ఏవి రసాలను భావింపచేస్తాయో అవి భావాలు అను వ్యుత్పత్తిచేత భావాలే రసాల ఉత్పత్తికి హేతువులు అని అర్థం.

మూ. నానాద్రవ్యైర్బహువిధైర్వ్యఞ్జనం **భావ్యతే యథా,**
ఏవం భావా **భావయన్తి** రసానభినయైః **సహ.** **35**

తా. ఎన్నో రకా లైన అనేకద్రవ్యాలచేత ఏ విధంగా వ్యంజనం భావింపబడుతుందో అట్లే భావాలు, అభినయాలతో కలిసి రసాలను భావింపచేస్తాయి.

వి. భవనం అనగా ఉండడం; పుట్టడం. **భావనం** అనగా ఉండే టట్లు, పుట్టే టట్లు, చెయ్యడం. భావయన్తి = రసాన్ని ఉండే టట్లు, పుట్టే టట్లు చేస్తాయి. అందుచేత వాటి కా పేరు అని అర్థం. అస లంటూ ముందుగా భావా లుండాలి. ఆ వివిధభావాలను (విభావానుభావవ్యభిచారిభావాలను) ఒక్క సందర్భంలో చతుర్విధాభినయాల ద్వారా ఆవిష్కరిస్తే అప్పుడు రసోదయం అవుతుంది.

'భావన' శబ్దానికి సంస్కరించడం అను అర్థం కూడ ఉంది. ఒక వస్తువులో అంతకు పూర్వం లేని ఒక మంచి గుణాన్ని పుట్టించడం సంస్కారం. పాయసంలో ఏలకుల పొడి, కుంకుమపువ్వు మొదలైనవి వేయడంవంటిది. ఒక విధమైన వ్యభిచారి భావాదులవల్ల పూర్వమే జనించి ఉన్న రసానికి ఒక విధమైన సంస్కారం చేసిన ట్లవుతుంది గాన ఆ అర్థంలో కూడ అన్వయించవచ్చును గాని మొదటి అర్థమే యుక్తతర మైనది.

వ్యంజనం అనగా ఏదైన ఒక ప్రధానమైన ఆహారపదార్థం తింటూన్నప్పుడు దానిలో కొంత రుచి పుట్టించడానికి మధ్య మధ్య నలుచుకొనే పచ్చడి, కూర మొదలైనది; నంజు;

అని అర్థం. ప్రకృత శ్లోకంలో - "బహువిధద్రవ్యాల కలయికచే వ్యంజనం పుడుతుంది" అన్నప్పుడు 'వ్యంజనం' అనగా క్రొత్త రుచి అని అర్థం గ్రహించాలి.

మూ. న భావహీనోఽస్తి రసో న భావో రసవర్జితః,
పరస్పరకృతా సిద్ధిస్తయోరభినయే భవేత్. 36

తా. భావం లేని రసం ఉండదు; రసం లేని భావం ఉండదు. అభినయంలో, (ఇక్కడ అభినయం అనగా నాట్యం అని అర్థం), నాట్యంలో, రస - భావాలు రెండింటి మొత్తం పట్ల పరస్పరసంబంధంచేత జరుగుతుంది.

మూ. వ్యఞ్జనౌషధిసంయోగో యథాన్నం స్వాదుతాం నయేత్,
ఏవం భావా రసాశ్చైవ భావయన్తి పరస్పరమ్. 37

తా. వ్యంజనాలు, ఓషధులు కలపడంవల్ల అన్నంలో రుచి పుట్టి నట్లు భావాలు రసాలూ కూడ పరస్పరమూ భావింపచేస్తుంటాయి.

వి. 'భావయన్తి' అనుదానికి ఇక్కడ, 'భావన' శబ్దానికి, పైశ్లోకవ్యాఖ్యానంలో చెప్పిన రెండవ అర్థం కూడ వర్తిస్తుంది.

మూ. యథా బీజాద్భవేద్వృక్షో వృక్షాత్పుష్పం ఫలం యథా,
తథా మూలం రసాః సర్వే తేభ్యో భావా వ్యవస్థితాః. 38

తా. బీజంనుండి వృక్షం ఎలా పుడుతుందో, వృక్షంనుండి పుష్పమూ ఫలమూ ఎలా పుడతాయో అదే విధంగా రసాలే అన్నింటికీ మూలం. అందుచేత రసాలవల్లనే భావాలు ఏర్పడతాయి.

వి. భావాలవల్ల రసాలు పుడతాయి అని అన్నట్లయితే "న హి రసాదృతే కశ్చిదప్యర్థః ప్రవర్తతే; తేన పూర్వం త ఏవోద్దేశ్యాః" (రసం లేకపోతే ఇతరమైన వేవీ లేవు; అందుచేత ముందుగా రసాలనే చెప్పాలి అని వెనుక చెప్పినదానికి ఇది విరుద్ధం కదా అని ఆశం తలంచుకొని - మొదట విత్తునుండి పుట్టిన చెట్టునుండే చివరికి పుష్పం ద్వారా ఫలరూపమైన మరొక విత్తనం పుట్టినట్లు, రసం అను విత్తనంనుండి క్రమంగా పుట్టిన భావాలే మళ్లీ రసానికి విత్తనాల వలె పనిచేస్తాయి అని ఈ శ్లోకంలో చెప్పబడింది. అనగా నిగూఢంగా నైనా రసాస్వాదార్హత లేని వానికి ఏ భావాలూ పుట్టవు; రసం అసలే పుట్టదు అని భావం.

మూ. తదేషాం రసానాముత్పత్తివర్ణదైవతనిదర్శనాన్యభివ్యాఖ్యాస్యామః, తేషాముత్పత్తిహేతవశ్చత్వారో రసాః, తద్యథా శృఙ్గారో, రౌద్రో, వీరో, బీభత్స ఇతి. అత్ర -

తా. ఇక ఈ రసాల ఉత్పత్తి, వర్ణాలు, దేవతలు, ఉదాహరణలు - వీటి వ్యాఖ్య

(విస్తృత ప్రతిపాదనం) చేస్తాం. (నాలుగు రసాల ఉత్పత్తికి నాలుగు రసాలు కారణం. అదెట్లనగా - శృంగారం, రౌద్రం, వీరం, బీభత్సం - (ఇవి కారణరసాలు). వీటిలో -

మూ. శృఙ్గారాద్ధి భవేద్ధాస్యో రౌద్రాచ్చ కరుణో రసః,
వీరాచ్చైవాద్భుతోత్పత్తిః బీభత్సాచ్చ భయానకః. 39

తా. శృంగారరసంనుండి హాస్యరసం పుడుతుంది. రౌద్రంనుండి కరుణ, వీరంనుండి అద్భుతం, బీభత్సంనుండి భయానకమూ పుడతాయి.

మూ. శృఙ్గారానుకృతిర్యా తు స హాస్యస్తు ప్రకీర్తితః,
రౌద్రస్యైవ చ యత్కర్మ స జ్ఞేయః కరుణో రసః. 40
వీరస్యాపి చ యత్కర్మ సోఽద్భుతః పరికీర్తితః,
బీభత్సదర్శనం యచ్చ జ్ఞేయః స తు భయానకః. 41

తా. శృంగారాన్ని అనుకరిస్తే అది హాస్యం అవుతుంది. రౌద్రరసం కర్మ (దాని పని) కరుణరసం. వీరరసం కర్మ అద్భుతరసం. బీభత్సాన్ని చూపడం భయానకం.

మూ. శ్యామో భవతి శృఙ్గారః సితో హాస్యః ప్రకీర్తితః,
కపోతః కరుణశ్చైవ రక్తో రౌద్రః ప్రకీర్తితః. 42
గౌరో వీరస్తు విజ్ఞేయః కృష్ణశ్చైవ భయానకః,
నీలవర్ణస్తు బీభత్సః పీతశ్చైవాద్భుతః స్మృతః. 43

తా. శృంగారం చామనచాయతో ఉంటుంది. హాస్యం తెల్లగాను, కరుణ పావురం రంగుతోను, రౌద్రం ఎఱ్ఱగాను, వీరం పసుపు కలిసిన తెలుపువర్ణంతోను (బంగారం రంగు) భయానకం నల్లగాను, బీభత్సం నీలంగాను, అద్భుతం పచ్చగాను ఉంటాయి.

వి. ఆ యా రసాలను ధ్యానించడానికై ఈ రంగుల చెప్పబడ్డాయి. (అ.భా.)

మూ. శృఙ్గారో విష్ణుదేవత్యో హాస్యః ప్రమథదైవతః,
రౌద్రో రుద్రాధిదైవత్యః కరుణో యమదైవతః. 44
బీభత్సస్య మహాకాలః కాలదేవో భయానకః,
వీరో మహేన్ద్రదేవః స్యాదద్భుతో బ్రహ్మదైవతః. 45

తా. శృంగారానికి అధిష్ఠానదేవత విష్ణువు. హాస్యానికి ప్రమథగణాలు. రౌద్రానికి రుద్రుడు. కరుణకు యముడు. బీభత్సానికి మహాకాలుడు. భయానకానికి కాలదేవత. వీరానికి మహేంద్రుడు. అద్భుతానికి బ్రహ్మదేవుడు.

వి. ఆ యా రసాల సిద్ధికై పూజలు నిర్వర్తించి నపుడు పూజించవలసిన దేవతలు వీరు. (అ.భా.)

మూ. ఏవమేతేషాం రసానాముత్పత్తివర్ణదైవతాన్యభివ్యాఖ్యాతాని. ఇదానీమన్నుభావవిభావ వ్యభిచారిసంయుక్తానాం లక్షణనిదర్శనాన్యభివ్యాఖ్యాస్యామః. స్థాయిభావాంశ్చ రసత్వముప నేష్యామః.

తా. ఈ విధంగా ఈ రసాల ఉత్పత్తి - వర్ణ - అధిష్ఠానదేవతలను చెప్పాం. ఇప్పుడు అనుభావ - విభావ - వ్యభిచారిభావాలతో కూడిన రసాల లక్షణాలను, ఉదాహరణలను వ్యాఖ్యానించెదము. స్థాయిభావాలు ఎలా రసా లవుతాయో ప్రతిపాదిస్తాం.

అథ శృఙ్గారరసప్రకరణమ్

మూ. తత్ర శృఙ్గారో నామ రతిస్థాయిభావప్రభవః. ఉజ్జ్వలవేషాత్మకః. యత్కించిల్లోకే శుచి మేధ్యమ్, ఉజ్జ్వలం, దర్శనీయం వా తత్ శృఙ్గారేణోపమీయతే. యస్తావదుజ్జ్వలవేషః స శృఙ్గారవానిత్యుచ్యతే. యథా చ గోత్రకులాచారోత్పన్నాని, ఆప్తోపదేశసిద్ధాని పుంసాం నామాని భవన్తి తథైవేషాం రసానాం భావానాం చ నాట్యాశ్రితానాం చార్థానామ్ ఆచారోత్పన్నాని ఆప్తోపదేశసిద్ధాని నామాని. ఏవమేష ఆచారసిద్ధో హృద్యోజ్జ్వలవేషాత్మకత్వాత్ శృఙ్గారో రసః. స చ స్త్రీపురుషహేతుక ఉత్తమయువప్రకృతిః.

తా. వాటిలో శృంగారం అనేది రతి అను స్థాయిభావంనుండి పుట్టినది. ఉజ్జ్వలమైన అనగా ప్రకాశించే, మెరిసిపోయే ఆకర్షక మైన వేషస్వరూప మైనది. లోకంలో శుభ్రము, పవిత్రము, ప్రకాశించేది, చూడ ముచ్చట గొల్పేది అయిన ఏ వస్తువైనా దానిని శృంగారంతో (శృంగారపురుషునితో) పోలుస్తారు. ఉజ్జ్వల మైన వేషం ధరించినవానిని శృంగారవంతు డంటారు. పురుషులకు గోత్రము, కులము, ఆచారము (ఇంటిలోని సంప్రదాయము) వీటిని పట్టి ఏర్పడినవి, ఆప్తుల ఉపదేశంచేత నిర్ణయింపబడినవీ అయిన పేర్లు ఏ విధంగా ఉంటాయో అదే విధంగా, ఈ రసాలకు, భావాలకు, నాట్యానికి సంబంధించిన ఇతర విషయాలకు కూడ ఆచారం (సంప్రదాయం) ప్రకారం వస్తూన్నవీ, ఆప్తుల ఉపదేశంచేత నిర్ణయింపబడినవి అయిన పేర్లు ఉంటాయి. ఈ విధంగా, ఈ రసం ఉజ్జ్వలవేషస్వరూప మైనది గాన 'శృంగారము' అను పేరు ఆచారసిద్ధ మైనది. దీనికి స్త్రీపురుషులు హేతువు. ఉత్తమప్రకృతి గల యువతీయువకులు దీనికి కారణం.

వి. రసాదులకు ప్రసిద్ధిలో ఉన్న పేర్లన్నీ అతిప్రాచీనకాలంనుంచీ వస్తూన్నవే కాని క్రొత్తగా నాట్యశాస్త్రకారుడు పెట్టినవి కావు అని పై మాటలవల్ల తెలుస్తూన్నది. కొన్ని పేర్లకు శ్రమపడితే వ్యుత్పత్త్యర్థం కనబడవచ్చు గాని అన్నింటికి లభించకపోవచ్చు. శృంగార శబ్దానికి వ్యుత్పత్తి చెప్పడంకోసం ప్రయత్నిస్తూ కొందరు శాస్త్రకారులు - శృంగం అనగా ప్రాధాన్యం; రసాలలో ప్రాధాన్యం పొందినది శృంగారం అని అర్థం చెప్పారు కాని

నాట్యశాస్త్రంలోని ఈ ఘట్టం చూస్తే ఈ పేర్లన్నీ అతిప్రాచీనకాలంనుంచీ వస్తున్నట్లు కనబడుతుంది.

ఈ ఘట్టంలోనే అభినవగుప్తుడు **"రసాదీనాం తచ్ఛాస్త్రవేదివృద్ధవ్యవహారతః నిరూఢాని ప్రాక్తనబ్రహ్మాద్యాప్తప్రణీతాని నామాని"** రసాదుల ఈ పేర్లు ప్రాచీనులైన శాస్త్రకారుల ప్రసిద్ధిని పట్టి రూఢ మైపోయినవి (అనగా వీటికి వ్యుత్పత్తి వెదకడం అనవసరం). ప్రాచీను లైన బ్రహ్మాదు లైన ఆప్తులు ఏర్పరచినవే ఈ పేర్లు" అన్నాడు. 'శృంగ' శబ్దానికి ఏదో మత్వర్థప్రత్యయం చేర్చి అర్థం చెప్పిన ఒక వ్యాఖ్యకారుణ్ణి ఆక్షేపిస్తూ వ్యాకరణ శాస్త్రంలోని **'శృఙ్గవృన్దాభ్యామారకన్'** అను వార్తికాన్ని **'శృఙ్గారభృఙ్గారే'** అను ఉణాది సూత్రాన్ని మరిచి ఇత డిలా వ్రాశాడు అని ఆక్షేపించాడు. (అభినవభారతి).

మూ. తస్య ద్వే అధిష్ఠానే సమ్భోగో విప్రలమ్భశ్చ. తత్ర సంభోగస్తావత్ - ఋతుమాల్యానులేపనాలంకారేష్టజనవిషయవరభవనోపభోగోపవనగమనానుభవనశ్రవణదర్శనక్రీడాలీలాదిభిః విభావైరుత్పద్యతే.

తా. శృంగారరసానికి సంభోగము, విప్రలంభమూ అని రెండు అవస్థలు. వాటిలో సంభోగశృంగారం, ఋతువులు, పుష్పమాలలు, సుగంధద్రవ్యానులేపనములు (మైపూతలు) అలంకారములు, ఇష్టజనుడు (ప్రియుడు లేదా ప్రియురాలు) భోగ్యవస్తువులు, శ్రేష్ఠమైన భవనము, వాటి భోగము, ఉద్యానగమనము, అక్కడ అనుభవించడము, ప్రియుణ్ణి లేదా ప్రియురాలిని గూర్చి శ్రవణము, దర్శనము, క్రీడ, విలాసలు మొదలైన విభావాలచేత పుడుతుంది.

మూ. తస్య నయనచాతుర్య - భ్రూక్షేప - కటాక్ష - సంచార. లలితమధురాఙ్గహార - వాక్యాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. వ్యభిచారిణశ్చ అలస్య - ఔగ్ర్య - జుగుప్సాః వర్జ్యాః.

తా. నేత్రాల నేర్పు, కనుబొమ్మల విరుపు, క్రీకంటి చూపులు, నడక, లలితములు మధురములు అయిన అంగహారములు, మాటలు మొదలైన అనుభావాలతో సంభోగ శృంగారాభినయం చెయ్యాలి. దీనిలో ఆలస్యము, ఉగ్రత్వము, జుగుప్స అను వ్యభిచారి భావాల ప్రయోగం ఉండకూడదు.

మూ. విప్రలమ్భకృతస్తు నిర్వేద - గ్లాని - శఙ్కా - అసూయా - శ్రమ - చిన్తా - ఔత్సుక్య - నిద్రా - స్వప్న - విబోధ - వ్యాధి - ఉన్మాద - అపస్మార - జాడ్య (మోహ) మరణాదిభిః అనుభావైః అభినేతవ్యః.

తా. విప్రలంభశృంగారాన్ని నిర్వేదము, గ్లాని, శంక, అసూయ, శ్రమము, చింత, ఔత్సుక్యము. నిద్ర, స్వప్నము, మేల్కొనడం, వ్యాధి, ఉన్మాదము, అపస్మారము, జడత్వము, మోహము, మరణము మొదలైన అనుభావాలతో అభినయించాలి.

మూ. అత్రాహ - యద్యయం రతిప్రభవః శృఙ్గారః కథమస్య కరుణాశ్రయిణః భావాః భవన్తి? అత్రోచ్యతే. పూర్వమేవాభిహితం సంభోగవిప్రలమ్భకృతః శృఙ్గారః ఇతి. వైశిక శాస్త్రకారైశ్చ దశావస్థోఽభిహితః. తాశ్చ సామాన్యాభినయే వక్ష్యామః.

తా. ఇక్కడ ప్రశ్నిస్తున్నాడు - శృంగారం రతినుండిపుట్టినది కదా; కరుణకు సంబంధించిన భావాలు దీని కెలా ఉంటాయి? సమాధానం చెపుతున్నాం - శృంగారం సంభోగచేత విప్రలంభంచేత (వియోగంచేత) చేయబడుతుంది (కలుగుతుంది) అని పూర్వమే చెప్పాం కదా! అందుచేతనే కామశాస్త్రకారులు దీనిలో (శృంగారంలో) పది అవస్థలు ఉంటాయి అని చెప్పారు. వాటిని గూర్చి సామాన్యాభినయప్రకరణంలో చెపుతాం.

మూ. కరుణస్తు శాప - క్లేశ - వినిపతితేష్టజన - విభవనాశ - వధ - బన్ధసముత్థః నిరపేక్షభావః. ఔత్సుక్యచిన్తాసముత్థః సాపేక్షభావో విప్రలమ్భః. ఏవమన్యః కరుణః అన్యశ్చ విప్రలమ్భ ఇతి. ఏవమేష సర్వభావసంయుక్తః శృఙ్గారో భవతి.

తా. శాపము, క్లేశములు, పడిపోయిన (కష్టాలలో పడిన) ఇష్టజనులు, వైభవ నాశము, వధ, బంధము - వీటివల్ల కలిగిన నిరపేక్షభావం (పూర్తిగా ఆశ వదులు కొనడం) కరుణ. విప్రలభంలో నైతే ఔత్సుక్యంవల్ల చింతవల్ల సాపేక్షభావం (ఎప్పటికైనా ఈ కష్టంనుండి గట్టెక్కుతాం అనే ఆశ) ఉంటుంది. అందుచేత కరుణ వేరు విప్రలంభం వేరు. ఈ విధంగా శృంగారరసంలో అన్ని భావాలకు (వ్యభిచారిభావాలకు) అవకాశం ఉంటుంది.

మూ. అపి చ -

సుఖప్రాయేషు సంపన్నః ఋతుమాల్యాదిసేవకః,
పురుషః ప్రమదాయుక్తః శృఙ్గార ఇతి సంజ్ఞితః. 46

తా. మరొక విషయమేమనగా - సుఖప్రధానము లైనవాటియందు సంపన్నుడు, ఋతువులను, మాల్యాదులను సేవించేవాడు, తగిన ప్రమదతో కూడినవాడు అయిన పురుషుడే శృంగార మని చెప్పబడుచున్నాడు. అనగా పురుషుని ఇలాంటి స్థితి శృంగారము అని భావం.

మూ. అపి చాత్ర సూత్రార్థానువిద్ధే ఆర్యే భవతః -

ఋతుమాల్యాలఙ్కారైః ప్రియజనగాన్ధర్వకావ్యసేవాభిః,
ఉపవనగమనవిహారైః శృఙ్గారరసః సముద్భవతి. 47

నయనవదనప్రసాదైః స్మితమధురవచోధృతిప్రమోదైశ్చ
మధురైశ్చాఙ్గవిహారైస్తస్యాభినయః ప్రయోక్తవ్యః. 48

ఇతి శృఙ్గారరసప్రకరణమ్

తా. ఈ సందర్భంలో - సూత్రార్థంతో సంబంధించిన (సూత్రార్థాన్ని విశదీకరించే) రెండు ఆర్యలు కూడ ఉన్నాయి -

వసంతాదిఋతువులచేత, మాల్యములచేత, అలంకారాలచేత, ప్రియజనులను, సంగీతమును కావ్యములను సేవించడంచేత, అనగా వీటితో దగ్గర సంబంధంచేత, ఉద్యానవనమునకు వెళ్లడంచేత, అక్కడ విహరిండంచేత శృంగారరసం పుడుతుంది.

నేత్రాలు (చూపులు) ముఖము ప్రసన్నంగా ఉండడము, చిరునవ్వు, మధుర మైన మాటలు, మనః స్థైర్యము, మధురమైన అవయవాల కదలికలు - వీటితో శృంగారరసాభినయం చెయ్యాలి.

శృఙ్గారరసప్రకరణం సమాప్తం

అథ హాస్యరసప్రకరణమ్

మూ. అథ హాస్యో నామ హాసస్థాయిభావాత్మకః. స చ వికృతపరవేషాలంకార - ధార్ష్ట్య - లౌల్య - కుహకాసత్ప్రలాప - వ్యఙ్గదర్శన - దోషోదాహరణాదిభిః విభావైః ఉత్పద్యతే. తస్య ఓష్ఠ - నాసా - కపోలస్పన్దన - దృష్టివ్యాకోశ - ఆకుఞ్చన - స్వేద - ఆస్యరాగ - పార్శ్వగ్రహణాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. వ్యభిచారిణశ్చాస్య అవహిత్థా - ఆలస్య - తన్ద్రా - నిద్రా - స్వప్న - ప్రబోధ - అసూయాదయః.

తా. హాసం స్థాయిభావంగా గలది హాస్యరసం. ఇతరుల వికృతవేషము, అలంకారము, ధార్ష్ట్యము (పొగరు), చపలత్వము, కుహకము, చెడ్డ పేలాపన, అంగవికారము మొదలైన వాటిని చూడడం, ఏవైన దోషాలను (నత్తి మొదలైనవి) గూర్చి చెప్పడం మొదలైన విభావాలచేత హాస్యరసం పుడుతుంది. పెదవులు, ముక్కు, చెక్కిళ్లు మొదలైనవాటి స్పందనము (కదలడం), కళ్లు పెద్దవి చేయడం, చిన్నవి చేయడం, చెమట, ముఖం ఎఱ్ఱబడడం. పక్కలు చేతులతో పట్టుకొనడం మొదలైన అనుభవాలచేత అభినయించి హాస్యరసాన్ని ప్రయోగించాలి. అవహిత్థ, అలసత్వము, తంద్ర (బద్ధకం), నిద్ర, స్వప్నం, మేల్కొనడం, అసూయ మొద లైనవి హాస్యానికి వ్యభిచారిభావాలు.

వి. కుహకం అనగా చక్కిలిగింతలుపెట్టడం అని అభినవభారతి. వంచన, మోసం అను అర్థాలు చెపితే బాగుంటుంది.

మూ. ద్వివిధశ్చాయమాత్మస్థః పరస్థశ్చ. యదా స్వయం హసతి తదా ఆత్మస్థః. యదా తు పరం హాసయతి తదా పరస్థః.

తా. ఆత్మస్థము, పరస్థమూ అని హాస్యం రెండు విధాలు. తాను నవ్వినపుడు ఇది ఆత్మస్థం. పరులను నవ్వించి నప్పుడు ఇది పరస్థం.

మూ. అత్రానువంశ్యే ఆర్యే భవతః -

విపరీతాలఙ్కారైర్వికృతాచారాభిధాన వేషైశ్చ,
వికృతైరర్థవిశేషైర్హసతీతి రసః స్మృతో హాస్యః. 49

తా. ఈ విషయంలో రెండు అనువంశ్య ఆర్య లున్నాయి -

విపరీతమైన అలంకారాలచేత, వికృతమైన ఆచారం (ఆచరణ) చేత, పేర్లచేత, వేషాలచేత, వికృతమైన ఆ యా విషయాలచేత, మానవుడు నవ్వుతాడు. అందుచేత అది హాస్య మను రసంగా చెప్పబడింది. ఇది **ఆత్మస్థహాస్యం**.

మూ. వికృతాచారైః వాక్యైః అఙ్గవికారైశ్చ వికృతవేషైశ్చ,
హాసయతి జనం యస్మాత్ తస్మాత్ జ్ఞేయో రసో హాస్యః. 50

తా. వికృతమైన ప్రవర్తనలచేత, వికృతమైన మాటలచేత, అవయవవికారాలచేత వికృత మైన వేషాలు ధరించడంచేత ఇతరులను నవ్వింపచేస్తాడు. ఇది **పరస్థహాస్యం**.

మూ. స్త్రీనీచప్రకృతావేష భూయిష్ఠం దృశ్యతే రసః,
షడ్భేదాశ్చాస్య విజ్ఞేయాః తాంశ్చ వక్ష్యామ్యహం పునః. 51

తా. ఈ రసం తరచు స్త్రీలలోను, నీచప్రకృతి గల మనుషులలోను కనబడు తున్నది. దీనిలో ఆరు భేదా లున్నాయి. వాటిని కూడ నేను చెపుతాను.

మూ. స్మితమథ హసితం విహసితముపహసితం చాపహసితమతిహసితమ్,
ద్వౌ ద్వౌ భేదౌ స్యాతాముత్తమమధ్యాధమప్రకృతౌ. 52

తా. స్మితము, హసితము, విహసితము, ఉపహసితము, అపహసితము, అతిహసితము అను ఆరు విధాల హసితభేదాలలో రెండేసి వరుసగా ఉత్తమ - మధ్యమ - అధమప్రకృతులైన వాళ్లలో ఉంటాయి.

మూ. తత్ర -

స్మితహసితే జ్యేష్ఠానాం మధ్యానాం విహసితోపహసితే చ,
అధమానామపహసితం హ్యతిహసితం చాపి విజ్ఞేయమ్. 53

తా. ఉత్తమప్రకృతి గలవాళ్లకు స్మిత - హసితాలు, మధ్యమప్రకృతి గలవాళ్లకు విహసితోపహసితాలు. అధములకు అపహసిత - అతిహసితాలు ఉంటాయి.

మూ. అత్ర శ్లోకాః -

ఈషద్వికసితైర్గణ్డైః కటాక్షైః సౌష్ఠవాన్వితైః,
అలక్షితద్విజం ధీరముత్తమానాం స్మితం భవేత్. 54

ఉత్ఫుల్లాననేత్రం తు గణ్డైర్వికసితైరథ,
కించిల్లక్షితదన్తం చ హసితం తద్విధీయతే. 55

తా. కొంచెం వికసించిన చెక్కిళ్లతో, చక్కగా అందంగా ఉన్న క్రీగంటి చూపులతో, దంతాలు కనబడకుండగా ధీరంగా గంభీరంగా ఉన్న చిరునవ్వు స్మితం. అది ఉత్తమ ప్రకృతులలో ఉంటుంది.

చెక్కిళ్లు కొంచెం వికసించగా, ధీరంగా ముఖము నేత్రాలూ కూడ బాగా ఉత్ఫుల్లము లువుతాయి (వికసిస్తాయి). దంతాలు కొంచెం పైకి కనబడతాయి. ఇది హసితం. ఇది కూడ ఉత్తప్రకృతులలోనే ఉంటుంది.

మూ. అథ మధ్యమానామ్ -

ఆకుఞ్చితాక్షిగణ్డం యత్సస్వనం మధురం తథా,
కాలాగతం సాస్యరాగం తద్వై విహసితం భవేత్. 56
ఉత్ఫుల్లనాసికం యత్తు జిహ్మదృష్టినిరీక్షితమ్,
నికుఞ్చితాఙ్గకశిరస్తచ్చోపహసితం భవేత్. 57

తా. కళ్లూ గండస్థలాలూ కొంచెం వంగుతాయి. మధురమైన ధ్వని ఉంటుంది. ముఖం ఎఱ్ఱబడుతుంది. తగిన సమయంలో (కారణం ఉంటేనే) వస్తుంది. అది **విహసితం**.

ఏ నవ్వులో ముక్కు వికసిస్తుందో, కంటి చూపు వక్రంగా ఉంటుందో, ఒడలూ శిరస్సూ కూడ వంచబడతాయో అది **ఉపహసితం**.

ఈ రెండు విధాల హాస్యాలూ మధ్యమప్రకృతులవి.

మూ. అథాధమానామ్ :-

అస్థానహసితం యత్తు సాశ్రునేత్రం తథైవ చ,
ఉత్కమ్పితాంసకశిరః తచ్చాపహసితం భవేత్. 58

సంబద్ధం సాశ్రునేత్రం చ వికృష్టస్వరముద్ధతమ్,
కరోపగూఢపార్శ్వం చ తచ్చాతిహసితం భవేత్. 59

తా. కన్నీళ్లతో నిండిన కళ్లతో, బుజాలూ శిరస్సూ ఊగిపోతూ అస్థానంలో, నవ్వకూడని చోట నవ్వే నవ్వు **అపహసితం**.

చాలా హడావిడి చేస్తూ, కళ్లనుండి నీళ్లు కారుతూండగా, కర్ణకఠోరమైన ధ్వనితో రెండు చేతులతో రెండు పార్శ్వాలూ పట్టుకొంటూ బిగ్గరగా నవ్వే నవ్వు **అతిహసితం**. ఈ రెండు విధాలైన హసితములూ కూడ అధమప్రకృతిగలవారిలో కనబడుతాయి.

మూ. హాస్యస్థానాని యాని స్యుః కార్యోత్పన్నాని నాటకే,
ఉత్తమాధమమధ్యానామేవం తాని ప్రయోజయేత్. 60

తా. నాటకంలో ఉత్తమాధమ మధ్యములకు సంబంధించిన హాస్యానికి అవసరం ఏర్పడినప్పుడు వాటిని ఈ విధంగా ప్రయోగించాలి.

మూ. ఇత్యేష స్వసముత్థస్తథా పరసముత్థశ్చ విజ్ఞేయః,
ద్వివిధస్త్రిప్రకృతిగతస్త్ర్యవస్థగతో రసో హాస్యః. 61

ఇతి హాస్యప్రకరణమ్.

తా. ఈ విధంగా స్వసముత్థము, పరసముత్థము అని రెండు విధా లైనదీ, ఉత్తమ మధ్యమ - అధమప్రకృతిగత మవడంచేత త్రిప్రకృతి అయిన మూడు అవస్థలు గల రసం హాస్యం.

వి. ఇతరులకు సంక్రమించని, స్మిత - హసిత - విహసితాలు ఆత్మసముత్థములు. తరులలో సంక్రమించే ఉపహసిత - అపహసిత - అతిహసితాలు పరసముత్థాలు (అభినవభారతి).

హాస్యప్రకరణం సమాప్తం.

అథ కరుణప్రకరణమ్

మూ. అథ కరుణో నామ శోకస్థాయిభావప్రభవః. స చ శాప - క్లేశవినిపతితేష్టజన- ప్రయోగ - విభవనాశ - వధ - బన్ధ - విద్రవ - ఉపఘాత - వ్యసనసంయోగాదిభిః విభావైః సముపజాయతే. తస్య అశ్రుపాత - పరిదేవన - ముఖశోషణ - వైవర్ణ్య - స్రస్తగాత్రతా - నిఃశ్వాస - స్మృతిలోపాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. వ్యభిచారిణశ్చాస్య నిర్వేదగ్లాని - చిన్తా - ఔత్సుక్య - ఆవేగ - భ్రమ - మోహ - శ్రమ భయ - విషాద - దైన్య - వ్యాధి - జడతా - ఉన్మాద - అపస్మార - త్రాస - ఆలస్య మరణ - స్తమ్భ - వేపథు - వైవర్ణ్య - అశ్రు - స్వరభేదాదయః.

తా. కరుణరసం శోకం అను స్థాయిభావంనుండి పుడుతుంది. అది శాపంచేత కష్టాలలో చిక్కుకొన్న లేదా ఏదో కష్టంలో చిక్కుకొన్న ఇష్టజనులు, వియోగం, వైభవనాశం, వధ, బంధము, లోకోపద్రవము తలచినదానికి ఎదురుదెబ్బలు తగలడం, లేదా ఆకస్మికంగా శరీరానికి దెబ్బలు తగలడం, వ్యవసనంతో సంబంధము (వ్యసనం కలగడం) మొదలైన విభావాలచేత కలుగుతుంది. కన్నీళ్లు, విలపించడం, ముఖం ఎండిపోవడం, ముఖం రంగు మారిపోవడం, అవయవాలు జారిపోవడం, నిట్టూర్పు, మరుపు, మొదలైన అనుభావాలచేత దీని అభినయం చెయ్యాలి. దీనికి - నిర్వేదము, గ్లాని, చింత, ఔత్సుక్యం,

ఆవేగం, భ్రమ, మోహం, శ్రమ, భయం, విషాదం, దైన్యం, వ్యాధి, జడత్వం, ఉన్మాదం, మూర్ఛ, త్రాసం (దిగులు), అలసత్వం, మరణం, స్తంభం (కొయ్యబారడం), వణుకు, రంగు మారిపోవడం, కన్నీళ్లు, కంఠస్వరంలో వికారం, మొదలైనవి వ్యభిచారులు.

మూ. అత్రార్యే భవతః -
ఇష్టవధదర్శనాద్వా విప్రియవచనస్య సంశ్రవాద్వాపి,
ఏభిర్భావవిశేషైః కరుణరసో నామ సంభవతి. 62
సస్వనరుదితైర్మోహాగమైశ్చ పరిదేవితైర్విలపితైశ్చ,
అభినేయః కరుణరసో దేహాయాసాభిఘాతైశ్చ. 63

ఇతి కరుణరసప్రకరణం.

తా. ఇష్టులైనవారి వధను చూడడంవల్ల గాని, అప్రియ మైన వార్త వినడంవల్ల గాని, ఈ విధమైన ఇతరమైన భావవిశేషాలవల్ల గాని, (లేదా ఇలాంటి భావవిశేషాలతో,) కరుణ అనే రసం పుడుతుంది. బిగ్గరగా ఏడ్పులచేత మోహం చెందుతూండ డంచేత, పరిదేవితములచేత (దైవాన్నీ, ఇతరులనూ నిందించడంచేత), విలాపాలచేత తన దేహాన్ని ఆయాసపెట్టే రొమ్ము బాదుకొనడం వంటి పనులు చేయడం చేతా కరుణ రసాన్ని అభినయించాలి.

కరుణరసప్రకరణం సమాప్తం.

అథ రౌద్రరసప్రకరణమ్

మూ. అథ రౌద్రో నామ క్రోధస్థాయిభావాత్మకః. రక్షోదానవోద్ధతమనుష్యప్రకృతిః సంగ్రామ హేతుకః. స చ క్రోధ - ఆఘర్షణ - అధిక్షేప - అనృతవచన - ఉపఘాత - వాక్పారుష్య - అభిద్రోహ - మాత్సర్యాదిభిః విభావైః ఉత్పద్యతే. తస్య చ తాడన - పాటన - పీడన - ఛేదన - భేదన - ప్రహరణాహరణ - శస్త్రసంపాత - సంప్రహార - రుధిరాకర్షాద్యాని కర్మాణి. పునశ్చ రక్తనయన - భృకుటీకరణ - దన్తోష్ఠపీడన - గణ్డస్ఫురణ - హస్తాగ్రనిష్పేషాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః.

తా. రౌద్రరసానికి స్థాయిభావం క్రోధం. దీనికి ప్రకృతి (ఆశ్రయం) రాక్షసులు, దానవులు, ఉద్ధతమనుష్యులు (తీవ్రస్వభావం గల భీమసేనాదులు). యుద్ధం దీనికి హేతువు. క్రోధంతో లాగడం, నిందించడం, అసత్యవచనం, దెబ్బతగలడం, పరుష వాక్కులు, ద్రోహము, మాత్సర్యం మొదలైన విభావాలవల్ల పుడుతుంది. కొట్టడం, చీల్చడం, పీడించడం, ఛేదించడం, బద్దలుకొట్టడం, ఆయుధాలు ప్రయోగించడం, ఆయుధాలతో కొట్టడం, రక్తం లాగడం మొదలైన పనులు దీనివల్ల జరుగుతాయి. ఎఱ్ఱని నేత్రాలు, కను

బొమ్మలు విరవడం, దంతాలు పెదవులు బిగించడం, చెక్కిళ్లు కదలడం, అరిచేతులు పిండడం మొదలైన అనుభావాలచేత రౌద్రరసాభినయం చెయ్యాలి.

మూ. భావాశ్చాస్య అసమ్మోహా - ఉత్సాహా - ఆవేగ - అమర్ష - చపలతా - ఔగ్ర్య - గర్వ - స్వేద - వేపథు - రోమాఞ్చ - గద్గదాదయః.

తా. సంమోహం లేకపోవడం, ఉత్సాహము, ఆవేగము, అమర్షము, చపలత, ఉగ్రత్వము, గర్వము, చెమట, వణకు, రోమాంచము, గద్గదస్వరము మొదలైనవి దీనికి సంబంధించిన భావాలు (వ్యభిచారిసాత్త్వికభావాలు).

మూ. అత్రాహ - యదభిహితం రక్షోదానవాదీనాం రౌద్రో రసః - కిమన్యేషాం నాస్తి? ఉచ్యతే. అస్త్యన్యేషామపి రౌద్రో రసః. కింత్వధికారోఽత్ర గృహ్యతే. తే హి స్వభావత ఏవ రౌద్రాః. కస్మాత్? బహుబాహవః, బహుముఖాః, ప్రోద్ధూతవికీర్ణపిఙ్గలశిరోజాః, రక్తోద్వృత్తవిలోచనాః, భీమాసితరూపిణశ్చైవ. యచ్చ కించిత్సమారభన్తే స్వభావచేష్టితం వాగఙ్గాదికం తత్సర్వం రౌద్రమేతేషామ్. శృఙ్గారశ్చ తైః ప్రాయశః ప్రసభం సేవ్యతే. తేషాం చానుకారిణో యే పురుషాః తేషామపి సంగ్రామసంప్రహారకృతః రౌద్రో రసః అనుమన్తవ్యః.

తా. (ప్రశ్న) ఇక్కడ అంటున్నాడు - రౌద్రరసం రాక్షసదానవాదులకు సంబంధించినది అని అంటున్నావు కదా? ఇది ఇతరులలో ఉండదా? (సమాధానం) చెపుతున్నాం; విను. రౌద్రరసం ఇతరులకు కూడా ఉంటుంది. కాని ఈ విషయంలో రాక్షసాదులలో ఉన్న అధికారం (రౌద్రరసానువృత్తి) గ్రహింపబడుతుంది. ఎందువల్ల అనగా వాళ్లు సహజంగా స్వభావంచేతనే రౌద్రులు. ఎందువల్ల? వాళ్లకు చాలా చేతులు, చాలా ముఖాలు, ఉంటాయి. ఎఱ్ఱగా ఉన్న జుట్టు విరమోసికొని ఉంటారు. ఎఱ్ఱని కళ్లు గుడ్లు తిప్పుతూ ఉంటారు. నల్లగా భయంకర మైన రూపాలతో ఉంటారు. వాళ్లు మామూలుగా చేసే పనులు, మాటలు తీరూ కూడ రౌద్రంగానే ఉంటాయి. వాళ్ల శృంగారసేవ కూడ చాల మోటగా ఉంటుంది. వాళ్లను అనుకరించే పురుషులలో కూడ యుద్ధమూ, ఆయుధప్రయోగమూ మొదలైనవాటిచే ఏర్పడు రౌద్రం ఉంటుం దని అంగీకరించాలి; వాళ్లు ఆ విధంగా ప్రవర్తించాలి.

మూ. అత్రానువంశ్యే ఆర్యే భవతః -

యుద్ధప్రహారఘాతనవికృతచ్ఛేదన విదారణైశ్చైవ,
సంగ్రామసంభ్రమాద్యైరేభిః సంజాయతే రౌద్రః. 64

నానాప్రహరణమోక్షైః శిరఃకబన్ధభుజకర్తనైశ్చైవ,
ఏభిశ్చార్థవిశేషైః అస్యాభినయః ప్రయోక్తవ్యః. 65

తా. ఈ సందర్భంలో రెండు అనువంశ్యఆర్యలు ఉన్నాయి.

యుద్ధము, చంపివేయడము, అవయవాలు నరికివేయడము. వికారంగా శరీరం ఛేదించడము, చీల్చివేయడము, యుద్ధంకోసం ఆయుధాలు పట్టడం మొదలైన హడావిడి వీటి అన్నింటిచేతా రౌద్రం పుడుతుంది.

అనేకవిధాలైన ఆయుధాల ప్రయోగంచేత, శిరస్సులను, మొండెములను, భుజాలను ఖండించడంచేత, ఇంకా ఇలాంటి పనులచేత రౌద్రరసాభినయం ప్రయోగించాలి.

మూ. ఇతి రౌద్రరసో దృష్టో రౌద్రవాగఙ్గచేష్టితః,
శస్త్రప్రహారభూయిష్ఠః ఉగ్రకర్మక్రియాత్మకః. 66

ఇతి రౌద్రప్రకరణమ్.

తా. ఈ విధంగా రౌద్రరసం రౌద్రమైన మాటలూ, శారీరచేష్టలు, అధికమైన ఆయుధప్రయోగమూ ఉగ్రమైన పనులు చేయడం అనే స్వరూపంతో కనబడుతుంది.

రౌద్రరసప్రకరణం సమాప్తం.

అథ వీరరసప్రకరణమ్

మూ. అథ వీరో నామ ఉత్తమప్రకృతిః ఉత్సాహాత్మకః. స చ అసంమోహ - అధ్యవసాయ - నయ - వినయ - బల - పరాక్రమ - శక్తి - ప్రతాప - ప్రభావాదిభిః విభావైరుత్పద్యతే. తస్య - స్థైర్య - ధైర్య - శౌర్య - త్యాగ - వైశారద్యాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. భావాశ్చాస్య ధృతి - మతి - గర్వ - ఆవేగ - ఔగ్ర్య - అమర్ష - స్మృతి - రోమాఞ్చాదయః.

తా. వీరరసం ఉత్తమప్రకృతి గలది, ఉత్సాహస్వరూప మైనది. సంమోహం (ఏమి చెయ్యాలో తెలియని స్థితి) లేకపోవడం, నిశ్చితమైన ఆలోచన, నీతి, వినయం, బలం, పరాక్రమం, శక్తి, ప్రతాపం, ప్రభావం ఈ విభావాలవల్ల పుడుతుంది. స్థైర్యం, ధైర్యం, శౌర్యం, త్యాగం, నేర్పుమొదలైన అనుభవాలతో దీని అభినయం ప్రయోగించాలి. ధృతి, మతి, గర్వం, ఆవేశం, ఉగ్రత్వం, అమర్షం (కోపం) స్మృతి, రోమాంచం మొదలైనవి దీని భావాలు (వ్యభిచారి - సాత్త్వికభావాలు).

వి. **అసంమోహాధ్యవసాయం** అనగా యథార్థస్థితిని జాగర్తగా తెలిసికొని నిర్ణయం తీసికొనడం. సంధి మొదలైన షడ్గుణాలను సరిగా ప్రయోగించడం నయం. ఇంద్రియ జయం **వినయం.** చతురంగసైన్యం **బలం.** శత్రుమండలాక్రమణం **పరాక్రమం.** యుద్ధాది సామర్థ్యం శక్తి. శత్రువులను బాధించగలడు అను ప్రసిద్ధి **ప్రతాపం.** అభిజనులు, ధనం, మంత్రులు మొదలైనవాటి సంపత్తి (సమృద్ధి) **ప్రభావం** (అ.భా.).

మూ. అత్రార్యే రసవిచారముఖే :-

ఉత్సాహాధ్యవసాయాదవిషాదిత్వాదవిస్మయామోహాత్,
వివిధాదర్థవిశేషాద్వీరరసో నామ సంభవతి. 67
స్థితిధైర్యవీర్యగర్వైరుత్సాహపరాక్రమప్రభావైశ్చ,
వాక్యైశ్చాక్షేపకృతైర్వీరరసః సమ్యగభినేయః. 68

ఇతి వీరరసప్రకరణమ్

తా. ఈ సందర్భంలో, రసవిచారప్రారంభంలో రెండు సాంప్రదాయికములైన ఆర్యలు - ఉత్సాహము, అధ్యవసాయము, అవిషాదము, అవిస్మయం (చిన్నవిషయానికి కూడ ఆశ్చర్యపడడం విస్మయం. అది లేకపోవడం అవిస్మయం), మోహం లేకపోవడం, ఇలాంటి అనేకవిషయాలవల్ల వీరరసం పుడుతుంది.

స్థితి, ధైర్యము, వీర్యము, గర్వము, ఉత్సాహము, పరాక్రమము, ప్రభావము - వీటితోను, ఆక్షేపించే మాటలతోను వీరరసాన్ని బాగా అభినయించాలి.

వీరరసప్రకరణం సమాప్తం.

అథ భయానకరసప్రకరణమ్

మూ. అథ భయానకో నామ భయస్థాయిభావాత్మకః. స చ వికృతరవ - సత్త్వదర్శన - శివోలూకత్రాసోద్వేగ - శూన్యాగారారణ్యగమన - స్వజనవధబన్ధదర్శన - శ్రుతికథాదిభిర్విభావైరుత్పద్యతే. తస్య ప్రవేపిత కరచరణ - నయనచాపల - పులక - ముఖ - వైవర్ణ్య - స్వరభేదాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. భావాశ్చాస్య స్తమ్భ - స్వేద - గద్గద - రోమాఞ్చ - వేపథు - స్వరభేద - వైవర్ణ్య - శంకా - మోహ - దైన్య - ఆవేగ - చాపల - జడతా - త్రాస - అపస్మార - మరణాదయః.

తా. భయానకరసానికి భయం స్థాయిభావం. వికృతమైన ధ్వని (వినబడడం) పిశాచాదులను చూడడం, నక్కల, గుడ్లగూబల భయంవల్ల ఉద్వేగం, అనగా అవి భయపడి అరుస్తూండగా విని లేదా చూచి ఉద్వేగం చెందుట, శూన్యగృహంలోనికి, శూన్యారణ్యంలోనికి వెళ్లడం, తనవాళ్ల వధను గాని, బంధనాన్ని చూడడం, లేదా వినడం లేదా దాని గూర్చి సంభాషణ - మొదలైనవాటినుండి భయానకరసం పుడుతుంది. చేతులు కాళ్లు వణకిపోవడం, కళ్లు తిరిగిపోవడం, పులకలు, ముఖం రంగు మారిపోవడం, కంఠస్వరం మారిపోవడం మొదలైన అనుభావాలతో దీని అభినయం ప్రయోగించాలి.

స్తంభము, స్వేదము, దగ్గుత్తిక, రోమాంచము, వణుకు - స్వరం మారిపోవడం,

దైన్యం, ఆవేగం (కంగారు), చపలత్వం, జడత, త్రాసము, అపస్మారం, మరణం మొదలైనవి దీని భావాలు (వ్యభిచారి - సాత్త్వికభావాలు).

మూ. అత్రార్యాః-

వికృతరవసత్త్వదర్శనసంగ్రామారణ్యశూన్యగృహగమనాత్,
గురునృపయోరపరాధాత్కృతకశ్చ భయానకో జ్ఞేయః. 69

తా. ఈ విషయంలో మూడు ఆర్య లున్నాయి - వికృతమైనధ్వని (అట్టహాసాదికం) వినబడడం, పిశాచాదులు కనబడడం, యుద్ధరంగంలోకి, శూన్యగృహంలోకి, అరణ్యంలోకి ప్రవేశించడం - వీటివలన భయానకరసం పుడుతుంది. గురువుల (పెద్దవాళ్ల) విషయంలో కాని, రాజు విషయంలో కాని తనవలన ఏదైన అపరాధం జరిగి నప్పుడు చాల భయపడి నట్లు అభినయిస్తే అది కృత్రిమమైన భయానకం.

మూ. గాత్రముఖదృష్టిభేదైరూరుస్తమ్భాభివీక్షణోద్వేగైః,
సన్నముఖశోషహృదయస్పన్దనరోమోద్గమైశ్చ భయమ్. 70

తా. అవయవాలలోను, ముఖంలోను, నేత్రాలలోను మార్పుల చేత, కాళ్లు బిగిసిపోవడంచేత, నాలుగు దిక్కుల వైపూ చూస్తుండడంచేత, ఉద్వేగంచేత (మనస్సులో కంగారుచేత) చిక్కిపోయిన ముఖం ఎండిన ట్లయిపోవడంచేత, గుండె కొట్టుకొనడంచేత, రోమాంచంచేత భయానకాన్ని అభినయించాలి.

మూ. ఏతత్స్వభావజం స్యాత్ సత్త్వసముత్థం తథైవ కర్తవ్యమ్,
పునరేభిరేవ కార్యైః కృతకం మృదుచేష్టితైః కార్యమ్. 71

తా. స్వాభావిక మైన భయం ఈ విధంగా ఉండాలి. పిశాచాదులవల్ల భయం కూడ ఇలాగే అభినయించాలి. కృత్రిమభయం విషయంలో కూడ ఇవే భావాలను ప్రయోగించి అభినయించాలి; అయితే ఆ భావాలు మృదువు లైన చేష్టల ద్వారా చూపాలి.

మూ. కరచరణవేపథుస్తమ్భగాత్రహృదయకమ్పేన,
శుష్కోష్ఠతాలుకణ్ఠైః భయానకో నిత్యమభినేయః. 72

ఇతి భయానకరసప్రకరణమ్.

తా. చేతులు కాళ్లు వణికిపోవడం, దేహం కొయ్యబారిపోవడం, గుండె కొట్టుకొనడం, పెదవులు, చెలివిలు, కంఠము ఎండిపోవడం - వీటితో భయానకరసాన్ని అభినయించాలి.

భయానకప్రకరణం సమాప్తం.

అథ బీభత్సరసప్రకరణమ్

మూ. అథ బీభత్సో నామ జుగుప్సాస్థాయిభావాత్మకః, స చ అహృద్య - అప్రియ - అచోష్య - అనిష్టశ్రవణదర్శనకీర్తనాదిభిః విభావైరుత్పద్యతే. తస్య సర్వాఙ్గ సంహార - ముఖవికూణన - ఉల్లేఖన - నిష్ఠీవన - ఉద్వేజనాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. భావాశ్చాస్య అపస్మారోద్వేగమోహవ్యాధిమరణాదయః.

తా. ఇపుడు జుగుప్స (ఏవగింపు) స్థాయిభావంగా గల బీభత్సం చెప్పబడుచున్నది ఇంపైనవి కానివి, అప్రియములు, తిన తగనివి, అనిష్టములు అయినవాటిని చూడడం, వాటిని గూర్చి వినడం, వాటిని గూర్చి చెప్పుకొనడం మొదలైన విభావాలచేత బీభత్సరసం పుడుతుంది. అన్ని అవయవాలు ముణుచుకొనడం, ముఖం వంకరగా తిప్పడం, చీంద్రించడం, ఉమ్మివేయడం, ఉద్వేజనం (అసహించుకోవడం) మొదలైన అనుభావాలచేత దీనిని అభినయించాలి. అపస్మారం, ఉద్వేగం, ఆవేగం, మోహం, వ్యాధి, మరణం మొదలైనవి దీని భావాలు.

మూ. అత్రానువంశ్యే ఆర్యే భవతః -

అనభిమతదర్శనేన చ గన్ధరసస్పర్శశబ్దదోషైశ్చ,
ఉద్వేజనైశ్చ బహుభిః బీభత్సరసః సముద్భవతి. 73

ముఖనేత్రవికూణనయా నాసాప్రచ్ఛాదనావనమితాస్యైః,
అవ్యక్తపాదపతనైః బీభత్సః సమ్యగభినేయః. 74

ఇతి బీభత్సరసప్రకరణమ్.

తా. ఈ రసం విషయంలో రెండు అనువంశ్యార్య లున్నాయి .

ఇష్టం కాని వస్తువును చూడడంచేత, గంధ - రస - స్పర్శ - శబ్దాలలోని దోషాలచేత అసహ్యం కలిగించే ఇంకా అనేకమైన వస్తువులచేత బీభత్సరసం పుడుతుంది.

ముఖమూ నేత్రాలూ వంకరగా తిప్పడంచేత, ముక్కు కప్పుకొనడంచేత, ముఖం ముందికి వంచుకొనడంచేత నడకలో తొట్రుబాటుచేత బీభత్సరసం బాగా అభినయించాలి.

బీభత్సరసప్రకరణం సమాప్తం.

అథ అద్భుతరసప్రకరణమ్

మూ. అథ అద్భుతో నామ విస్మయస్థాయిభావాత్మకః. స చ దివ్యజనదర్శన - ఈప్సిత మనోరథావాప్తి - ఉపవనదేవకులాదిగమన - సభా - విమాన - మాయా - ఇన్ద్రజాల సంభావనాదిభిః విభావైః ఉత్పద్యతే. తస్య నయనవిస్తార - అనిమిషప్రేక్షణ - రోమాఞ్చ

అశ్రు - స్వేద - హర్ష - సాధువాద - దానప్రబన్ధ - హాహాకార - బాహువదనచేలాఙ్గులి భ్రమణాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. భావాశ్చాస్య స్తమ్భ - అశ్రు - స్వేద - గద్గద - రోమాఞ్చ - ఆవేగ - సంభ్రమ - జడతా - ప్రలయాదయః.

తా. ఇప్పుడు విస్మయం స్థాయిభావంగా గల అద్భుతరసాన్ని గూర్చి చెప్పబడుచున్నది - దివ్యజనుల దర్శనం, అనుకొన్న కోరిక తీరడం, ఉద్యాన - దేవాలయాదులకు వెళ్లడం, సభ - విమానము (అందమైన భవనము) మాయ - ఇంద్రజాలము - ఆదరంతో చేసిన సత్కారము మొదలైన విభావాలచేత అద్భుతరసం ఉత్పన్నం అవుతుంది. కళ్లు పెద్దవిగా చేయడం, రెప్పపాటు లేకుండా చూడడం. రోమాంచం, కన్నీళ్లు, స్వేదము, సంతోషము, 'బాగు బాగు' అనడం, ధనం ఇవ్వడం, నిరంతరంగా ఆహా ఆహా అని బిగ్గరగా అనడం, చేతులు, ముఖము, చేతిలోని వస్త్రము వేళ్లు తిప్పడం మొదలైన అనుభవాలతో అద్భుతరసా భినయం ప్రయోగించాలి. స్తంభము, కన్నీరు, గద్గదస్వరము, రోమాంచము, ఆవేగమూ, సంభ్రమము, జడత్వము ప్రలయము (సంజ్ఞ లేకపోవడం) మొదలైనవి దీని భావాలు.

మూ. అత్రానువంశ్యే అర్యే భవతః -

యత్త్వతిశయార్థయుక్తం వాక్యం శిల్పం చ కర్మరూపం వా,
తత్సర్వమద్భుతరసే విభావరూపం హి విజ్ఞేయమ్. 75

స్పర్శగ్రహోల్లుకసనైః హాహాకారైశ్చ సాధువాదైశ్చ,
వేపథుగద్గదవచనైః స్వేదాద్యైరభినయస్తస్య. 76

ఇత్యద్భుతరసప్రకరణం

తా. ఈ విషయంలో అనువంశ్యార్యలు రెండున్నాయి -

ఏదో ఒక వైశిష్ట్యంతో కూడిన అర్థం గల వాక్కు అందమైన శిల్పము, ప్రశంస నీయమైన కర్మ - ఇవన్నీ అద్భుతరసంలో విభావా లని గ్రహించాలి.

స్పర్శ, గ్రహణము, ఉల్లుకసనము, హాహాకారము, 'బాగుబాగు' అనడము, వణుకు, గద్గరస్వరము. స్వేదము మొదలైనవాటితో అద్భుతరసాన్ని అభినయించాలి.

వి. స్పర్శ :- కళ్లు సగం మూసి, కనుబొమ్మలు పైకి ఎత్తి బుజాలు చెక్కిళ్ల వైపు ఎగరవేయడం (shrugging) స్పర్శ. పారవశ్యంలో ప్రక్కనున్నవాళ్లనో, ఏదైనవస్తువునో పట్టుకొనడం గ్రహం. కూర్చున్నచోటనే త్రుళ్లిపడడం ఉల్లుకసనం.

అద్భుతరస ప్రకరణం సమాప్తం.

రసాలలో మూడేసి విధాలు, అద్భుతంలో రెండు విధాలు

మూ. శృఙ్గారం త్రివిధం విద్యాద్వాఙ్నైపథ్యక్రియాత్మకమ్,
అఙ్గనైపథ్యవాక్యైశ్చ హాస్యరౌద్రౌ త్రిధా స్మృతౌ. **77**

తా. వాక్కు, నైపథ్యం (వేషము), క్రియ (చేష్టలు) అని శృంగారం మూడు విధాలు. అట్లే హాస్యరౌద్రాలు, శరీరచేష్టలు, వేషము - మాటలు - వీటిచేత మూడు విధాలు.

మూ. ధర్మోపఘాతజశ్చైవ తథార్థాపచయోద్భవః,
తథా శోకకృతశ్చైవ కరుణస్త్రివిధః స్మృతః. **78**

తా. ధర్మానికి విఘాతం ఏర్పడడంవల్ల కలిగినది, ధనం తరిగిపోవడంవల్ల, లేదా అనుకొన్న ప్రయోజనానికి లోపం కలగడంవల్ల కలిగినది, శోకంవల్ల, కలిగినది అని కరుణరసం మూడు విధాలు.

మూ. దానవీరం ధర్మవీరం యుద్ధవీరం తథైవ చ,
రసం వీరమపి ప్రాహ బ్రహ్మా త్రివిధమేవ హి. **79**

తా. దానవీరం, ధర్మవీరం, యుద్ధవీరం అని వీరరసం మూడు విధాలు అని బ్రహ్మదేవుడు చెప్పాడు.

మూ. వ్యాజాచ్చైవాపరాధాచ్చ విత్రాసితకమేవ చ,
పునర్భయానకం చైవ విద్యాత్ త్రివిధమేవ హి. **80**

తా. కృత్రిమము, అపరాధంవల్ల కలిగినది, భయహేతువు కనబడడంవల్ల కలిగినది అని భయానకం కూడ మూడు విధములు.

మూ. బీభత్సః క్షోభజః శుద్ధ ఉద్వేగీ స్యాత్ ద్వితీయకః,
విష్ఠాకృమిభిరుద్వేగః క్షోభజో రుధిరాదిజః. **81**

తా. చిత్తక్షోభవలన కలిగిన **బీభత్సం శుద్ధం**; ఉద్వేగిబీభత్సం రెండవది. విష్ఠ (మలాదికము) కృములుమొదలైన అశుద్ధమైన విభావాలవల్ల కలిగినది **ఉద్వేగజ బీభత్సము.** రక్తమాంసాదులు చూడగా కలిగిన చిత్తక్షోభచే కలిగినది **క్షోభజబీభత్సము.**

వి. ఈ విధంగా శ్లోకంలో ఉన్నదానిని పట్టి బీభత్సం; శుద్ధము, ఉద్వేగి అని రెండు విధాలే అన్నట్లు తెలుస్తున్నది. అభినవగుప్తుడు మాత్రం తన గురువుల అభిప్రాయం ఉటంకిస్తూ విష్ఠాదుల ద్వారా కలిగినది రుధిరాదిదర్శనంవల్ల కలిగినదీ కూడ అశుద్ధమే అని అంటూ, యోగశాస్త్రంలో చెప్పి నట్లు శరీరాదుల విషయంలోనే జగుప్స కలగడం

చేత ఏర్పడిన బీభత్సం మోక్షహేతువు గాన అది శుద్ధం అనిసూచించాడు. ఈవిధంగా బీభత్సంలోకూడ మూడుభేదాలు అంగీకరించినట్లయింది.

మూ. దివ్యశ్చానన్దజశ్చైవ ద్విధా ఖ్యాతోఽద్భుతో రసః,
దివ్యదర్శనజో దివ్యః హర్షాదానన్దజః స్మృతః. **82**

తా. దివ్యము, ఆనందజము అని అద్భుతరసం రెండు విధాలు. దివ్యములైన వస్తువులను, పురుషులను చూడడంవల్ల కలిగినది **దివ్యాద్భుతం.** సంతోషంవల్ల కలిగినది **ఆనందజాద్భుతం.**

అథ శాన్తవిచారః (ఇది కొన్ని ప్రతులలో లేదు)

మూ. అథ శాన్తో నామ శమస్థాయిభావాత్మకః మోక్షప్రవర్తకః. స తు తత్త్వజ్ఞాన - వైరాగ్య - ఆశయశుద్ధ్యాదిభిః విభావైః సముత్పద్యతే. తస్య యమ - నియమ - అధ్యాత్మ ధ్యాన - ధారణ - ఉపాసన - సర్వభూతదయా - లిఙ్గగ్రహణాదిభిః అనుభావైః అభినయః ప్రయోక్తవ్యః. వ్యభిచారిణశ్చాస్య నిర్వేద - స్మృతి - ధృతి - సర్వాశ్రమ - శౌచ - స్తమ్భ - రోమాఞ్చాదయః.

తా. శమం స్థాయిభావంగా గల శాంతరసం మోక్షమార్గంలో ప్రవర్తింపచేస్తుంది. అది తత్వజ్ఞానము, వైరాగ్యము, అంతఃకరణశుద్ధి మొదలైన విభావాలచేత పుడుతుంది. యమ - నియమ - ఆత్మతత్త్వధ్యాన - ధారణ - ఉపాసనములు, సర్వభూతములయందు దయ, లింగగ్రహణము అనగా వైరాగ్యచిహ్నాలైన కాషాయవస్త్రాదుల గ్రహణము మొదలైన అనుభావాలచేత శాంతరసాభినయం ప్రయోగించాలి. నిర్వేదము, స్మృతి, ధృతి, సర్వాశ్రమ, శుచిత్వము, స్తంభము (అన్ని ఆశ్రమాలలోను శుచిత్వము), రోమాంచము మొదలైనవి దీని వ్యభిచారిభావాలు.

వి. **యమాలు** - **"తత్రాహింసాసత్యాస్తేయబ్రహ్మచర్యాపరిగ్రహాః యమాః"** (పాతంజలయోగసూత్రం. 2.30) అహింస, సత్యము, పరుల సొత్తు హరించకపోవడం, బ్రహ్మచర్యం, ధనాదులు కూడబెట్టుకొనకపోవడం - ఇవి **యమాలు.** **"శౌచసంతోషతపః స్వాధ్యాయేశ్వరప్రణిధానాని నియమాః"** (యో.సూ. 2.32) పవిత్రత్వము, సంతృప్తి, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరపూజ, (పరమేశ్వరునియందే ఎల్లవేళలా మనస్సు నిలుపుట) ఇవి **నియమాలు.** ఏదైన ఒకవసువునందు మనస్సు నిలపడం **ధారణ.** ఏవస్తువుపై మనస్సు నిలపబడినదో దానినే నిరంతరము చింతించుట **ధ్యానం.** **"దేశబన్ధః చిత్తస్య ధారణా" "తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్"** (యో.సూ. 3.1,2.)

మూ. అత్రార్యాః శ్లోకాశ్చ భవన్తి -

మోక్షాధ్యాత్మసముత్థః తత్త్వజ్ఞానార్థహేతుసంయుక్తః,
నైఃశ్రేయసోపదిష్టః శాన్తరసో నామ సంభవతి. 1

తా. మోక్షమును గూర్చి, అధ్యాత్మవిషయాలను గూర్చి చింతనచేత పుట్టేదీ, తత్త్వజ్ఞానానికి ఉపయోగించే హేతువులతో కూడినది, మోక్షమార్గం చూపే మహాత్ములచేత ఉపదేశింపబడినదీ అయిన శాంతరసం అనేది సంభవించును; (ఇది అసంభవం కాదు).

మూ. బుద్ధీన్ద్రియకర్మేన్ద్రియసంరోధాధ్యాత్మసంస్థితోపేతః,
సర్వప్రాణిసుఖహితః శాన్తరసో నామ విజ్ఞేయః. 2

తా. బుద్ధీంద్రియ - కర్మేంద్రియాలను అదుపులో పెట్టుకొని ఆత్మయందే స్థిరంగా నిలచినవారిచేత పొందబడేది, సకలప్రాణులకు సుఖకరము, హితమూ అయినది శాంత రసముగా తెలియదగినది.

మూ. న యత్ర దుఃఖం న సుఖం న ద్వేషో నాపి మత్సరః,
సమః సర్వేషు భూతేషు స శాన్తః ప్రథితో రసః.

తా. దేనిలో దుఃఖం కాని, సుఖం కాని, ద్వేషం కాని, అసూయ కాని ఉండదో, అన్ని ప్రాణుల విషయంలోను సమత్వబుద్ధి ఉంటుందో అట్టి శాంత మను రసం ప్రసిద్ధమైనది.

మూ. భావా వికారాః రత్యాద్యాః శాన్తస్తు ప్రకృతిర్మతః,
వికారః ప్రకృతేర్జాతః పునస్తత్రైవ లీయతే. 3

తా. రతి మొదలైన భావాలు వికారాలు, వికృతులు; శాంతంనుండి పుట్టిన కార్యాలు. శాంత మైతే వాటి కన్నింటికీ ప్రకృతి, కారణం, ప్రకృతినుండి జనించిన వికారం మళ్లీ దానిలోనే లీనమైపోతుంది.

మూ. స్వం స్వం నిమిత్తమాసాద్య శాన్తాద్భావః ప్రవర్తతే,
పునర్నిమిత్తాపాయే చ శాన్త ఏవోపలీయతే. 4

ఏవం నవరసా దృష్టాః నాట్యజ్ఞైర్లక్షణాన్వితాః.

తా. ఆ యా నిమిత్తకారణంవల్ల శాంతరసంనుండి రత్యాదిభావాలు పుడతాయి. నిమిత్తం తొలగిపోగానే తిరిగి అవి శాంతంలోనే అణగిపోతాయి.

ఇంతవరకు కొన్ని పుస్తకాలలో మాత్రమే ఉన్న ఈ భాగాన్ని ప్రామాణికంగా గ్రహించి అభినవగుప్తుడు - శాంతం రసం మాత్రమే కాదు; అన్నింటికంటె ప్రధానమైన రసం;

అన్ని రసాలు దీనినుండే పుట్టాయి" అని గట్టిగా వాదించి స్థాపించాడు. ఈ విషయాలన్నీ ఈ అధ్యాయం చివర ఉన్న అనుబంధంలో చర్చించబడ్డాయి.

మూ. ఏవమేతే రసా జ్ఞేయాస్త్వష్టౌ లక్షణలక్షితాః,
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి భావానామపి లక్షణమ్. 83

ఇతి భరతీయే నాట్యశాస్త్రే రసాధ్యాయః షష్ఠః.

తా. ఈ విధంగా వేరు వేరు లక్షణాలు గల ఈ ఎనిమిది రసాలు తెలియదగినవి. ఇటుపైన భావాల లక్షణం కూడ చెపుతాను.

పుల్లెల శ్రీరామచంద్రుడు రచించిన 'బాలానందిని' అను నాట్యశాస్త్రాంధ్ర వ్యాఖ్యానమునందు రసాధ్యాయ మను ఆరవ అధ్యాయం సమాప్తం.

"ఇ (ర)త్యాదిశక్త్యష్టకమధ్యవృత్తిర్యస్య స్వహృన్మణ్డలసంప్రయోజ్యా (జ్యః),
స్థాయీ శివశ్చేతసి తేన వృత్తిః కృతా రసాధ్యాయ ఇహ క్రమేణ."

- శ్రీమదభినగుప్తాచార్యాః.

శ్రీః శ్రీః శ్రీః.

బాలాసన్దినీవాఖ్య

షష్ఠాధ్యాయానికి అనుబంధం

(రససిద్ధాంతాదులను గూర్చిన చర్చ)

రససిద్ధాంతం : ఇపుడు లభిస్తూన్న, రససిద్ధాంతాన్ని ప్రతిపాదించే గ్రంథాలలో అతి ప్రాచీనమైనది భరతుని **నాట్యశాస్త్రం**. అయితే **నాట్యశాస్త్రా**నికి పూర్వం రసాన్ని గూర్చి తెలియదని అర్థం కాదు. **నాట్యశాస్త్రం** ఈ ఆకారంలో సిద్ధం అవడానికి పూర్వం అనేకమైన అనువంశ్య శ్లోకాలు, ఆర్యలు ప్రచారంలో ఉండేవి. వాటిని **నాట్యశాస్త్రం**లో అక్కడక్కడ చేర్చడం జరిగింది. రూపక ప్రయోగాన్ని దృష్టిలో ఉంచుకొని **నాట్యశాస్త్రం** నిర్మించబడింది. కావ్య-నాట్యశబ్దాలు రెండూ పర్యాయపదాలుగా కూడ ఉపయోగింపబడేవి. రససిద్ధాంతం **అభినవభారతి**లో అతివిస్తృతంగాను, **లోచనం**లో సంక్షిప్తంగాను ప్రతిపాదింపబడింది. మహాకవీ విమర్శాగ్రేసరుడూ అయిన అభినవగుప్తుడు **ధ్వన్యాలోకా**నికి నాట్యశాస్త్రానికి కూడా వ్యాఖ్యానాలు రచించాడు. నాట్యశాస్త్రం షష్ఠాధ్యాయంలోని 'నాట్యరసాః స్మృతాః' అనే వాక్యాన్ని వివరిస్తూ – "**నాట్యాత్ సముదాయరూపాత్** రసాః, యది వా **నాట్యమేవ** రసాః, **రససముదాయో** హి **నాట్యమ్. న** నాట్య ఏవ చ రసాః, కావ్యేఽపి నాట్యాయమాన ఏవ రసః, కావ్యార్థవిషయే హి ప్రత్యక్షకల్ప సంవేదనోదయే రసోదయః ఇత్యుపాధ్యాయాః. తదాహుః కావ్యకౌతుకే

"ప్రయోగత్వమనాపన్నే కావ్యే నాస్వాదసంభవః" ఇతి.
'వర్ణనోత్కలికాభోగప్రౌఢోక్త్యా సమ్యగర్పితాః,
ఉద్యానకాన్తాచన్ద్రాద్యా భావాః ప్రత్యక్షవత్ స్ఫుటాః'

ఇతి (అ.భా.మొ.సం 291-92).

అభినవగుప్తుడు ఇంకా ఇలా అన్నాడు – "**కావ్యం తావన్ముఖ్యతః దశరూపాత్మకమేవ** ... తత్ర యే స్వభావతః నిర్మలముకురహృదయాః త ఏవ సంసారోచితక్రోధ మోహాభిలాషపరవశమనసః న భవన్తి **తేషాం తథావిధదశరూపకాకర్ణనసమయే సాధారణ** రసనాత్మచర్వణగ్రాహ్యః రససంచయః నాట్యలక్షణః స్ఫుట ఏవ. యే త్వతథాభూతాః తేషాం ప్రత్యక్షోచితతథావిధచర్వణాలాభాయ నటాదిప్రక్రియా స్వగతక్రోధశోకాదిసంకట హృదయగ్రన్థిభఞ్జనాయ గీతాదిప్రక్రియా చ మునినా విరచితా. 'సర్వానుగ్రాహకం హి శాస్త్రమ్' ఇతి న్యాయాత్. తేన నాట్య ఏవ రసాః న లోకే ఇత్యర్థః. **కావ్యం చ నాట్యమేవ**" (మొ.సం.పే. 292).

రస శబ్దానికి ముఖ్యార్థం రుచి, లేదా ఆస్వాదం. కావ్యనాటకాదులలోని సౌందర్యం

యొక్క భావావేశపూర్ణమైన అనుభూతి (ఆస్వాదం) అని దీని లాక్షణికార్థం. కవి చేసే రచన (కావ్యం) **"హ్లాదైకమయి"** (కేవలానందస్వరూపం) అని అంటాడు మమ్మటుడు. పఠితమీద ప్రసరించే అత్యధికమైన కావ్య ప్రభావానికి ఎంత ప్రాధాన్యం ఉన్నదో ఈ ఒక్కపదం స్పష్టం చేస్తూన్నది.

జ్ఞానప్రధానము, అనుభూతిప్రధానమూ అని వాఙ్మయం రెండు విధాలని డి.క్వేన్సీ చేసిన ద్వివిధవిభాగం సంస్కృత రచయితలు ఏనాడో అంగీకరించి ఉన్నారు. మొదటి తరగతికి చెందిన వాఙ్మయం ఆ యా విషయాల జ్ఞానం కలిగిస్తే రెండవ తరగతికి చెందినది హృదయాన్ని స్పందింపచేస్తుంది. ఈ రెండు విధాల వాఙ్మయాన్ని ఒకచోట కలపడానికి అవకాశం లేకపోలేదు. అయితే వీటిని పూర్తిగా వేరు వేరుగానే ఉంచవచ్చును. సాహిత్య విమర్శ అనేది, అది సంస్కృతంలో ఉన్నా ఇతర భాషలలో ఉన్నా కూడ, పైన చెప్పిన ద్వితీయభేదానికి చెందిన గ్రంథాలకు సంబంధించి ఉంటుంది. కావ్యం, రూపకం, కథాఖ్యాయికాదులు – ఇవన్నీ దీనికి చెందినవి. వీటిలో ఇది తప్పా, ఒప్పా, ఇలా ఉంటుందా ఉండదా అనే ప్రశ్నలకు తావు లేదు. ప్రతిభాత్మకమైన సహజమానసిక భావనకూ (సంవిత్తుకూ) తర్కబలసంపాదిత మైన జ్ఞానానికీ చాల భేదం ఉంటుంది. కావ్యంలో ధ్వనింపబడే అర్థం విషయంలో ఇది తప్పా ఒప్పా అనే ప్రశ్నకు అవకాశం లేదని ఆనందవర్ధనుడు స్పష్టంగా చెప్పాడు – **"కావ్యవిషయే చ వ్యఙ్గ్యప్రతీతీనాం సత్యాసత్త్వ నిరూపణస్య అప్రయోజకత్వమేవ ఇతి తత్ర** ప్రమాణాన్తరవ్యాపారపరీక్షా **ఉపహాసాయైవ సంపద్యతే"** (ధ్వన్యా. పే. 253). రసాలకు కావ్యాలతో ఉన్న సంబంధాన్ని గూర్చి క్రమబద్ధమైన రీతిలో చర్చ, నిర్ణయమూ **ధ్వన్యాలోకం** వచ్చేవరకు జరగలేదు. అయితే ప్రాచీనాలంకారికులకు రసాని కున్న ప్రాధాన్యం తెలియ దని అర్థం కాదు.

"కామం సర్వోప్యలంకారో రసమర్థే నిషిఞ్చతి,
తథాప్యగ్రామ్యతైవైనం భారం వహతి భూయసా" (కావ్యాదర్శం.I.62)

అని **కావ్యాదర్శం** అంటూన్నది. రసవదలంకారం ఎనిమిది రసాలలో ఏదో ఒక రసం మీద ఆధారపడి ఉంటుం దని దండి సోదాహరణంగా ప్రతిపాదించాడు. స్థాయిభావాలకీ రసాలకీ ఉన్న భేదం కూడ దండికి స్పష్టంగా తెలుసును (చూ.కావ్యాదర్శ II.280 - 292).

"మధురం రసవద్వాచి వస్తున్యపి రసస్థితిః,
యేన మాద్యన్తి ధీమన్తః మధునేవ మధువ్రతాః" (కావ్యాద.I.51)

"కన్యే కామయమానం మాం న త్వం కామయసే కథమ్,
ఇతి గ్రామ్యోఽయమర్థాత్మా వైరస్యాయ ప్రకల్పతే"

"కామం కన్దర్పచణ్డాలో మయి వామాక్షి నిర్దయః
త్వయి నిర్మత్సరో దిష్ట్యేత్యగ్రామ్యోఽర్థో రసావహః" (I. 63,64)

ఇత్యాది శ్లోకాలు కావ్యంలో దండి రసానికి ఎంత ప్రాధాన్యం ఇచ్చాడో సూచిస్తున్నాయి.

"రసవద్దర్శితస్పష్టశృఙ్గారాదిరసం యథా" (భామహకా. III. 6)

అను శ్లోకం భామహునకు రసాల విషయంలో ఉన్న పరిచయాన్ని సూచిస్తూన్నది. మహాకావ్యంలో రసా లుండాలి అని కూడ అతడు అన్నాడు -

"యుక్తం లోకస్వభావేన రసైశ్చ వివిధైః పృథక్" (కావ్యాలం. I. 31)

అయితే కావ్యంలో ఉండవలసిన ప్రధానాంశం రసం అని మాత్రం అతడు ప్రతిపాదించ లేదు.

"దీప్తరసత్వం కాన్తిః" (కా. అ. సూ. II. 2. 4) అని అంటూ వామనుడు రసాలను కాంతిగుణంలో చేర్చాడు. దండి (I. 31) భామహుడూ (I. 24) కూడ రూపకాలను గూర్చి తమ గ్రంథాలలో చర్చించకుండా, వాటిని తెలుసుకోవా లనుకొన్నవాళ్లు నాట్య శాస్త్రాదులు చూడవచ్చును అన్నారు. ప్రాచీనాలంకారికులు రూపకాలనూ కావ్యాలనూ అంతగా పరస్పర సంబంధం లేని విభిన్న ప్రక్రియలనుగా చూచి నట్లు కనబడుతుంది. అందుచేత ఆలంకారికులు ప్రారంభదశలో రసాలను గూర్చి తమ గ్రంథాలలో విస్తృతంగా చర్చించలేదు. రసాలను గురించి తొలిసారిగా చర్చించిన అలంకారశాస్త్ర గ్రంథం రుద్రటుని కావ్యాలంకారం. రుద్రటునికి రాదాపు నూరు సంవత్సరాలకు పూర్వం రచించబడిన శిశుపాలవధం లో రసాలకీ నాటకాదులకీ ఉన్న సంబంధం స్పష్టంగా వర్ణించబడింది-

"స్వాదయన్ రసమనేకసంస్కృతప్రాకృతైరకృతపాత్ర సంకరైః,
భావశుద్ధివిహితైర్ముదం జనో నాటకైరివ బభార భోజనైః" (శిశు. 14. 50)

భరతుని నాట్యశాస్త్రంలో కూడ రసస్వరూపచర్చ ఒక్కటే ప్రధాన విషయం కాదు. రూపక ప్రయోగంలో రసాని కున్న సంబంధాన్ని పట్టి రసానికి కావలసిన అన్ని విషయాలను చర్చించడం దీని ప్రధానోద్దేశ్యం. ఆంగిక - వాచిక - ఆహార్య - సాత్త్వికాభినయాల సాహాయ్యంతో ప్రేక్షకులకు రసానుభూతి కలిగించడం రూపకం చేయవలసిన ప్రధానమైన కార్యం. ఈ చతుర్విధాభినయాలు వరుసగా 8-13, 15-22, 23, 24 అధ్యాయాలలో నాట్యశాస్త్రంలో ప్రతిపాదించబడ్డాయి. **"న హి రసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే"** అని అంటుంది నాట్యశాస్త్రం (మొ. సం. పే. 274). దీని అర్థం వివరిస్తూ - రూపక ప్రదర్శనంలో మొదటి నుండి చివరి దాకా ఒక రసం సూత్రం వలె అనుస్యూతంగా నడుస్తూంటుంది" అని అభినవగుప్త డన్నాడు. "ఏక ఏవ తావత్పరమార్థతః రసః సూత్రస్థానీయత్వేన రూపకే

ప్రతిభాతి" (అ. భా. మొ. సం. పే. 273). **నాట్యశాస్త్రంలోని** చాలా వరకు గ్రంథం నాటకరచయితకూ, నటునికీ సంబంధించిన విషయాలకోసం వినియోగించబడింది. ప్రేక్షకులలో రసావిర్భావప్రక్రియా సానుభూతీ అనే విషయాలు 6,7 అధ్యాయాలలో మాత్రమే చర్చించబడ్డాయి. **కావ్యమీమాంసలో** చెప్పినదానిని పట్టి భరతుడు రూపకాలను గూర్చి మాత్రమే చర్చించగా రసచర్చ నందికేశ్వరుడు చేశాడు. అయితే మనకిపుడు లభించే **నాట్యశాస్త్రంలో** ఈ రెండు విషయాల ప్రతిపాదనా కూడా ఉన్నది. నందికేశ్వరుని గ్రంథం మనకు లభించడం లేదు.

రససిద్ధాంతం శారీరక - మానసిక ప్రవృత్తుల కలయిక మీద ఆధారపడి ఉందని అంటూ కాణే మానవులలో నిగూఢంగా ఉండే కొన్ని మానసిక ప్రవృత్తులను గూర్చిన, కొందరు శారీరక - మానసిక శాస్త్ర నిపుణుల అభిప్రాయాన్ని ఈ విధంగా ఉదాహరించారు (H.S.P;P - 357-358). "మానసిక శాస్త్రజ్ఞులకు అనేక విషయాలలో ఐకమత్యం లేదు. MacDowall అనే పండితుడు 'ది ఎనెర్జీస్ ఆఫ్ మెన్' అనే గ్రంథంలో (1932) (ఏడవ చాప్టర్ పే. 97,98) మానవులలో ఉండే పద్దెనిమిది సహజమైన ప్రవృత్తులను వర్ణించి చెప్పాడు. 'సేన్ సైకాలజీ' (1944) అనే గ్రంథంలో R.J.S. MacDowall ఈ పద్దెనిమిదింటినీ పద్నాలుగుకు తగ్గించి వాటికి సంబంధించిన భావావేశాలతో సహా ప్రతిపాదించాడు.

	సహజ ప్రవృత్తి (Instinct)	సంబద్ధ భావావేశం (Attendant emotion)
1.	ఆపదనుండి తప్పించుకొనడం (Escape from danger)	భయం (Fear)
2.	ఎదిరించడం (Combat)	కోపం (Anger)
3.	జుగుప్స (Repugnance)	అసహ్యించు కొనడం (Disgust)
4.	బాలసంరక్షణ (Parental Protection of the young)	వాత్సల్యం (Parental feeling)
5.	విషయజిజ్ఞాస (Curiosity)	సాహసప్రదర్శనం (Adventure)
6.	తనమాట నిలబెట్టుకొనడం (Self assertion)	ప్రభుత (Superiority)
7.	ఆత్మనింద (Self abasement)	లొంగి ఉండడం (Subjection)
8.	ఏడ్పు (Cry of distress)	అసహాయ స్థితి (Helplessness)

9. కామం (Sex)	లైంగిక ప్రవృత్తి (Sexual Desire)
10. గుంపు (Herd)	ఏకాంతస్థితి (Loneliness)
11. ఆహారాన్వేషణం (Food-Seeking)	ఆకలి (Appetite)
12. కూడబెట్టడం (Hoarding)	స్వత్వబుద్ధి (Feeling of owership)
13. నిర్మాణం (Construction)	సర్జనశక్తి (Feeling of Creativeness)
14. నవ్వు (laughter)	సంతోషం (Amusement)

ఈ మానసిక శాస్త్రవేత్తలు మొదటి స్తంభంలో (Column) ఉన్నవాటిని instincts (సహజప్రవృత్తులు) అనీ, రెండవ స్తంభంలో ఉన్నవాటిని attendent emotions అనీ అన్నారు. కాని నిజానికి మొదటి స్తంభంలో ఉన్నవాటిని attendant - instincts అనడం యుక్తం అని తోస్తుంది. ఎందువల్ల ననగా emotions అనేవి instincts కు కారణం. ఉదాహరణకి భయం అనే ఎమోషన్ కలగగానే కళ్లు మూసికొనడం, నెత్తికి చెయ్యి అడ్డుపెట్టుకొనడం వంటి, ఇన్‌స్టింక్ట్, ప్రభుత అనుభావం వల్ల సెల్ఫ్ అసెర్షన్ వంటి ఇన్‌స్టింక్ట్ కలుగుతాయి. నిజానికి మన అలంకారికులు ఏనాడో ప్రతిపాదించిన స్థాయి - సాత్త్విక - వ్యభిచారిభావాదులు వాటి విశ్లేషణా చూస్తే ఇతరులు చేసిన వాటిలో శబ్దాడంబరమే తప్ప పరిపూర్ణత్వం కనబడదు.

రత్యాదులను మాత్రమే స్థాయిభావాలుగా ఎందుకు అంగీకరించాలి అనేదానికి అభినవగుప్తుడు చక్కని ఉపపత్తి చూపించాడు. పుట్టినది మొదలు ప్రతీ మానవునిలోను ప్రతీప్రాణిలోను సుఖం అనుభవించాలనే కోరిక ఉంటుంది. (రతి); తనలో ఒక వైశిష్ట్యాన్ని ఆరోపించుకొని ఇతరులను పరిహసిస్తాడు (హాసం); తన కిష్టమైన వ్యక్తులు లేదా వస్తువులు దూరం అయినప్పుడు శోకిస్తాడు (శోకం). అలా దూరం చేయడానికి కారణం అయిన వారిమీద కోపం చూపుతాడు (క్రోధం); వాళ్లనేమీ చేయలేక తన్ను తాను రక్షించుకొనజాలనప్పుడు భయపడతాడు (భయం); ఇది సంపాదించాలి, అది సంపాదించాలి అని అనుకొంటూ ఉంటాడు (ఉత్సాహం); చెడ్డ వస్తువులను అసహ్యించుకొంటాడు (జుగుప్స); ఎవరైనా గొప్పపనులు చేస్తే అది చూచి ఆశ్చర్యపడతాడు (విస్మయం); కొన్నింటిమీద అనాసక్తి చూపుతాడు (నిర్వేదం). **"స్థాయిత్వం చ ఏతావతామేవ. జాత ఏవ హి జన్తుః ఇయతీభిః సంవిద్భిః పరీతో భవతి."** తథాహి - **"దుఃఖసంశ్లేషవిద్వేషీ సుఖాస్వాదన సాదరః" ఇతి న్యాయేన సర్వో రిరంసయా వ్యాప్తః, స్వాత్మని ఉత్కర్ష మానితయా పరముపహసన్, అభీష్టవియోగసంతప్తః తద్ధేతుషు కోపపరవశః, అశక్తౌ తతో భీరుః, కించిదర్జిజిషురపి, అనుచితవస్తువిషయవైముఖ్యాత్మకతయాక్రాన్తః,**

కిం చిదనభీష్టతయా అభిమన్యమానః, తత్తత్స్వపరకర్తవ్యదర్శనసముదితవిస్మయః, కించిచ్చ జిహాసురేవ జాయతే (అ.భా. VI. అధ్యాయం).

ఇంచుమించు ఇలాంటి తొమ్మిది భావాల ఆవిష్కరణం ఉన్నదే నిజమైన కావ్యం అని కొందరు ఆధునిక పాశ్చాత్య విమర్శకులు అంగీకరించడం గమనార్హం - "Every truth which a human being enunciates, every throught, even every outward impression which can enter into his consciousness, may become poetry when shown through an impassioned medium, when invested with the colouring of joy or grief or pity or affection or admiration or reverence, or awe or even hatred or terror: and unless so coloured, nothing, be it as interesting as it may, is poetry (quoted from Mill in the preface of mirror of composition' P. VIII; the contribution of panditaraja to sanskrit poetics part. I.P.141).

ఒక రూపకాన్ని చూచినపుడు ప్రేక్షకుల మనస్సులలో కలిగే భావాలను భరతుడు, తదనుసారులైన అర్వాచీనులు ఎలా విశ్లేషించారో ఇప్పుడు పరిశీలిద్దాం. రూపక ప్రయోగం నేత్రాలు, చెవులూ అనే రెండు ఇంద్రియాలకు మాత్రమే ప్రవర్తకంగా ఉంటుంది. **"క్రీడనీయకమిచ్ఛామో దృశ్యం శ్రవ్యం చ యద్భవేత్"** (నా.శా.I.11). ఇవి శారీరకాలంబనం (Physiological basis). నృత్యము, అభినయము, అలంకారాలు, చిత్రణము - ఇవి నేత్రం ద్వారా ఆనందాన్ని కలిగించే కళలు. సంభాషణ, పద్యాదిపఠనం, సంగీతం - ఇవి చెవుల ద్వారా ఆనందం కలిగించే కళలు. విషాదకరసంఘటనలు కూడ రూపకంలో ప్రదర్శించినపుడు ఆనందమే కలిగిస్తాయనే విషయం భరతాదులకు తెలుసు. మామూలు జీవితంలో జాలి, భయం ఆనందాన్ని కలిగించవు. వాటినే రంగస్థలం మీద ప్రదర్శించినప్పుడు వాటి ప్రభావం వేరుగా ఉంటుంది. అలాంటి సన్నివేశాలలో సహృదయులు అనుభవించే ఆ ఆనందాన్ని వీరు విశ్లేషించి పరీక్షించి వర్ణించారు. రూపకాదులను చూడడం వల్ల కలిగే ఆనందమూ రసమూ వాస్తవంలో ఒక్కటే; అనగా ఈ ఆస్వాదంలో భేదాలు లేవు. అభినవగుప్తుడు రసాన్ని వైయాకరణుల స్ఫోటతో పోలుస్తాడు - **తేన రస ఏవ నాట్యం యస్య వ్యుత్పత్తిః. ఫలమిత్యుచ్యతే. తథా చ రసాదృతే ఇత్యత్ర** (నా.శా.6.34) **ఏకవచనోపపత్తిః. తతశ్చ ముఖ్యభూతాన్మహారసాత్ స్ఫోటదృశీవాసత్యాని వా, అన్వితాభిధానదృశీవ ఉపాయాత్మకాని సత్యాని వా, అభిహితాన్వయదృశీవ తత్సముదాయరూపాణి వా రసాన్తరాణి భాగాభినివేశదృష్టాని రూప్యన్తే"** (నా.శా.I. 16). భాషలో ఒక పరిపూర్ణార్థాన్ని బోధించేవి వాక్యాలు. వాటిని పదాలుగాను, పదాలను వర్ణాలుగాను విభజించి పదాల అర్థం అనీ (కొన్నిచోట్ల) వర్ణాల అర్థం అనీ అంటున్నాం. నిజానికి ఇవన్నీ ఒకే ఒక వాక్యార్థానికి సంబంధించినవి. అదే విధంగా ఆనందానుభవం

ఒక్కటే అయినా దానిని విశ్లేషించి ఎనిమిది వేరువేరు స్థాయి భావాలకు సంబంధించిన దవడం చేత శృంగారాదిభేదాలతో ఎనిమిది విధాలని అంటున్నాం. వాస్తవంలో ఆనందానుభూతి, రసాస్వాదం అనేది ఒక్కటే.

రసం సామాజికాశ్రయం. ఇది స్థాయి భావభేదాన్ని పట్టి ఎనిమిది విధాలు అని భావప్రకాశనం చెపుతున్నది –

"యతోఽష్టధా మనోవృత్తిః సభ్యానాం నాట్యకర్మణి,
అష్టావేవానుభూయన్తే తాసూక్తాస్తై రసాః పృథక్.
సామాజికైస్తు రస్యన్తే యస్మాత్తస్మాద్రసాః స్మృతాః" (భా.ప్ర. II. P.46)

"వర్ధితాః స్థాయినో భావాః నాయకాదిసమాశ్రయాః,
అనుకారతయా నాట్యే క్రియమాణా నటాదిషు,
రసతాం ప్రతిపద్యన్తే సామాజికమనఃస్వతే,
సంస్కారైః ప్రోక్తనైస్తైశ్చ రస్యన్తే యత్నతో రసాః" (భా.ప్ర. II. P.46)

దశరూపకంలో కూడ ఈ విధంగానే ప్రతిపాదింపబడింది. (IV. 38–39). రసాస్వాదం కలగాలంటే కవి – శ్రోతల మధ్య సమన్వయం ఉండాలని **లోచనంలో** (పే. 23) చెప్పబడింది. "వక్తృప్రతిపత్తృప్రతిసహకారిత్వం హి **అస్మాభిః ద్యోతనస్య** ప్రాణత్వేనోక్తమ్."

రంగస్థలం మీద ప్రయోగించబడే రూపకాన్ని చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు ఒక విధమైన ఆనందానుభూతి కలుగుతుంది. ఈ అనుభూతిలో దుఃఖానికి ఏ మాత్రమూ అవకాశం లేదు. సామాజికుల మనస్సులో అణగి ఉన్న రతి – హాస శోకాది భావాలను వివిధాభినయాల ద్వారా ఉత్తేజితము లయే టట్లు చేయడంచేత ఈ అనుభూతి వివిధ రూపాలలో ఉన్నట్లు కనబడుతుంది. (కాని, ఆ అనుభూతి వాస్తవంలో ఒక్కటే అని వీరి అభిప్రాయం) – "**అస్మన్మతే తు సంవేదనమేవ ఆనన్దఘనమ్ ఆస్వాద్యతే తత్ర కా** దుఃఖాశంకా? కేవలం **తస్యైవ చిత్రతాకరణే రతిశోకాదివాసనావ్యాపారః తదుద్బోధనే** చాభినయాదివ్యాపారః" (అ.భా.మొ.సం.I. పే. 293) అని అభినవగుప్త డన్నాడు.

భరతుడు నాట్యశాస్త్రంలోని ఆరవ అధ్యాయంలో రసాన్ని ప్రతిపాదించాడు. జాగర్తగా పరిశీలిస్తే భరతుడు ప్రతిపాదించిన రసానికి చివరకు అభినవగుప్తుని దగ్గరకు వచ్చేసరికి తేలిన రసస్వరూపానికి చాల భేదం ఉంది. "విభావానుభావవ్యభిచారిసంయోగాద్రస నిష్పత్తిః" అనేది భరతుడు చెప్పిన రససూత్రం. దీనిని ఆధారంగా చేసికొని వివిధ వ్యాఖ్యానాలు బయలుదేరాయి. ఈ సూత్రంలో స్థాయి శబ్దం ప్రయోగించలేదు. ఇలా

ప్రయోగించకపోవడంలో చాల విశేషం ఉందని కొందరు వ్యాఖ్యాతలు నిరూపించడానికి ప్రయత్నించారు. అయితే రెండు మూడు వాక్యాల తరవాత భరతుడు – "**యథా హి... తథా నానాభావోపగతా అపి స్థాయినో భావా రసత్వమాప్ను వన్తి**" అని స్థాయిభావాలను స్పష్టంగా పేర్కొన్నాడు. **'సంయోగ' 'నిష్పత్తి'** శబ్దాల అర్థం అస్పష్టంగా ఉండడం చేత ఈ సూత్రాన్ని వేరు వేరు విధాల వ్యాఖ్యానించడానికి అవకాశం ఏర్పడింది. దీనికి లోల్లటుడు, శంకుకుడు, భట్టనాయకుడు, అభివనవగుప్తుడు ఇచ్చిన నాలుగు విధాలైన వివరణలున్నాయి. జగన్నాథుడు ఈ నాలుగు కాక ఇంకా నాలుగు వివరణలను చూపాడు.

లోల్లట – శంకుక – భట్టనాయకుల గ్రంథా లేవీ మనకిప్పుడు లభించడం లేదు. వాళ్ల మతాలను గూర్చి అభినవగుప్త – మమ్మటాదులు చెప్పిన దానిని పట్టి మాత్రమే తెలుసుకొనవలసి ఉంది. వీటికి వరసగా **ఉత్పత్తివాదం, అనుమితివాదం, భుక్తివాదం, అభివ్యక్తివాదం** అని పేర్లు. ఈ వాదాలను తెలిసికొనే ముందు ఈ సూత్రంలో ఉపయోగించిన కొన్ని పారిభాషికపదాల అర్థాలు తెలుసుకొనవలసి ఉంది. నాట్యశాలకు వెళ్లేవారిలోను, కావ్యం పఠించేవారిలోను కొన్ని స్థిరమైన భావాలు నిగూఢంగా ఉంటాయి. ఇవి మౌలికములైన భావాలు. ఇవి సాధారణంగా అంతర్లీనంగానే ఉన్నా తగిన సంభాషణలు, పాటలు సంగీతం మొదలైనవి వినగానే, అభినయం చూడగానే పైకి ఉద్బుద్ధము లౌతాయి. శ్రవ్యకావ్యాలలో విశిష్టశబ్దాలు చదవడంచేత ఉద్బుద్ధమౌతాయి. అప్పుడు అవి వాళ్ల మనస్సులలో ఆనందరూప స్థితిని పొందుతాయి. స్థిరమైన ఈ భావాలకే స్థాయిభావా లని పేరు. వీటి కీ పేరు ఎందుకు వచ్చిందో భరతుడు ఏడవ అధ్యాయంలో ఈ విధంగా వివరించాడు. ఒక రాజుకు వాని పరిచారకులకు శరీరాదు లన్నీ సమంగానే ఉన్నా ఒకనిని రాజు అంటారు. ఇతరులు అతనికి సేవ చేస్తారు. అదే విధంగా ఒకటి స్థాయిభావం అయితే దానితో కలిసి ఉన్న ఇతర భావాలు విభావ – అనుభావ – వ్యభిచారిభావా లవుతాయి. వీటితో కూడిన స్థాయిభావం రసత్వాన్ని పొందుతుంది. ఆనందంగా, ఆస్వాదంగా మారుతుంది. "**యథా నరేన్ద్రో బహుజన పరివారోఽపి సన్ స ఏవ నామ లభతే నాన్యః సుమహానపి పురుషః తథా విభావానుభావ వ్యభిచారిపరివృతః** స్థాయీ భావో రసనామ లభతే. **భవతి చాత్ర శ్లోకః** – "

"యథా నరాణాం నృపతిః శిష్యాణాం చ యథా గురుః,
ఏవం హి సర్వభావానాం భావః స్థాయీ మహానిహ" (నా.శా. VII. 8)

దశరూపకంలో స్థాయిభావాల స్వరూపం మరొక దృక్కోణంతో పరిశీలించి చెప్పబడింది. "స్థాయిభావం సముద్రం వలె నిశ్చల మైనది. అప్పుడప్పుడు ఇతర భావాలు వచ్చి దానిని క్షుబ్దం చేయడానికి ప్రయత్నించినా అది కదలకుండా అలాగే ఉంటుంది.

ఇతరభావాలు స్థాయిభావాన్ని విచ్ఛిన్నం చేయజాలవు. అవి దానికి అంగంగా ఉండిపోతాయి. ఈ విధంగా విభావాదులచేత ఉత్తేజితములై రసస్థితిని పొందగల స్థాయిభావాలు రతి, హాసం, శోకం, క్రోధం, ఉత్సాహం, భయం, జుగుప్స విస్మయం అని ఎనిమిది. కొందరు శమాన్ని కూడ చేర్చి తొమ్మిది స్థాయిభావాలను అంగీకరించారు."

వీటి అన్నింటిసంయోగం వల్ల కలిగే ఆనందానికి రసం అని పేరు. దీనికి ఈ పేరు రావడానికి కారణం ఏమో భరతుడు వివరించాడు. మనుష్యులు బెల్లం, పాలు సుగంధద్రవ్యాలు, మిరియాలు మొదలైన వస్తువుల లన్నీ కలిపి తయారుచేసిన ఒక ఆహారపదార్థం తిన్నప్పుడు ఏ విధంగా ఆనందం అనుభవిస్తారో అదే విధంగా ప్రేక్షకులు అనేక భావాలచేత, అభినయాదులచేత పైకి ఉద్బుద్ధం అయే టట్లు చేయబడిన స్థాయి భావాలను ఆస్వాదిస్తారు. అందుచేత ఆ ఆస్వాదనానికి నాట్యరసం అని పేరు. లోకంలో రసశబ్దానికి పాదరసం, మాధుర్యం మొదలైనవి (మధురామ్లలవణకటుకషాయతిక్తాలు), సారం, అత్యంతాసక్తి, ఫలాదులనుండి పిండి తీసిన ద్రవపదార్థం, కషాయం, మొదలైన అనేక అర్థా లున్నాయి. అయితే కావ్యనాటకాదులలో దీనికి ఆస్వాదం అని అర్థం. "రసనాద్రసత్వమేషాం మధురాదీనామివోక్తమాచార్యైః" (14) అని రుద్రటు డన్నాడు. "**విభావానుభావసాత్త్వికవ్యభిచారిభావైః ఉపచీయమానః పరిపూర్ణః స్థాయీ భావో రస; చరమసమయపర్యన్తస్థాయిత్వాదస్య స్థాయిత్వవ్యపదేశః**" (రసతరం. IV) అని **రసతరంగిణి.**

లోపల కలిగిన భావంవల్ల పుట్టిన వికారం అనుభావం. ఇది లోపల పుట్టిన భావానికి సంసూచకం "**అనుభావో వికారస్తు భావసంసూచనాత్మకః**" (దశ రూ. IV. 3) అని దశరూపకం. "**స్థాయి భావాననుభావయన్తః సామాజికాన్ సభ్రూవిక్షేపకటాక్షాదయః రసపోషకారిణః అనుభావాః**" అని ధనికుడు వివరించాడు ఈ అనుభావాలలో ఎనిమిదింటికి సాత్త్విక భావాలని పేరు.

> పృథగ్భావా **భవన్త్యేతేఽనుభావత్వేఽపి సాత్త్వికాః,**
> **సత్త్వాదేవ సముత్పత్తేస్తచ్చ తద్భావభావనమ్.**
> **స్తమ్భప్రలయరోమాఞ్చాః స్వేదో వైవర్ణ్యవేపథూ,**
> **అశ్రు వైస్వర్యమిత్యష్టౌ స్తమ్భోఽస్మిన్నిష్క్రియాఙ్గతా.**
> **ప్రలయో నష్టసంజ్ఞత్వం శేషాః సువ్యక్తలక్షణాః.**"   (దశ రూ. IV. 4-6)

వీటిని సాత్త్వికభావా లనడానికి కారణం విషయంలో అభిప్రాయభేదం ఉంది. దశరూపకానుసారం సత్త్వం అనగా సానుభూతితో కూడిన Sympathetic హృదయం. దానిచేత ఏర్పడినవి (సత్త్వేన నిర్వృత్తాః) గాన సాత్త్వికభావాలు. **సాహిత్యదర్పణంలో** కూడ ఇదే వ్యుత్పత్తి చెప్పబడింది. (III. 134) అయితే **రసతరంగిణిలో "సత్త్వం జీవశరీరమ్,**

తస్య ధర్మాః సాత్త్వికాః. ఇత్థం చ శరీరభావాః స్తమ్భాదయః స్సాత్త్వికాః భావాః ఇత్యభిధీయన్తే" అని చెప్పబడింది. ఈ విధంగా సాత్త్విక భావాలు లోపల కలిగిన భావంవల్ల పుట్టి ఆ భావాన్ని ఇతరులు తెలుసుకొనే టట్లు చేస్తాయి గాన అనుభావాలు. ఇదే విధంగా లోపల నున్న రతి - క్రోధాదులవలన కలిగే భ్రూలతాకుంచన - కటాక్ష వీక్షణాదులు కూడ అనుభావాలే.

ఆలంబనవిభావం అనీ **ఉద్దీపనవిభావం** అనీ విభావం రెండు విధాలు. శృంగార రసం విషయంలో పరిశీలిస్తే నాయకునిలో ఉన్న రతికి ఆలంబనవిభావం నాయిక (ఆ రతికి ఆశ్రయం నాయకుడు). నాయికలో ఉన్న రతికి ఆలంబనవిభావం నాయకుడు (ఆశ్రయం నాయిక). ఆశ్రయం వేరు, ఆలంబనం వేరు. రతి ఉద్బుద్ధం అవడానికి ఉపకరించే ఏకాంతస్థాన - ఉద్యాన - చంద్రోదయాదులు ఉద్దీపన విభావాలు. నిర్వేదం, గ్లాని, శంక మొదలైన భావాలు మాటిమాటికీ మారిపోతూంటాయి. ఇవి కూడ స్థాయి భావాలను పరిపుష్టం చేస్తూంటాయి. వీటికి **వ్యభిచారిభావాలు** లేదా సంచారిభావాలు అని పేరు. ఇవి ముప్పైమూడు. వీటిలో కొన్ని అనేకరసాలకు సాధారణాలుగా ఉండవచ్చును. అనగా ఒక రసానికి వ్యభిచారిభావాలుగా ఉన్నవి ఇతరరసాలకి కూడ వ్యభిచారులుగా ఉండవచ్చును. ఒక్కొక్కప్పుడు రత్యాదిస్థాయిభావాలు కూడ పూర్తిగా పరిపుష్టం కానప్పుడు ఇతరరసాలకు వ్యభిచారిభావాలు కావచ్చును. తగిన విభావానుభావవ్యభిచారి భావాలచేత పరిపుష్టము లైన రతి - హాసాదులు శృంగార - హాస్యాది రూపాన్ని పొందుతాయి. రసాలను విభావాదుల ఉపస్థాపనం ద్వారా ఆస్వాద్యములయేటట్లు చెయ్యాలి కాని ఇక్కడ ఈ రసం ఉంది, అక్కడ అది ఉంది అని చెప్పకూడదు. విభావాద్యుపస్థాపనం లేకుండా పేర్లు చెప్పినా రసావిష్కృతి కలగదు. వీటి కన్నింటికి ప్రేక్షకునిలోను పఠితలోను భావుకత్వం, సహృదయత్వం ఉండాలి. అది లేనివానికి రసాస్వాదం కలగదు. వేషధారణమాత్రసంన్యాసులు కాకుండా నిజమైన వైరాగ్యం గల సంన్యాసులకు శృంగారకరుణాద్యాస్వాదం కలుగదు. పిరికిపందకు వీరరసం పడదు.

> **"సవాసనానాం నాట్యాదౌ రసస్యానుభవో భవేత్,**
> **నిర్వాసనాస్తు రఙ్గాన్తః కాష్ఠకుడ్యాశ్మసంనిభాః."**

"**విభావానుభావవ్యభిచారి సంయోగాద్రసనిష్పత్తిః**" అనే రససూత్రం చెప్పి భరతుడే దానికి వివరణ తన మాటలలో ఇచ్చి ఉన్నాడు - "**తత్ర విభావానుభావవ్యభిచారి సంయోగాద్రసనిష్పత్తిః" కో దృష్టాన్తః? అత్రాహ - యథా హి నానావ్యఞ్జనౌషధి సంయోగాత్ రసనిష్పత్తిః. తథా నానాభావోపగమాద్రసనిష్పత్తిః. యథా హి గుడాదిభిః ద్రవ్యైః వ్యఞ్జనైః ఓషధిభిశ్చ షాడవాదయః రసాః నిర్వర్త్యన్తే తథా నానాభావోపగతా అపి స్థాయినో భావాః**

రసత్వమ్ అప్నువన్తీతి. రసః ఇతి – కః పదార్థః? ఉచ్యతే ఆస్వాద్యత్వాత్. కథమాస్వాద్యతే రసః? యథా హి నానావ్యఞ్జన సంస్కృతమన్నం భుఞ్జానాః రసానా స్వాదయన్తి హర్షాదీంశ్చాధిగచ్ఛన్తీతి సుమనసః పురుషా ఇత్యభివ్యాఖ్యాతాః తథా నానాభావాభినయవ్యఞ్జితాన్ వాగఙ్గసత్త్వోపేతాన్ స్థాయిభావానాస్వాదయన్తి హర్షాదీంశ్చాధిగచ్ఛన్తీతి ప్రేక్షకాః సుమనస ఇత్యభివ్యాఖ్యాతాః. తస్మాన్నాట్యరసాః. అత్రానువంశ్యౌ శ్లోకౌ భవతః –

యథా బహుద్రవ్యయుతైః వ్యఞ్జనైర్బహుభిర్యుతమ్,
ఆస్వాదయన్తి భుఞ్జానా భక్తం భక్తవిదో జనాః.
భావాభినయసంబద్ధాన్ స్థాయిభావాంస్తథా బుధాః,
ఆస్వాదయన్తి మనసా తస్మాన్నాట్యరసాః స్మృతాః.

(నాట్యశా. హిం. అ.భా. పే. 442. 501)

భరతుడు చెప్పినదానిని పట్టి రసంలో అలౌకికత్వం ఏదీ లేదు. ఇది లోకంలో ప్రత్యక్షంగా కనబడే ఆ యా వస్తువులవల్ల, స్త్రీ పురుషాదులవల్ల పుట్టుట లేదు గాన దీనిని అలౌకికం అని అంటే అనవచ్చు నేమో! రసాన్ని భరతుడు పాకరసదృష్టాంతం సహాయంతో విశదీకరించాడు. వరిఅన్నం మొదలైనవాటిని వేరు వేరు రుచులు గల వివిధవ్యంజనాలతో (ఊరగాయలు మొదలైనవాటితో – పోపు సామాగ్రితో) కలిపినపుడు దాని కొక క్రొత్త రుచి వస్తుంది. (షాడబం అంటే అర్థం స్పష్టంగా తెలియదు. అలా తయారుచేసిన అన్నాదికం షాడబం కావచ్చు. దీని రుచికి ఆ పేరు ఉండవచ్చు). అదే విధంగా విభావానుభావవ్యభిచారిభావాలు స్థాయిభావంతో కలవడంచేత రసం నిష్పన్నం అవుతుంది. అనగా విభావాదులతో కలిసిన స్థాయిభావం రసంగా మారుతుంది. తినేవాళ్లకి పాకరసం ఆనందం ఇచ్చినట్లు ఈ రసం సహృదయులకు ఆనందం ఇస్తుంది. ఇక్కడ ఇచ్చిన ఈ దృష్టాంతాన్ని పట్టి చూస్తే భరతుని అభిప్రాయం ప్రకారం నాట్యరసం పాకరసం వలె పుట్టింపబడుతుంది గాన రసం వేరు, దానివల్ల కలిగే ఆనందం వేరు అన్నట్లు కనబడుతుంది. వ్యాఖ్యానాల జోలికి పోకుండా భరతుని మాటలను వాక్యనిర్మాణంలో పరిచయం ఉన్నవాళ్లు పరిశీలిస్తే ఇంతమాత్రం అర్థమే వస్తుంది. భరతుడు రసాలను నాట్యానికి సంబంధించి నంతవరకే ప్రతిపాదించాడు.

కాలాంతరంలో భరతుని రససూత్రానికి వేరు వేరు అర్థాలు చెప్పబడ్డాయి. లోల్లటుని వ్యాఖ్య భరతునికి చాల దగ్గరగా ఉంటుంది. భట్టలోల్లటాదుల ప్రకారం రసం ప్రధానంగా రామాదులలోనే ఉంటుంది. నాట్యంలో (రూపకాలలో) నటుడు రామాదుల వేషభూషాదులు ధరించి ఆ విధంగానే మాట్లాడుతూ రామాదుల్ని అనుకరించడంచేత నటుడిలో కూడ రసం ఉన్నట్లు కనబడుతుంది. రతి మొదలైనవాటికే విభావాదులతో సంబంధం ఏర్పడి

నప్పుడు అవి రసాలుగా మారుతాయి. శృంగారాన్ని గూర్చి చెప్పవలసి నప్పుడు – ఆలంబనం, ఉద్దీపనం అనే ద్వివిధ విభావాలవల్ల రతి పుడుతుంది. వాస్తంలో రతి పుట్టేది ఆలంబన విభావం చేతనే. పుట్టిన రతికి కొంత పుష్టి కలిగిస్తాయి కాబట్టి ఉద్దీపనవిభావాలను కూడ రతికి కారణం అని చెప్పడం జరుగుతున్నది. ఒక్కొక్కపుడు ఆలంబన విభావం ఉన్నా సుందరమైన పరిసరాలు వివిక్తస్థానం మొదలైన ఉద్దీపన విభావాలు లేకపోతే, రతి పుట్టకపోవచ్చు కూడ. ఈ విభావాలకీ రతికీ ఉన్న సంబంధం జన్యజనకభావసంబంధం. రతి జన్యం, పుట్టేది, విభావాలు జనకాలు, పుట్టించేవి. కటాక్షవీక్షణం మొదలైన అనుభవాలు రతివల్ల పుట్టిన కార్యాలు. వాటిని పట్టి రతి ఉన్నట్లు తెలుస్తుంది. ఈ అనుభావాలకీ రతికీ గమ్యగమకభావ సంబంధం. తెలుపబడేది రతి, తెలిపేవి అనుభావాలు. లజ్జ మొదలైన విభావాలు రతిని బాగా పరిపుష్టం చేసి శరీరం అంతటా వ్యాపించే టట్లు చేస్తాయి. కాబట్టి వీటికీ రతికీ మధ్య నున్న సంబంధం పోష్యపోషకభావసంబంధం. రతి పోషించదగినది, విభావాలు పోషించేవి. ఈ విధంగా రతితో విభావానుభావవ్యభిచారుల సంయోగంచేత, కలయికచేత, రామాదులైన అనుకార్యవ్యక్తులలో శృంగారరసం పుడుతుంది. బాగా అభినయాదులు చేయడంచేత నటుడిలో కూడ ఉన్నట్లు కనబడుతుంది.

ఈ విధంగా భట్టలోల్లటాదుల మతం ప్రకారం – (స్థాయినామ్ = నిగూఢంగా ఉన్న స్థాయిభావములకు), విభావ – లలనాదిరూపాలైన ఆలంబన విభావాలతోను ఉద్యానాదులైన ఉద్దీపనవిభావాలతోను ఉత్పాద్యోత్పాదక భావరూపసంబంధంవల్లా, అనుభావ – కటాక్షాలు, హస్తచాలనాలు మొదలైన కార్యాలైన అనుభావాలతో గమ్యగమక భావరూపసంబంధంవల్లా, వ్యభిచారి – నిర్వేదం మొదలైన వ్యభిచారిభావాలతో పోష్యపోషకభావ సంబంధంవల్లా, రసనిష్పత్తిః – వరసగా రసం యొక్క ఉత్పత్తి, అభివ్యక్తి, పుష్టి కలుగుతుంది అని రససూత్రానికి అర్థం. సూత్రంలో లేకపోయినా నాట్యశాస్త్రంలో తరవాత ప్రతిపాదించే రీతిని పట్టి "స్థాయినామ్" అనే పదాన్ని అధ్యాహారం తెచ్చుకొని అర్థం చెప్పుకోవాలి. (లోల్లటాదులకు సమకాలికులైన భవభూత్యాదులు రసం రామాదినిష్ఠం అని అంగీకరించడం గమనార్హం.)

ఈ విధంగా రసం అనుకరింపబడే రామాదులలలో నిష్పన్నం అయితే ఆ రసనిష్పత్తి లేని సామాజికులకు రసాస్వాదం ఎలా కలుగుతుంది? అందుచేత శ్రీశంకుకాదులు దీనిని మరొక విధంగా వ్యాఖ్యానించారు –

శ్రీ శంకుకాదుల అభిప్రాయం ప్రకారం ఆ యా హేతువుల చేత సామాజికుడు నటుడిలో ఉన్నట్లు ఊహించే (అనుమేయమైన) స్థాయిభావమే రసం. నటుడు గురువు

వద్ద సరియైన శిక్షణ పొంది చాలాకాలం స్వయంగా కూడ అభ్యాసం చేసి, రాముని వేషం ధరించి మాటలలోను, చేష్టలలోను ఆ రాముణ్ణే అనుకరిస్తున్నాడు. విభావానుభావ వ్యభిచారు లనే సామాంతరాలు గల కార్య - కారణ - సహకారులను ప్రదర్శిస్తున్నాడు. అవి కృత్రిమాలే అయినా కృత్రిమా లని అనిపించకుండా సహజాలే అన్నట్లు కనబరుస్తున్నాడు. "సేయం మమాఙ్గేషు" ద్వైవాదహమద్య" ఇత్యాదిశ్లోకాలు పఠిస్తూ అత డా విధంగా అభినయించే టప్పుడు సామాజికులు మనస్సులలో ఆ శ్లోకాల భావాన్ని మననం చేస్తూ ఆ నటుణ్ణి చూస్తూంటే, వాళ్లకి ఇతడు రాముడు అనే జ్ఞానం కలుగుతుంది. ఈ జ్ఞానం లోకంలో ప్రసిద్ధంగా ఉన్న ఏ జ్ఞానాల కోవకీ చెందదు. "ఇతడు రాముడే" అనే జ్ఞానం వలె ఇది సమ్యగ్జ్ఞానం (యథార్థజ్ఞానం) కాదు. ముత్యపు చిప్పను చూడగానే "ఇది వెండి" అనే జ్ఞానం కలిగి మరు క్షణంలోనే "ఇది వెండి కాదు" అని బాధజ్ఞానం కలుగుతుంది. ఈ బాధజ్ఞానాన్ని పట్టి మొదట కలిగిన జ్ఞానం మిథ్యాజ్ఞానం (భ్రమ) అని తెలుస్తుంది. ఇక్కడ "ఇతడు రాముడు కాడు," అను బాధజ్ఞానం కలగకపోవడం చేత ఇది (రామోఽయమ్ అనే జ్ఞానం) భ్రమ కాదు. ఇది స్థాణువా (బండఱాయా) లేక మనిషా అన్నపుడు ఈ జ్ఞానంలో రెండు కోటులు (పక్షాలు) ఉండడంచేత దీనిని సంశయం అంటాం. ఆ విధంగా ఇక్కడ "ఇతడు రాము డవునా కాదా" అను రెండు పక్షాలు లేకపోవడంచేత సంశయజ్ఞానం కాదు. "ఇతడు రాముడు వలె ఉన్నాడు" అనే జ్ఞానం కాదు కాబట్టి ఇది సాదృశ్యజ్ఞానము కాదు. ఈ విధంగా నటుణ్ణి చూస్తున్నపుడు కలిగే "ఇతడు రాముడు" అనే జ్ఞానం లోక ప్రసిద్ధాలైన అన్నివిధాల జ్ఞానాలకంటె విలక్షణ మైనది. చిత్రించిన గుఱ్ఱాన్ని చూచినపుడు కలిగే 'ఇది గుఱ్ఱం' అనే జ్ఞానం వంటిది. ఎందుచేత ననగా అది కూడ సమ్యగ్జ్ఞానము కాదు, సంశయమూ కాదు, సాదృశ్యజ్ఞానము కాదు. ఇది "గుఱ్ఱం కాదు" అనే బాధజ్ఞానం కలగక పోవడంచేత భ్రాంతీ కాదు. ధూమాన్ని చూచి పర్వతంమీద అగ్నిని ఊహించి నట్లు నటుని అభినయం అంతా చూచి సామాజికులు అతడు రాము డనుకొని అతనిలో స్థాయిభావం ఉందను కొంటున్నారు. ఆ స్థాయిభావానికీ నటుడు ప్రదర్శించే విభావాదులకూ సంబంధం గమ్యగమకభావసంబంధం. స్థాయిభావం గమ్యం, తెలియదగినది, విభావాదులు గమకాలు. తెలిపేవి; ఊహింపచేసేవి. ఈ స్థాయి భావంలో సహజంగా ఒక రమణీయత్వం ఉంది. అందుచేత ఇది లోకంలో అనుమీయమానములైన ఇతరవస్తువుల వంటిది కాదు. అందువలన దీనిని అనుమానప్రమాణంవలన గ్రహించినా ఇది ఆస్వాదయోగ్యంగా ఉంటుంది. ఈ విధంగా నటునిలో వాస్తవంగా లేని రతిని ఉన్నట్లుగా భావించి సామాజికులు ఆస్వాదిస్తారు. అదే రసం "స్థాయికి విభావానుభావవ్యభిచారులతో సంయోగంవల్ల అనగా అనుమాప్యానుమాపకసంబంధం వల్ల (స్థాయి అనుమాప్యం, ఊహింపచేయదగినది,

విభావాదులు అనుమాపకాలు, అనుమితిని కలిగించేవి) రసనిష్పత్తి. రసానుమితి" అని సూత్రార్థం.

చమత్కారం ప్రత్యక్షంవల్లనే కలగాలి కాని అనుమిత్యాదులవల్ల కలగదు అనే విషయం లోకప్రసిద్ధం. అందుచేత ఈ రసానుమితివాదం అయుక్తం అనే ఉద్దేశ్యంతో భట్టనాయకుడు ఈ సూత్రాన్ని మరొక విధంగా వ్యాఖ్యానించాడు -

కావ్యనాట్యాదులలో ప్రయోగించే శబ్దానికి అభిధ అనే వ్యాపారం (function) ఒక్కటే కాకుండా 'భావకత్వం', 'భోజకత్వం' అని మరి రెండు వ్యాపారాలు కూడ ఉంటాయి. రసానుభూతి విషయంలో ఈ రెండు వ్యాపారాలకీ చాల ప్రాధాన్యం ఉంది. నాట్యం సందర్భంలో నటుడు, రామాదినాయకులు, సామాజికుడు, అనే ముగ్గురు ఉంటారు. నటుడు నాయకుడూ కూడ తటస్థులే. అనగా రసానుభూతికి సంబంధించి సంతవరకు ఉదాసీనులే. అందుచేత రసం తటస్థులైన నట - రామాదులకు సంబంధించినదిగా గాని, తనకు, అనగా సామాజికునికి సంబంధించినదిగా గాని ప్రతీతి (జ్ఞాన) గోచరం కాదు. వారిలో పుట్టదు. వారిలో ఉన్నట్లు వ్యంజింపచేయబడదు. శబ్దంలో ఉన్న రెండవ వ్యాపారం అయిన భావకత్వం, సామాజికుణ్ణి, అభిధ ద్వారా తెలిసిన కావ్యార్థాన్ని మాటి మాటికీ భావనచేసే టట్లు చేస్తుంది. ఆ భావన ఉన్నంతవరకూ సామాజికుడు ఎదుటనున్న విభావాదుల్ని ఆ యా వ్యక్తులనుగా గాని, ఆ యా వ్యక్తులకు, దేశకాలాలకు సంబంధించిన వాటినిగా గాని చూడడు. సామాన్యరూపంలో (సర్వసాధారణరూపంలో) చూస్తాడు. అనగా రత్యాదులను సీతారామాదులకు సంబంధించినవాటినిగా కాక కేవలం రత్యాదిరూపంలో చూస్తాడు. అటుపైన భోజకత్వవ్యాపారం పనిచేయడం ప్రారంభిస్తుంది. అప్పుడు సాధారణీకృతాలైన విభావాదులతో సహకృతమైన ఈ భోజకత్వవ్యాపారంచేత సామాజికునికి ఈ రత్యాదుల ఆస్వాదం కలుగుతుంది. ఈ రత్యాద్యాస్వాదమే రసనిష్పత్తి. స్థాయికి విభావాదులతో భోజ్యభోజకభావసంబంధంచేత (స్థాయి భోజ్యం, అనుభవించ తగినది; విభావాదులు భోజకాలు, అనుభవింపచేసేవి) రసనిష్పత్తి అనగా రసభుక్తి (భోగం) అని ఈ సూత్రానికి అర్థం.

సాధారణీకరణం (universalisation) రససిద్ధాంతానికి సంబంధించిన అతి ప్రధానమైన అంశం. దీనిని ప్రప్రథమంగా ప్రతిపాదించిన గౌరవం భట్టనాయకునికి చెందుతుంది. వ్యంజనావ్యాపారం ఒక్కటే అంగీకరిస్తే చాలు, భావకత్వభోజకత్వ వ్యాపారాలు అంగీకరించవలసిన పనిలేదు అనే ఉద్దేశ్యంతో భట్టనాయకుని మతాన్ని ఖండించిన అభినవగుప్తాదులు కూడ ఈ సాధారణీకరణాన్ని అంగీకరించారు.

"సత్త్వోద్రేకప్రకాశానన్దమయసంవిద్విశ్రాన్తిసతత్త్వేన భోగేన భుజ్యతే' అనే వాక్యంలో మమ్మటుడు భట్టనాయకాభిమతరసస్వరూపాన్ని ప్రతిపాదించాడు. ప్రపంచకం అంతా

సత్త్వరజస్తమోగుణాత్మకం అని సాంఖ్యుల సిద్ధాంతం. ఇది దార్శనికుల కందరికీ అంగీకారయోగ్య మైన సిద్ధాంతం. మానవుడు కూడ సత్త్వరజస్తమోగుణాత్మకుడే. సత్త్వగుణం జ్ఞానాన్నీ, ప్రకాశాన్నీ కలిగిస్తుంది. రజోగుణం కార్యశీలత్వాన్ని కలిగిస్తుంది. తమోగుణం నిద్రా - ఆలస్యాదులకు (ఆలస్యం అనగా మందగొండితనం) కారణం. ఈ మూడు గుణాలు విషమంగా అనగా హెచ్చుతగ్గులలో ఉంటూంటాయి. ఒక గుణం హెచ్చుగా ఉన్నప్పుడు మిగిలిన రెండూ అణగి ఉంటాయి. సత్త్వగుణం రజస్తమోగుణాలను అణచి ఉద్రిక్తంగా ఉన్నపుడు జ్ఞానం, ప్రకాశం, ఆనందం అధికంగా ఉంటాయి. వాస్తవానికి జ్ఞాన - ప్రకాశ - ఆనందాలు మూడు ఒకటే అని తాత్త్వికులు చెపుతారు. భావకత్వవ్యాపారంచేత భావ్యమానమై, సాధరణీకృతమైన స్థాయిభావం, సత్త్వోద్రేకంచేత (సత్త్వగుణం రజస్తమోగుణాలను అణచి ఉద్రేకం చెందడంచేత) కలిగిన ప్రకాశ = ప్రకాశ అనే, ఆనన్దమయసంవిత్ = ఆనందరూపమైన జ్ఞానము నందు, విశ్రాన్తి = విశ్రమించడం, అనగా ఇతర జ్ఞానా లేవీ లేకుండా ఉండడం, అనే సతత్త్వేన = సమానమైన స్వరూపం గల, భోగంచేత అనగా సాక్షాత్కారంచేత, అనుభవించబడును అని అర్థం. భోగం అనగా - సత్త్వోద్రేకంచేత కలిగిన ప్రకాశ అనే ఆనందస్థితిలో ఇతర విషయజ్ఞానా లేవీ లేకుండా ఉండడం అని భావం. ఆ భోగమే రసాస్వాదం లేదా రసం ఇది భట్టనాయకుని మతంలోని సారం.

భట్టనాయకు డంగీకరించిన భావకత్వభోజకత్వవ్యాపారాలతో పని లేకుండా వ్యంజనావ్యాపారంచేతనే రసాస్వాదాన్ని నిరూపిస్తూ అభినవగుప్తుడు తన మతాన్ని ఈ విధంగా ప్రతిపాదించాడు - లోకంలో దైనందినజీవితంలో యువతి, ఉద్యానం మొదలైన (రతి) కారణాలనూ, కటాక్షవిక్షేపాదికార్యాలనూ, నిర్వేదం మొదలైన సహకారులనూ బాగా పరిశీలించి వాటి సహాయంచేత రత్యాదిభావాలను అనుమానించగలిగిన (అనగా ఊహించగలిగిన) వ్యక్తి హృదయంలో రత్యాదిస్థాయిభావాలు వాసనారూపంలో, అనగా సంస్కారరూపంలో, ఉండిపోతాయి. అలాంటివాడే సహృదయుడైన సామాజికుడు. వానికే రసాస్వాదయోగ్యత ఉంటుంది. కేవలం వ్యాకరణ - న్యాయ - మీమాంసా - వేదాంతాది శాస్త్రాదుల పఠనపాఠనాదులతోను, ఈనాటి విజ్ఞానశాస్త్రం, కంప్యూటర్లు మొదలైన వాటితోను కాలం గడిపే శుష్కహృదయులకూ, వేదాభ్యాసజడులకూ ఈ వాసన ఉండదు. రసాస్వాదం అసంభావ్యం. అందుచేతనే -

"వాసనాచేన్న హేతుః స్యాత్ స స్యాన్మీమాంసకాదిషు"

"సవాసనానాం నాట్యాదౌ రసస్యానుభవో భవేత్
నిర్వాసనాస్తు రఙ్గాన్తః కాష్ఠకుడ్యాశ్మసంనిభాః."

అని అంటారు. "రసాస్వాదనకి వాసన హేతువు కాకపోతే అలాంటి వాసన లేని మీమాంసకులకు కూడ (వీళ్లలో వేదాంతులు కూడ చేరుతారు) రసాస్వాదం కలగాలి. (కలగడం లేదు కదా)". "వాసన ఉన్నవాళ్లకే నాట్యాదులలో రసానుభవం కలుగుతుంది. వాసన లేనివాళ్లు నాట్యశాలలో కూర్చుండి చూస్తున్నా, అక్కడ ఉన్న స్తంభాలూ గోడలూ రాళ్లు ఎంతో వీళ్లు కూడ అంతే" అని ఈ వాక్యాల అర్థం.

అలాంటి సహృదయులైన సామాజికులు ధ్వనికావ్యాదులలోను -

"కాయికో వాచికశ్చైవ ఆహార్యః సాత్త్వికస్తథా,
చత్వారోఽభినయాః ప్రోక్తా నాట్యశాస్త్రవిశారదైః."

అని చెప్పిన చతుర్విధాభినయాలు ఉన్న నాట్యంలోను (రూపకంలోను) కవి - నటాదులు చూపిన వనితాదికారణకార్యసహకారుల్ని చూస్తారు. అయితే అవి లోకానికి (ప్రత్యక్ష జీవితానికి) సంబంధించినవి కావు. విభావనం, అనుభావనం, వ్యభిచారణం అనే అలౌకికాలైన వ్యాపారాలు (పనులు) చేస్తూంటాయి. అతి సూక్ష్మంగా వాసనారూపంలో ఉన్న రత్యాదుల్ని ఆస్వాదయోగ్యాలు అయే టట్లు చేయడం విభావనం. వాటిని అనుభవ యోగ్యం అయే టట్లు చేయడం వ్యభిచారణం. అందుచేత వీటికి కారణ - కార్య - సహకారు లనే పేర్లకు బదులు విభావ - అనుభావ - వ్యభిచారు లనే పేర్లు పెట్టి వ్యవహరిస్తారు. నిజానికి ఈ విభావాదులు ఒకానొక కాలంలో ఒకానొక దేశంలో జరిగిన లేదా జరిగినట్లు చిత్రించిన కథలోని వ్యక్తులకు సంబంధించినవి. అయితే సామాజికుడు సహృదయు డవడంచేత, భావనాబలంచేత, వ్యక్తి విశేష - దేశ - కాలాదుల్ని పూర్తిగా విస్మరించి ఆ వ్యక్తుల్ని నాయికా - నాయకాదిరూపంలోనే చూస్తాడు కాని ఏనాటివాళ్లో అయిన శకుంతలాదుష్యంతాదుల రూపాలలో చూడడు. తన సంకుచిత వ్యక్తిత్వాన్ని కూడ మరచిపోతాడు. ఈ విభావాదులు "నాకు సంబంధించినవి" అని కాని, "వీళ్ల కెవరికీ సంబంధించనివి" అని కాని అతనికి ఆ సమయంలో జ్ఞానం ఉండదు. వీటి నన్నింటినీ సాధారణరూపంలో చూస్తాడు (ఇదే సాధరణీకరణం అనగా). ఆ విభావాదులచేత వ్యంగ్యాలైన రత్యాదుల్ని సాధారణరూపంలోనే చూస్తాడు. ఆ సమయంలో విభావాదుల జ్ఞానం తప్ప ఇతరవిషయాల జ్ఞానం ఏదీ వానికి ఉండదు. అతని హృదయంలో అణగి ఉన్న రత్యాదులు ఉద్బుద్ధాలవుతాయి. ఆ రత్యాదుల్నే ఆస్వాదిస్తారు. ఈ విధంగా రత్యాదుల ఆస్వాదమే రసం. లేదా ఆస్వాదించబడే రత్యాదులే రసం.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. పటికబెల్లం వేరు, దాని ఆస్వాదనం వేరు. అదే విధంగా రసాస్వాదనం అన్నప్పుడు రసం వేరు, దాని ఆస్వాదనం వేరు అని చెప్పాలి కదా? ఆస్వాదమే రసం ఎలా అవుతుంది? దానికి బౌద్ధమతం ప్రకారం ఒక

సమాధానం చెపుతారు. బౌద్ధమతానికి సంబంధించిన ప్రధానమైన నాలుగు శాఖలలో యోగాచారశాఖ ఒకటి. యోగచారుల సిద్ధాంతం ప్రకారం జ్ఞానంకంటె భిన్నంగా బాహ్యమైన వస్తు వనేది లేదు. అయినా ఘటం వేరు, దాని జ్ఞానం వేరు అన్నట్లు ఘటజ్ఞానం అని వ్యవహరిస్తున్నాం. అదే విధంగా రసం వేరు దాని ఆస్వాదం వేరు కాకపోయినా 'రసాన్ని ఆస్వాదించడం' అని వ్యవహరించడం సౌకర్యం కోసం చెప్పే మాట మాత్రమే. ఔపచారికప్రయోగం అన్నమాట. ("ఈ కావ్యంలో ఈ రసం ఉంది" అని చెప్పేమాటలు పూర్తిగా ఔపచారికా లని వేరే చెప్పనక్కరలేదు). మరొక ఉదాహరణం చెప్పాలంటే – "నన్ను నేను తెలుసుకొనుచున్నాను" అని లోకంలో వ్యవహారం ఉంది. ఇక్కడ తెలుసుకొనే వాడు తెలుసుకొనబడేదీ కూడ తానే (ఆత్మయే). అదే విధంగా ఆస్వాదించబడేదీ ఆస్వాదనమూ కూడ రసమే. రసంలోని ప్రధానమైన అంశం ఏది? ఆస్వాదమే. రసం ఎంత సేపు ఉంటుంది? విభావాదుల జీవితమే దీనికి అవధి. అనగా విభావాదులు ఎంతసేపు ఉంటే ఇది అంతసేపు ఉంటుంది. విభావాదుల జ్ఞానం ఆగిపోతే రసాస్వాదం ఆగిపోతుంది. అంతేకాదు – ఆ తన్మయత్వస్థితి సడలి "ఈమె శకుంతల, ఇతడు దుష్యంతుడు" ఇత్యాదివిధంగా గాని "ఎదుట ఉన్నది ఫలానా నటుడు లేదా నటి' అని కాని అనుకొనగానే విభావాదుల సాధారణీకరణానికి ఆఘాతం కలిగినప్పుడు కూడ విభావాదుల జీవితం ఆగిపోయినట్లే.

ఈ రసాస్వాదం పానకరసాస్వాదం వంటిది. బెల్లం, ఏలకులు, మిరియాలు, పచ్చకర్పూరం మొదలైన వస్తువు లన్నీ వేసి తయారుచేసిన పానకం ఆస్వాదిస్తూన్నపుడు దాని రుచి ఆ వస్తువుల రుచుల సంమేళన రూపంలో ఉంటుంది. ఆ వస్తువుల్ని వేరు వేరుగా తిన్నపుడు ఉండే రుచి వేరు, అవన్నీ కలపగా వచ్చే రుచి వేరు. అదే విధంగా రసాస్వాదనంలో, విభావానుభావాదులు స్థాయితో కలవడంచేత ఆ సంమిశ్రితానుభూతి విశిష్టంగా ఉంటుంది. ఆ సమయంలో రసం మన ఎదటనే స్ఫురిస్తూన్నట్లు, హృదయంలో ప్రవేశించినట్లు, శరీరం అంతా వ్యాపించి నట్లు అనిపిస్తుంది. శరీరం పరవశమైపోతుంది. బ్రహ్మానందాన్ని అనుభవిస్తున్నామా అనిపించే టట్లు చేస్తుంది. బ్రహ్మానందంలో ఆత్మ ఒక్కటే భాసిస్తుంది. దీనిలో విభావాదులు కూడ భాసిస్తాయి. కాబట్టి ఇది బ్రహ్మానందం కాదు. తత్సదృశం మాత్రమే. దైనందిన జీవితంలో కనబడే దృశ్యాల అనుభూతి వేరు; ఈ కావ్యనాట్యాద్యనుభూతి వేరు. దానిలో చమత్కారం ఉండవచ్చు లేకపోవచ్చు కాని దీనిలో మాత్రం వర్ణించడానికి శక్యం కాని చమత్కారం, ఆనందానుభూతి కలుగుతుంది. అందుచేతనే ఇది అలౌకికం. ఈవిధంగా సామాజికు డాస్వాదించే, తనలోనే అణగి ఉండి విభావాదులచేత ఉద్బుద్ధాలైన రత్యాదులే రసం. "విభావానుభావవ్యభిచారి సంయోగాత్ = స్థాయిభావాలకు విభావాదులతో వ్యంగ్యవ్యంజకభావ సంబంధంవల్ల

లేదా విభావ – అనుభావ – వ్యభిచారిభావాలు పరస్పరం కలవడం వల్ల, రసనిష్పత్తిః = రసాభివ్యక్తి కలుగుతుంది" అని ఈ పక్షంలో రస సూత్రానికి అర్థం. ఇది అభినవగుప్తుని మతం. అభినవగుప్తుడు తన మతాన్ని పూర్వమతవిమర్శపూర్వకంగా **అభినవభారతిలోను, లోచనంలోను** ప్రతిపాదించాడు. (**కావ్యప్రకాశకు** అస్మద్విరచిత బాలానందినీ వ్యాఖ్యానంలో వివరించిన ఈ మత చతుష్టయాన్ని యథాతథంగా ఇక్కడ చూపించడం జరిగింది.)

జగన్నాథుడు **రసగంగాధరంలో**, అభినవగుప్తాదుల మతాలను చూపిన తరవాత రెండు క్రొత్త మతాలను కూడ చూపించాడు. వాటిలో **'నవ్యాస్తు'** అని ప్రారంభించి చెప్పిన మతం ప్రకారం రసానుభవం భ్రాంతిజ్ఞానజన్యం. ఇది వేదాంత సిద్ధాంతాన్ని అనుసరించి ప్రతిఫాదించిన మతం. ముత్యపుచిప్పను చూచినపుడు వెండి అనే భ్రాంతి కలుగుతుంది. ఆ సయంలో అక్కడ కనబడే వెండి అనిర్వచనీయం. అది నిజంగా ఉన్నది అనడానికి వీలు లేదు. నిజంగా ఉంటే క్షణాంతరంలో "ఇది వెండి కాదు" అనే జ్ఞానం కలగకూడదు. అలా గని అసలే లేదనడానికి వీలు లేదు. ఎదురుగా కనబడుతూన్నది కదా? ఈ విధంగా ఇది ఉన్న దని కాని లేదని కాని నిర్వచించడానికి శక్యం కాదు గాన **అనిర్వచనీయం.** భ్రాంతిస్థలా లన్నింటిలో ఇదే పద్ధతి. ఇదే విధంగా పరిపుష్టరత్యాదిరూపమైన ఈ శృంగారాదిరసం కూడ అనిర్వచనీయమే. కవి లేదా నటుడు ప్రదర్శించిన అసత్యములైన విభావాదులచేత సహృదయుడు వ్యంజనావ్యాపారం ద్వారా దుష్యంతాదులకు శకుంతలాదుల విషయంలో రతి ఉన్న దని గ్రహిస్తాడు. సహృదయునిలో భావన అనే దోషం ఉంది. దానిచేత తనలో దుష్యంతత్వాదికాన్ని ఆరోపించుకొంటాడు. అప్పుడు అతనిలో రతి పుడుతుంది. అది అనిర్వచనీయమే. దానితో అతడు అలౌకికమైన ఆనందాన్ని అనుభవిస్తాడు. ఇలాంటి ఆనందాన్ని కలిగించే శక్తి కావ్యాద్యుపస్థాపితమైన విభావాదులకు మాత్రమే ఉంది. ఈ విధంగా ఎదుట నున్న వాళ్లను దుష్యంతాదు లనుకొనడం అనే భ్రాంతితో ప్రారంభమైన జ్ఞానం తనలో లేని రత్యాదులను ఆరోపించు కొనడం అనే భ్రాంతికి దారితీసి తద్వారా ఆనందం కలిగిస్తుంది. ఇది ఈ మతం యొక్క సంక్షిప్తరూపం. దీని తరవాత **'పరే తు'** అనే మాటలతో ప్రారంభించి మరొక మతం ప్రతిపాదించబడింది. ఇది కూడ భ్రాంతిత్వాన్ని ప్రతిపాదించే మతం. వెనుక చెప్పిన శుక్తిరజతదృష్టాంతంలో అద్వైతవేదాంతులు అనిర్వచనీయమైన రజతం భాసిస్తూన్నది అని అంటే మరికొందరు దార్శనికులు గృహ – ఆపణాదులలో తాను ఇది వరకు చూచి ఉన్న రజతాన్నే ద్రష్ట ఇక్కడ ముత్యపుచిప్ప మీద చూస్తున్నాడు అంటారు. మొదటిదానికి **అనిర్వచనీయఖ్యాతి** అనీ రెండవదానికి **అన్యథాఖ్యాతి** అనీ పేర్లు. ఈ రెండవ మతం అన్యథాఖ్యాత్యనుసారం ప్రతిపాదించి నట్లు కనబడుతుంది. ఏదైనా రసానుభూతి

భ్రాంతిజన్య మనే ఈ మతం కూడ చెపుతున్నది. బహుశా జగన్నాథునకు మొదటి మతం అంగీకార్యం అయి ఉండవచ్చు.

అయితే ఆరోపితమైనది రత్యాదిక మైతే అది సహజంగా సుఖరూపం గాన ఆనందజనకం అయితే కావచ్చును. శోకాద్యారోపం ఆనందహేతు వెలా అవుతుంది. అన్ని రసాలూ ఆనందస్వరూపాలు కదా అని ప్రశ్న. దీనికి సమాధానంగా జగన్నాథుడు - శోకాదులు కూడ ఆనందజనకాలే అని లోకంలో సహృదయుల అనుభవం అయితే కావ్యాదులకు దుఃఖాన్ని కూడ సుఖంగా మార్చ గల శక్తి ఉందని ఒప్పుకోండి; అలా కాక కరుణాదులవల్ల దుఃఖం కలుగుతుంది అని అనుభవ మైతే తదనుసారంగా కరుణాదులు శృంగారాదుల వలె ఆనందరూపాలు కావు అని అంగీకరించండి అంటాడు. దీనిని పట్టి అన్ని రసాలు సుఖరూపాలే అనే అభినవగుప్తాదుల వాదం జగన్నాథునికి అంగీకార్యం కాదని తెలుస్తూన్నది.

రససంఖ్య : కాళిదాసుని **విక్రమోర్వశీయం** (II. 18) **కావ్యాదర్శం** (II. 392) ఒక నాట్యశాస్త్రపాఠం (IV. 15. 16) మొదలైనవాటిని పట్టి మొదట ఎనిమిది రసాలే అంగీకరించబడి నట్లు తెలుస్తూన్నది. ఉద్భటునిలోను (IV. 5) **విష్ణుధర్మోత్తర పురాణం**లోను తొమ్మిది రసాల నిర్దేశం ఉంది. దీనిని పట్టి ఏడవ శతాబ్దం నాటికి శాంతరసం కూడ చేర్చబడినట్లు తెలుస్తూన్నది. మొట్టమొదట శాంతరసాన్ని ప్రతిపాదించినవాడు వాసుకి అని భావప్రకాశనంలో చెప్పబడింది. శాంతరసానికి కావ్యాలలో స్థానం ఉండవచ్చునేమో కాని రూపకాలలో దీనికి అవకాశం ఉండదు అని కొందరన్నారు **"శమమపి కేచిత్ప్రాహుః పుష్టిర్నాట్యేషు నైతస్య"** (దశరూపకం. IV. 35).

"నాటకాదినిబన్ధే **తు** తపశ్చరణవస్తుని,
అభినేతుమశక్యత్వాత్తద్వాక్యార్థపదార్థయోః,
సామాజికానాం **మనసి** రసః శాన్తో **న జాయతే."** (భా. ప్ర. పే. 47)

ఈ విధంగా శాంతరసానికి రూపకాలలో అనుప్రవేశం లేదనడానికి అనేకకారణాలు చెప్పబడ్డాయి. **మహాభారతంలో** శాంతరసం ప్రధానరసం అని ఆనందవర్ధనుడు నాల్గవ ఉద్ద్యోతంలో ప్రతిపాదించాడు. అయితే **నాట్యశాస్త్రం**లోని కొన్ని పాఠాలలో శాంతరసం కూడ ప్రతిపాదించబడిన దనీ నిజానికి మోక్షహేతువవడంచేత అదే ప్రధానరస మనీ అభినవగుప్తుడు **అభినవభారతిలో** (మొదటి సం. పే. 340) గట్టిగా ప్రతిపాదించాడు. అభినవగుప్త - ధనంజయుల ప్రకారం శాంతరసానికి స్థాయిభావం శమం. వైరాగ్యము, సంసారభీరుత్వము, విభావాలు, మోక్షశాస్త్రచింత అనుభావం. నిర్వేద - మతి - ధృతి -

స్మృతులు వ్యభిచారిభావాలు. నిర్వేదం దీని స్థాయిభావ మని మమ్మటుడు, జుగుప్స లేదా ఉత్సాహం స్థాయిభావం అని కొందరూ అన్నారు. రుద్రటుడు ప్రేయస్ అను పదవ రసం పేర్కొన్నాడు. కొందరు ఆర్ద్రత స్థాయిభావంగా గల స్నేహరసాన్ని, కొందరు లౌల్య - భక్తిరసాలను చెప్పినట్లు అభినవగుప్తుడు (మొ. సం. 341-42 పే) అన్నాడు. అయితే స్నేహం రత్యుత్సాహాలలోను, లౌల్యం హాసంలోను లేదా రతిలోను, భక్తి రతిలోను అంతర్గతం అవుతాయి అని అభినవగుప్తుని అభిప్రాయం. దేవాది విషయకరతి భావమే కాని రసం కాదని మమ్మటు డన్నాడు - **"రతిర్దేవాదివిషయా వ్యభిచారీ తథాఞ్జితః, భావః ప్రోక్తః"** (కా. ప్ర. IV. 35) "నటుడు కేవలం రసం పోసిన పాత్ర వంటివాడు. వానికి దాని ఆస్వాదనం ఉండదు. కొందరు శ్రద్ధ స్థాయిభావంగా గల భక్తిని, లౌల్యాన్ని, స్నేహాన్ని రసాలుగా అంగీకరిస్తారు, అది యుక్తం కాదు" అని **సంగీతరత్నాకరంలో** (370-71 శ్లోకాలు VII పే. 815) ప్రతిపాదింపబడింది. **నాగానందనాటకం**లో శాంత శృంగారాలు వ్యాపించి ఉన్నాయనీ, శాంతరసానికి తృష్ణాక్షయసుఖం స్థాయిభావం అనీ చెపుతూ ఆనందవర్ధనుడు **మహాభారతం** నుండి తృష్ణాక్షయసుఖప్రాధాన్యాన్ని చెప్పే శ్లోకం ఉదాహరించి, దీనియందు అందరికీ ఆసక్తి లేనంత మాత్రాన ఇది స్థాయిభావం కాదని గాని, శాంతరసం నాటకాదులలో ఉండ దని గాని చెప్పడానికి వీలు లేదని అన్నాడు - **"శాన్తశ్చతృష్ణాక్షయ సుఖస్య యః పరిపోషః తల్లక్షణః రసః** ప్రతీయతే. **తథాచోక్తమ్"** -

**"యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్,
తృష్ణాక్షయసుఖస్యైతే నార్హతః షోడశీం కలామ్."** (శాం. ప. 175-35)

"యది నామ సర్వజనానుభవగోచరతా తస్య నాస్తి నైతావతాసావలోకసామాన్యమహాను భావచిత్తవృత్తివిశేషవత్ ప్రతిక్షేప్తుం శక్యః" (ధ్వన్యా. పే. 219-220). అభినవగుప్తుడు లోచనంలో రూపకాలలో ఒకప్పుడు ధర్మం, ఒకప్పుడు క్రీడలు, ఒకప్పుడు ఐశ్వర్యం, ఒకప్పుడు శమం కూడ చూపవచ్చును అను నాట్యశాస్త్రవాక్యాన్ని ఉదాహరించి శమం కూడ రూపకాలలో నిబద్ధం కావచ్చును అని అంటాడు.

**"త్రైలోక్యస్యాస్య సర్వస్య నాట్యం భావానుకీర్తనమ్,
క్వచిద్ధర్మః క్వచిత్క్రీడా క్వచిదర్థః క్వచిచ్ఛమః."** (నా. శా. VII. 104)

అందరికీ ఇష్టం కాకపోయినంత మాత్రంచేత దానిని కూర్చకూడ దనే మాట లేదు అని అంటూ వీతరాగులకు శృంగారం అంటే ఇష్టం లేకపోయినంత మాత్రంచేత శృంగారం రసం కాదంటామా అని ప్రశ్నిస్తాడు. శాంతం అనేది శమం ద్వారా సాధించబడుతుంది. నటునిలో శమం ఉండదు; అందుచేత రూపకాలలో శాంతానికి అవకాశం లేదు అనే

కొందరి అభిప్రాయాన్ని చెప్పి **సంగీతరత్నాకరంలో** - రసాస్వాదం సామాజికునకే కాని నటునికి కాదు కదా; అందుచేత రూపకాలలో కూడ శాంతం ఉండడానికి అభ్యంతరం ఏమీ ఉండకూడదు అని సమాధానం చెప్పబడింది-

> "శాన్తస్య శమసాధ్యత్వాన్నటే చ తదసంభవాత్,
> అష్టావేవ రసా నాట్యేష్వితి కేచిదచూచుదన్.
> తదచారు యతః కంచి న్న రసం స్వదతే నటః,
> సామాజికాస్తు లిహతే రసాన్, పాత్రం నటో మతః".

(సం. రత్నా. x. 1370-71)

నాట్యశాస్త్రంలో భరతుడు ప్రతిపాదించిన రససిద్ధాంతాన్ని గూర్చిన విమర్శ, ఆ గ్రంథం ఆవిర్భవించినది మొదలు నేటివరకు అనేకనాట్యశాస్త్రవ్యాఖ్యానగ్రంథాలలోను ఎన్నో స్వతంత్రఅలంకారశాస్త్రగ్రంథాలలోను, ఆధునికసాహిత్యవిమర్శకుల గ్రంథాదుల లోను నిరంతరంగా జరుగుతూనే ఉంది. ఇక్కడ కొందరు ప్రాచీనవ్యాఖ్యాతల, ఆలం కారికుల అభిప్రాయాలు మాత్రమే సంక్షిప్తంగా చూపబడ్డాయి.

శ్రీః శ్రీః శ్రీః